గురువారం
15•2•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 249
• పేజీలు : 16 + (24/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

ఉపాధికి గనులు

తెలంగాణలో చిత్తశుద్ధితో గనుల తవ్వకాలు.. కేంద్రమంత్రి తోమర్ ప్రశంస



బుధవారం హైటెక్స్‌లో మైనింగ్ టుడే -2018 అంతర్జాతీయ సదస్సును ప్రారంభించిన రాష్ట్ర గవర్నర్ నరసింహన్, కేంద్ర మంత్రి నరేంద్రసింగ్ తోమర్‌కు జ్ఞాపికలను అందజేస్తున్న రాష్ట్ర గనులు, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు

- కార్మికుల ఆరోగ్యంపై దృష్టిపెట్టాలి
- సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో తెలంగాణ భేష్
- సదస్సు ప్రారంభిస్తూ గవర్నర్ నరసింహన్
- మా ఇసుక విధానానికి దేశవ్యాప్తంగా ప్రశంసలు
- ఇసుకనుంచి రూ.3170 కోట్ల ఆదాయం
- వచ్చే ఆర్థిక సంవత్సరం లక్ష్యం రూ.3500 కోట్లు
- రాష్ట్రంలోని 31 జిల్లాల్లో అపార ఖనిజ వనరులు
- గనులు, పరిశ్రమల మంత్రి కే తారకరామారావు
- ఖమ్మం జిల్లాలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుపై ఆశాభావం

- మైనింగ్ రంగంలో భారీ ఉద్యోగావకాశాలు
- మనకున్న నిక్షేపాల్లో ఒకశాతంలోనే తవ్వకాలు
- కనీసం పదిశాతం మైనింగ్‌తో జీడీపీ గణనీయ వృద్ధి
- మైనింగ్‌టుడే అంతర్జాతీయ సదస్సులో కేంద్రమంత్రి నరేంద్రసింగ్ తోమర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ఉపాధి కల్పన సవాలును అధిగమించడానికి గనుల రంగం ఎంతగానో ఉపయోగపడుతుందని కేంద్ర గనులు, పంచాయతీరాజ్ శాఖల మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ చెప్పారు. ఈ రంగంలో ఉపాధి, ఉద్యోగాల కల్పనకు అపార అవకాశాలు ఉన్నాయన్నారు. ఇక్కడి హైటెక్స్‌లో నాలుగు రోజులపాటు జరిగే మైనింగ్ టుడే-2018 అంతర్జాతీయ సదస్సును బుధవారం రాష్ట్ర గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి ప్రసంగిస్తూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనింగ్ రంగంలో చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని ప్రశంసించారు. వ్యవసాయం తర్వాత ఎక్కువ ఉపాధి అవకాశాలున్నది ఖనిజ రంగంలోనేనని కేంద్రమంత్రి చెప్పారు. 32 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న భారతదేశంలో ఎనిమిది లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఖనిజ నిక్షేపాలున్నాయని తెలిపారు. కానీ.. ఇందులో మనం కేవలం ఒకశాతం ప్రాంతంలోనే తవ్వకాలు జరుపుతున్నామంటే ఆశ్చర్యం కలుగకమానదని అన్నారు. ఖనిజ నిక్షేపాలున్న కనీసం పదిశాతం ప్రాంతంలో మైనింగ్ జరిగితే స్థూల జాతీయోత్పత్తి గణనీయంగా వృద్ధి చెందుతుందని, ఉపాధి కల్పనలో, ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో ఈ రంగం ఎంతో కీలకంగా మారుతుందని చెప్పారు. దేశం ముందు ఉపాధి కల్పన పెద్ద సవాలుగా మారిన నేపథ్యంలో ఖనిజ తవ్వకాలు చురుకుగా సాగాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. 2014కు ముందు గనులను వేలం వేయకపోవడం వల్ల

మిగతా 2వ పేజీలో



ఢిల్లీలో జరుగనున్న కృష్ణా- గోదావరి నదీ యజమాన్య బోర్డుల సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహంపై బుధవారం జలసౌధలో సాగునీటి అధికారులతో సమావేశమైన మంత్రి హరీశ్‌రావు, సీఎస్ ఎస్కే జోషి

కృష్ణాలో మన వాటా 575 టీఎంసీలు

సాధనకోసం ట్రిబ్యునల్‌లో పట్టుపడతాం: మంత్రి హరీశ్

- గోదావరిలోనూ న్యాయమైన వాటాకోసం పట్టు
- పోలవరం ముంపు సమస్యలపై కేంద్రంపై ఒత్తిడి చేయాలి
- టెలిమెట్రీ అమలుపై ఉదాసీనంగా కేఆర్‌ఎంబీ
- జలసౌధలో అధికారులతో సమీక్షలో మంత్రి హరీశ్‌రావు
- నేడు ఢిల్లీలో కేఆర్‌ఎంబీ, జీఆర్‌ఎంబీ సెక్రటరీల సమావేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన వాటాకోసం గట్టిగా పోరాటం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఢిల్లీలో గురువారం కేంద్ర జలవనరులశాఖ కార్యదర్శి అధ్యక్షతన కృష్ణా, గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుల తెలంగాణ, ఏపీ కార్యదర్శుల సమావేశం జరుగనుంది. ఈ సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహం, తెలంగాణ రైతుల ప్రయోజనాలకు నష్టం కలిగించేలా ఆంధ్రప్రదేశ్ చేసే ప్రతిపాదనలను ఎలా తిప్పికొట్టాలి అనే అంశాలపై బుధవారం హైదరాబాద్‌లోని జలసౌధలో నీటిపారుదలశాఖాధికారులతో మంత్రి తన్నీరు హరీశ్‌రావు సుదీర్ఘంగా చర్చించారు. కృష్ణాలో తెలంగాణ వాటాగా 575 టీఎంసీల నీటి కేటాయింపునకు డిమాండ్ చేయాలని నిర్ణయించారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్స్‌వల్ల కలిగే ముంపు సమస్యలపైనా సమీక్షించారు. రాష్ట్రంలోని చారిత్రాత్మక భద్రాచలం రామాలయంతోపాటు పలు గ్రామాలు, బొగ్గు గనులు, మణుగూరు హెవీవాటర్‌ప్లాంట్ తదితర ముఖ్యమైన ప్రాంతాలకు ముంపు ప్రమాదం ఉందన్నారు. భద్రాచలం పట్టణం, దాని చుట్టుపక్కల గోదావరి పరివాహక

మిగతా 2వ పేజీలో



క్రైస్తవులకు ఉచితంగా జెరూసలేం యాత్ర!

నాగాలాండ్‌లో అధికారంలోకి వస్తే అమలు చేస్తాం

బీజేపీ ప్రకటన

హజ్ సబ్సిడీ ఎత్తివేసి, ఇలాంటి హామీలెలా ఇస్తారు?: ఎంపీ అసదుద్దీన్

5

పీఎన్‌బీలో భారీ స్కామ్

ముంబై శాఖలో రూ.11,346 కోట్ల మోసపూరిత లావాదేవీలు

- ఇతర బ్యాంకుల ద్వారా సొమ్ము విదేశాలకు తరలింపు
- మరోసారి తెరపైకి నీరవ్ మోదీ, ఆయన భాగస్వాములు
- పది మంది అధికారులపై సస్పెన్షన్ వేటు
- దర్యాప్తు సంస్థలకు కేసు అప్పగింత

ముంబై/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రెండోది అయిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో భారీ కుంభకోణం వెలుగుచూసింది. ముంబై నగరంలోని ఒక శాఖలో ఈ కుంభకోణం బయటపడిందని, ఆ శాఖలో 177 కోట్ల డాలర్ల (రూ.11,346 కోట్లు) మోసపూరిత లావాదేవీలు కొనసాగినట్లు తేలడంతో ఆ శాఖ డిప్యూటీ మేనేజర్, మరో తొమ్మిది మంది అధికారులను సస్పెండ్ చేయడంతో పాటు సొమ్ము రికవరీ కోసం కేసును ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు (దర్యాప్తు సంస్థలకు) నివేదించామని పంజాబ్ నేషనల్ బ్యాంక్ వెల్లడించింది. ఈ కుంభకోణం వలన జరిగిన నష్టం గత సంవత్సరం పంజాబ్ నేషనల్ బ్యాంకు ఆర్జించిన



రూ.1,320 కోట్ల నికర ఆదాయం కంటే ఎనిమిది రెట్లు ఎక్కువ కాగా, ఈ బ్యాంకు మొత్తం మార్కెట్ విలువలో మూడింట ఒకటో వంతుగా ఉన్నది. కొంత మంది ఖాతాదారులకు ప్రయోజనం చేకూర్చేందుకు ఈ మోసపూరిత, అనధికార లావాదేవీలు నిర్వహించినట్టు గుర్తించామని, ఈ మొత్తాన్ని

మిగతా 13వ పేజీలో



బుధవారం రాత్రి మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని ఏడుపాయలలో శివరాత్రి జాతర సందర్భంగా వనదుర్గామాత ఆలయం చుట్టూ ఎడ్ల బండ్లు తిరిగే కార్యక్రమంలో పాల్గొన్న అశేష భక్తజనం.

6

జనగామ జిల్లాలో బౌద్ధారామం!

గూడూరులో శాతవాహనకాలపు ఆనవాళ్లు • నవీన శిలాయుగపు పనిముట్లూ లభ్యం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: తెలంగాణ ప్రాచీన చరిత్రపై మరో వెలుగు రేఖ ప్రసరించింది. జనగామ జిల్లాలోని గూడూరు గ్రామంలో తొలి చారిత్రకయుగం (శాతవాహన కాలం) నాటి బౌద్ధారామం బయటపడింది. ఔత్సాహిక పురావస్తు పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి కృషి ఫలితంగా ఈ బౌద్ధారామంతోపాటు నవీన శిలాయుగం నాటి ఆదిమానవులు ఉపయోగించిన రాతిగొడ్డళ్లు, సమాధులు కూడా వెలుగుచూశాయి. పాలకుర్తికి సుమారు 5 కిలోమీటర్ల దూరంలోవున్న గూడూరు గ్రామంలోని ఓ పాటిగడ్డపై రాళ్లు, పెంకులు, ఇటుకలు చెల్లాచెదరుగా వున్నట్టు స్థానికులు అందించిన సమాచారం ఆధారంగా ఈ ప్రాంతాన్ని పరిశీలించినట్టు రత్నాకర్‌రెడ్డి తెలిపారు. ఈ పాటిగడ్డపై నాపరాయి (లైమ్‌స్టోన్) ఫలకంపై ఇరువైపులా పద్మాలు చెక్కివున్నాయి. వీటితోపాటు మట్టిపాత్రలు, ఇటుకలు, రాతి ఆయుధాలను సేకరించారు. రెండు వైపులా పద్మాలున్న రాతిఫలకం ఆధారంగా గూడూరులో ప్రాచీనకాలంలో బౌద్ధారామం ఉండి ఉంటుందని పురావస్తుశాఖ అధికారులు ప్రాథమికంగా ధ్రువీకరించారు. రెండువైపులా పద్మాలున్న రాతి శిలాఫలకాలను బౌద్ధారామాలపై అలంకరణకు ఉపయోగించేవారని, ఇక్కడ లభించిన ఇటుకల పరిణామం అధారంగా ఈ బౌద్ధమత నిర్మాణాలు శాతవాహన కాలానికి చెంది ఉంటాయని పురావస్తు అధికారి భానుమూర్తి నిర్ధారించినట్టు రత్నాకర్‌రెడ్డి చెప్పారు. స్థానికంగా దొరికిన ఇటుకలు 8 నుంచి 9 సెంటీమీటర్ల మందంతో, 26 సెంటీమీటర్ల పొడవుతో ఉన్నాయని, శాతవాహనకాలపు ఇటుకల పరిమాణానికి ఇవి దగ్గరగా ఉన్నాయని వివరించారు. క్రీ.శ. 1124లో చాళుక్య రాజు 6వ విక్రమాదిత్యుడు వేసిన శాసనంలో ఈ ఊరి పేరును గుముడూరు అని పేర్కొన్నారని, గుమ్మటంలా ఉండే బౌద్ధారామం ఆకృతి నుంచే గుముడూరు అనే పేరు వచ్చివుంటుందని, కాలక్రమంలో గుముడూరు పేరు గూడూరుగా మారి ఉంటుందని అన్నారు. శాతవాహనుల కాలంనాటి ఆనవాళ్లున్న కొండాపూర్ సమీపంలోనూ గుముడూరు అనే గ్రామం ఉందని ఈ సందర్భంగా చెప్పారు. గూడూరుకు సుమారు 4కిలోమీటర్ల దూరంలోఉన్న ఇప్పగూడెం గ్రామంలో ఇదివరకే బుద్ధుడు, తారవిగ్రహాలు వెలుగుచూశాయి. తార ఆధారంగా వెయ్యేండ్ల క్రితం ఇక్కడ వజ్రయాన బౌద్ధం విలసిల్లినట్టుగా పురావస్తుశాఖలో పదవీవిరమణ చేసిన శివనాగిరెడ్డి నిర్ధారించారు.



గూడూరు సమీపంలో బయటపడిన చతురస్రాకారపు బావి నిర్మాణం, మట్టిదిబ్బలో దొరికిన కుండలు



ఇరువైపులా పద్మాలు చెక్కిన నాపరాయి

వరల్డ్ ఐటీ కాంగ్రెస్‌లో ప్రధాని ప్రసంగం

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించి మాట్లాడనున్న మోదీ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లో ఈ నెల 19 నుంచి 21 వరకు జరుగనున్న ప్రతిష్ఠాత్మకమైన వరల్డ్ ఐటీ కాంగ్రెస్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. హెచ్‌ఐసీసీలో జరిగే ఈ సదస్సులో వీడియో లింక్ ద్వారా ప్రారంభించిన అనంతరం సదస్సును ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ ధ్రువీకరించారు. శ్రీలంక ప్రధాన మంత్రి రణిల్ విక్రమ సింఘే, కేంద్ర ఐటీశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావులతో పాటు కెనడియన్ మంత్రి నవదీప్ బైన్స్, బీసీజీ చైర్మన్ హన్స్‌పాల్ బర్కనర్, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, అడోబ్ చీఫ్ శంతన్ నారాయణ్, ప్రముఖ నటి దీపికా పదుకొనె, ఇషా ఫౌండేషన్ సద్గురు తదితరులు ఈ సదస్సులో పాల్గొంటారు.

ఏకీకృత సర్వీస్‌రూల్స్ సమస్యను పరిష్కరించండి

సీఎస్‌ను కోరిన ఉపాధ్యాయ సంఘాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పలు ఉపాధ్యాయసంఘాల నాయకులు బుధవారం ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కే జోషిని కోరారు. సీపీఎస్‌ను రద్దుచేయాలని, భాషా పండితుల పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, ఎయిడెడ్ టీచర్ల రికవరీని నిలిపివేయాలని కోరుతూ సీఎస్‌కు వినతిపత్రం సమర్పించారు. కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. సీఎస్‌ను కలిసిన వారిలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్రనాయకులు సీహెచ్ రాములు, చావ రవి, తెలంగాణ పీఆర్టీయూ రాష్ట్రనాయకులు మారెడ్డి అంజిరెడ్డి, ఎం చెన్నయ్య ఇతర ఉపాధ్యాయసంఘాల నాయకులు ఉన్నారు.



ఇంటర్నేషనల్ రిలేషన్‌షిప్ సదస్సులో పాల్గొన్న ఐఐసీటీ డైరెక్టర్ ఎస్ చంద్రశేఖర్, కౌన్సిల్ జనరల్ ఆఫ్ ఫ్రాన్స్ మెంబర్ ఫ్రాంకోయిస్ గౌంటీర్

ఆయుర్వేద మందుల తయారీకి

ఫ్రాన్స్‌తో ఒప్పందం

ఐఐసీటీ డైరెక్టర్ ఎస్ చంద్రశేఖర్

తార్నాక: భారతదేశంలో ప్రకృతి సిద్ధంగా లభించే ఆయుర్వేద మూలికలతో శాస్త్రీయమందుల తయారీకి ఫ్రాన్స్‌తో అవగాహన ఒప్పందం చేసుకుంటున్నట్టు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(ఐఐసీటీ) డైరెక్టర్ డాక్టర్ ఎస్ చంద్రశేఖర్ చెప్పారు. బుధవారం హైదరాబాద్ తార్నాకలోని ఐఐసీటీ ఆడిటోరియంలో జరిగిన ఇంటర్నేషనల్ రిలేషన్‌షిప్ సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ అనుసరిస్తున్న విధానాలతో భారతీయవైద్యం అంతర్జాతీయస్థాయిని అందిపుచ్చుకుంటున్నదని చెప్పారు. ఈ నేపథ్యంలో పలుదేశాలు భారతీయ ఆయుర్వేద వైద్యాన్ని అనుసరిస్తున్నాయని తెలిపారు. భారత్‌లో లభ్యమయ్యే ఆయుర్వేద మూలికలు, ఇతర ముడిసరుకుతో శాస్త్రీయమందుల తయారీకి సీఎస్‌ఐఆర్, ఫ్రెంచ్ కౌన్సిల్ జనరల్‌తో ఒప్పందాలు చేసుకుంటున్నదని అన్నారు. ఈ నెల 10న ఢిల్లీలో ఇరుదేశాల మధ్య ఆయుర్వేద మందుల తయారీపై ఎంవోయూ జరుగనున్న నేపథ్యంలో అందులో పొందుపర్చాల్సిన అంశాలను సదస్సులో చర్చించినట్టు తెలిపారు. ఎంవోయూ కుదుర్చుకున్న తరువాత ఇండోఫ్రెంచ్ జాయింట్ లేబోరేటరీ ద్వారా ప్రకృతికి సంబంధించిన మూలకాల నుంచి రసాయనాలు తయారుచేయడానికి కావాల్సిన వైవిధ్యాలపై పరిశోధన చేయనున్నట్టు వివరించారు. ఈ ప్రక్రియ 2022 వరకు సాగుతుందని చెప్పారు. సదస్సులో కౌన్సిల్ జనరల్ ఆఫ్ ఫ్రాన్స్ మెంబర్ ఫ్రాంకోయిస్ గౌంటీర్ తదితరులు పాల్గొన్నారు.



బుధవారం హెచ్‌ఐసీసీలో మైనింగ్‌టుడే సదస్సును ప్రారంభిస్తున్న గవర్నర్ నరసింహన్, కేంద్రమంత్రి నరేంద్రసింగ్ తోమర్, రాష్ట్ర మంత్రి కేటీఆర్



హెచ్‌ఐసీసీలో జరిగిన సదస్సులో మైనింగ్‌టుడే సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న గవర్నర్ నరసింహన్, కేంద్రమంత్రి నరేంద్రసింగ్ తోమర్, రాష్ట్రమంత్రి కేటీఆర్, పరిశ్రమలశాఖ కార్యదర్శి జయేశ్‌రంజన్, టీఎస్‌ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, ఎంఈఏఐ జాతీయ అధ్యక్షుడు అరుణ్ కుమార్ కొఠారి తదితరులు

ఉపాధికి గనులు

మొదటిపేజీ తరువాయి...

వేల కోట్ల నష్టం వాటిల్లిందని చెప్పారు. ఇప్పటివరకు సుమారు 32 గనుల వేలం జరిగిందన్నారు. ఈ వేలం వల్ల రాష్ట్రాలకు వచ్చే ఆదాయం రూ.1.35లక్షల కోట్లు ఉంటుందని తెలిపారు. ఈ ఆదాయంతో పేదరిక నిర్మూలన, విద్యా సౌకర్యాలు మెరుగుపర్చడం, అభివృద్ధికోసం రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు చేయవచ్చునని చెప్పారు. బంగారు, వజ్రాలు, ఇనుప గనులు ఉన్న చోటే పేదరికం అధికంగా ఉన్నదని కేంద్ర మంత్రి ఆవేదన వ్యక్తంచేశారు. మైనింగ్‌లో నిర్లక్ష్యం వహిస్తే పర్యావరణంతోపాటు మనందరికీ ముప్పువాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

సంపదే ఆరోగ్యం కాదు..

అంతకుముందు సదస్సును ప్రారంభించిన సందర్భంగా గవర్నర్ నరసింహన్ మాట్లాడుతూ ఆరోగ్యమే సంపదగానీ, సంపదే ఆరోగ్యం కాదని చెప్పారు. గనుల్లో పనిచేసే వారి భద్రతను ప్రధానంగా తీసుకోవాలని సూచించారు. పారదర్శక విధానాలతో జిల్లా మినరల్ ఫౌండేషన్ (డీఎంఎఫ్) నిధులను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ నిధితో రోడ్లు వేయడమే కాకుండా స్థానికుల అవసరాలు తీర్చే పనులను చేపట్టాలన్నారు. గనుల తవ్వకాలు చేపట్టే, ఖనిజ నిల్వలు ఉన్న ప్రాంతాల్లో పునరావాసం, పర్యావరణం అతి పెద్ద సవాళ్లని ఆయన అభివర్ణించారు. ఇలాంటి ప్రాంతాల్లో ఎక్కువగా గిరిజనులే ఉంటారని తెలిపారు. పునరావాసం, ఇతర చెల్లింపుల్లో పారదర్శకంగా ఉండాలన్నారు. వీటన్నంటి వివరాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని పెద్ద ఎత్తున ఉపయోగించుకుంటున్నదని గవర్నర్ ప్రశంసించారు.

ఇసుక విధానానికి దేశవ్యాప్త ప్రశంసలు..

తెలంగాణ ఇసుక విధానం దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుందని రాష్ట్ర గనులు, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు చెప్పారు. మధ్య దళారులకు అవకాశాలు లేకుండా, పర్యావరణానికి ఇబ్బందులు కలిగించకుండా, ఇష్టారీతిన తవ్వకాలు జరుపకుండా ఈ విధానాన్ని రూపొందించామన్నారు. స్టాక్‌యార్డుల్లో ఇసుక అందుబాటులో ఉంచడంతోపాటు శాండ్‌టాక్సీ విధానంతో వినియోగదారుడి ఇంటివద్దకే ఇసుక అందించే ఏర్పాటు చేశామని తెలిపారు. ఇసుకను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునేలా మార్పులు తీసుకొచ్చామన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ఈ-చెల్లింపులు, ఈ-అనుమతులకు అవకాశం ఇస్తున్నామని తెలిపారు. ఇసుకనుంచి 2016-17 ఆర్థిక సంవత్సరంలో రూ.3170 కోట్లు ఆదాయంరాగా, తదుపరి ఆర్థిక సంవత్సరానికి రూ.3500 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. దక్షిణాదిలో అత్యధిక బొగ్గు నిల్వలు కలిగిన రాష్ట్రం తెలంగాణ అన్నారు. వీటితో పాటుగా లైమ్‌స్టోన్, గ్రానైట్, ఐరన్ ఓర్ నిల్వలు కూడా పెద్ద ఎత్తున ఉన్నాయన్నారు. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో అపారమైన ఖనిజ వనరులున్నాయని చెప్పారు. గనుల తవ్వకాల విషయంలో పర్యావరణానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందుకుపోతున్నామని తెలిపారు. సూర్యాపేట జిల్లాలో లైమ్‌స్టోన్ బ్లాకులు వేలం వేయడానికి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. సులభ వాణిజ్య విధానంలో దేశంలోనే తెలంగాణ మొదటి ర్యాంకు సాధించిందని కేటీఆర్ గుర్తుచేశారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు

రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న విధంగా ఖమ్మం జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కేటీఆర్ చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌ఎండీసీ ఆధ్వర్యంలో నడుస్తున్న బైలడిల్లా గనుల నుంచి ఐరన్ ఓర్‌ను తరలించడానికి అవసరమైన రైల్వేలైను సర్వే కోసం రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.2 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా రాష్ట్రంలో ఉక్కు పరిశ్రమను కేంద్రం ఏర్పాటుచేస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తంచేశారు.

ఆచరణ సాధ్యమయ్యే సూచనలివ్వండి

మైనింగ్ టుడే అంతర్జాతీయ సదస్సులో ప్రధానంగా క్షేత్రస్థాయిలో అచరణ సాధ్యమయ్యే సూచనలు, సిఫార్సులు ఉండాలని మంత్రి కేటీఆర్ ఆకాంక్షించారు. దీనికి ఐదు అంశాలను సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రధాన ఆదాయవనరును ఇంకా పెంచడంపై ఆచరణ సాధ్యమయ్యే సూచనలు, పర్యావరణానికి ఇబ్బంది లేకుండా గనులు, ఖనిజాల తవ్వకాలు, సురక్షిత మైనింగ్‌కు ఉత్తమ విధానాలు, ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించడం, జియో మ్యాపింగ్, జియో ట్యాగింగ్, ఆర్‌ఎఫ్‌ఐడీ లాంటి టెక్నాలజీ ఉపయోగించడంపై చర్చలు జరిపి సలహాలు, సూచనలు ఇవ్వాలని మంత్రి కోరారు. సామాజిక బాధ్యతగా డీఎంఎఫ్ నిధులను వినియోగించడంపై సూచనలు చేయాలని కోరారు. కేంద్ర గనుల శాఖ కార్యదర్శి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ డీఎంఎఫ్ ద్వారా ఖనిజాలు, గనులు ఉన్న జిల్లాల్లో రూ. 13,600 కోట్ల నిధులు స్థానికంగా అభివృద్ధి చేయడానికి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర గనుల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ మాట్లాడుతూ రాష్ట్రంలో గనులకు జియో ట్యాగింగ్, జియో ఫెన్సింగ్ జూన్ నెలాఖరుకల్లా పూర్తవుతుందన్నారు. ఈ సందర్భంగా మైనింగ్ టుడే- 2018 సావనీర్‌ను గవర్నర్ నరసింహన్, కేంద్ర మంత్రి తోమర్ ఆవిష్కరించారు. టీఎస్‌ఎండీసీ రూపొందించిన బ్రోచర్‌ను మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. ప్రారంభ కార్యక్రమం అనంతరం ఎగ్జిబిషన్‌ను గవర్నర్ నరసింహన్, కేంద్ర మంత్రి తోమర్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. కార్యక్రమంలో టీఎస్‌ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, మైనింగ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎంఈఏఐ) జాతీయ అధ్యక్షులు అరుణ్ కుమార్ కొఠారి, ఫిక్కీ డైరెక్టర్ జనరల్ దిలీప్ షినాయ్, సదస్సు నిర్వహణ కమిటీ చైర్మన్ బీఆర్వీ సుశీల్‌కుమార్, టీఎస్‌ఎండీసీ ఎండీ మల్సూర్ తదితరులు పాల్గొన్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, ఆఫ్రికా దేశాలతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలనుంచి ప్రతినిధులు హాజరయ్యారు.

'మై ఫ్రెండ్ కేటీఆర్..'

ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర గనుల శాఖ మంత్రి కేటీఆర్‌ను గవర్నర్ నరసింహన్ 'మై ఫ్రెండ్ కేటీఆర్' అంటూ సంబోధించారు. తన ప్రసంగంలో గనులపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను, ఉపయోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రశంసిస్తూ మాట్లాడారు. వయస్సు, హోదాలో పెద్ద వారైన గవర్నర్.. కేటీఆర్‌ను 'మై ఫ్రెండ్' అంటూ సంబోధించడంతో సభికులు కొంత ఆశ్చర్యపోయారు.



మైనింగ్‌టుడే సదస్సు వేదికపై ముచ్చటిస్తున్న గవర్నర్ నరసింహన్, మంత్రి కేటీఆర్

ముహూర్తం



సూర్యోదయం: 6.46 గంటలకు



సూర్యాస్తమయం: 6.14 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, కృష్ణపక్షం అమావాస్య, నక్షత్రం: శ్రవణం ఉదయం 7.32 వరకు తదుపరి ధనిష్ఠ, అమృతఘడియలు: రాత్రి 10.22 నుంచి 11.58 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.56 నుంచి 3.22 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.11 నుంచి సాయంత్రం 4.42 వరకు, వర్జ్యం: ఉదయం 11.54 నుంచి 1.30 వరకు.

లోకం పోకడ



పెళ్లి చేశారు సరే, హనిమూన్‌కు పంపిచరా? అని వెంటబడుతున్నాయి!



ఎర్రజొన్న రైతులకు ఎంపీ కవిత భరోసా

ఆందోళన పడొద్దు.. ప్రతి బస్తాను మార్క్‌ఫెడ్ కొనుగోలు చేస్తుందని హామీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఎర్రజొన్న రైతులు ఆందోళన చెందవద్దని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత కోరారు. ప్రతి బస్తాను మార్క్‌ఫెడ్ కొనుగోలు చేస్తుందని ఆమె భరోసా ఇచ్చారు. కొద్దిరోజులుగా ఎర్రజొన్న రైతులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ఎంపీ కవిత.. మార్కెటింగ్‌శాఖమంత్రి టీ హరీశ్‌రావుతో మాట్లాడారు. సీఎం సూచన మేరకు మంగళవారం హరీశ్‌రావు, వ్యవసాయమంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి, మార్కెటింగ్ అధికారులు, ఇతర ఉన్నతాధికారులతో ఎర్ర జొన్నరైతులు ఆందోళనను చర్చించిన విషయం తెలిసిందే. టీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని కవిత స్పష్టంచేశారు. అధికారంలోకి రాగానే ఎర్రజొన్న రైతుల బకాయిలను చెల్లించిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. పంటలకు అవసరమైన నాణ్యమైన కరంటుతోపాటు మార్కెటింగ్ సౌకర్యాలు పెంచామని చెప్పారు. ప్రతిపక్షాల తప్పుడు మాటలను నమ్మొద్దని కవిత రైతులను కోరారు.

క్రిమిసంహారక మందుపై నిషేదం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మెసర్స్ గోల్డెన్ ఫైమ్ కెమ్ కంపెనీకి చెందిన క్రిమిసంహారక మందుపై నిషేధం విధించినట్టు రాజేంద్రనగర్ పురుగు మందుల పరీక్షా కేంద్రం వ్యవసాయశాఖ అదనపు సంచాలకుడు బుధవారం ప్రకటించారు. జీఎస్టీఆర్ 01 బ్యాచ్ నంబర్‌తో ఉండే డెల్టమిత్రీన్ 1 శాతం, ట్రయిజోఫాన్ 35 శాతం (ట్రేడ్‌నేమ్ క్రిస్) అనే పురుగుమందు నాసిరకంగా తేలడంతో అమ్మడం, నిల్వచేయడంపై నిషేదం విధించినట్టు తెలిపారు.

జీఎస్టీ ఎగవేతపై మహా చెక్

బకాయిలపై స్పెషల్ డ్రైవ్‌లు.. జీరో దందాపై ఎన్‌ఫోర్స్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

వస్తు, సేవలపన్ను (జీఎస్టీ) బకాయిదారులపై, విలువ ఆధారిత పన్ను (వ్యాట్) ఎగవేతదారులపై కఠినంగా వ్యవహరించాలని అధికారులు నిర్ణయించారు. రాష్ట్రంలో వే-బిల్లులు లేకుండా సరఫరా అయ్యే సరుకుల రవాణాను కట్టడిచేయడానికి, ఇతర రాష్ట్రాల నుంచి అడ్డదారిలో సరుకుల తరలింపునకు కళ్లెం వేసేందుకు 'మహాచెక్' పేరిట భారీఎత్తున స్పెషల్‌డ్రైవ్‌లను నిర్వహించడానికి రంగంసిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో స్పెషల్‌డ్రైవ్‌లను నిర్వహించి పన్ను బకాయిలను వసూలు చేయాలని ఆబ్కారీ,వాణిజ్యపన్నులశాఖ ముఖ్యకార్యదర్శి సోమేశ్‌కుమార్ ఆదేశాలు జారీచేశారు. వచ్చేనెల మొదటి వారం వరకు బకాయిలన్నింటినీ వసూలు చేయాలని సూచించారు. ఇప్పటికే ప్రతీ 250 మంది డీలర్లకు ఒక ఆఫీస్ ఇంచార్జిని నియమించారు. సరుకుల



అక్రమ రవాణాను అడ్డుకోవడానికి రాష్ట్రవ్యాప్తంగా నలువైపులా సరిహద్దులలో ఈవారం మహాచెక్‌ల పేరిట తనిఖీలను నిర్వహించనున్నారు. మరోవైపు రాష్ట్ర వాణిజ్యపన్నుల అధికారులు, కేంద్ర జీఎస్టీ అధికారులు సంచార బృందాలను రంగంలోకి దింపుతున్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన జీఎస్టీపై అవగాహన రావడానికి సమయం పడుతుందని కేంద్ర ప్రభుత్వం ఇంతకాలం చూసీచూడనట్టుగా వ్యవహరించిందని, ఇకపై జీఎస్టీ పన్నును ఎగవేయడానికి ప్రయత్నించే వారిపై కఠినచర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి జీఎస్టీ వే-బిల్లులు తప్పనిసరి అని వాణిజ్యపన్నుల శాఖ అధికారులు నొక్కిచెప్తున్నారు. మరో రెండురోజులలో సంచార బృందాల తనిఖీలు మొదలవుతాయని అధికారులు తెలిపారు.

వ్యాట్ బకాయిలపై స్పెషల్ డ్రైవ్

కాగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన నాటి నుంచి ఇప్పటివరకు విలువ ఆధారిత పన్ను (వ్యాట్) బకాయి పడినవారిపై వాణిజ్యపన్నుల శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే హెచ్చరికల నోటీస్‌లను పంపినా స్పందించనివారికి ఆన్‌లైన్‌లో నోటీసులను జారీ చేస్తున్నారు. రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం ఆస్తులను జప్తుచేస్తున్నారు. రాష్ట్రంలో గతనెల నిర్వహించిన స్పెషల్‌డ్రైవ్‌లు సత్ఫలితాలిచ్చాయి. బకాయిదారులకు వెంటవెంటనే నోటీసులను జారీ చేయడం, సంచార బృందాలను ఏర్పాటుచేయడం వల్ల రాష్ట్రంలో జీఎస్టీ వసూలు పెరిగింది. తాజాగా జనవరిలో జీఎస్టీ రాబడి భారీగా పెరిగింది. డిసెంబర్‌లో స్టేట్ జీఎస్టీ రూపంలో రూ.725 కోట్ల రాబడి రాగా జనవరిలో అది రూ.850 కోట్లకు పెరిగింది. జీఎస్టీ, ఐజీఎస్టీ మొత్తం కలిపి డిసెంబర్‌లో రూ.1,490.50 కోట్లు రాగా, జనవరిలో రూ.1,656.14 కోట్ల ఆదాయం వచ్చింది. ఇదే ఉత్సాహంతో స్పెషల్ డ్రైవ్‌లను విస్తృతంగా నిర్వహించనున్నట్టు అధికారులు వెల్లడించారు. జీఎస్టీ రిటర్న్‌లు ఫైల్‌చేయని వారికి నోటీసులు జారీచేశారు. జీఎస్టీ పన్ను చెల్లించకుంటే సరుకు విలువతోపాటు 100 శాతం జరిమానా విధిస్తున్నారు. ఇప్పటికే దాదాపు 16 వేల మందికి ఆన్‌లైన్‌లో నోటీసులు జారీచేశారు.

కృష్ణాలో మన వాటా 575 టీఎంసీలు

మొదటిపేజీ తరువాయి...

ప్రాంతంలో 124 కి.మీ. మేరకు పోలవరం ప్రాజెక్టు ప్రభావం ఉంటుందని తెలిపారు. బ్యాక్‌వాటర్ ప్రభావిత ప్రాంతాలు, తలెత్తే సమస్యలపై అధ్యయనానికి పోలవరం ప్రాజెక్టు అథారిటీని ఆదేశించాల్సిందిగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఉన్నతాధికారులను మంత్రి కోరారు. బచావత్ అవార్డు ప్రకారం పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర జలసంఘం అనుమతులు ఇచ్చిన తరువాత నాగార్జునసాగర్ ఎగువ రాష్ట్రాలకు 45 టీఎంసీల నీటిని వినియోగించుకునే హక్కు దక్కుతుందని మంత్రి అన్నారు. ప్రస్తుతం పోలవరాన్ని జాతీయప్రాజెక్టుగా చేపట్టినందున ఆ 45 టీఎంసీల నీటిని కేంద్రమే తెలంగాణకు కేటాయించాలని స్పష్టంచేశారు.

తెలంగాణకు 575 టీఎంసీల నీటి వాటా..

కృష్ణాబేసిన్‌లోని ప్రాజెక్టుల కింద 36.45 లక్షల హెక్టార్ల సాగుకు యోగ్యమైన భూములున్నప్పటికీ, 5.75 లక్షల హెక్టార్ల భూమికి (15%) మాత్రమే సాగునీరు అందుతున్నదని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. 45 టీఎంసీల నీటిని తెలంగాణకు కేటాయిస్తే, నీరందని ప్రాంతాల్లో సాగుకు వాడుకుంటామన్నారు. పట్టిసీమ ద్వారా గోదావరి జిలాలను ఏపీ మళ్లించుకుంటున్నందున కృష్ణా జలాల్లో తెలంగాణకు 45 టీఎంసీల నీటి వాటా ఉంటుందని చెప్పారు. మొత్తంగా రెండు రాష్ట్రాలకు కృష్ణాలో కేటాయించిన 811 టీఎంసీలలో తెలంగాణకు 575 టీఎంసీలు కేటాయించి న్యాయంచేయాలని గురువారం ఢిల్లీలో కేంద్రాన్ని కోరాలని ఆదేశించారు.

ఆర్డీఎస్ ఆధునీకరణకు డిమాండ్ చేయాలి

రాజోలిబండ డైవర్షన్ స్కీం (ఆర్డీఎస్)కింద రాష్ట్రానికి 15.9 టీఎంసీల కేటాయింపులున్నప్పటికీ, వాస్తవంగా సగటున 4.56 టీఎంసీలకు మించి రావడంలేదని మంత్రి తెలిపారు. ఆర్డీఎస్ కాల్వలు ఆధునీకరించాలని 2004లోనే నిపుణుల కమిటీ సిఫారసు చేసిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. సమైక్య రాష్ట్రంలో ఈ పనులు ముందుకు సాగలేదన్నారు. తెలంగాణ ఆవిర్భవించిన తరువాత కూడా ఏపీ అనేక అడ్డంకులు సృష్టిస్తున్న విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని అధికారులను కోరారు. నిపుణుల కమిటీ గతంలో చేసిన సిఫారసుల మేరకు ఆర్డీఎస్ ఆధునీకరణ పనులు వేగవంతమయ్యేలా కేంద్రం జోక్యం చేసుకోవాలని ఢిల్లీ సమావేశంలో కోరాలని ఆదేశించారు.

పనిచేయని టెలిమెట్రీలు

శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల కింద నీటి వాడకాన్ని లెక్కగట్టేందుకు టెలిమెట్రీ స్టేషన్లు ఏర్పాటు చేయాలని 2016 జూన్‌లో కేంద్ర జలవనరుల శాఖ నిర్ణయించినప్పటికీ.. దానిని అమలు చేయడంలో కృష్ణా బోర్డు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నదని మంత్రి విమర్శించారు. తొలివిడుతలో 19 టెలిమెట్రీల ఏర్పాటుకు 2017 ఫిబ్రవరిలో కేఆర్‌ఎంబీ ప్రతిపాదించినా అవి పనిచేయడం లేదని చెప్పారు. రెండోవిడుత టెలిమెట్రీ స్టేషన్ల జాబితాను ఇంతవరకు ఖరారు చేయకపోవడాన్ని మంత్రి తీవ్రంగా ఆక్షేపించారు. టెలిమెట్రీల ఏర్పాటులో జాప్యంవల్ల పోతిరెడ్డిపాడు కింద అధికంగా నీటిని కృష్ణాబేసిన్ అవతలికి అక్రమంగా తరలిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్‌రాజ్, ఈఎన్సీలు మురళీధర్‌రావు, నాగేందర్‌రావు, సీఈలు సునీల్, ఖగేందర్ రావు, లింగరాజు, హరిరాం, బంగారయ్య, శంకర్, భగవంతరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు అధికారం కల్ల

- వచ్చే ఎన్నికల్లోనూ టీఆర్ఎస్‌దే గెలుపు
- టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ చెప్పినవన్నీ అబద్ధాలే
- కాంగ్రెస్‌ను ప్రజలు విశ్వసించడంలేదు: మంత్రి జూపల్లి ఫైర్



బుధవారం టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు. చిత్రంలో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కల్ల అని, వచ్చే ఎన్నికల్లోనూ టీఆర్ఎస్‌దే అధికారమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు జోస్యం చెప్పారు. పదేండ్లు అధికారంలో ఉండి ఏ ఒక్కరికీ మేలు చేయని కాంగ్రెస్ నాయకులను ప్రజలు ఎంతమాత్రం విశ్వసించడంలేదని పేర్కొన్నారు. బుధవారం టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌తో కలిసి జూపల్లి మీడియాతో మాట్లాడారు. 2019 ఎన్నికల్లోనూ ప్రజలు కేసీఆర్ పక్షానే నిలిచి టీఆర్ఎస్‌కు అఖండ విజయాన్ని చేకూరుస్తారని దీమా వ్యక్తంచేశారు. పింఛన్ల పంపిణీతో పాటు వివిధ పథకాల అమలుపై టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతున్నవన్నీ పచ్చి అబద్ధాలేనని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 29,21,828 మందికి పింఛన్లు ఇవ్వగా, టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక రూ.200 ఉన్న పింఛన్లను రూ.1000కి, రూ.500 ఉన్న పింఛన్లను రూ.1500కు పెంచి 39,77,693 మందికి పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కేవలం పింఛన్ల కోసం ఏడాదికి రూ.5301.83 కోట్లను ఖర్చుచేస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాలకు గతంలో కంటే అధికంగా రుణాలు ఇచ్చామని, సెర్ప్ ఉద్యోగుల వేతనాలను రూ.6 వేల నుంచి రూ. 12 వేలకు పెంచామని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నపుడు సెర్ప్ ఉద్యోగుల వేతనాలను ఎందుకు పెంచలేదని నిలదీశారు. 2009 ఎన్నికల సందర్భంగా అన్ని వర్గాల వారికి 24 గంటలు, వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ ఇస్తామని, ఇంటింటికీ ఎల్పీజీ కనెక్షన్లు, మరో రెండు కిలోల బియ్యాన్ని ఇస్తామని మ్యానిఫెస్టోలో పెట్టిన కాంగ్రెస్ ఆ తర్వాత ఒక్క వాగ్దానాన్ని కూడా నెరవేర్చలేదని విమర్శించారు. ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ప్రజల ఆదరణ పొందుతుండడంతో కాంగ్రెస్ నాయకుల్లో నిరాశ నిస్పృహలు ఆవరించాయని, అందుకే ప్రభుత్వంపై మతిమాలిన విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.



కొమురవెల్లిలో ఘనంగా పెద్దపట్నం

శివరాత్రికి రూ.10,44,036 ఆదాయం

చేర్యాల, నమస్తే తెలంగాణ: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి క్షేత్రంలో శివరాత్రి సందర్భంగా మంగళవారం పెద్దపట్నం వైభవంగా నిర్వహించారు. రాత్రి 12గంటలకు స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం అనంతరం, ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. భక్తులు పట్నం దాటి స్వామి వారిని దర్శించుకున్నారు. జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మల్లన్న క్షేత్రంలో పర్యటించి భక్తుల వసతులను పరిశీలించారు. మహా శివరాత్రి సందర్భంగా మల్లన్న ఆలయానికి రూ.10,44,036 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

వైద్యశాఖలో 931 కొత్త పోస్టులకు ఆర్థికశాఖ అనుమతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వైద్య, ఆరోగ్య, కుటుంబసంక్షేమశాఖ పరిధిలో కొత్తగా 931 పోస్టులకు అనుమతిస్తూ ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి ఎన్ శివశంకర్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. సిద్దిపేట ప్రభుత్వ వైద్యకళాశాల, దవాఖానలో పనిచేసేందుకు ఈ పోస్టులను మంజూరుచేస్తున్నట్టు తెలిపారు.

త్వరలో 21 ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ల నియామకం

సుల్తాన్‌బజార్: రాష్ట్రంలో నూతనంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ (ఎఫ్ఎస్‌వో) నియామకాలకు ఆర్థికశాఖ అనుమతినిచ్చిందని ఐపీఎం డైరెక్టర్ డాక్టర్ శంకర్ చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో 1954 నుంచి 20 మంది ఎఫ్ఎస్ఓలు మాత్రమే ఉండటం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కొత్తగా పోస్టులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపించామని బుధవారం ఆయన నమస్తే తెలంగాణతో తెలిపారు. స్పందించిన ప్రభుత్వం 21 పోస్టుల భర్తీకి అనుమతినిచ్చిందని, త్వరలో టీఎస్‌పీఎస్సీ ద్వారా ఈ నియామకాలు జరుగుతాయని అన్నారు. ఇంతకుముందే పది పోస్టులకు అనుమతివ్వగా భర్తీ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. జిల్లాల్లో 7 గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు (జీఎఫ్ఐ), 7 అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్స్ (ఏఎఫ్‌సీ), 1 జాయింట్ ఫుడ్ కంట్రోలర్, పోస్టులు కూడా త్వరలో భర్తీ కానున్నాయన్నారు.

తెలంగాణ ఎక్సలెన్సీ అవార్డు కమిటీ ఏర్పాటు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ఎక్సలెన్సీ అవార్డు కమిటీని ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. అవార్డు కమిటీ చైర్మన్‌గా మైనార్టీ వెల్ఫేర్ ఎంక్వాయిరీ కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ జీ సుధీర్, సభ్యులుగా ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి, కన్వీనర్‌గా సాధారణ పరిపాలనా విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీలను నియమించింది.

గోల్కొండ బ్రాండ్ నోట్‌పుస్తకాలనే కొనండి

ప్రభుత్వ సంస్థలకు ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్లు ఇతర ప్రభుత్వ అనుబంధ సంస్థలు 'తెలంగాణ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్' తయారుచేసే కాగితపు ఉత్పత్తులనే కొనాలని రాష్ట్ర పరిశ్రమలశాఖ ఉత్తర్వులు జారీచేసింది. 38 ఏండ్లుగా ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ గోల్కొండ బ్రాండ్ పేరిట నోట్ పుస్తకాలు, స్క్రిబ్లింగ్ ప్యాడ్‌లు, స్టూడెంట్ డైరీలను తయారుచేసి విక్రయిస్తున్నది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని కార్పొరేషన్‌ను ప్రోత్సహించడానికి అన్ని ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్‌లు, విద్యాసంస్థలు గోల్కొండ బ్రాండ్ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు.

18న హజ్ యాత్రికులకు శిక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర హజ్ కమిటీ ద్వారా ఈసారి హజ్ యాత్రకు వెళ్తున్న యాత్రికులకు ఈ నెల 18న శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్టు హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారి, ప్రొఫెసర్ ఎస్ఏ షకూర్ తెలిపారు. 18న ఓల్డ్ మలక్‌పేట, వాటర్‌ట్యాంక్ సమీపంలోని హైటెక్ గార్డెన్‌లో ఏర్పాటుచేసే శిక్షణ శిబిరాన్ని డిప్యూటీ సీఎం మహమూద్ అలీ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. దీనికి రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ మసీఉల్లాఖాన్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు కూడా హాజరవుతారని వెల్లడించారు.

మేడారంలో శాశ్వత ఏర్పాట్లు చేయండి

ప్రధాని మోదీకి సీపీఐ నారాయణ లేఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారాన్ని జాతీయ పండుగగా గుర్తించాలని ప్రధాని మోదీకి సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ బుధవారం లేఖ రాశారు. రెండేండ్లకోసారి జరిగే ఈ గిరిజన జాతరకు కోటికిపైగా భక్తులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఇక్కడ శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లుచేయాలని లేఖలో ప్రధానిని కోరారు.

52 ఆర్వోబీలకు ఆమోదం

- రూ. 2,700 కోట్ల అంచనా వ్యయం
- రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 460 ఆర్వోబీలకు ప్రతిపాదనలు
- అంచెలంచెలుగా రైల్వే క్రాసింగ్‌ల ఎత్తివేత
- ఆర్వోబీల నిర్మాణ బాధ్యత ఆర్‌అండ్‌బీ దే
- రైల్వేను ఒప్పించిన మంత్రి తుమ్మల
- రాష్ట్రంలో రైల్వే పెండింగ్ ప్రాజెక్టులపై మంత్రి హరీశ్‌రావు అధ్యక్షతన అధికారులతో మంత్రుల సమీక్ష



బుధవారం జలసౌధలో రాష్ట్రంలోని రైల్వే పెండింగ్ ప్రాజెక్టులపై మంత్రి హరీశ్‌రావు అధ్యక్షతన అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, మహేందర్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి కూడా ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలోని 460 రైల్వే లెవల్ క్రాసింగ్‌లను అంచెలంచెలుగా ఎత్తి వేసేందుకు సమగ్ర ప్రతిపాదనలు ప్రభుత్వం సిద్ధంచేస్తున్నది. తొలివిడుతగా 2018లో 52 ఆర్వోబీలను నిర్మించేందుకు రూ.2,700 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలను ఆమోదించింది. వీటికయ్యే వ్యయాన్ని రైల్వే శాఖ, రాష్ట్ర ప్రభుత్వం సమానంగా భరించనున్నాయి. ప్రధానంగా ఆర్వోబీల నిర్మాణాలను రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ ఆధ్వర్యంలో చేపట్టేందుకు రైల్వేశాఖను మంత్రులు ఒప్పించారు. ఇకనుంచి రాష్ట్ర పరిధిలోని ఆర్వోబీల నిర్మాణాలు పూర్తిగా ఆర్‌అండ్‌బీ శాఖ చూసుకుంటుంది. బుధవారం హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని జలసౌధలో రాష్ట్రంలోని రైల్వే పెండింగ్ ప్రాజెక్టులపై మంత్రి హరీశ్‌రావు అధ్యక్షతన అధికారులతో మంత్రులు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రోడ్లు భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్‌శర్మ, దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్, ఆర్‌అండ్‌బీ, రైల్వే శాఖలకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు పెద్దపీట

ప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చెప్పారు. ఇందులోభాగంగా ఆర్వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన చేపడుతున్నదని అన్నారు. రైల్వే క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్ అంతరాయాలు తగ్గించేందుకు కృత నిశ్చయంతో ఉన్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రమాదాలను పూర్తిస్థాయిలో నిరోధించేందుకు పలు రకాల చర్యలు చేపడుతున్నామన్నారు. రాష్ట్రంలో 16 ఆర్వోబీల స్థితిగతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

సమావేశం నుంచే కలెక్టర్లతో మాట్లాడిన మంత్రి తుమ్మల

రైల్వే ప్రాజెక్టులతోపాటు, ఆర్వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణాల కోసం భూ సేకరణ సమస్యగా మారిందని రైల్వే అధికారులు తెలుపడంతో ఆర్‌అండ్‌బీశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పలు జిల్లాల కలెక్టర్లతో సమావేశం నుంచే మాట్లాడారు. భూ సేకరణ పనులు పూర్తిచేసి సంబంధిత స్థలాలను అప్పగించినట్లైతే ఆర్వోబీలు త్వరగా పూర్తవుతాయని వారికి మంత్రి చెప్పారు. సంగారెడ్డి, మెదక్, భద్రాద్రి, ఖమ్మం, వరంగల్ (రూరల్), సూర్యాపేట కలెక్టర్లతో మాట్లాడటంతో త్వరలోనే భూసేకరణ సమస్య కొలిక్కివచ్చే అవకాశాలున్నాయని చెప్పారు.

సుబాబుల్ రైతులను ఆదుకుంటాం: మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో సుబాబుల్ రైతులు పడుతున్న కష్టాలను తీర్చి కనీస మద్దతు ధర వచ్చేలా కృషిచేస్తామని నీటిపారుదల, మార్కెటింగ్‌శాఖ మంత్రి హరీశ్‌రావు హామీ ఇచ్చారు. బుధవారం ఎర్రమంజిల్‌లోని జలసౌధలో సుబాబుల్ రైతులతో హరీశ్‌రావు సమావేశమయ్యారు. ఐటీసీ నియమించిన ఏజెంట్లను, దళారులను తొలిగిస్తే కంపెనీ అందించే రూ.4,508 మద్దతు ధర రైతులకు అందుతుందని అన్నారు. మండలానికో డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తామని మంత్రి చెప్పారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే మదన్‌లాల్, సుబాబుల్ రైతులు పాల్గొన్నారు.



జలసౌధలో సీఎస్ ఎస్కే జోషికి పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరిస్తున్న మంత్రి హరీశ్‌రావు

సీఎస్ జోషికి మంత్రి హరీశ్ సత్కారం

అంకితభావమున్న అధికారి అని ప్రశంసలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ పునర్నిర్మాణంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా, నీటిపారుదల వ్యవహారాలను పర్యవేక్షించిన సీఎస్ ఎస్కే జోషి అధికారిగా కాకుండా తెలంగాణ పౌరునిగా బాధ్యతాయుతంగా పనిచేశారని మంత్రి హరీశ్‌రావు ప్రశంసించారు. జోషి చిత్తశుద్ధి, నిబద్ధత కలిగిన అధికారి అని పేర్కొన్నారు. కొత్తరాష్ట్రంలో చేపడుతున్న ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయడానికి జరిపిన కృషిని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు గుర్తించారని చెప్పారు. ఎస్కే జోషిని ప్రభుత్వ ప్రధాన క్యార్యదర్శిగా నియమించడంతోపాటు నీటిపారుదలశాఖ బాధ్యతలు కూడా ఆయనకే అప్పగించడం చాలా సంతోషంగా ఉందని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా జలసౌధలో సమీక్ష సమావేశంలో సీఎస్ జోషి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోషిని మంత్రి హరీశ్‌రావు సత్కరించారు. ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు సైతం జోషిని శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేసేందుకు మంత్రి హరీశ్ పడుతున్న శ్రమను సీఎస్ జోషి కొనియాడారు.

టీఆర్టీ దరఖాస్తుల సవరణకు మరోసారి గడువు

- రేపు సాయంత్రం వరకు అవకాశమిచ్చిన టీఎస్‌పీఎస్సీ
- 19 నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉపాధ్యాయపోస్టుల భర్తీకోసం నిర్వహించే టీచర్ రిక్రూట్‌మెంట్‌టెస్ట్ (టీఆర్టీ)కు హాజరయ్యే అభ్యర్థులు తమ దరఖాస్తుల్లో తప్పులను సవరించుకునేందుకు టీఎస్‌పీఎస్సీ మరోసారి అవకాశం ఇచ్చింది. గురువారం ఉదయం 5 గంటల నుంచి శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు తప్పులు సవరించుకొనేందుకు అవకాశం ఇస్తున్నామని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఏ వాణీప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్‌అసిస్టెంట్, ఎస్జీటీ, ఫిజికల్ డైరెక్టర్స్, లాంగ్వేజీ పండిట్‌పోస్టులకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు తప్పుల సవరణల కోసం ఎడిట్ ఆప్షన్ ఇచ్చామన్నారు. ఇందుకోసం tspsc.gov.in అనే వెబ్‌సైట్‌ను సంప్రదించాలని, 31 జిల్లాలకు బదులుగా 10 జిల్లాలకు సంబంధించి మార్పులు చేసుకోవటానికి ఎడిట్ ఆప్షన్ ఇచ్చామని తెలిపారు. ఈ నెల 19 నుంచి టీఆర్టీ హాల్‌టికెట్ల డౌన్‌లోడింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని టీఎస్‌పీఎస్సీ సెక్రటరీ పేర్కొన్నారు

ఈ నెల 28 నుంచి ఇంటర్ పరీక్షలు

- రెండురోజుల్లో హాల్‌టికెట్ల డౌన్‌లోడ్
- హాల్‌టికెట్లు ఇవ్వని కాలేజీలపై చర్యలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో పరీక్షల కాలం వచ్చేస్తుంది. ఈ నెల 28 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలను జరుగనున్నాయి. అందుకు సంబంధించిన ఏర్పాట్లలో ఇంటర్ బోర్డు అధికారులు నిమగ్నమయ్యారు. 2017-18 విద్యాసంవత్సరానికి సంబంధించి 9.25 లక్షల మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో 4.75 లక్షల మంది ఫస్టియర్, 4.50 లక్షల మంది సెకండియర్ పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రైవేటు విద్యార్థులు 1.25 లక్షల మంది ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఈ పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,560 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఇంటర్ పరీక్షల నిర్వహణ అధికారి సుశీల్‌కుమార్ తెలిపారు. హాల్‌టికెట్ల పంపిణీ రెండురోజుల్లో మొదలవుతుందని, విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఈ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు.

పకడ్బందీ ఏర్పాట్లు

రాష్ట్రవ్యాప్తంగా 20 సమస్యాత్మక కేంద్రాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, మాస్‌కాపీయింగ్ జరుగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. వీడియో రికార్డింగ్ కూడా చేయాలని బోర్డు అధికారులు నిర్ణయించారు. రాష్ట్రంలోని కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీలను దృష్టిలో పెట్టుకుని ఈసారి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నారు. ఫీజు బకాయిల పేరుతో విద్యార్థులు పరీక్షలకు హాజరు కానివ్వకుండా హాల్‌టికెట్లు నిలిపివేసిన ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని ఇంటర్ బోర్డు అధికారులు హెచ్చరించారు. హాల్‌టికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులు పెట్టవద్దని ప్రైవేటు జూనియర్ కాలేజీ యాజమాన్యాలకు ఇంటర్ బోర్డు సెక్రటరీ స్పష్టం చేశారు.

ఇంటింటికీ తెలంగాణ సర్వస్వం

- కోటి పుస్తకాల ముద్రణ.. మార్చి 18 నుంచి పంపిణీ
- ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి వెల్లడి



బుధవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి. చిత్రంలో సీఎంవో ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ చరిత్రను ప్రతి కుటుంబానికి తెలిపేందుకు 'మన తెలంగాణ- మన చరిత్ర' పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్టు ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి చెప్పారు. అరచేతిలో ఇమిడే ఈ పుస్తకాలను ఉగాది పర్వదినం మార్చి 18 నుంచి అందించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు వివరించారు. సచివాలయంలో బుధవారం సీఎం కార్యాలయం ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా కొన్ని పుస్తకాలను ప్రచురించామని, వాటిలో పాకెట్‌సైజ్‌లో ఉండే "మన తెలుగు" అనే పుస్తకం విశేషంగా ఆకట్టుకుందని తెలిపారు. దీంతో తెలంగాణ చరిత్ర, భాష, సంస్కృతి, కళలు, సాహిత్యం వంటి అంశాలపై మరో పాకెట్‌సైజ్ పుస్తకాన్ని రూపొందించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారని పేర్కొన్నారు. దేశపతి శ్రీనివాస్ నేతృత్వంలో స్టేట్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ ట్రైనింగ్ (ఎస్సీఈఆర్టీ) ఆధ్వర్యంలో దీనిని ముద్రించనున్నట్టు రమణాచారి తెలిపారు. ఈ పుస్తకంలో పొందుపర్చే అంశాలపై రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి, గ్రంథాలయ పరిషత్తు చైర్మన్ అయాచితం శ్రీధర్, తెలుగు యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ఎస్వీ సత్యనారాయణ, అధికార భాషా సంఘం అధ్యక్షుడు దేవులపల్లి ప్రభాకర్‌రావుతోపాటు పలువురు కవులు, రచయితలు, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్‌తో సమావేశమై చర్చిస్తారని చెప్పారు. ముఖ్యమంత్రి కార్యాలయ ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉగాది నుంచి పంపిణీ చేసే తెలంగాణ చరిత్ర పుస్తకాలకు సీఎం కేసీఆర్ స్వయంగా పేరు పెట్టనున్నారని తెలిపారు.



టీమిండియా అద్భుత ఆటతీరుతో దక్షిణాఫ్రికాపై సిరీస్ విజయం సాధించింది. ఈ విజయంలో కీలకపాత్ర పోషించిన మణికట్టు స్పిన్నర్లు కుల్దీప్, చాహల్ కృషి అమోఘం. సెంచరీ సాధించిన రోహిత్ మరోమారు కీలక ఇన్నింగ్స్ ఆడాడు. విజయాల బాటను ఇలాగే కొనసాగించండి.

సచిన్ టెండూల్కర్, దిగ్గజ క్రికెటర్

సఫారీ గడ్డపై భారతజట్టు ప్రదర్శన అదరహో అనిపించింది. సిరీస్ విజయాన్నందించిన ఐదో వన్డే విజయం భారత్ సాధించిన విజయాలలో అతిగొప్పది.. రోహిత్ సూపర్. ఫాం తాత్కాలికం.. క్లాస్ శాశ్వతం అని నిరూపించాడు.

సౌరభ్ గంగూలీ, భారత మాజీ కెప్టెన్



చరిత్రలో నేడు



1903

తొలిసారిగా అమెరికా మార్కెట్లోకి వచ్చిన టెడ్డీ బేర్.

1906

బ్రిటిష్ లేబర్ పార్టీ స్థాపన.





1944

బెర్లిన్‌పై బాంబుదాడి చేసిన 891 బ్రిటిష్ విమానాలు.

ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో ఘన విజయం సాధించడం ద్వారా అధికారం చేపట్టి మూడేండ్లయింది. రాజకీయాలలో, పరిపాలనలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పుతామని ఈ పార్టీ వాగ్దానం చేసింది. ప్రజారోగ్యం, విద్యా రంగాలలో కొత్తదారులు తొక్కింది. నీటి సరఫరా, విద్యుత్ టారిఫ్ విషయంలో పేదల అనుకూల విధానాలు చేపట్టింది. కానీ ఎక్కువకాలం వివాదాలతో గడిచింది. చాలామంది ఆప్ విజయాన్ని భారత రాజకీయాలలో చరిత్రాత్మక ఘటనగా భావించారు. ఆప్ ఘర్షణాత్మక విధానాలకు అతీతంగా ఎదిగి చరిత్రాత్మక తీర్పును సార్థకం చేసుకోవడానికి ఇంకా రెండేండ్ల వ్యవధి ఉన్నది.

హిందుస్థాన్ టైమ్స్

పాకిస్థాన్ ఎట్టకేలకు అంతర్జాతీయ కట్టుబాట్లకు అనుగుణంగా ఆంతరంగిక చట్టాలను సవరించుకున్నది. ప్యారిస్‌లో ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ సమావేశం జరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం వెలువడింది. పాకిస్థాన్ ద్వారా ఉగ్రవాదులకు తోడ్పాటు అందుతున్న నేపథ్యంలో, ఈ దేశంపై చర్యలు తీసుకునే అంశాన్ని ప్యారిస్ సమావేశం చర్చించదలిచింది. ఈ సందర్భంలోనే పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని కట్టడి చేసే ఆర్డినెన్స్ విడుదల చేసింది. పాకిస్థాన్ నిజంగా ఉగ్రవాదాన్ని కట్టడి చేసే ఉద్దేశంతో ఈ చర్యలు తీసుకున్నట్టు కనిపించడం లేదు.

డాన్

కేప్‌టౌన్ హెచ్చరిక

దక్షిణాఫ్రికా దేశంలోని కేప్‌టౌన్ నగరం నీటికొరతను ఎదుర్కొంటున్న తీరు ప్రపంచ దేశాలకు ఒక హెచ్చరిక. మూడేండ్లుగా తీవ్ర దుర్భిక్షం నెలకొనడంతో, జలాశయ నీళ్ళు అడుగంటాయి. దీంతో కేప్‌టౌన్ నివాసులు రోజు వారీ అవసరాలకు తగినంత నీటిని కూడా పొందలేని దుస్థితి ఏర్పడ్డది. ఈ నేపథ్యంలో జూన్ నెల నుంచి రేషన్ ద్వారా నీటిని తెచ్చుకునే దుస్థితి ఏర్పడుతున్నది. ఇక ఆ రోజు నుంచి నల్లాలలో నీళ్ళు రావు. నగరంలో అక్కడక్కడా నీటి సరఫరా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్నది. పొద్దునే వెళ్ళి క్యూలో నిలబడి నీళ్ళు తెచ్చుకోవలసి వస్తున్నది. అయినా ప్రభుత్వం మనిషికి రోజుకు 25 లీటర్లు మాత్రమే ఇస్తున్నది. ప్రభుత్వం మొదట ఏప్రిల్ 28ని ‘డే జీరో’గా ప్రకటించి, నీటికొరతకు సిద్ధపడమని వెల్లడించింది. దీంతో ప్రజలు అప్రమత్తమై నీటి పొదుపును మొదలుపెట్టారు. వ్యవసాయానికి కూడా నీటి వినియోగం తగ్గించారు. దీంతో స్థానిక ప్రభుత్వం డే జీరోను జూన్ పదకొండుకు జరిపింది. ప్రజల నీటి పొదుపు, లభ్యతలో మార్పు వచ్చే కొద్దీ డే జీరోను అధికారులు ముందుకు వెనక్కు జరుపుతూనే ఉన్నారు. ఇవాళ కేప్‌టౌన్ ఎదుర్కొంటున్న విషమ పరిస్థితి భవిష్యత్తులో ప్రపంచంలోని పలు నగరాలకు తప్పదని అంటున్నారు. బీబీసీ కథనం ప్రకారం కేప్‌టౌన్ తరహాలో లండన్, మాస్కో సహా ప్రపంచంలోని పదకొండు నగరాలు నీటి కొరతను ఎదుర్కోబోతున్నాయి. వీటిలో బ్రెజిల్ ఆర్థిక రాజధాని అయిన సావో పాలో మొదట ఉండగా, బెంగళూరు రెండవ స్థానంలో ఉన్నది.

మన దేశంలో బెంగళూరుతో పాటు పలు ప్రాంతాలు నీటికొరతను ఎదుర్కొంటున్నాయి. వెంటనే అప్రమత్తం కాకపోతే ముందు వెనుకగా అన్నిటికీ ఇదే గతి పట్టవచ్చు. ఒకప్పుడు తెలంగాణలో, విదర్భలో కరువు ఎంత విలయాన్ని సృష్టించిందో తెలిసిందే. పశ్చిమ మహారాష్ట్ర నుంచి అదే రాష్ట్రంలోని లాతూరుకు మంచి నీటిని రైలు వాగన్లలో తరలించవలసి వచ్చింది. ఆసియా అభివృద్ధి బ్యాంకు వెల్లడించిన వివరాల ప్రకారం– భారత్‌లో 2030 నాటికి యాభై శాతం నీటి కొరత ఉంటుంది. బెంగళూరులో 1970 దశకంలో 285 జలాశయాలు ఉంటే, ఇప్పుడు 194కు తగ్గిపోయాయి. కొత్త నిర్మాణాలు చేపడుతున్నా, మంచినీటి, మురికినీటి పారుదల ఏర్పాట్లు తగినట్టుగా లేవు. మంచినీళ్ళలో సగం వృథాగా పోతున్నాయని అధ్యయనంలో వెల్లడైంది. దేశంలోని మిగతా నగరాల పరిస్థితి ఏమంత గొప్పగా లేదు. అభివృద్ధి పేర ప్రకృతిని ధ్వంసం చేయడం, పర్యావరణానికి హాని కలిగించడం వల్ల ఆ ఫలితాలను అనుభవించవలసి వస్తున్నది. కేప్‌టౌన్ నీటి కరువుకు గురవడానికి కారణం వాతావరణ మార్పు కారణమైనప్పటికీ, సకాలంలో స్పందించి చర్యలు తీసుకుంటే, ఇంత సంక్షోభం వాకిట్లకు వచ్చి నిలువకపోయేది. దక్షిణాఫ్రికాలోని రాజకీయ నాయకుల సంకుచిత విధానాలు ఈ సంక్షోభాన్ని తెచ్చిపెట్టాయి. కేంద్రంలో ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ అధికారంలో ఉన్నది. రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు ప్రతిపక్ష కూటమి డెమొక్రాటిక్ అలయన్స్ చేతిలో ఉన్నాయి. కేప్‌టౌన్ పరిస్థితి దారుణంగా ఉన్నదని, తగు చర్యలు తీసుకోవాలని ఎంత కోరినా కేంద్రం సహకరించలేదు. ఉదాహరణకు– కనీసం ప్రకృతి బీభత్సంగా ప్రకటిస్తే, ఇతర నిధులను నీటి ఏర్పాట్ల వైపు మళ్ళించవచ్చు. ఇటువంటి ఏ విజ్ఞప్తినీ కేంద్రం పట్టించుకోలేదు. చివరికి ఆ ఫలితాన్ని ప్రజలు అనుభవిస్తున్నారు.

ప్రజల సంక్షేమం, సమాజ భవిష్యత్తు విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించా లె. దక్షిణాఫ్రికాలోనే కాదు, మన తెలంగాణ రాష్ట్రానికి కూడా ఇది వర్తిస్తుంది. వర్షపు నీటిని ఒడిసిపట్టి జలాశయాలలో నిలువ చేసుకోవడం ఎంతో అవసరం. కోట్లాది మంది జనాభాకు ప్రస్తుత అవసరాలు తీర్చడమే కాదు,భవిష్యత్ తరాలకు కూడా కొరత ఏర్పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలె. దీర్ఘకాలిక వ్యూహంతో నీటి పారుదల ప్రాజెక్టులు చేపట్టడం, జలాశయాలు నిర్మించుకోవడం తప్పనిసరి అని అందరూ గ్రహించాలె.

ప్రజల సంక్షేమం, సమాజ భవిష్యత్తు విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలె. దక్షిణాఫ్రికాలోనే కాదు, మన తెలంగాణ రాష్ట్రానికి కూడా ఇది వర్తిస్తుంది. వర్షపు నీటిని ఒడిసిపట్టి జలాశయాలలో నిలువ చేసుకోవడం ఎంతో అవసరం. కోట్లాది మంది జనాభాకు ప్రస్తుత అవసరాలు తీర్చడమే కాదు, భవిష్యత్ తరాలకు కూడా కొరత ఏర్పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలె. దీర్ఘకాలిక వ్యూహంతో నీటి పారుదల ప్రాజెక్టులు చేపట్టడం, జలాశయాలు నిర్మించుకోవడం తప్పనిసరి అని అందరూ గ్రహించాలె. తెలంగాణ ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైన ప్రాంతం. కరువు, నీటి కొరత వల్ల మనుషులు, గొడ్డుగోదా మలమల మాడిన రోజులున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం అవతరించిన వెంటనే ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో చేపడుతున్న మౌలిక చర్యలు గమనార్హమైనవి. వేలాది చెరువుల పునరుద్ధరణ మూలంగా పల్లెలు సస్యశ్యామలం కావడమే కాకుండా, భూగర్భ జలాలు పెరుగుతున్నాయి. మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్ వల్ల ఏ ప్రాంతానికి నీటి కొరత ఏర్పడదు. రైళ్ళలో నీళ్ళు తెప్పించవలసిన అవసరం అంతకన్నా ఉండదు. హరితహారం వంటి ప్రాజెక్టు ద్వారా పచ్చదనం పెంచుతున్నారు. ఈ పర్యావరణ పరిరక్షణ చర్యలన్నీ విజయవంతంగా అమలు కావాలంటే ప్రజలలో కూడా చైతన్యం అవసరం. చంటి పిల్లలను సాకే ప్రతి తల్లిదండ్రులు, తమ పిల్లలు, మనుమలు బతుకాలంటే, భూమి నివాసయోగ్యంగా ఉండాలనేది గ్రహించాలె. పర్యావరణాన్ని కాపాడుకోలేకపోతే, ధనవంతులు, పేదలు అనే తేడా లేకుండా, మానవులే కాదు, సమస్త జీవరాశి అంతరించిపోతుంది. నీటి ప్రాజెక్టులకు అడ్డుతగిలే వారు ఇప్పటికైనా ఆత్మపరిశీలన చేసుకోవాలె.

జనగళం

చే‘నేతన్న’కు అవార్డుల పంట

భారతదేశ సుసంపన్నమైన సాంస్కృతిక వారసత్వ సంపదలో అంతర్భాగంగా చేనేత పరిశ్రమ విరాజిల్లుతున్నది. దేశ వస్త్ర ఉత్పత్తుల్లో తెలంగాణలో తయారయ్యే వస్త్రాలకు ప్రత్యేక స్థానం, ప్రాధాన్యం ఉన్నది. అగ్గిపెట్టెలో అమిరే 6 గజాల చీరను ప్రపంచానికి అందించిన ఘనత తెలంగాణది. కుట్టులేని అంగీలు, కటింగులేని గాంధీ టోపీ స్వాతంత్ర్య పోరాటానికి అందించిన ఘనత తెలంగాణ నేతన్నది. మగ్గంపై అందంగా పురివిప్పి ఆడిన నెమళ్ళు, ఏనుగులు, పిట్టలు, గొల్లభామలు, విరుగగాసిన మామిడి పిందెలు, విరిసిన పూల తరంగాలు, మనిషిని నిలబెట్టి వారి చిత్రాన్ని వస్త్రంపై నేయగల సమర్థత తెలంగాణ నేతన్నలది. పలుర కాల నాణ్యమైన ఉత్పత్తులు రాష్ట్ర నేతన్న నైపుణ్యానికి ప్రతిబింబం. దేశానికే తలమానికం.

ఒక మగ్గం పనిచేస్తే ఆ చేనేత కార్మికుడి కుటుంబంలో నలుగురు సభ్యులేగాక వస్త్ర తయారీకి ముందు, తర్వాత పనులద్వారా ఆరుగురికి ప్రత్యక్ష ఉపాధి దొరుకుతుంది. అలా లక్షలాదిమంది చేనేతరంగంపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనోపాధి పొందుతున్నారు. చేనేత కళ, సమర్థత, సార్థకత, నైపుణ్యాలకు ఆదరణ కరువు అవుతున్నది.

రాష్ట్రం ఏర్పడిన తర్వాత చేనేత రంగానికి పూర్తిస్థాయిలో ప్రభుత్వం అండగా నిలిచి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టింది. చేనేత రంగానికి పూర్వవైభవం తెచ్చేందుకు, చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడకుండా వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ కంకణబద్ధులై కృషి చేస్తున్నారు. చేనేత కార్మికుల సమస్యలకు ఒక శాశ్వత, సమగ్ర పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నారు. సబ్సిడీలు అందించడంతో పాటు నేత కార్మికులు తయారుచేసి వస్త్రాలన్నిటిని ప్రభుత్వం కొనుగోలు చేయడం ఎంతో మేలుచేస్తుంది. అంతేకాకుండా మెగా టెక్స్‌టైల్స్ పార్క్, వరంగల్ వస్త్ర నగరికి ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపనతో చేనేత వెతలు తీరుతాయి. ఈ నేపథ్యంలో చేనేత రంగానికి ప్రభుత్వం అన్నివిధాలా అందిస్తున్న ప్రోత్సాహాన్ని ప్రతిఒక్కరూ అందిపుచ్చుకోవాలి. ఆకలి చావులకు నెలవుగా ఉన్న చేనేతరంగం సకల విధాలుగా అభివృద్ధి చెందాలి. మగ్గం సిరిసంపదలకు చిరునామా కావాలి.

– డాక్టర్ చిక్కా దేవదాసు
జాతీయ అధ్యక్షులు, చేనేత వర్గాల చైతన్య వేదిక
(కేంద్రప్రభుత్వం రాష్ట్ర చేనేతకు ఆరు అవార్డులు ప్రకటించిన సందర్భంగా..)

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

ఆలోకన



టంకశాల అశోక్

చరిత్రను వక్రీకరించిన మోదీ

ఇటీవల రాజకీయ ఒత్తిడికి గురవుతున్న ప్రధాని మోదీ, ఈ నెల 7న పార్లమెంటులో మాట్లాడుతూ చరిత్రను వక్రీకరించారు. నెహ్రూ ఎట్లా ప్రధాని అయ్యారు, దేశ విభజనకు ఎవరు బాధ్యులు, కశ్మీర్ పట్ల పటేల్ వైఖరి ఏమిటి, దేశంలో ప్రజాస్వామిక వ్యవస్థ అవతరణ, ఆంధ్రప్రదేశ్ విభజన తీరు అనే అయిదు అంశాల్లోనూ ఆయన ఈ విధమైన వక్రీకరణలు చేశారు. ఒత్తిడి పెరిగితే దానిని రాజకీయంగా ఎదుర్కోవాలి. కానీ అందుకు చరిత్రను వక్రీకరించటం వల్ల తనపై గౌరవం తగ్గుతుంది.

నెహ్రూ నాయకుడు కావటం విషయం ముందు చూద్దాం. మోదీ అన్నట్లు పార్టీ నాయకునిగా నెహ్రూ కన్నా పటేల్‌నే ఎక్కువమంది కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు, అన్ని పీసీసీలూ బలపరిచిన మాట నిజం. అయినప్పటికీ వారిని కాదని నెహ్రూ నాయకత్వాన్ని నిర్ణయించింది ఎవరు? ఆ పనిచేసింది స్వయంగా గాంధీయే. అందుకు కారణాలను ఆయనే స్వయంగా చెప్పారు. ఇంగ్లీష్ వారినుంచి మనం అధికారాన్ని స్వీకరిస్తున్న తరుణంలో జవహర్‌లాల్‌కు బదులు మరొకరు ఆ స్థానంలోకి రాలేరని, ఆంగ్లేయులతో వ్యవహరించేందుకు హారో కాలేజీలో, కేంబ్రిడ్జిలో చదివి బారిస్టర్ అయిన నెహ్రూ అందుకు అవసరమని అన్నారాయన. బయటి దేశాల గురించి సర్దార్ కన్నా నెహ్రూకు ఎక్కువ తెలుసని, ముస్లింలతో సత్సంబంధాలకు పటేల్ విముఖుడు కాగా నెహ్రూకు అటువంటి సంబంధాలు ఉన్నాయని, అంతర్జాతీయ వ్యవహారాలు బాగా తెలిసినందున ఆ స్థాయిలో దేశానికి సముచితమైన స్థానాన్ని సాధించగలడని కూడా అభిప్రాయపడ్డాడు. ఇది కాకుండా, దేశంలోని సాధారణ ప్రజల్లో, ముఖ్యంగా యువతరంలో, పట్టణ వాసులలో, ప్రగతిశీల భావనలు గల వర్గాలలో నెహ్రూకు ఉండిన మద్దతు చాలా ఎక్కువ. ఆ విషయంలో నెహ్రూతో పోటీపడగల ఏకైక వ్యక్తి సుభాష్ బోస్ కాగా ఆయన ఈ సరికి లేరు. వాస్తవానికి గాంధీ అంతకుముందు సంవత్సరాలలో ఒక దశలో తన వారసుడు పటేల్ అని స్పష్టంగా సూచించకుండా వెనుకకుపోవటంలో ఇటువంటి కారణాలు పనిచేశాయి. అప్పటి వివిధ పరిస్థితులు అన్నింటిని దృష్టిలోకి తీసుకుంటూ తన నిర్ణయాన్ని ఆ విధంగా మార్చుకోవటం గాంధీజీ గొప్పతనాన్ని సూచిస్తుంది.

పోతే, పార్టీ నాయకత్వం కోసం నామినేషన్లకు గడువు 1946 ఏప్రిల్ 29 కాగా, ఆ నాటికి నెహ్రూ పేరును ఒక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కూడా ప్రతిపాదించలేదు. రాష్ట్ర కాంగ్రెస్‌లు అన్నీ ఫ్యూడల్, మితవాదవర్గాల ప్రాబల్యంలో ఉండటం అందుకు కారణం. ఆ రోజుకు గాంధీజీ సైతం తన అభిప్రాయం చెప్పలేదు. గడువు ముగిసిపోయినాక కృపలానీ పార్టీ వర్కింగ్ కమిటీకి లేఖ రాస్తూ గాంధీ నెహ్రూకు అనుకూలమంటూ సూచించాడు. దానితో పటేల్ తన అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకున్నారు. ఈ వివరాలన్నీ అప్పటి చారిత్రక పత్రాలలో ఉన్నవే. ఈ నిర్ణయం సరైనదా కాదా అనే చర్చ ఎంతైనా చేయవచ్చు. కానీ ఆ నిర్ణయం తీసుకున్నది నెహ్రూనో, ఆయన కుటుంబమో కాదు. నిర్ణయానికి గల కారణాలను గాంధీ దాచి ఉంచలేదు. తర్వాత వివరించారు కూడా. అవి ఏమిటో పైన చూశాము. ఆ కారణాలు సహేతుకమో కాదో మోదీ చర్చించవచ్చు. కాని అప్పుడు జరిగిన దానిని అప్పటి పరిస్థితుల నుంచి, గాంధీ చెప్పిన కారణాల నుంచి విడదీసి ఒకటి రెండు ముక్కలుగా తమకు అనుకూలమైన రీతిలో మాట్లాడటం చరిత్రను పాక్షికంగా చూపటం, వక్రీకరించటం అవుతుంది. పటేల్ తనకు తానే గొప్పవాడు. మన ప్రయోజనాల కోసం ఆయనను మరింత గొప్పవాడిని చేసి ఇతరులను తక్కువచేసే చరిత్ర వక్రీకరణ మాత్రం సరైనది కాదు.

మోదీ ప్రసంగంలో దేశ విభజన అన్నది రెండో అంశం. ‘మీరు (కాంగ్రెస్) దేశాన్ని విభజించినప్పుడు ఎటువంటి విషాన్ని నాటారంటే, ఆ ఫలితాలను 125 కోట్లమంది భారతీయులు అనుభవించకుండా గత డెబ్బై ఏండ్లలో ఒక్కరోజు కూడా గడువలేదు’ అన్నారు. ఇందులో విషం నాటడం, దాని ఫలితాలు అనే విషయాలను అట్లుంచితే అందుకు ఆరంభం కాంగ్రెస్ దేశాన్ని విభజించటంతో జరిగిందన్నది మోదీ ఎత్తిచూపదలచిన మాట. దేశ విభజన ఒక విషాదకరమైన పరిణామం అనటంలో, అందువల్ల అప్పుడు జరిగిన మారణహోమాన్ని అట్లుంచి దాని దుష్ప్రభావాలు నేటికీ కన్పిస్తున్నాయనటంలో సందేహంలేదు. కాని దేశ విభజనకు బాధ్యత కాంగ్రెస్‌దని మోదీ నిందించదలుచుకుంటే, అదే కాంగ్రెస్‌కు అప్పుడు అగ్రనాయకులలో ఒకరైన పటేల్ పాత్ర కూడా అందులో ఏమైనా ఉందా అనేది ప్రశ్న. మోదీ మాటలను బట్టి ఆ దోషమంతా తక్కిన కాంగ్రెస్‌ది అన్న అభిప్రాయం కలిగే అవకాశం ఉంది. ఇంతకూ విభజన విషయంలో పటేల్ వైఖరి, పాత్ర ఏమిటి? ఇందుకు సంబంధించి కూడా చారిత్రక పత్రాలు చాలానే ఉన్నాయి. జిన్నా నాయకత్వాన ముస్లిం లీగ్ పాత్రను అట్లుంచి కాంగ్రెస్ విషయం చూస్తే, విభజనను పటేల్ వ్యతిరేకించారా? విభజన వద్దంటూ చివరిదశ వరకు గాంధీజీ పట్టుబట్టడం మినహా, పటేల్ అందుకు బాగానే అనుకూలురు. ఆయన వ్యవహారణ అంతా చివరిదశలో అందుకు తగినట్లుగానే సాగినట్లు ఆయన కార్యదర్శి వి.పి.మెనన్ రచనలను, ఇతర పత్రాలను గమనించినపుడు స్పష్టమవుతుంది. దేశానికి స్వాతంత్ర్యం ఇవ్వటంతో పాటు విభజించగలమని అప్పటి బ్రిటిష్ ప్రధాని లార్డ్ అట్లీ 1946లో సూచించగా, ఆ మేరకు మెనన్ తయారుచేసిన ముసాయిదా ప్రణాళికను పటేల్ అదే సంవత్సరం డిసెంబర్ చివరివారం, 1947 జనవరి మొదటివారం మధ్య ఆమోదించినట్లు చరిత్రకారులు నిర్ధారిస్తున్నారు. విభజనకు కాంగ్రెస్‌ను ఒప్పించగలనని పటేల్ అన్నట్లు కూడా మెనన్ రాశాడు. ముస్లిం లీగ్‌ను ఏదో ఒకవిధంగా వదిలించుకోవాలనుకున్న నెహ్రూ సైతం విభజనకు మనస్ఫూర్తిగానే సిద్ధపడటం రహస్యం కాదు. కనుక మోదీ ఈ విషయమై కాంగ్రెస్‌ను, నెహ్రూ నిందించటమంటే పటేల్‌ను కూడా నిందించటమవుతుంది. చారిత్రక వాస్తవాలు ఎవరినీ మినహాయించవు.

కశ్మీర్‌కు సంబంధించి సాధారణంగా తెలియని విషయం ఒకటున్నది. అక్కడి పాలకుడు హిందువు అయినా ప్రజలలో అధిక సంఖ్యాకులు ముస్లింలు అయినందున, భారతదేశంలో ఆ సంస్థానం విలీనం పట్ల సర్దార్ పటేల్ మొదటినుంచీ ఆసక్తి చూపలేదు. 1947 ఆగస్టు 15న దేశం స్వతంత్రం కాగలదని ప్రకటించిన బ్రిటిష్ పాలకులు ఇక్కడి సంస్థానాలు ఇండియన్ యూనియన్‌లో, లేదా పాకిస్థాన్‌లో విలీనం కావచ్చునని, లేదా స్వతంత్రంగా ఉండవచ్చునని మూడు ఆప్షన్లు ఇచ్చారు. అందుకు ఆమోదం తెలిపిన భారత నాయకత్వం వీలైనన్ని ఎక్కువ సంస్థానాలను ఆకర్షించేందుకు ప్రయత్నించింది. ఈ ప్రయత్నాలను 1947 మే నుంచే ఆరంభించిన పటేల్, కశ్మీర్‌ను మాత్రం పట్టించుకోలేదు. ఒకవేళ కశ్మీర్ పాకిస్థాన్‌తో చేరదలచుకుంటే తమకు అభ్యంతరం లేదని పటేల్ తనకు మాట ఇచ్చినట్లు గవర్నర్ జనరల్ మౌంట్ బాటెన్ జూన్ మూడవవారంలో కశ్మీర్ రాజు హరిసింగ్‌తో చెప్పినట్లు, పటేల్ కార్యదర్శి మెనన్ స్వయంగా పేర్కొన్నాడు. ‘కశ్మీర్ గురించి ఆలోచించేందుకు కూడా నాకు సమయం లేదు’ అని సైతం పటేల్ అన్నట్లు పేర్కొన్నాడు మెనన్. అప్పటి క్యాబినెట్ కార్యదర్శి వి.శంకర్ కూడా ఈ విషయాలు ధృవీకరించాడు. ఆగస్టులో దేశం స్వతంత్రమైన తర్వాత సెప్టెంబర్ 13న కూడా తన వైఖరి అదే అయినట్లు పటేల్ ఆ రోజు ఉదయం రక్షణమంత్రి బల్‌దేవ్‌సింగ్‌కు రాసిన లేఖ స్పష్టం చేస్తున్నది. ఆ తర్వాత మాత్రమే కొన్ని ఇతర పరిణామాల వల్ల పటేల్ వైఖరి మారింది. కాని అప్పటికే కశ్మీర్ చేజారటం మొదలైంది. యుద్ధం పట్ల ఆయన ఉత్సాహమైతే చూపారు గాని, కశ్మీర్‌లో ఒక భాగం పాకిస్థాన్ అధీనంలోకి ఆ సరికే వెళ్లిపోయింది. పటేల్‌ను పొగిడిన మోదీ ఈ చరిత్రనంతా తేలికగా విస్మరించారు.

ఆంధ్రప్రదేశ్ విభజన, తెలంగాణ ఏర్పాటు పట్ల మోదీకి తాను ప్రధాని కాకముందు నుంచి ఉండిన వ్యతిరేకత రహస్యం కాదు. అది ఇపుడు తను ఎదుర్కొంటున్న ఒత్తిడి వల్ల బహుశా తనకు తెలియకుండానే మళ్లీ బయటపడింది. తన వ్యాఖ్యలపై, వాటిలోని లోపాలపై, వాటిలోని లోపాలపై, అవాస్తవికతలపై వివరించి చెప్పుకోవటం కూడా వృథాప్రయాస.

ఇక తక్కిన రెండు అంశాల గురించి చర్చించవలసింది నిజానికి ఎక్కువలేదు. భారతదేశంలో గణతంత్ర ప్రజాస్వామిక వ్యవస్థలు క్రీస్తు పూర్వం నుంచి ఉండటం అందరికీ తెలిసిందే. కాంగ్రెస్ ప్రస్తావన వచ్చేది ఆధునిక పార్లమెంటరీ ప్రజాస్వామ్య సందర్భంలో. మాజీ వలసలు అనేకం రకరకాల నియంతృత్వాలలోకి వెళ్లగా, భారతదేశం సుస్థిరమైన ప్రజాస్వామ్యంగా నిలబడటంలో పటేల్ కూడా భాగస్వామి అయిన కాంగ్రెస్‌కు గుర్తింపును ఇస్తే మోదీకి అభ్యంతరం ఏమిటో తెలియదు. ఆధునిక ప్రజాస్వామ్యాలకు సంబంధించి ప్రపంచమంతా ఆమోదిస్తున్న స్థితిని ఆయన రాజకీయ ప్రయోజనాల కోసం తిరస్కరిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ విభజన, తెలంగాణ ఏర్పాటు పట్ల మోదీకి తాను ప్రధాని కాకముందు నుంచి ఉండిన వ్యతిరేకత రహస్యం కాదు. అది ఇపుడు తను ఎదుర్కొంటున్న ఒత్తిడి వల్ల బహుశా తనకు తెలియకుండానే మళ్లీ బయటపడింది. తన వ్యాఖ్యలపై, వాటిలోని లోపాలపై, వాటిలోని లోపాలపై, అవాస్తవికతలపై వివరించి చెప్పుకోవటం కూడా వృథాప్రయాస. ప్రధానమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తిలో ఇటువంటి ధోరణి కన్పించటం విచారకరం.

ప్రాథమిక విద్యే భవితకు పునాది

విశ్లేషణ



డాక్టర్ అనభేరి రాజేశ్వర్ రావు

ప్రపంచదేశాలన్నీ మానవ వనరుల అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా జీవన నైపుణ్యాలను బాలబాలికలలో పెంపొందిస్తున్నాయి. ప్రాథమికస్థాయి నుంచే పటిష్ఠమైన పునాదివేసి బాధ్యతాయుతమైన పౌరులుగా, ఆర్థిక వనరులుగా మలుచుకోవడానికి కృషిచేస్తున్నాయి. 1854లో చార్లెస్‌వుడ్ భారతదేశంలో ఉన్నతవిద్యకు ఆంగ్లం, ప్రాథమిక విద్యకు ప్రాంతీయ భాషలు బోధనా భాషలుగా ఉండాలని సూచించారు. మన ముఖ్యమంత్రి ప్రాథమికస్థాయిలో మాతృభాష కొనసాగాలని, ఇంటర్మీడియట్ వరకు విధిగా తెలుగు భాష ఒక సబ్జెక్టుగా అమలుచేయాలని తీసుకున్న నిర్ణయం ముదావహం.

తెలంగాణ బంగారు భవితకు పునాదిగా మన పాఠశాల విద్యను సంస్కరించాలనుకుంటున్నారు. తద్వారా భాషా నైపుణ్యాల పెంపు, విజ్ఞాన శాస్త్రాలలో శాస్త్రీయ అవగాహన, సామాజిక స్పృహ, మానవతా విలువలను పెంపొందించాలనుకుంటున్నారు. పరీక్షల భయం లేకుండా నిరంతర సమగ్ర మూల్యాంకనం, ఉపాధ్యాయుల, విద్యార్థుల మధ్య సన్నిహిత సంబంధం, ఆటపాటలతో కృత్యాధార బోధనతో జ్ఞానం, వ్యక్తిగత నైపుణ్యాభివృద్ధికి బాలబాలికల అందరికీ సమాన విద్యావకాశాలు కల్పిస్తున్నారు. స్నేహపూర్వక వాతావరణంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థుల మధ్య కుల, మత, రాజకీయాలకు అతీతంగా విద్యాహక్కు చట్టాన్ని శాస్త్రీయంగా అమలుచేస్తున్నారు.

దేశాభివృద్ధిలో, ఆర్థికాభివృద్ధిలో మానవ వనరులు పెంపొందించేందుకు పాఠశాల విద్య రూపకల్పనలో సంస్కరణలు చేపట్టడం ప్రధాన కర్తవ్యంగా భావించడం మనమంతా హర్షించదగిన విషయం. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ముఖ్యమంత్రి విశాల దృక్పథంతో భవిష్యత్తు లో తెలంగాణ బిడ్డలు ప్రపంచ దేశాలన్నింటిలో విస్తరించి, ప్రధాన భూమి క పోషించి, దేశాభివృద్ధికి తోడ్పడే విధంగా కేజీ టు పీజీ ఉచిత విద్యా విధానాన్ని అమలుచేస్తున్నారు. విద్యారంగంలో సంస్కరణలు చేపడు తూ, మార్పులకు ప్రత్యేక శ్రద్ధ వహించడం మన అదృష్టం. గత ప్రభుత్వాలకు భిన్నంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు గురుకుల సొసైటీల ద్వారా సకల సౌకర్యాలతో గుణాత్మక విద్యను అందిస్తుండటం ప్రశంసనీయం. గురుకులాలతో పాటు మండల, జిల్లాస్థాయిలో మరిన్ని జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటుచేసి, బడుగు బలహీనవర్గాల పిల్లలకు ఉచితంగా ప్రవేశం కల్పిస్తున్నారు. వారిలో భవిష్యత్తుకు తోడ్పడే జీవన నైపుణ్యాల అభివృద్ధికి, ఉన్నత విద్యకు తోడ్పడటం హర్షణీయం.

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కృషిచేస్తున్నది. అయితే ప్రాథమిక విద్యను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్నది. గత ప్రభుత్వాలు జాతీయ విద్యావిధానంలో భాగంగా ఆపరేషన్ బ్లాక్ బోర్డు పథకం అమలుచేశాయి. అలాగే విద్యాహక్కు చట్టం అమలు కోసం ప్రాథమిక పాఠశాలలు నెలకొల్పాయి. బడీడు పిల్లలందరికీ బడిని అందుబాటులోకి తెచ్చి చదువుకునే అవకాశం కల్పించింది. ప్రాథమిక పాఠశాలలు నెలకొల్పినప్పటికీ నిత్యం పర్యవేక్షణ లేకపోవడం వల్ల సరైన ఫలితాలు రావడం లేదు. అలాగే విద్యార్థుల్లో ఆశించిన స్థాయిలో భాషానైపుణ్యాలు, కనీస అభ్యసనా సామర్థ్యాలు పెంపొందడం లేదు. దీంతో ప్రభుత్వ పాఠశాలల, ఉపాధ్యాయుల పట్ల సమాజంలో గౌరవం సన్నగిల్లింది. ఇవి ఆందోళన కలిగించే అంశాలు అక్షరజ్ఞానానికి చిన్నారులు దూరమై నిరక్ష్యరాస్యులుగా మారటం వల్ల విద్యాభిమానులుగా, తల్లిదండ్రులుగా మనందరం ఆందోళన చెందుతున్నాం.

రాష్ట్ర ప్రభుత్వం గురుకుల విద్యాలయాలను ప్రాథమికోన్నతస్థాయిలో ఏర్పాటు చేసినట్లుగా మేజర్ గ్రామ పంచాయతీ స్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలను, ప్రాథమిక పాఠశాలలను ఒకే ప్రాంగణంలో విడిగా కొనసాగించాలి. ఆరు గదులు, ఐదుగురు ఉపాధ్యాయులు, ఒక సహాయకుడిని విధిగా ఉండేలా చూడాలి. 30 మంది విద్యార్థుల కంటే తక్కువగా ఉన్న పాఠశాలలను మూసివేయాలి. రాజకీయాలకు అతీతంగా భద్రత గల వాహన సౌకర్యం ఉచితంగా కల్పించాలి. నిరుద్యోగ యువతకు వాహనాలను స్వయం ఉపాధి పథకంలో భాగంగా సమకూర్చాలి. పాఠశాలలకు చేర్చేందుకు తోడ్పడినందుకు వారికి పారితోషికం కల్పిస్తూ ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు కృషిచేయాలి. తల్లిదండ్రులు, యువజన సేవా సంఘాలు బాధ్యతగా పాఠశాల విద్యాభివృద్ధికి సహకరించాలి. బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించి, వారు బడిలో కొనసాగేలా తోడ్పడాలి. తద్వారా గుణాత్మక విద్యను ఆశించగలం. దీంతో మన ఆర్థిక, మానవ వనరులు వృథా కావు.

అలాగే ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అన్ని సౌకర్యాల వల్ల, మంచి ప్రావీణ్యం, విద్యార్హతలు ఉన్న ఉపాధ్యాయుల వల్ల ప్రభావితమై విద్యార్థుల ప్రతిభాపాటవాలు పెంపొందుతాయి. ఎలాంటి డ్రాపౌట్స్ లేకుండా ప్రాథమిక పాఠశాలల్లో విద్యా కార్యక్రమాలు కొనసాగుతాయి. విద్యా ప్రమాణాలు పెరుగుతాయి. పాఠశాలలను సక్రమంగా పర్యవేక్షించడం, ఉపాధ్యాయులకు అవసరమైన సూచనలు ఇవ్వడం వల్ల బలమైన ప్రాథమికస్థాయి పునాది ఏర్పడుతుంది. విద్యాహక్కు చట్టం నిర్బంధ ప్రాథమిక విద్య అమలు జరుగుతుంది. దీంతో విద్యార్థుల హాజరుశాతం పెరుగుతుంది. తల్లిదండ్రులు, సమాజం ఆశిస్తున్నస్థాయిలో విద్యార్థుల మూర్తిమత్వం పెంపొందుతుంది. సరైన అవగాహనతో, నైపుణ్యాలతో ప్రాథమికవిద్యను పూర్తిచేసిన అనంతరం ప్రభుత్వం ఏర్పాటుచేసిన గురుకుల పాఠశాలల్లో సెకండరీ విద్యను అభ్యసించడంలో గణనీయమైన మార్పులను మనం గమనించవచ్చు. తద్వారా మన రాష్ట్ర విద్యార్థులు తమ ప్రతిభతో దేశం నలుమూలల ఉన్న ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో విద్యను అభ్యసించి ప్రయోజకులుగా మారుతారు. మంచి పరిపాలకులుగా, నాయకులుగా, విజ్ఞాన శాస్త్రవేత్తలుగా ఆర్థికాభివృద్ధికి, సర్వతోముఖాభివృద్ధికీ తోడ్పడగలరు.

విద్యాహక్కు చట్టం అమలు పేరుతో విద్యార్థులు లేని పాఠశాలలను కొనసాగించడం వల్ల ఆర్థిక వనరులు, మానవ వనరులు, ప్రజాధనం వృథాచేసి విద్యార్థుల భవిష్యత్తును నిర్వీర్యం చేయవద్దు. దానికంటే ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలి. వాటిని మంచి ఆహ్లాదకర ప్రాంగణాలుగా రూపొందించాలి. గ్రామాల్లోని పాఠశాలలకు వసతులు ఏర్పరుచడంలో రాష్ట్రంలోని, దేశంలోని పారిశ్రామికవేత్తల సహకారంతో సామాజిక బాధ్యత కార్యక్రమాలను అమలుచేయాలి. స్వచ్ఛంద సంస్థలతో, ఎన్ఆర్ఐలతో తమ గ్రామాల్లోని పాఠశాలలను దత్తత తీసుకొని స్థానిక ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో రాజకీయాలకు అతీతంగా ప్రాథమిక విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలి. మాతృభాష బోధనను విధిగా పాఠశాలల్లో అమలుపరుచడం మన అధికారుల, ప్రజాప్రతినిధుల కర్తవ్యం. అలాగే తల్లిదండ్రులు, సమాజంలోని వివిధ యువజన, మహిళా, స్వచ్ఛంద సేవాల సంస్థలు నీటివనరుల సంరక్షణకు, హరితహారం ఇచ్చిన ప్రాధాన్యాన్ని విద్యారంగానికి కూడా ఇవ్వాలి. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బలమైన పునాది వేయడం మనందరి కనీస బాధ్యత.

విద్యాహక్కు చట్టం అమలు పేరుతో విద్యార్థులు లేని పాఠశాలలను కొనసాగించడం వల్ల ఆర్థిక వనరులు, మానవ వనరులు, ప్రజాధనం వృథాచేసి విద్యార్థుల భవిష్యత్తును నిర్వీర్యం చేయవద్దు. దానికంటే ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలి. వాటిని మంచి ఆహ్లాదకర ప్రాంగణాలుగా రూపొందించాలి.

(వ్యాసకర్త: పాఠశాల విద్య రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

బెంగాల్‌లో జంతువుల కోసం శ్మశానం

కోల్‌కతా: తాము పెంచుకున్న జంతువులు చనిపోతే వాటికి ఎక్కడ అంతిమ సంస్కారాలు నిర్వహించాలో తెలియక జంతుప్రేమికులు సతమతమవుతుంటారు. అలాంటి వారికోసం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఆధునిక పద్ధతిలో 'జంతువుల శ్మశానాన్ని' నిర్మిస్తున్నది. హుగ్లీ నదిని ఆనుకొని, ఆర్మేనియన్ ఘాట్ పరిసరాల్లో 30 లక్షల వ్యయంతో నిర్మాణం చేస్తున్నది. జంతు వనరుల అభివృద్ధి సంస్థతో కలిపి కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ ఈ ప్రాజెక్టును చేపట్టింది. ఈ శ్మశానంలో ఇప్పటికే ఒక విద్యుత్ కొలిమిని ఏర్పాటు చేశామని, మరొదాన్ని ఈ ఏడాది బిగిస్తామని ఆ రాష్ట్ర జంతువనరుల అభివృద్ధిశాఖ మంత్రి స్వపన్ దేబ్‌నాథ్ పేర్కొన్నారు. జంతువుల అంతిమ సంస్కారాల కోసం కనీస చార్జీ వసూల్ చేస్తామని ఆయన చెప్పారు.

నెతన్యాహుపై అవినీతి ఆరోపణలు

పదేండ్లలో రూ.1.9 కోట్ల విలువైన కానుకలు తీసుకున్నారని అభియోగం

కానుకలు ఇచ్చిన వారి జాబితాలో రతన్ టాటా పేరు

రాజీనామాకు తిరస్కరిస్తున్న ఇజ్రాయెల్ ప్రధాని



జెరూసలేం: ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. రెండు అవినీతి కేసులలో అతనిపై అభియోగాలు మోపాలని పోలీసులు బుధవారం ప్రాసిక్యూషన్ విభాగానికి సిఫారసు చేశారు. అయితే ప్రధాని పదవికి రాజీనామా చేసేందుకు ఆయన నిరాకరించారు. నెతన్యాహుపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి 14 నెలలపాటు దర్యాప్తు జరిపిన పోలీసులు ఆయనకు వ్యతిరేకంగా తగిన సాక్ష్యాధారాలు లభించాయని తెలిపారు. ఇజ్రాయెల్‌కు రెండుమార్లు ప్రధానిగా ఎన్నికైన నెతన్యాహు రెండు అవినీతి కేసుల్లో పాత్రధారిగా ఉన్నట్టు పేర్కొన్నారు. తనకు విలువైన కానుకలు ఇచ్చిన వారికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకున్నట్టు ఒక కేసులో, తనకు అనుకూలంగా వార్తలు రాయాలని 'యేడియట్ అహరనోట్' పత్రిక ప్రచురణకర్తతో అక్రమంగా ఒప్పందం కుదుర్చుకున్నట్టు మరొక కేసులో ఆయనపై అభియోగాలు నమోదయ్యాయని జెరూసలేం పోస్ట్ పత్రిక తెలిపింది. నెతన్యాహు పదేండ్లలో మూడు లక్షల అమెరికన్ డాలర్ల (రూ.1.9 కోట్ల) విలువైన బహుమతులు తీసుకున్నాడని పోలీసులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలను తోసిపుచ్చిన ఇజ్రాయెల్ ప్రధాని తన సంకీర్ణ ప్రభుత్వం స్థిరంగా ఉందని చెప్పారు. టీవీలో దేశప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగిస్తూ తానుగానీ, తమ మిత్రపక్షాలు గానీ ఎన్నికలను కోరుకోవడం లేదని అన్నారు. తనపై ఇప్పటికి 15 ఎన్‌క్వైరీలు, దర్యాప్తులు జరిగాయని, ఇంతవరకు ఏవీ రుజువుకాలేదని, మరోసారి అదే జరుగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హాలీవుడ్ నిర్మాత అర్నాన్ మిల్చన్‌కు పన్ను మినహాయింపు వర్తించేలా నెతన్యాహు నిర్ణయం తీసుకున్నాడని పోలీసులు ఆరోపిస్తున్నారు. మిల్చన్ చేపట్టిన ఒక ప్రాజెక్టులో భారత పారిశ్రామికవేత్త రతన్ నావల్ టాటా కూడా భాగస్వామిగా ఉన్నాడని, అయితే ఆ ప్రాజెక్టు రద్దయిందని పేర్కొన్నారు. పోలీసుల నివేదిక ఆధారంగా నెతన్యాహుపై నేరారోపణ చేయాలా వద్దా అన్న అంశంపై అటార్నీ జనరల్ ఇప్పుడప్పుడే నిర్ణయం తీసుకోకపోవచ్చునని పరిశీలకులు భావిస్తున్నారు.

నేడు పాక్షిక సూర్యగ్రహణం

అర్ధరాత్రి దాటిన తర్వాత 12:25 నుంచి ప్రారంభం.. భారత్‌లో కనిపించదు

ఈ ఏడాది మరో రెండు పాక్షిక సూర్యగ్రహణాలు



న్యూఢిల్లీ: ఈ ఏడాది తొలి పాక్షిక సూర్యగ్రహణం గురువారం కనిపించనుంది. గడిచిన ఆరునెలలో ఇది రెండవ సూర్యగ్రహణం. గత ఏడాది ఆగస్టు 21న సంపూర్ణ సూర్యగ్రహణం సంభవించింది. భూమికి, సూర్యుడికి మధ్య కొంతమేర చంద్రుడు అడ్డుగా రావడంతో గురువారం పాక్షిక సూర్యగ్రహణం ఏర్పడనుంది. అంటార్కిటికా, దక్షిణ అమెరికాలోని దక్షిణ ప్రాంతంలో ఈ పాక్షిక సూర్యగ్రహణం కనిపిస్తుంది. ఉరుగ్వే, పరాగ్వే పశ్చిమభాగం, చిలీ, అర్జెంటీనా, దక్షిణ బ్రెజిల్ వాసులు దీనిని చూడొచ్చు. భారత కాలమానం ప్రకారం గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత 12:25 గంటల నుంచి శుక్రవారం తెల్లవారుజామున 4:17 గంటల వరకు గ్రహణం సంభవించనున్నందున చూసే అవకాశం లేదు. మనదేశంలో సూర్యగ్రహణం కనిపించనందున గ్రహణ నియమాలను ఆచరించాల్సిన అవసరం లేదని జ్యోతిష్యులు చెబుతున్నారు. ఈ ఏడాది జూలై 13, ఆగస్టు11న మరో రెండు పాక్షిక సూర్యగ్రహణాలు సంభవిస్తాయని ఖగోళ శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ రెండు గ్రహణాలు కూడా భారత్‌లో కనిపించవు. సూర్యగ్రహణం కనిపించని దేశాల ప్రజలు.. ఇంటర్నెట్‌లో నాసా ప్రత్యక్ష ప్రసారాన్ని చూసి ఆనందించవచ్చు.

ఉగ్రవాది అరీజ్‌ఖాన్ అరెస్టు

ఢిల్లీ, జైపూర్ వరుస బాంబు పేలుళ్ల కేసులో నిందితుడు

విద్యను మధ్యలో వదిలి.. బాంబుల తయారీకి సాయం

వేర్వేరు ప్రాంతాల్లో తిష్ఠ వేస్తూ.. దశాబ్దకాలంగా పరారీలోనే..

భారత్- నేపాల్ సరిహద్దులో పట్టుకున్న పోలీసులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:

ఎంతోమంది ప్రాణాలను బలిగొని దశాబ్దకాలంగా తప్పించుకు తిరుగుతున్న ఇండియన్ ముజాహిదీన్ ఉగ్రవాది అరీజ్‌ఖాన్ అలియాస్ జునైద్ (32)ను బుధవారం అరెస్టు చేశామని ఢిల్లీ పోలీసులు తెలిపారు. భారత్– నేపాల్ సరిహద్దులో ఖాన్‌ను అరెస్టు చేశామని చెప్పారు. అరీజ్‌ఖాన్‌కు ఐదు బాంబు పేలుళ్ల కేసులతో సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. 'బాంబులు తయారుచేయడంలో దిట్టగా మారిన ఖాన్‌కు.. 2008లో ఢిల్లీలో జరిగిన వరుస బాంబు పేలుళ్లు, 2007 ఉత్తర్‌ప్రదేశ్ పేలుళ్లు, 2008 జైపూర్ వరుస పేలుళ్లు, 2008 అహ్మదాబాద్ పేలుళ్లతో సంబంధాలు ఉన్నాయి. ఈ పేలుళ్లలో 165మంది మృతిచెందగా, 535మంది గాయపడ్డారు. ఢిల్లీ వరుస బాంబు పేలుళ్లలోనే 30 మంది మరణించారు. బాట్లా హౌస్ ఎన్‌కౌంటర్ నుంచి అతడు త్రుటిలో తప్పించుకున్నాడు' అని ఢిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగం డీసీపీ ప్రమోద్‌సింగ్ కుశ్వాహ తెలిపారు. బాట్లాహౌస్ ఘటనలో ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌చంద్ శర్మ ప్రాణాలు కోల్పోయారు.

ఇంజినీరింగ్ విద్యను వదిలి..

ఉగ్రవాది అరీజ్‌ఖాన్‌ది ఉత్తరప్రదేశ్‌లోని ఆజామ్‌గఢ్. అతడు ఇంజినీరింగ్ విద్యను మధ్యలోనే ఆపేశాడు. 2007, 2008లో ఢిల్లీ, గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో పేలుళ్ల కోసం బాంబులు తయారుచేయడానికి ఉగ్రవాదులకు సాయం అందించాడు. 2008 సెప్టెంబర్ 19న ఢిల్లీ జామియానగర్‌లోని బాట్లాహౌస్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లో ఇద్దరు ఇండియన్ ముజాహిదీన్ ఉగ్రవాదులు హతంకాగా, పలువురు అరెస్టయ్యారు. ఈ సమయంలో ఖాన్ తప్పించుకున్నాడు. ఖాన్ ప్రతినెలా వేర్వేరు ప్రాంతాలకు మారుతుండేవాడు. అనంతరం నేపాల్‌కు వెళ్లిపోయాడు. అక్కడ సలీమ్ అనే మారు పేరుతో నేపాలీ స్థానికుడిగా కార్డు, పాస్‌పోర్ట్ పొందాడు. తొలుత ఓ రెస్టారెంట్‌లో భాగస్వామిగా వ్యాపారం చేశాడు, ఆ తర్వాత నేపాల్‌లోని వివిధ పాఠశాలల్లో బోధనలు చేశాడు. ఇండియన్ ముజాహిదీన్ వ్యవస్థాపకుడు రియాజ్ భత్కల్‌తో సంబంధాలు కొనసాగించాడు. అతడి ప్రేరణతో 2014 సెప్టెంబర్‌లో ఉగ్రవాద సంస్థకు డబ్బు సమకూర్చేందుకు సౌదీఅరేబియాకు చేరుకున్నాడు. 2017లో సౌదీ నుంచి తిరిగి నేపాల్‌కు వెళ్లిపోయాడు. అప్పుడప్పుడు భారత్‌కు వచ్చి వెళ్లేవాడు. ఖాన్ తలపై రూ.15 లక్షల రివార్డు కూడా ఉంది.



అరీజ్‌ఖాన్‌ను కోర్టుకు తీసుకువస్తున్న పోలీసులు

ఆమె ఎడబాటుతో ప్రేమ తెలిసింది

లక్నో, ఫిబ్రవరి 14:

ఒకడు ప్రేమించడం లేదని యాసిడ్ పోశాడు. మరొకరు ఆమెను ఆదరించి, కోలుకునేంత వరకు అండగా నిలిచి, ఆమె దూరమైనప్పుడు ఆ ఎడబాటు ప్రేమ అని తలచి చివరికి ఆమెనే తన జీవితభాగస్వామిగా చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. వారిద్దరికి ప్రేమికుల దినోత్సవం సాక్షిగా బుధవారం నిశ్చితార్థం జరిగింది. ఒడిశాలోని జగత్‌పూర్‌కు చెందిన ప్రమోదినిపై 2009లో కాలేజీ నుంచి ఇంటికి వస్తుండగా యాసిడ్ దాడి జరిగింది. ఈ దాడిలో ఆమెకు 80 శాతం కాలిన గాయాలతోపాటు కంటిచూపుకూడా పోయింది. దీంతో ఆమెకు శారీరకంగానే కాదు మానసిక వేదనను అధిగమించడం పెద్ద సవాలుగా మారింది. ఆ సమయంలో ఎక్కడినుంచి వచ్చాడో సరోజ్ సాహు ఆమెకు అన్నీ తానై తోడుగా నిలిచాడు. తొమ్మిది నెలల చికిత్స తరువాత ప్రభుత్వాసుపత్రి నుంచి వైద్యులు ప్రమోదినిని ఇంటికి పంపించేశారు. ఐదేండ్లు పడకకే పరిమితమైన ఆమెకు 2014లో ఓ నర్స్ మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్న సరోజ్ సాహును పరిచయం చేసింది. తొలుత ప్రమోదినిని లేచి నడిచేలా సాయం చేయాలని సాహు నిర్ణయించుకున్నాడు. నాలుగు నెలల్లోనే అతని కృషి ఫలించింది. ఆమె పూర్తిగా కోలుకోవాలంటే తాను పక్కనే ఉండాలని భావించిన సాహు ఉద్యోగానికి కూడా రాజీనామా చేశాడు. కొద్దిరోజులు చికిత్స కోసం ఢిల్లీ తీసుకెళ్లాడు. ఆ తరువాత ప్రమోదిని తన ఇంటికి వెళ్లిపోవడంతో ఆ ఎడబాటును భరించలేకపోయానని సాహు చెప్పాడు. ఆమె తన జీవితానికి ఓ అర్థాన్ని ఇచ్చిందని గ్రహించానని, దీంతో ఆమెను జీవితభాగస్వామిగా చేసుకోవాలని నిర్ణయించుకున్నానని తెలిపాడు. వెంటనే ఆమెకు ఫోన్ చేసి తన మనసులో మాట చెప్పానని, తొలుత నిరాకరించినా తరువాత అంగీకరించిందని అన్నారు. ఆమెకు కంటికి చికిత్స చేయించడంతో 20 శాతం చూపు వచ్చిందని సాహు చెప్పారు. వచ్చే ఏడాది ఇదే రోజున పెండ్లి చేసుకోబోతున్నామని తెలిపారు.



ప్రమోదినితో సరోజ్ సాహు



కోల్‌కతా శివారులోని తాజ్‌మహల్ నమూనా వద్ద ఓ యువజంట సెల్ఫీ

లక్నో యూనివర్సిటీ గేట్లు బంద్

లక్నో: ప్రేమికుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులు క్యాంపస్‌లో కూర్చోవద్దని, అటూ ఇటూ తిరుగరాదని నిషేధాజ్ఞలు జారీ చేసిన లక్నో యూనివర్సిటీ యాజమాన్యం, బుధవారం ఏకంగా క్యాంపస్ గేట్లకు తాళాలు వేసింది. మహాశివరాత్రిని పురస్కరించుకొని బుధవారం యూనివర్సిటీకి సెలవు దినమని యాజమాన్యం సోమవారమే ప్రకటించింది. పాశ్చాత్య సంస్కృతితో ప్రభావితమైన విద్యార్థులు కొందరు ప్రతి ఏటా ఫిబ్రవరి 14న వాలెంటైన్స్‌డే జరుపుకొంటున్నారని, అయితే ఈసారి శివరాత్రి కారణంగా ఆ రోజున యూనివర్సిటీకి సెలవు ప్రకటిస్తున్నామని ప్రొక్టర్ వినోద్ సింగ్ చెప్పారు. అయితే విద్యార్థులు మాత్రం 'ఇది సంకుచిత మనస్తత్వానికి నిదర్శనం' అని వ్యాఖ్యానించారు.



ప్రేమికులను తరిమేసిన బజరంగ్‌దళ్

అహ్మదాబాద్: ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం గుజరాత్‌లోని సబర్మతి నది ఒడ్డుకు చేరిన ప్రేమజంటలను బజరంగ్‌దళ్ కార్యకర్తలు తరిమివేశారు. వాలెంటైన్స్ డేను వ్యతిరేకించే బజరంగ్‌దళ్ కార్యకర్తలు కర్రలు చేతబట్టుకొని 'జై శ్రీరామ్' అని నినాదాలు చేస్తూ ప్రేమికుల వెంటపడ్డారు. మోటార్‌సైకిళ్లపై వచ్చిన సంఘ్ కార్యకర్తలు నది ఒడ్డునే కాకుండా రోడ్లపై నిల్చున్న, కూర్చున్న జంటలను కూడా తరిమికొట్టారు. బజరంగ్‌దళ్ కార్యకర్తలను చూసి పరుగులు పెట్టిన యువ జంటలు రోడ్లపై పడిపోవడంతో పలువురికి గాయాలయ్యాయి. నది ఒడ్డున గల పార్కులో గస్తీ తిరుగుతున్న పోలీసులు వెంటనే వచ్చి కొందరు కార్యకర్తలను అరెస్టు చేశారు. తాము ప్రేమకు వ్యతిరేకం కాదని, వాలెంటైన్స్ డే పేరిట జరిగే విశృంఖలత్వానికి వ్యతిరేకులమని దళ్ ఉపాధ్యక్షుడు నికుంజ్ పారేఖ్ చెప్పారు.

ఈ వారం కడుపు 'పండే'వారు అధికం!

లండన్: ప్రేమికుల రోజు శృంగారంతో గర్భం ధరించే మహిళల సంఖ్య ఐదు శాతం పెరుగుతున్నదని ఓ విశ్లేషణ నివేదిక వెల్లడించింది. దీంతో తొమ్మిది నెలల తరువాత శిశుజననాల సంఖ్యలోనూ పెరుగుదల నమోదవుతున్నట్టు ఆ నివేదిక పేర్కొంది. బ్రిటన్‌కు చెందిన జాతీయ ఆరోగ్య సేవా సంస్థ (ఎన్‌హెచ్‌ఎస్) 2015కు సంబంధించిన వివరాలను విశ్లేషించి ఈ నివేదికను రూపొందించింది. ఆ సంవత్సరం వాలెంటైన్స్ డే వచ్చిన వారంలో 16,263 మంది గర్భందాల్చారని తెలిపింది. ఇది సాధారణ సగటు (వారంలో 15,427) కంటే 836మంది అధికం. వాలెంటైన్స్‌డే తరువాతి వారంలో 16,344 మంది గర్భం దాల్చారని ఆ నివేదిక వెల్లడించింది. అయితే క్రిస్మస్ సమయంలో కడుపు పండే మహిళల సంఖ్యతో పోలిస్తే ఇది తక్కువేనని తెలిపింది. వాలెంటైన్స్ డే తరువాత తొమ్మిది నెలలకు కొత్త శిశువుల రాకతో అనేక కుటుంబాల్లో సంతోషం వెల్లివిరుస్తున్నదని ఎన్‌హెచ్‌ఎస్‌కు చెందిన ప్రసూతి విభాగం అధిపతి సారా జేన్ మార్ష్ పేర్కొన్నారు. మెరుగైన ఆరోగ్య సంరక్షణ, ఆధునిక వైద్య సదుపాయాల కారణంగా ఈ ఏడాది జన్మించే బాలికల్లో ప్రతి ముగ్గురిలో ఒక్కరు తప్పకుండా నూరేండ్లు దాటి జీవిస్తారని చెప్పారు.

నేర దర్యాప్తు తీరు మారాలి

దర్యాప్తునకు సాంకేతికతను జోడించండి

ఆధారాల సేకరణలో ఆధునిక టెక్నాలజీతో లాభాలు.. ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: నేర దర్యాప్తు తీరుతెన్నులను మార్చాలని, ఆధునిక టెక్నాలజీని సమర్థవంతంగా వాడుకోవాలని సుప్రీంకోర్టు కేంద్రప్రభుత్వానికి సూచించింది. 'నేర ప్రదేశాల్లోని క్రైమ్ సీన్‌ను సాధారణంగా పోలీసులు నమోదు చేస్తుంటారు. కానీ డిజిటల్ ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీని వాడుకుంటే నేరం జరిగిన తీరును మరింత స్పష్టంగా వివరించేందుకు అవకాశముంటుంది. ఘటన జరిగిన వెనువెంటనే ఇలాంటి ఫొటోలు, వీడియోలను రూపొందించి.. అన్ని పోలీస్‌స్టేషన్లకు చేరవేయగలిగితే, నేరస్తులను త్వరగా పట్టుకునేందుకు వీలవుతుంది' అని జస్టిస్‌లు ఆదర్శ్ కే గోయల్, ఉదయ్ యూ లలిత్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం పేర్కొన్నది. గత ఏడాది మార్చిలో దాఖలైన ఓ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. 'అమెరికాలో ఎఫ్‌బీఐ అధికారులు కెమెరాలతో కూడిన దుస్తులు ధరిస్తారు. దాంతో ఘటనాస్థలంలో వారు చూసిన ప్రతీదీ రికార్డు అవుతుంది. ఆధారాల సేకరణకు ఇది అత్యుత్తమ పద్ధతి' అని ధర్మాసనం తెలిపింది. సమయాన్ని, స్థలాన్ని సూచించే జీపీఎస్ టెక్నాలజీతో కూడిన హైడెఫినిషన్ కెమెరాలు వాడితే మరింత ప్రయోజనమని ఈ కేసులో అమికస్ క్యూరీగా వ్యవహరిస్తున్న సీనియర్ న్యాయవాది అరుణ్ మోహన్ చెప్పారు. ఈ విషయంలో ప్రభుత్వంతో చర్చిస్తానని కేంద్రం తరఫు న్యాయవాది షిరీన్ ఖజురియా ధర్మాసనానికి తెలిపారు. కేసు తదుపరి విచారణను న్యాయస్థానం వచ్చేనెల ఏడవ తేదీకి వాయిదా వేసింది.

బాలల సంక్షేమానికి టెక్నాలజీని వాడండి

బాలల సంక్షేమానికి టెక్నాలజీని సమర్థవంతంగా ఉపయోగించుకోకపోతే, సాంకేతికరంగంలో అగ్రశ్రేణి దేశంగా భారత్ కేవలం కాగితాలకే పరిమితమవుతుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. జువైనల్ జస్టిస్ బోర్డ్ (జేజేబీ), శిశుసంక్షేమ కమిటీ (సీడబ్ల్యూసీ)లలో కంప్యూటర్ల కొరత ఉండడం బాధాకరమని తెలిపింది. బాలనేరస్తుల చట్టం అమలుపై దాఖలైన ఓ పిటిషన్‌పై బుధవారం జస్టిస్ మదన్‌బీ లోకూర్, దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. జేజేబీ, సీడబ్ల్యూసీలకు కంప్యూటర్ పరికరాలతోపాటు, తగిన సాఫ్ట్‌వేర్‌లనూ అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. అవసరమైన చోట బాలనేరస్థుల్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారానే విచారించేందుకు వీలుగా తగిన సాంకేతికతను సమకూర్చాలని ఆదేశించింది.

ఎన్నికల కమిషనర్ల వేతనాలు పెంపు

నెలకు రూ.2.50లక్షలు

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులకు వేతనాలు పెరిగినట్లే కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్, కమిషనర్లకూ జీతాలు పెరిగాయి. పెరిగిన వేతనాల ప్రకారం సుప్రీంకోర్టు జడ్జి లేదా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నెలకు రూ. 2.50లక్షలు జీతం తీసుకుంటున్నారని, ఎన్నికల ప్రధాన కమిషనర్, ఇద్దరు కమిషనర్లకు కూడా వేతనం రూ.2.50లక్షలకు పెంచినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ పెంపు జనవరి 2016 నుంచి వర్తిస్తుందని, మాజీ ప్రధాన కమిషనర్లు, కమిషనర్లు కూడా దీనివల్ల లబ్ధిపొందనున్నారని పేర్కొంది. ప్రస్తుతం ఎన్నికల ప్రధాన కమిషనర్, కమిషనర్లు నెలకు రూ. 90,000 వేతనం పొందుతున్నారని తెలిపింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల వేతనాల పెంపునకు పాటించిన నిబంధనలను ఈసీకీ వర్తింపజేశామని వివరించింది.

ఇన్ పేషెంట్స్ ఆహారంపై జీఎస్టీ విధించం: కేంద్రం

న్యూఢిల్లీ: ఆరోగ్య సమస్యలతో దవాఖానల్లో చేరిన రోగులకు(ఇన్ పేషెంట్స్‌కు) డాక్టర్ల సలహా మేరకు హాస్పిటల్ యాజమాన్యం అందించే ఆహారంపై జీఎస్టీ ఉండదని కేంద్రప్రభుత్వం తెలిపింది. రోగికి ఆహారాన్ని అందించడం ఆరోగ్య సేవల కిందకు వస్తుందని పేర్కొంది. ఒకవేళ రోగి దవాఖానలో చేరకుండా హాస్పిటల్ యాజమాన్యం అందించే ఆహారాన్ని తీసుకుంటే కచ్చితంగా జీఎస్టీ చెల్లించాలని, ఆ రోగి వెంట ఉండే వ్యక్తులు కూడా ఆహారాన్ని స్వీకరిస్తే పన్ను కట్టాల్సిందేనని వివరించింది.

పాక్‌లో హఫీజ్ ఆస్తుల స్వాధీనం ప్రారంభం

ఇస్లామాబాద్: అంతర్జాతీయ ఒత్తిళ్ల మేరకు జమాత్ ఉద్ దవా అధిపతి, ఫలాయీ ఇన్సానియత్ ఫౌండేషన్ (ఎఫ్ఐఎఫ్) వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్‌ను ఉగ్రవాద జాబితాలో చేర్చిన పాకిస్థాన్.. అతడి ఆస్తుల స్వాధీనానికి చర్యలు ప్రారంభించింది. రావల్పిండి, పంజాబ్ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఉన్న హఫీజ్ సయీద్‌కు చెందిన పాఠశాలలను, దవాఖానలను, అంబులెన్స్‌లను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆధీనంలోకి తీసుకుంటున్నాయి. పంజాబ్ రాష్ట్రంలో 300 మంది విద్యార్థులున్న ఓ మదర్సాను ఆ రాష్ట్ర ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకోగా, రావల్పిండిలోని నాలుగు దవాఖానలను జిల్లా యంత్రాంగం స్వాధీనం చేసుకుంది. అధికార వర్గాలు మాట్లాడుతూ హఫీజ్ సయీద్ ఆస్తులను లెక్కగట్టుతున్నామని, పాఠశాలలను, దవాఖానలను స్వాధీనం చేసుకుంటున్నామని తెలిపారు.

మావోయిస్టుల శిబిరం పేల్చివేత

ఛత్తీస్‌గఢ్‌లో ఘటన

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లాలో ఉన్న మావోయిస్టుల శిబిరాన్ని భద్రతాబలగాలు పేల్చేశాయి. భారీగా మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. మంగళవారం సాయంత్రం కుకనార్ పోలీసుస్టేషన్ పరిధిలోని జోంగెరస్‌లో జిల్లా రిజర్వ్ పోలీసులు కూంబింగ్ చేపట్టారని డీఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. భద్రతా బలగాల రాకను గుర్తించిన మావోయిస్టులు పరారయ్యారని, దీంతో వారి శిబిరాన్ని భద్రతా బలగాలు పేల్చేశాయని చెప్పారు. ఎనిమిది బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, డిటోనేటర్లు, జిలిటిన్ స్టిక్స్, పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని డీఐజీ తెలిపారు.

దక్షిణాఫ్రికాలో అవినీతి 'గుప్తా'

జొహాన్నెస్‌బర్గ్, ఫిబ్రవరి 14:

భారత సంతతి వ్యాపార దిగ్గజం ఇండ్లపై పోలీసుల దాడులు

అధ్యక్షుడి పదవికి ముప్పు తెచ్చిన గుప్తా కుటుంబం

దేశ రాజకీయాల్ని శాసించే స్థాయికి చేరిందని ఆరోపణలు

రాజనామా చేయకపోతే జేకబ్ జుమాపై నేడు అవిశ్వాస తీర్మానం



జేకబ్ జుమా

అతికొద్ది కాలంలో దక్షిణాఫ్రికా రాజకీయాలను శాసించే స్థితికి ఎదిగిన గుప్తా కుటుంబానికి చెందిన ఇండ్లపై పోలీసులు బుధవారం దాడులు జరిపారు. దేశాధ్యక్షుడు జేకబ్ జుమా పదవికి ముప్పు తెచ్చిన అవినీతి ఆరోపణలపై దర్యాప్తులో భాగంగా పోలీసులు ఈ దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గుప్తా కుటుంబ సభ్యునితోపాటు మరో ఇద్దరిని అరెస్టు చేశారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో అధ్యక్షుడు జుమాను రాజీనామా చేయాలని అధికార ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సీ) పార్టీ కోరింది. జుమాకు వ్యతిరేకంగా వచ్చిన అవినీతి ఆరోపణల్లో భారతీయ సంతతికి చెందిన గుప్తా కుటుంబం కేంద్రంగా ఉన్నట్టు తెలుస్తున్నది. గుప్తా కుటుంబానికి అనుకూలంగా అనేక నిర్ణయాలు తీసుకోవడంతోపాటు, రహస్యంగా ఉంచాల్సిన ప్రభుత్వ సమాచారాన్ని, కాంట్రాక్టులను జేకబ్ జుమా వారికి అందించినట్టు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా మంత్రివర్గంలో ఎవరిని నియమించాలి, ఎవరిని తొలిగించాలన్నది కూడా గుప్తా కుటుంబం ఇష్టాయిష్టాలపైనే ఆధారపడి ఉంటుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుప్తా కుటుంబం కనుసన్నల్లోనే దక్షిణాఫ్రికా ప్రభుత్వం నడుచుకుంటున్నదని స్థానిక మీడియా కోడై కూస్తున్నది. ఈ ఆరోపణలను అధ్యక్షుడు జుమాతోపాటు గుప్తా కుటుంబం కూడా ఖండించింది. అయితే గుప్తాలకు వ్యతిరేకంగా తమకు లభించిన ఆధారాలు ఎంతో తీవ్రమైనవని పోలీసు విభాగానికి చెందిన హాక్స్ యూనిట్ ప్రతినిధి హంగ్వానీ ములాడ్జీ పేర్కొన్నారు. గుప్తా కుటుంబంపై చర్యతో దేశంలో అవినీతి వ్యతిరేక పోరాటం ఇప్పుడే ప్రారంభమైందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. గుప్తాల ఇండ్లపై దాడులు జరుపడం పట్ల దక్షిణాఫ్రికా కార్మిక సంఘాల సమాఖ్య ఉపాధ్యక్షుడు మొలెకో ఫకేడీ హర్షం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, అధ్యక్షుడు జుమా తనంతట తానుగా పదవి నుండి తప్పుకోవాలని లేదా అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కోవడానికి సిద్ధం కావాలని ఏఎన్‌సీ హెచ్చరించింది. పార్లమెంట్‌లో గురువారం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నామని తెలిపింది.

క్రమంగా పెరిగిన గుప్తాల ప్రాబల్యం



అతుల్, రాజేశ్, అజయ్

దక్షిణాఫ్రికాలో శ్వేతజాతి పాలన ముగుస్తున్న దశలో 1993లో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన గుప్తా సోదరులు అతుల్, రాజేశ్, అజయ్ ఆ దేశానికి వలస వెళ్లారు. విదేశీ పెట్టుబడులకు ద్వారాలు తెరిచిన నేపథ్యంలో గుప్తా కుటుంబం కంప్యూటర్లు, మైనింగ్, విమానయానం, ఇంధనం, మీడియా, టెక్నాలజీ రంగాల్లో పెట్టుబడులు పెట్టింది. అదే క్రమంలో అధికార ఏఎన్‌సీ పార్టీతో, ముఖ్యంగా జేకబ్ జుమాతో సన్నిహిత సంబంధాలను ఏర్పరుచుకుంది. గుప్తాకు చెందిన సహారా కంప్యూటర్ సంస్థ డైరెక్టర్‌గా జుమా కొడుకు డుడుజేన్ పనిచేశారు. జుమా మూడో భార్య బోంగి ఎన్‌గెమా, ఆయన కూతురు కూడా గుప్తాలతో కలిసి పనిచేశారు.


క్రైస్తవులకు ఉచితంగా జెరూసలేం యాత్ర

నాగాలాండ్‌లో అధికారంలోకి వస్తే అమలు చేస్తాం.. బీజేపీ ప్రకటన

హామీ రాష్ట్రానికే పరిమితమా? దేశమంతటా వర్తిస్తుందా? అన్న దానిపై అస్పష్టత

హజ్ సబ్సిడీ ఎత్తివేసి, ఇలాంటి హామీలెలా ఇస్తారు?: అసదుద్దీన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: ముస్లింలకు హజ్ సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం తొలిగించిన నెలరోజుల తర్వాత.. తాజాగా బీజేపీ క్రైస్తవులకు జెరూసలేం ఉచిత యాత్ర ఆఫర్‌ను ప్రకటించింది. త్వరలో జరుగనున్న నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే క్రైస్తవులను ఉచితంగా జెరూసలేం యాత్రకు పంపుతామని బీజేపీ హామీ ఇచ్చింది. అయితే ఈ హామీ కేవలం నాగాలాండ్‌కే పరిమితమా? ఈశాన్య రాష్ట్రాల్లోని క్రైస్తవులందరికీ కల్పిస్తారా? దేశంలోని క్రిస్టియన్లందరికీ వర్తిస్తుందా? అనే విషయాన్ని స్పష్టంగా చెప్పలేదు. త్వరలో జరుగనున్న ఈశాన్య రాష్ట్రాల(మేఘాలయ, నాగాలాండ్, త్రిపుర) ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఈ హామీని బీజేపీ తెరపైకి తెచ్చినట్లు తెలుస్తున్నది. మేఘాలయలో 75శాతం జనాభా, నాగాలాండ్‌లో 88 శాతం జనాభా క్రైస్తవులే. ఈమేరకు క్రైస్తవులను తమవైపు తిప్పుకునేందుకు బీజేపీ ప్రయత్నాలు మొదలుపెట్టింది. 'నాగాలాండ్‌లో తమకు అధికారం కట్టబెడితే, క్రైస్తవులకు ఉచితంగా జెరూసలేం యాత్రకు పంపుతామని బీజేపీ వాగ్దానం చేస్తున్నది' అని 'వుయ్ ది నాగాస్' అనే వార్తాసంస్థ ట్విట్టర్‌లో వెల్లడించింది. హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు ఎన్నాళ్లుగానో ఇస్తున్న రాయితీని నెలరోజుల క్రితమే కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. తద్వారా మిగిలే నిధులను మైనార్టీల సంక్షేమానికి ఉపయోగిస్తామని ప్రకటించింది. మైనార్టీలను బుజ్జగించడం కోసం కాకుండా, వారికి సగౌరవంగా సాధికారత కల్పించేందుకే తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తున్నదని అప్పట్లో కేంద్ర మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నక్వీ తెలిపారు. ఈ నేపథ్యంలో బీజేపీ తాజా హామీని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ తప్పుపట్టారు. 'ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీజేపీ క్రిస్టియన్లను ఉచితంగా జెరూసలేం పంపుతామని హామీ ఇస్తున్నది. సబ్సిడీ ఏదైనా సరే.. అందరికీ ఒకేలా ఉండాలి. ముస్లింలకు హజ్ సబ్సిడీని తొలిగించడం, హిందూవులకు మానససరోవరం యాత్ర సబ్సిడీని కొనసాగించడం, క్రిస్టియన్లను ఉచితంగా జెరూసలేం పంపుతామని ప్రకటించడం సరైన పద్ధతి కాదు' అని అసదుద్దీన్ తెలిపారు. ఎన్నికల్లో ఉపయోగపడేలా ఉంటే బీజేపీ ముస్లింలకు కూడా రాయితీ కొనసాగించేదని, ఇదే ఆ పార్టీ నమ్మిన 'ఇండియా ఫస్ట్' నినాదమని ఆయన ఓ ట్వీట్‌లో విమర్శించారు. మతపరమైన యాత్రలకు రాయితీలు ఇవ్వడాన్నే తాము వ్యతిరేకిస్తున్నట్లు సీపీఎం తెలిపింది. మరోవైపు బీజేపీ హామీపై ఇజ్రాయెల్ మీడియా భిన్నంగా స్పందించింది. ప్రభుత్వాలు యాత్రికులను సబ్సిడీపై పుణ్యక్షేత్రాలకు పంపాలనుకోవడం ఇదేమీ తొలిసారి కాదని, నైజీరియా తమ దేశంలోని ముస్లిం, క్రిస్టియన్ యాత్రికులను మక్కా, జెరూసలేంకు ఏటా పంపుతున్నదని 'జెరూసలేం పోస్ట్' అనే పత్రిక తెలిపింది. అయితే ఈ తరహా ఎన్నికల హామీలన్నీ తర్వాత క్రమంగా మరుగున పడుతాయని వ్యాఖ్యానించింది.



జెరూసలేంలోని చర్చ్ ఆఫ్ నేటివిటీ



ముంబైలోని స్టాక్ ఎక్స్ఛేంజీలో బుధవారం జీహెచ్ఎంసీ బాండ్లపై సంతకాలు చేస్తున్న మేయర్ బొంతు రామ్మోహన్, కమిషనర్ జనార్దన్‌రెడ్డి

బల్దియా బాండ్లకు అనూహ్య స్పందన

మొదటి దశలో రూ.200 కోట్లు సేకరణ

మేయర్, కమిషనర్ ముంబై పర్యటన విజయవంతం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

నగరంలో చేపట్టిన వ్యూహాత్మక రోడ్ల అభివృద్ధి పథకం(ఎస్‌ఆర్‌డీపీ) కోసం నిధుల సమీకరణలో భాగంగా జీహెచ్ఎంసీ జారీచేస్తున్న మున్సిపల్ బాండ్లకు అనూహ్య స్పందన లభించింది. రూ.200కోట్ల సమీకరణ కోసం ముంబై స్టాక్ ఎక్స్ఛేంజీలో బుధవారం ఎలక్ట్రానిక్ బిడ్డింగ్ నిర్వహించగా 200 శాతం సబ్‌స్క్రిప్షన్ వచ్చింది. రూ.8.90 కూపన్ రేటుపై బాండ్లను జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ బొంతు రామ్మోహన్, జీహెచ్ఎంసీ కమిషనర్ బీ జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇప్పుడు రూ.200 కోట్లు సేకరిస్తున్న జీహెచ్ఎంసీ, దశలవారీగా అవసరాలకు తగ్గట్టు రూ.వెయ్యి కోట్ల నిధులను సమీకరించనున్నది. ప్రతినెలా పన్నుల రూపంలో వచ్చే ఆదాయాన్ని ఎస్క్రో అకౌంట్ ద్వారా బాండ్లు కొనుగోలుచేసిన వారికి చెల్లించనున్నారు. బీమా, పెన్షన్ ఫండ్స్, ప్రైమరీ డీలర్లు, బ్యాంకులు తదితర రంగాలవారు బాండ్ల కొనుగోలుకు ముందుకొచ్చారు.

సరికొత్త అధ్యాయానికి నాంది

ఇటీవల బాండ్ల ద్వారా నిధులు సేకరిస్తున్న మొదటి మున్సిపల్ కార్పొరేషన్‌గా పుణె నిలువగా, రెండో మున్సిపల్ కార్పొరేషన్‌గా జీహెచ్ఎంసీ నిలిచింది. 50-60 ఏండ్ల చరిత్రలో స్థానిక సంస్థలు, మున్సిపాలిటీలు అన్నీ కలిపి ఇప్పటివరకు బాండ్ల ద్వారా దాదాపు రూ.2,000కోట్లు సమీకరించగా, ఇప్పుడు జీహెచ్ఎంసీ ఒకేసారి రూ.200 కోట్లకు బాండ్లు జారీచేయడం చారిత్రాత్మకమని అధికారులు అభివర్ణించారు. ఈ ఘటన మున్సిపల్ బాండ్ల మార్కెట్‌లో సరికొత్త అధ్యాయానికి తెరలేపిందన్నారు. స్థానిక సంస్థలు ప్రభుత్వాలపై ఆధారపడకుండా ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు ఈ విధానం దోహదపడుతుందని చెప్పారు. బాండ్ల జారీ ప్రక్రియలో భాగంగా జీహెచ్ఎంసీ ప్రఖ్యాత ఏజెన్సీలైన 'కేర్', 'ఇండియా రేటింగ్స్' నుంచి ఏఏ(స్టేబుల్) రేటింగ్ పొందింది. జీహెచ్ఎంసీ ఆర్థిక పరిస్థితి పటిష్ఠంగా ఉన్నట్టు తేలడంతో బాండ్లకు విశేష స్పందన వచ్చినట్టు అధికారులు చెప్తున్నారు. ఏఏ(స్టేబుల్) రేటింగ్ కోసం దేశంలోని పలు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నా లభించడం లేదని, జీహెచ్ఎంసీకి ఈ రేటింగ్ రావడం సంస్థ ఆర్థిక స్థిరత్వానికి నిదర్శనమని పేర్కొంటున్నారు. 2016-17ఎకనామిక్ సర్వే ప్రకారం స్థానిక సంస్థల్లో పారదర్శకత, జవాబుదారీతనంలో జీహెచ్ఎంసీ ద్వితీయ స్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా కొన్నేండ్లుగా జీహెచ్ఎంసీ మిగులు బడ్జెట్‌లో కొనసాగుతూ, తమ ఆర్థిక అవసరాల్లో 93 శాతం వరకు నిధులను సొంత ఆదాయ మార్గాల ద్వారానే సమకూర్చుకుంటున్నది. రాష్ట్ర ప్రభుత్వం నగరంలో ట్రాఫిక్ రద్దీని నిర్మూలించడంతో పాటు సిగ్నల్ ఫ్రీ రోడ్లుగా తీర్చిదిద్దేందుకు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో రూ.21వేల కోట్ల అంచనాతో ఎస్‌ఆర్‌డీపీ ప్రాజెక్టును చేపట్టింది. ఈ ప్రాజెక్టుకు రూ.వెయ్యి కోట్లను బాండ్ల జారీ ద్వారా, మరో రూ.2,500 కోట్లను బ్యాంకు రుణం ద్వారా సేకరించాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. ఇందులో భాగంగా దశలవారీగా రూ.200 కోట్ల చొప్పున బాండ్లు జారీచేస్తున్నారు.

జనారణ్యం.. ఏడుపాయల

మెదక్, నమస్తే తెలంగాణ ప్రతినిధి:

దుర్గమ్మ నామస్మరణతో మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని ఏడుపాయల వనదుర్గమ్మ క్షేత్రం మారుమోగింది. అశేష భక్తజనంతో జనారణ్యంగా మారింది. జాతరలో అత్యంత కీలకమైన బండ్ల ఊరేగింపు బుధవారం వైభవంగా కొనసాగింది. బండ్లు తిరిగే కార్యక్రమాన్ని తిలకించేందుకు రాష్ట్రంతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి లక్షల మంది తరలివచ్చారు. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం పాపన్నపేట సంస్థానాధీశుల బండి ముందు నడువగా.. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 110 బండ్లు అనుసరించాయి. ఏడుపాయల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళావేదిక వద్ద రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బుర్రకథలు, జానపద గేయాలు, భక్తిగీతాలు భక్తులను అలరించాయి. జాతర నేపథ్యంలో అమ్మవారి ఆలయం విద్యుత్‌దీపాల్లో ధగధగలాడుతున్నది. గురువారం రథోత్సవంతో జాతర సమాప్తం కానున్నది.



ఏడుపాయల ప్రాంతంలో భక్తులు ఏర్పాటుచేసుకున్న టెంట్లు, డేరాలు, చలువపందిళ్లు

తెల్లాపూర్ టెక్నోసిటీకి పచ్చజెండా

పనులు చేపట్టేందుకు ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలు

100 ఎకరాల్లో ప్రపంచస్థాయి టౌన్‌షిప్.. వారంలో పనులు ప్రారంభం, ఐదేండ్లలో పూర్తి

మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో పట్టాలెక్కిన పెండింగ్ ప్రాజెక్టు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

పదేండ్లుగా పెండింగ్‌లో ఉన్న తెల్లాపూర్ టెక్నోసిటీ ప్రాజెక్టు పట్టాలెక్కింది. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా ప్రభుత్వం ఔటర్ కేంద్రంగా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు ఇప్పటికే మంగళ్‌పల్లి, బాటసింగారం లాజిస్టిక్ పార్కుల పనులను ప్రారంభించిన సంగతి తెలిసిందే. తాజాగా హెచ్ఎండీఏ పరిధిలో 2007 సంవత్సరం నుంచి అమలుకు నోచుకోకుండా ఉన్న తెల్లాపూర్ టెక్నోసిటీ ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకొచ్చింది. ఈ ప్రాజెక్టును దక్కించుకున్న కంపెనీలతో పలుమార్లు సమావేశమై పనులను ప్రారంభించే దశకు చేర్చింది. ఈ క్రమంలో ఐటీ, పురపాలకశాఖల మంత్రి కే తారకరామారావు తనదైన ముద్ర వేశారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ వేదికగా ప్రభుత్వ ప్రైవేట్ పార్ట్‌నర్ షిప్ (పీపీపీ) పద్ధతిలో చేపట్టే ఈ టెక్నో సిటీ ప్రాజెక్టుకు ప్రభుత్వం ఇటీవల ఆమోద ముద్ర వేసింది. భాగస్వామ్య సంస్థలు టిష్మన్ స్పైర్ ఇండియా మాస్టర్ ఫండ్, ఐసీఐసీఐ వెంచర్ ఫండ్ మేనేజ్‌మెంట్ కంపెనీ, నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీల నిర్వాహకులు ప్రాజెక్టు పనులపై హెచ్ఎండీఏతో ఒప్పందం కుదుర్చుకున్నారు. వారం రోజుల్లోగా పనులు చేపట్టి ఐదేండ్లలో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మాణాన్ని పూర్తి చేయనున్నారు. తెల్లాపూర్ టెక్నోసిటీ ఏర్పాటుతో అతిపెద్ద ఐటీ హబ్‌తో పాటు వేల ప్లాట్లతో కూడిన అపార్టుమెంట్లు, విల్లాలతో వాణిజ్యనగరంగా రూపాంతరం చెందనున్నది. ఈ ప్రాజెక్టు లాభాల్లో 5 శాతం హెచ్ఎండీఏ ఖజానాలోకి చేరనున్నది.

రూ.50 కోట్లతో మౌలిక వసతులు

టెక్నోసిటీ ప్రాజెక్టు ఏర్పాటుకుగానూ హెచ్ఎండీఏ మౌలిక వసతులు కల్పించనున్నది. ఈ మేరకు రూ.50 కోట్ల అంచనా వ్యయంతో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ కనెక్షన్లకు సంబంధించిన పనులు చేపట్టనున్నారు. త్వరలోనే టెండర్లు పిలిచి ఈ పనులు చేపడుతామని హెచ్ఎండీఏ కమిషనర్ చిరంజీవులు తెలిపారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దడంలో భాగంగా హెచ్ఎండీఏ అభివృద్ధి పథకాలు చేపట్టడంతోపాటు అపరిష్కృత ప్రాజెక్టులను అందుబాటులోకి తీసుకొస్తున్నదని వివరించారు.

ప్రాజెక్టు నేపథ్యమిదీ..

సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం తెల్లాపూర్‌లో 400 ఎకరాల్లో అతిపెద్ద ఐటీ హబ్‌తోపాటు వేల ప్లాట్లతో కూడిన అపార్టుమెంట్లు, విల్లాలు నిర్మించాలని 2007 ఆగస్టు 10న టెక్నోసిటీ ప్రాజెక్టు ఖరారైంది. పీపీపీ పద్ధతిలో 400 ఎకరాల్లో ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయించి టెండర్లు ఆహ్వానించారు. ఎకరాకు రూ.4.2కోట్లు చొప్పున వెచ్చించేందుకు అంగీకరిస్తూ టిష్మన్ స్పైర్ ఇండియా మాస్టర్ ఫండ్ (37శాతం), ఐసీఐసీఐ వెంచర్ ఫండ్ మేనేజ్‌మెంట్ కంపెనీ (37శాతం), నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ (26శాతం) ముందుకొచ్చి ప్రాజెక్టును దక్కించుకున్నాయి. ఈ మేరకు రూ.1,680 కోట్లకు 400 ఎకరాల భూమిని అప్పగించేందుకు హెచ్ఎండీఏ అంగీకరించింది. లాభాల్లో 5 శాతాన్ని హెచ్ఎండీఏకు చెల్లించాలని ఒప్పందం కుదుర్చుకున్నది. ఇందులో భాగంగా ముందుగా 100 ఎకరాల కోసం టిష్మన్ స్పైర్ ఇండియా మాస్టర్ ఫండ్ సంస్థతో కూడిన భాగస్వామ్య కంపెనీలు రూ.448 కోట్లు హెచ్ఎండీఏకు చెల్లించాయి. ఈ సమయంలోనే అనూహ్యంగా భూ వివాదం తెరపైకి వచ్చింది. ప్రాజెక్టు చేపట్టిన 400 ఎకరాల్లో 300 ఎకరాలు అసైన్డ్ భూములని కొందరు హైకోర్టులో కేసులు వేశారు. దీంతో ప్రాజెక్టు నిలిచిపోయింది.

మంత్రి కేటీఆర్ కృషితో..

ఉమ్మడి రాష్ట్రంలో నిలిచిపోయిన తెల్లాపూర్ టెక్నోసిటీ ప్రాజెక్టును పట్టాలెక్కించాలని మంత్రి కేటీఆర్ నిర్ణయించారు. ఎప్పటికప్పుడు సంబంధిత సంస్థలతో సమావేశమయ్యారు. సదరు సంస్థలు వెనక్కి వెళ్లకుండా వారిని ఒప్పించడంలో ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఫలితంగా హెచ్ఎండీఏకు ప్రత్యక్షంగా వారు చెల్లించిన రూ.448 కోట్లు తిరిగి ఇవ్వకుండా ఉపశమనం దొరికింది. వివాదం లేకుండా ఉన్న 100 ఎకరాల్లో తక్షణమే టెక్నో సిటీ ప్రాజెక్టును చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఈ ప్రతిపాదనకు ఆయా సంస్థలు అంగీకారం తెలిపారు. ఒప్పందంలో మార్పులు లేకుండా పనులు చేపట్టేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయి. ప్రధానంగా ప్రభుత్వంపై భరోసా, 2007 నాటి రియల్ భూం ప్రస్తుతం ఉండటంతో ఈ సంస్థలు ప్రాజెక్టు చేపట్టేందుకు మొగ్గు చూపినట్టు తెలుస్తున్నది. ఈ ప్రాజెక్టు అమలుతో పరిసర ప్రాంతాలే కాకుండా హెచ్ఎండీఏకు ఉన్న 300 ఎకరాల నుంచి భారీ ఆదాయం సమకూర్చుకోనున్నది.

మెట్రో ప్రయాణికులు 10 లక్షలు

మొదటిదశ పూర్తిగా అందుబాటులోకి వస్తే ఫుల్ రష్

నాగోల్-మియాపూర్ మార్గంలో నిత్యం 60 వేల మంది ప్రయాణం

నిలకడగా కొనసాగుతున్న రద్దీ.. చెన్నైతో పోల్చితే మనమే బెస్ట్

ఏప్రిల్ నుంచి పెరుగనున్న రైళ్ల స్పీడు.. ఏడాది చివరినాటికి మూడు కారిడార్లు సిద్ధం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

నగర రవాణాలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిన మెట్రోరైలుకు ప్రయాణికుల నుంచి ఆశించినదానికి మించి ఆదరణ లభిస్తున్నది. ప్రస్తుతం నాగోల్-మియాపూర్ మార్గంలో రోజూ 60 వేల నుంచి 70 వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చుతూ నగర రవాణాలో మెట్రోరైలు తనవంతు పాత్ర పోషిస్తున్నది. మెట్రోకు నగరవాసుల నుంచి అత్యంత ఆదరణ లభిస్తున్నా కొన్ని వర్గాలు కావాలనే దుష్ప్రచారానికి తెరలేపాయి. ఈ ఏడాది చివరినాటికి మూడు కారిడార్లు పూర్తయితే మెట్రోరైలులో నిత్యం ప్రయాణించేవారి సంఖ్య 10 లక్షల నుంచి 15 లక్షల వరకు చేరుతుందని అధికారులు చెప్తున్నారు. అమీర్‌పేట-ఎల్బీనగర్, అమీర్‌పేట-హైటెక్‌సిటీ మార్గాలను ఈ ఏడాది జూన్‌నాటికి పూర్తిచేయాలని గడువు విధించుకొని పనులు చేస్తున్నారు. ఇవి పూర్తయితే నగరం తూర్పు నుంచి పడమరకు, ఉత్తరం నుంచి దక్షిణానికి నలుదిశలా ప్రయాణించే వీలుంటుంది. ఒక్కసారి రైలు ఎక్కి ఏకంగా 30 కిలోమీటర్లు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా దాటేయవచ్చు. దీంతో అత్యధికశాతం మంది ట్రాఫిక్ ఇబ్బందులు లేని మెట్రోరైలునే ఆశ్రయిస్తారని అధికారులు చెప్తున్నారు. కారిడార్-2తో కలిపి మూడు కారిడార్లను ఈ ఏడాది డిసెంబర్ చివరికి పూర్తిచేస్తామని అధికారులు చెప్తున్నారు.

అవన్నీ అపోహలే..

మెట్రోరైలు కమర్షియల్ ఆపరేషన్స్ ప్రారంభించిన మొదట్లో ప్రయాణికుల సంఖ్య భారీగా ఉన్నది. జాయ్‌రైడర్స్ తగ్గడంతో ప్రస్తుతం ప్రయాణికుల సంఖ్య నిలకడగా కొనసాగుతున్నది. వీరు మెట్రో సేవలతో సంతృప్తికరంగా ఉన్నారని, ప్రయాణికుల సంఖ్య తగ్గే అవకాశం లేదని అధికారులు చెప్తున్నారు.

త్వరలో పాస్‌లు

మెట్రో ప్రయాణికులకు త్వరలో పాస్‌లు జారీ చేసే విషయంలో కసరత్తు జరుగుతున్నది. ఇవి త్వరలో అందుబాటులోకి వస్తాయని అధికారులు చెప్తున్నారు. డెయిలీ, వీక్లీ, మంత్లీ పాస్‌లు అందుబాటులోకి తేనున్నారు. ఆర్టీసీ, ఎంఎంటీఎస్‌తో కలిపి ఉమ్మడి పాస్‌లను జారీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే వివిధ సంస్థలు, శాఖలతో సంప్రదింపులు జరిపి కొలిక్కి తెచ్చారు. పాస్‌లు అందుబాటులోకి వస్తే విద్యార్థులు, ఉద్యోగులు ఎక్కువగా మెట్రోను ఆశ్రయించే అవకాశం ఉంటుంది.



బుధవారం ప్రారంభమైన హైటెక్‌సిటీలోని మెట్రోమాల్

హైటెక్‌సిటీ మెట్రోమాల్ ప్రారంభం

మెట్రోరైలు ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన హైటెక్‌సిటీ మెట్రోమాల్‌లో కార్యకలాపాలు ప్రారంభం అయ్యాయి. సినిమా థియేటర్‌కు అనుమతులు రావడంతో పీవీఆర్ సంస్థ బుధవారం నుంచి సినిమాలను ప్రదర్శిస్తున్నది. మెట్రోరైలుకు అనుబంధంగా హైటెక్‌సిటీ, పంజాగుట్ట, ఎర్రమంజిల్, మూసారాంబాగ్‌ల్లో మెగా షాపింగ్ మాల్స్ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో సినిమా థియేటర్లు, షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే హైటెక్‌సిటీ, పంజాగుట్ట, ఎర్రమంజిల్ మాల్స్ పూర్తయ్యాయి. మూసారాంబాగ్ మాల్ త్వరలో నిర్మాణం కాబోతున్నది. హైటెక్స్ మెట్రోమాల్‌లో రెండు వేల చదరపు గజాల విస్తీర్ణం ఉండగా పీవీఆర్ ఐకాన్ కోసం 500 చదరపు గజాలు కేటాయించారు.

తాము అంచనా వేసిన సంఖ్యతో పోల్చితే ప్రస్తుత ప్రయాణికుల సంఖ్య ఎక్కువంటున్నారు. ప్రయాణికులను ఎప్పటికప్పుడు గమ్యస్థానాలకు చేర్చుతుండటంతో స్టేషన్లలో రద్దీ తక్కువగా కనబడుతున్నదని, ప్రయాణికులు లేరనేది కేవలం దుష్ప్రచారమని కొట్టిపారేస్తున్నారు. ఉద్యోగాలు తొలిగిస్తున్నారన్న ప్రచారంలోనూ నిజం లేదన్నారు. ఏప్రిల్ ఏడో తేదీ నుంచి సీఎంఆర్ఎస్ ఆంక్షలు తొలిగి సీబీటీసీ టెక్నాలజీ అందుబాటులోకి వస్తున్నది. దీంతో రైళ్ల వేగం కూడా పెరుగనున్నది. కేవలం 5 నుంచి 7 నిమిషాలకు ఒక రైలు అందుబాటులోకి రానున్నది. మాల్స్ కూడా సిద్ధమైతే సినిమాలు చూడటానికి, షాపింగ్ చేయడానికి వచ్చేవారు మెట్రోరైలులోనే రాకపోకలు సాగించే అవకాశం ఉన్నది.

చెన్నైతో పోలిస్తే మనమే బెస్ట్

చెన్నై మెట్రోతో పోలిస్తే హైదరాబాద్ మెట్రోకు విపరీత ఆదరణ ఉన్నది. చెన్నై మెట్రోరైలు 28 కిలోమీటర్ల మేర ఆపరేషన్స్ 2015 జూన్ 29న ప్రారంభమయ్యాయి. ఇందులో నిత్యం ప్రయాణించేవారి సంఖ్య 25 వేలకు మించడం లేదు. చెన్నైతో పోల్చితే హైదరాబాద్ మెట్రో మార్గం సమానంగా ఉన్నా, ప్రయాణికుల సంఖ్య రెట్టింపు కన్నా ఎక్కువగా ఉన్నది. ఇతర మెట్రోల టికెట్ ధరలతో పోల్చితే మన మెట్రో చార్జీల్లో తేడా ఏమీలేదు. పైగా స్మార్ట్‌కార్డులు కొన్నవారికి 10 శాతం రాయితీ కల్పిస్తున్నది. ఇప్పటివరకు రెండు లక్షల మంది స్మార్ట్‌కార్డులు కొనుగోలు చేశారంటే ఎంత ఆదరణ ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. అయినా చార్జీల విషయాన్ని కొందరు గోరంతలు కొండంతలుగా చూపిస్తున్నారు. మిగతా ప్రాజెక్టులన్నీ జైకా నిధులతో ప్రభుత్వమే నిర్మించగా, హైదరాబాద్ ప్రాజెక్టును పీపీపీ మోడల్‌లో నిర్మించారు.

పార్కింగ్ సమస్యే లేదు

వ్యక్తిగత వాహనాలను తగ్గించి ప్రయాణాన్ని సాఫీగా సాగేలా చేయడం, తద్వారా పర్యావరణ హితానికి తోడ్పడాలన్నదే మెట్రోరైలు ఉద్దేశం. పార్కింగ్ సమస్యను భూతద్దంలో చూపిస్తున్న కొన్ని వర్గాలు ఈ ఉద్దేశాన్ని అర్థం చేసుకోవడం లేదు. లాస్ట్‌మైల్ కనెక్టివిటీలో భాగంగా ప్రయాణికుడు ఇంటినుంచి గమ్యస్థానానికి, మళ్లీ ఇంటికి ఇలా ఎక్కడికి వెళ్లాలన్నా మెట్రో ద్వారా సౌకర్యం కల్పించాలన్నదే మెట్రో కాన్సెప్ట్. ప్రపంచంలో మెట్రోరైళ్లన్నీ ఈ కాన్సెప్ట్‌తోనే నడుస్తున్నాయి. హైదరాబాద్ మెట్రోరైలులో లాస్ట్ మైల్ కనెక్టివిటీని విడుతల వారీగా ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఆర్టీసీ, రెంట్ ఏ బైక్, ఓలా వంటి సంస్థలతో ఒప్పందం కుదుర్చుకొని మెట్రో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చుతున్నది. చాలా దేశాల్లోని మెట్రో స్టేషన్లలో అసలు పార్కింగ్ స్థలాలే కేటాయించలేదు. అయినా హైదరాబాదీల జీవన విధానాన్ని అధ్యయనం చేసిన అధికారులు నాగోల్ నుంచి మియాపూర్ వరకు అన్ని స్టేషన్లలో పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. చాలా మంది ఇండ్లవద్దే వాహనాలను వదిలి వస్తుండటం, మరికొందరు నో పార్కింగ్‌లో వాహనాలను నిలుపుతుండటంతో పలు మెట్రో పార్కింగ్ ఏరియాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

6 నుంచి ఓయూ డిగ్రీ కోర్సుల పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా వర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్టు అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ కోర్సుల రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 6వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు తెలిపారు. పూర్తి వివరాలను www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

బీఈడీ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా వర్సిటీ పరిధిలోని బీఈడీ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్టు అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ సప్లిమెంటరీ పరీక్ష ఫీజును ఈ నెల 26వ తేదీ వరకు సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని, రూ.200 అపరాధ రుసుముతో వచ్చే నెల 7వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్టు చెప్పారు. పరీక్ష తేదీల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని ప్రకటించారు. ఇతర వివరాలకు www.osmania.ac.inలో చూసుకోవచ్చన్నారు.

ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సుల పరీక్షలు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సుల పరీక్షలను వాయిదా వేసినట్టు అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (బీపీఈడీ), డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (డీపీఈడీ) కోర్సుల మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలను ఈ నెల 15వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు గతంలో ప్రకటించినప్పటికీ, సాంకేతిక కారణాల వల్ల వాటిని వాయిదా వేశామని చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలను www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.



కీసరగుట్టపై శ్రీభవానీ రామలింగేశ్వరస్వామివారి దర్శనం అనంతరం ప్రసాదాల కౌంటర్ వద్ద భక్తులు



గుట్టపై శివలింగానికి పూజలు చేస్తున్న ఓ కుటుంబం

కీసరగుట్టలో భక్తుల కోలాహలం

బ్రహ్మోత్సవాలకు 10 లక్షల మంది హాజరు

కీసర:

సుప్రసిద్ధ శైవక్షేత్రమైన మేడ్చల్ జిల్లా కీసరగుట్ట దేవస్థానం శివభక్తులతో కొలాహలంగా మారింది. బ్రహ్మోత్సవాల నాలుగోరోజైన బుధవారం కూడా భక్తులు భారీగా తరలివచ్చారు. శివరాత్రి పర్వదినాన ఉపవాస దీక్షను చేపట్టిన శివభక్తులు స్వామివారి సన్నిధిలో విరమించారు. రాత్రంతా జాగరణలో ఉన్న భక్తులు బుధవారం స్వామివారిని దర్శించుకొన్నారు. మహాశివరాత్రి సందర్భంగా మంగళవారం ఒక్క రోజే 10 లక్షల మంది భక్తులు జాతరలో పాల్గొన్నట్టు కలెక్టర్ ఎంవీ రెడ్డి తెలిపారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాల్లో ఇప్పటివరకు స్వామివారికి వివిధ సేవల ద్వారా రూ.48,38,120 ఆదాయం వచ్చిందన్నారు. హుండీ లెక్కింపుతో కలిపి, గతేడాది కంటే ఈసారి ఎక్కువ ఆదాయం చేకూరనున్నట్టు తెలిపారు.

ముగిసిన రాచకొండ ఉత్సవాలు



రాచకొండలో శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

సంస్థాన్‌నారాయణపురం: పర్యాటకశాఖ సహకారంతో రాచకొండ చారిత్రక, పర్యావరణ, పర్యాటక పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మూడు రోజులపాటు కొనసాగిన ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ముగింపు వేడుకల్లో ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. రాచకొండను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని చెప్పారు. సోమవారం నుంచి ప్రారంభమైన ఈ ద్వితీయ ఉత్సవాలకు పర్యాటకులు భారీ హాజరయ్యారు. చివరిరోజు శివలింగానికి పాలాభిషేకాలు, ప్రత్యేక పూజలు, నృత్య ప్రదర్శన, ఫొటో ప్రదర్శన ఆకర్షణగా నిలిచాయి.

గొంతులో ఇరుక్కున్న ద్రాక్ష.. వృద్ధురాలు మృతి



శివమ్మ (ఫైల్)

షాద్‌నగర్, నమస్తే తెలంగాణ: గొంతులో ద్రాక్ష పండు ఇరుక్కోవడంతో ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో జరిగింది. షాద్‌నగర్‌లోని గాంధీనగర్‌కాలనీకి చెందిన శివమ్మ (88) శివరాత్రి ఉపవాస దీక్షలో భాగంగా ఇంట్లో పూజలు చేసిన అనంతరం ద్రాక్ష పండ్లు తిన్నారు. ఈ క్రమంలో శివమ్మ గొంతులో ద్రాక్షపండు ఇరుక్కొని ఊపిరి ఆడలేదు. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన స్థానిక ప్రైవేట్ దవాఖానకు తరలించేలోపే మృతి చెందారు.



ఆనందం డబ్బులకూ దొరుకును!

ఆనందం ఎక్కడుంటుంది? మంచి మాటలో.. ప్రేమించే మనుషుల్లో.. ఆత్మీయ ముచ్చట్లలో.. ఆనందం పుష్కలంగా ఉంటుంది. ఇవేవీ లేకుండా డబ్బులకూ ఆనందం దొరుకుతుందట!

'హ్యాపీనెస్-మనీ' అనే అంశంపై పుర్‌డ్యూ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు తాజాగా ఓ అధ్యయనం చేశారు. ఆనందం ఎక్కడ.. ఎప్పుడు దొరుకుతుందనేది స్పష్టంగా చెప్పలేకపోవచ్చు గానీ.. ప్రస్తుత పరిస్థితుల్లో డబ్బులు పెట్టి కొనుక్కోవచ్చంటున్నారు. ఇది అందరికీ తెలిసిన విషయమే. అయినప్పటికీ మధ్య తరగతి కుటుంబాల్లో కూడా ఈ ధోరణి క్రమంగా విస్తరిస్తున్నదని వారు పేర్కొన్నారు. మామూలుగా డబ్బులు ఎక్కువగా ఉంటే ఆనందాన్ని కోల్పోతారు. సమస్యలు.. ఒత్తిడి లాంటివి ఎక్కువై ఉన్న కొద్ది ఆనందాన్ని కాస్త దూరం చేస్తాయి. అప్పుడు ఆనందాన్ని సౌకర్యాల్లో వెతుక్కుని డబ్బుతో కొనడానికి ప్రయత్నిస్తుంటారు చాలామంది అని చెప్పారు. ఎంత డబ్బులతో ఆనందం పొందాలనుకున్నా మానవ సంబంధాల వల్ల పొందే ఆనందాన్ని మాత్రం పొందలేమని పరిశోధకులు అంటున్నారు.

తీపి పానీయాలు తాగుతున్నారా?

స్వీట్లు, తీపి పానియాలు చూస్తే ఆగలేరు చాలామంది. ఇలాంటి వారిలో మహిళలు మరింత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు నిపుణులు.

మహిళలు తీపి పానీయాలకు దూరంగా ఉంటేనే మంచిదట. రెగ్యులర్‌గా వీటిని తాగడం వల్ల మహిళల్లో సంతానోత్పత్తి క్రమంగా తగ్గుతూ వస్తుందంటున్నారు. కాబట్టి తీపి పానీయాలకు సాధ్యమైనంత దూరంగా ఉంటేనే మంచిదని సూచిస్తున్నారు. ఈ అంశంపై అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీకి చెందిన నిపుణులు పరిశోధన చేశారు. 'ప్రెగ్నెన్సీ స్టడీ ఆన్‌లైన్' అనే పోర్టల్ ద్వారా సుమారు 3828 మహిళలు.. 1045 మంది పురుషులను పరిశీలించారు. ప్రతీ రెండు నెలలకు ఒకసారి వారిని పరిశీలించారు. పురుషులు.. మహిళలు మానవ జీవితంలో నిత్యాహారమైన చక్కరలాంటి ద్రవపదార్థాలు మహిళలకు హానీ చేస్తున్నాయంటున్నారు. కాబట్టి చాయ్.. కాఫీ ఇతర చక్కరతో కూడిన పానీయాల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు.



జిందగీ పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.

zindagi@ntdaily.news
www.ntnzindagi.com
/nt.zindagi

7. జిందగీ

Life is Beautiful

నమస్తే తెలంగాణ

హైదరాబాద్
గురువారం 15 ఫిబ్రవరి 2018

WWW. NTNEWS.COM

నెంబర్ వన్‌కాయ్!

కూరగాయల్లో రారాజు ఏదంటే..
వంకాయ పేరే వినిపిస్తుంది!
అందుకే అది నెంబర్‌వన్ కాయగా ప్రశస్తికెక్కింది..
వంకాయ తిన్నవాళ్లంతా 'ఆహా.. ఏమి రుచి'
అనకమానరు!
'వంకాయ వంటి కూరయు' అని పద్యం చెప్పినా..
'రోజూ తిన్నా మరి.. మోజే తీరనది' అని పాడినా..
వంకాయకే చెల్లుతుంది!
అందుకే అద్భుతమైన వంకాయ రుచులను
ఈ వారం మీ ముందుచుతున్నాం.

వంగీ బాత్



కావాల్సినవి :

వంకాయలు : 200 గ్రా. ,
కంది పప్పు : 100గ్రా.
బియ్యం : 100 గ్రా.,
చింతపండు రసం : ఒక టీస్పూన్
కారం : ఒక టీస్పూన్
బెల్లం : అర టీస్పూన్
పచ్చిమిరపకాయలు : 4
ఇంగువ : పావు టీస్పూన్
తాళింపు గింజలు : 10 గ్రా.
కరివేపాకు : ఒక రెమ్మ, **నెయ్యి :** ఒక టీస్పూన్
పసుపు : చిటికెడు ,**నూనె :** ఒక టీస్పూన్
ఉప్పు : తగినంత

తయారీ :

ముందుగా బియ్యం, పప్పులను విడివిడిగా కడిగి పెట్టుకోవాలి. కడాయిలో నెయ్యి, నూనె వేసి అందులో తాళింపు గింజలు వేసి పచ్చిమిర్చి, వంకాయలు, కరివేపాకు వేసి వేయించాలి. ఇవి కాస్త వేగాక.. పసుపు, చింతపండు రసం, ఉప్పు, కారం, బెల్లం, ఇంగువ వేసి రెండు నిమిషాలు కలుపాలి. ఆ తర్వాత కొన్ని నీళ్లు పోసి మరిగించాలి. ఇందులో ముందే కడిగిన బియ్యం, పప్పులను వేసి సన్నని మంట పై పది నిమిషాలపాటు ఉడికించుకోవాలి. రుచికరమైన వంగీబాత్ మీ ముందుంటుంది.

వంకాయ బఠాణీ పలావు



కావాల్సినవి :

వంకాయ : 200 గ్రా., **బాస్మతీ బియ్యం :** 200 గ్రా., **నూనె :** ఒక టీస్పూన్ **ఉల్లిగడ్డ :** 2, **పచ్చిమిర్చి :** 4, **కొత్తిమీర :** ఒక కట్ట, **పుదీనా :** ఒక కట్ట, **పచ్చి బఠాణీ :** 100 గ్రా., **పచ్చిమిర్చి పేస్ట్ :** ఒక టీస్పూన్, **అల్లం, వెల్లుల్లి పేస్ట్ :** ఒక టీస్పూన్, **గరం మసాలా :** 20 గ్రా., **గరం మసాలా పొడి :** అర టీస్పూన్, **ఉప్పు :** తగినంత

తయారీ :

బాస్మతీ బియ్యాన్ని కడిగి పెట్టుకోవాలి. కడాయిలో నూనె పోసి అందులో గరం మసాలా, పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలు, అల్లంవెల్లులి పేస్ట్ వేసి వేయించాలి. దీంట్లోనే పుదీనా, బఠాణీ, కొత్తిమీర, వంకాయ ముక్కలు, పచ్చిమిర్చి పేస్ట్, ఉప్పు, గరం మసాలా పొడి వేసి కలిపి తగినన్ని నీళ్లు పోసి బియ్యం వేయాలి. సన్నని మంట మీద కాసేపు ఉంచి ఆ తర్వాత దమ్ వేయాలి. అంతే టేస్టీ వంకాయ బఠాణీ పలావు వేడిగా మీ నోరూరిస్తుంది.

వంకాయ చిప్స్



కావాల్సినవి :

వంకాయలు : 200 గ్రా., **పచ్చిమిరపకాయలు :** 4, **కరివేపాకు :** ఒక రెమ్మ, **కారం :** అర టీస్పూన్, **ధనియాల పొడి :** అర టీస్పూన్, **ఉప్పు, నూనె :** తగినంత

తయారీ :

వంకాయలను చిప్స్‌లా కట్ చేసుకోవాలి. వీటిని నీళ్లలో ఉప్పు వేసి పక్కన పెట్టాలి. కడాయిలో నూనె పోసి డీప్ ఫ్రై చేసుకోవాలి. మరో కడాయిలో కొద్దిగా నూనె పోసి పచ్చిమిర్చి, కరివేపాకు వేయించి డీప్ ఫ్రై చేసుకున్న వంకాయల్లో వేయాలి. దీంట్లో ఉప్పు, కారం, ధనియాల పొడి వేసుకొని కలుపాలి. కావాలనుకుంటే ఇందులో చాట్ మసాలా వేసుకోవచ్చు. వీటిని వేడిగా లాగిస్తే టేస్టీగా ఉంటాయి.

వంకాయ కబాబ్




కావాల్సినవి :

వంకాయ : 200 గ్రా.,
పెరుగు : ఒక టీస్పూన్
కారం : ఒక టీస్పూన్
జీలకర్ర పొడి : అర టీస్పూన్
గరం మసాలా : పావు టీస్పూన్
ధనియాల పొడి : అర టీస్పూన్
ఆమ్‌చూర్ పొడి : పావు టీస్పూన్
నువ్వుల పొడి : 10 గ్రా.
నూనె, ఉప్పు : తగినంత

తయారీ :

ఒక గిన్నెలో పెరుగు, కారం, జీలకర్ర పొడి, గరం మసాలా, ధనియాల పొడి, ఆమ్‌చూర్ పొడి, ఉప్పు, కొద్దిగా నూనె వేసుకొని బాగా కలుపుకోవాలి. దీంట్లోనే నువ్వుల పొడి కూడా కలిపి కాసేపు అలా పక్కన పెట్టాలి. ఇప్పుడు అన్ని వంకాయలను మధ్యగా కోసి పెట్టాలి. దీంట్లో ముందు కలిపి పెట్టుకున్న మిశ్రమాన్ని కూరాలి. ఈ వంకాయలను సీకుకు గుచ్చి బొగ్గులపై కాల్చుకోవాలి. అంతే.. వంకాయ కబాబ్ రెడీ!



జి.యాదగిరి
కార్పొరేట్ చెఫ్
వివాహభోజనంబు రెస్టారెంట్
జూబ్లీహిల్స్, హైదరాబాద్
పార్క్‌లైన్, సికింద్రాబాద్

వంకాయ హల్వా



కావాల్సినవి :

వంకాయలు : 200గ్రా.
చక్కెర : 100 గ్రా.
మిల్క్‌మేడ్ : 50 గ్రా.
పాలు : అర లీటరు
ఇలాయిచీ పౌడర్ : పావు టీస్పూన్
డ్రై ఫ్రూట్స్ : 20 గ్రా.
నెయ్యి : 2 టీస్పూన్స్

తయారీ :

వంకాయలను చిన్న ముక్కలుగా కట్ చేసి ఉప్పు నీళ్లల్లో వేసి ఉంచాలి. ఇప్పుడు కడాయిలో నూనె పోసి డ్రై ఫ్రూట్స్ వేగాక వంకాయలు వేసి వేగనివ్వాలి. ఇవి సగానికి పైగా వేగిన తర్వాత పాలు పోసి బాగా ఉడికించుకోవాలి. వంకాయలు పేస్ట్ మాదిరిగా అయిపోతాయి. ఆ తర్వాత చక్కెర, మిల్క్‌మేడ్ వేసి సన్నని మంట మీద కలుపుతుండాలి. చివరగా ఇలాయిచీ పొడి వేసి రెండు నిమిషాల తర్వాత దించేయాలి. ప్లేట్‌కి నెయ్యి రాసి ఈ మిశ్రమాన్ని పోసి చల్లారనివ్వాలి. తియ్యని వంకాయ హల్వా మీ నోరూరించక మానదు.

నమస్తే తెలంగాణ **చిత్రం**



నరేష్, శివాజీరాజా, శ్రీకాంత్

అప్పటివరకు 'మా' గుర్తురావడం లేదు

'సమస్యలు ఎదురైనప్పుడే హీరోయిన్‌లు 'మా'(మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) ముందుకు వస్తున్నారు. ఆ సమయంలో ఒక చేతిలో 'మా' మెంబర్‌షిప్ ఫారమ్ మరో చేతిలో కంప్లెంట్‌తో కనిపిస్తున్నారు. అప్పటివరకు మేము గుర్తుకురావడం లేదు. పరిస్థితి అంతదాకా తెచ్చుకోవద్దని వారిని కోరుతున్నాను. తెలుగువారైనా, పరభాషకు చెందిన కథానాయికలైనా ఖచ్చితంగా 'మా'లో సభ్యత్వం తీసుకోవాలి' అని హీరోయిన్‌లను హెచ్చరించారు మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు శివాజీరాజా. 'మా' ఏర్పాటై 25 వసంతాలు పూర్తయిన సందర్భంగా సిల్వర్‌జూబ్లీ వేడుకల్ని ఈ నెల 28న అమెరికాలోని డల్లాస్‌లో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు ఇటీవల హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో శివాజీరాజా తెలియజేశారు. త్వరలో జరుగబోయే మరో వేడుకకు మహేష్ బాబు హాజరుకానున్నారని, బాలకృష్ణ, వెంకటేశ్, నాగార్జున తమకు చక్కటి సహకారాన్ని అందిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రచయిత కథ!



సంచిత, విద్యాసాగర్‌రాజు

విద్యాసాగర్‌రాజు నటిస్తూ రూపొందించిన చిత్రం 'రచయిత'. సంచిత పదుకునే కథానాయిక. కళ్యాణ్ ధూళిపాళ్ల నిర్మించిన ఈ చిత్రం రేపు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం బుధవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదరప్రసాద్ మాట్లాడుతూ 'ఈ చిత్రాన్ని నైజాంలో రంజిత్ మూవీస్ ద్వారా విడుదల చేస్తున్నాం. ఇటీవలే ప్రత్యేక షోలు వేశాం. చూసిన ప్రతీ ఒక్కరు అద్భుతంగా వుందని అభినందించారు. ఇదొక స్వచ్ఛమైన సినిమా. ఈ సినిమా కోసం వైజాగ్, విజయవాడ, ప్రకాశం జిల్లాల్లో నటుడు జగపతిబాబు పాదయాత్ర చేశారు' అని తెలిపారు. నిర్మాత మాట్లాడుతూ 'సినిమా నిర్మించడం ఒకెత్తు, దాన్ని విడుదల చేయడం ఒకెత్తు అని ఈ సినిమాతో తెలిసింది. అడ్డంకుల్ని అధిగమించడానికి జగపతిబాబు, దామోదరప్రసాద్, ముత్యాల రాందాస్ కృషిచేశారు' అని తెలిపారు. ఎమోషనల్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఒక అమ్మాయి మనసు లోతు ఎంతో తెలియజెప్పే ప్రయత్నం చేశాం' అని విద్యాసాగర్‌రాజు అన్నారు.

శీను లవ్‌స్టోరీ!



చాందిని

శ్రీనివాసరావు నటిస్తూ నిర్మిస్తున్న చిత్రం 'శీనుగాడి ప్రేమ'. 'సిన్సియర్ రా మామా' అని ఉపశీర్షిక. ఆర్.కె. దర్శకత్వం వహించిన ఈ చిత్ర గీతాలు ఇటీవల హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. ప్రణవి, కావేరి, చాందిని కథానాయికలు. రమణ సాకే సంగీతం అందించిన ఈ చిత్ర ఆడియోను టీఎఫ్‌పీసీ ఛైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్ విడుదల చేశారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ 'ఓ అందమైన ప్రేమకథ నేపథ్యంలో తెరకెక్కుతున్న చిత్రమిది. చక్కని కథ కుదిరింది' అన్నారు.



మహేష్‌బాబు, మంజుల

అక్కతో సినిమా చేస్తానేమో!

'మంజుల దర్శకురాలిగా మారుతుందని ఊహించలేదు. ఓ సందర్భంలో తను ఏదో రాసుకుంటుంటే చూశాను. కవిత్వం అనుకున్నాను. కానీ సినిమా కోసం కథ రాసుకుందని అనుకోలేదు. భవిష్యత్‌లో అక్క దర్శకత్వంలో నేను సినిమా చేస్తానేమో' అని అన్నారు హీరో మహేష్‌బాబు. సందీప్‌కిషన్, అమైరాదస్తూర్, త్రిధాచౌదరి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మనసుకు నచ్చింది'. మంజుల ఘట్టమనేని దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. సంజయ్‌స్వరూప్, పి.కిరణ్ నిర్మాతలు. ఈ నెల 16న ఈ చిత్రం విడుదలకానున్నది. బుధవారం హైదరాబాద్‌లో చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మహేష్‌బాబు మాట్లాడుతూ 'మంజుల అక్కయ్య సినిమా చేస్తున్నానని చెప్పగానే షాక్ అయ్యాను. గర్వంగా ఉంది. ఈ సినిమాకు నేను వాయిస్ ఓవర్ అందించాను' అని తెలిపారు. నాన్న, తమ్ముడు గర్వపడేలా ఈ చిత్రం ఉంటుందని, సినిమా కోసం వాయిస్ ఓవర్ చెప్పమని అడగ్గానే మహేష్‌బాబు వెంటనే అంగీకరించాడని మంజుల పేర్కొన్నారు. మంజుల దర్శకత్వంలో సినిమా చేయడం ఆనందంగా ఉందని సందీప్‌కిషన్ అన్నారు. ప్రతి ఒక్క మనసుకు నచ్చే చిత్రమిదని నిర్మాతల్లో ఒకరైన కిరణ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో అమైరా దస్తూర్, మంజుల కూతురు జాన్వి తదితరులు పాల్గొన్నారు.

ఇంతలో ఎన్నెన్ని వింతలో...



సౌమ్య,నందు

నందు, గగన్‌విహారి, సౌమ్య వేణుగోపాల్, పూజా రామచంద్రన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఇంతలో ఎన్నెన్ని వింతలో'. వరప్రసాద్ వరికూటి దర్శకుడు. ఎస్.శ్రీకాంత్‌రెడ్డి, ఇప్పిలి రామమోహనరావు నిర్మాతలు. యాజమాన్య స్వరాలను సమకూర్చిన గీతాల్ని చిత్రబృందం ఇటీవల హైదరాబాద్‌లో విడుదల చేసింది. ఈ సందర్భంగా నందు మాట్లాడుతూ 'ప్రేమించిన అమ్మాయితో పెళ్లికి సిద్ధమవుతున్న తరుణంలో స్నేహితుడు చేసిన తప్పు కారణంగా ఓ యువకుడి జీవితం ఎలా చిక్కుల్లో పడింది?. ఆ సమస్య నుంచి అతడు ఎలా బయటపడ్డాడన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. ఒక్క రాత్రిలో జరిగే కథ ఇది. ఆద్యంతం ఉత్కంఠభరితమైన మలుపులతో సాగుతుంది. 'పెళ్లిచూపులు' తర్వాత నాకు మంచి పేరును తెచ్చిపెడుతుందనే నమ్మకముంది' అని తెలిపారు. మార్చి 2న ఈ సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాతలు చెప్పారు. కథానుగుణంగా అర్థవంతమైన సాహిత్యం కుదిరిందని, సినిమాలోని అన్ని పాటలు తానే రాశానని గేయరచయిత సురేష్ గంగుల చెప్పారు. ఈ కార్యక్రమంలో యాజమాన్య, పూజా రామచంద్రన్, సౌమ్యవేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'సత్యగ్యాంగ్' ఆశయం



అక్షిత, సాత్విక్

సాత్విక్ ఈశ్వర్, అక్షిత జంటగా నటిస్తున్న చిత్రం 'సత్యగ్యాంగ్'. సిద్ధయోగి క్రియేషన్స్ పతాకంపై మహేష్‌ఖన్నా నిర్మిస్తున్నారు. ప్రభాస్ దర్శకుడు. ఇటీవల చిత్రబృందం టీజర్‌ను విడుదలచేసింది. నిర్మాత మాట్లాడుతూ 'అనాథలైన నలుగురు యువకుల కథ ఇది. సమాజంలో అనాథలనే వారు ఉండకూడదనే సందేశాత్మక కథాంశంతో రూపొందిస్తున్నాం. అనాథ బాలల చేతుల మీదుగా టీజర్‌ను విడుదల చేయడం ఆనందంగా ఉంది. త్వరలో చిత్ర గీతాల్ని విడుదల చేయనున్నాం. సినిమా చాలా బాగా వచ్చింది. తప్పకుండా తెలుగు ప్రేక్షకుల్ని మెప్పిస్తుందనే నమ్మకముంది' అని తెలిపారు. యాక్షన్, థ్రిల్లర్ అంశాలకు ప్రాధాన్యమున్న చిత్రమిదని, సత్యగ్యాంగ్ పోరాటం దేనికోసమనేది ఉత్కంఠను పంచుతుందని దర్శకుడు చెప్పాడు. చక్కటి సందేశం మిళితమైన సినిమాతో చిత్రసీమకు పరిచయం కానుండటం ఆనందంగా ఉందని నాయకానాయికలు చెప్పారు. ఈ కార్యక్రమంలో సినిమాటోగ్రాఫర్ అడుసుమిల్లి విజయ్‌కుమార్, అక్షిత తదితరులు పాల్గొన్నారు.

కలిసి బ్రతుకుదాం



హితేష్‌కళ్యాణ్

హితేష్‌కళ్యాణ్, సంధ్య నాయకా నాయికలుగా నటిస్తున్న చిత్రం 'కలిసి బ్రతుకుదాం'(భాళాస్ బంచ). మాయ భాస్కర్ దర్శకనిర్మాత. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ నెలలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మాయా భాస్కర్ మాట్లాడుతూ 'కుటుంబ విలువలతో కూడిన వినోదభరిత చిత్రమిది. తెలుగు, బంజారా భాషల్లో ఏకకాలంలో విడుదలచేయనున్నాం. వాణిజ్య హంగులన్నీ పుష్కలంగా ఉంటాయి. సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. యు.ఎ సర్టిఫికెట్ లభించింది' అని తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సుధాకర్, సంగీతం: రవికళ్యాణ్.

నమస్తే తెలంగాణ
విందు
హైదరాబాద్
గురువారం 15 ఫిబ్రవరి 2018

ఈ వయసులో.. ఫాస్ట్‌ఫుడ్‌కి దూరంగా ఉండాలి!



యుక్త వయసు పిల్లలు తిండి విషయంలో చాలా నిర్లక్ష్యంగా ఉంటారు. ఇంటి ఆహారం కంటే బయటి ఆహార పదార్థాలే తినాలని ఉవిళ్లూరుతుంటారు. కానీ ఈ వయసులో బయటి తిండి మంచిది కాదని గుర్తు పెట్టుకోవాలి.



డాక్టర్ మయూరి ఆవుల
న్యూట్రిషనిస్ట్
mayuri.trudiet
@gmail.com

స్కూలు నుంచి అప్పుడే కాలేజ్‌లోకి వచ్చేస్తారు. ఫ్రెండ్స్ ఎక్కువ అవుతారు. దాంతో చాలావరకు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ స్కిప్ చేసేస్తుంటారు. మూడు పూటలా భోజనం అనేది వాళ్ల డైరీ నుంచి మెల్లగా పక్కకు జరుగుతుంది. స్నాక్స్‌లో కూడా ఇంటి నుంచి వచ్చే ఆహారం కాకుండా బయట దొరికే వాటితో కానిచ్చేస్తుంటారు. ఇవన్నీ వారి ఎదుగుదలకు ఆటంకంగా మారుతాయి. పైగా అందులో ఉండే అధిక కొవ్వులు, చక్కెర నిల్వలు వారిని స్థూలకాయులను చేస్తుంది. కాబట్టి ఈ వయసులో కచ్చితంగా పోషక విలువలున్న ఆహారాన్ని తినేలా చూసుకోవాలి. లేకపోతే వాళ్లు చదువులో కూడా వెనుకబడడానికి కూడా ఈ ఆహారపు అలవాట్లు కారణం అవుతాయి. కాబట్టి ఎలాంటి ఆహారం తీసుకుంటే వారికి మేలో తెలుసుకొని ఆ ఆహారాల్ని వారు తినేలా చూసుకోండి.

- వీరికి ప్రొటీన్స్ ఎక్కువ అవసరమవుతాయి. ఇవి శరీర ఎదుగుదలకు ముఖ్యంతో ఉపయోగపడుతాయి. బాడీ టిష్యూల మరమ్మత్తుకు కూడా ఈ ప్రొటీన్స్ పనికొస్తాయి.
- కొవ్వుల్లో మంచి కొవ్వులు, చెడు కొవ్వులనే రకాలు ఉంటాయి. మంచి కొవ్వులు శరీరంలోకి చేరినప్పుడు మనకు తగిన శక్తి లభిస్తుంది. దాంతో మనం ఆహారాన్ని ఎక్కువ కూడా తీసుకుంటాం.
- కార్బోహైడ్రేట్లు కూడా ఈ వయసు పిల్లలకు ముఖ్యం. డైట్‌లో కచ్చితంగా కార్బోహైడ్రేట్స్ లభించే ఆహారాన్ని అందించాలి.
- విటమిన్స్, మినరల్స్ ఉన్న ఆహారాలను తక్కువ మొత్తంలో అందించాలి. ఇవి వాళ్లకు శక్తిని అందించకపోయినా కొన్ని రకాల న్యూట్రియంట్స్‌ని అందిస్తాయి. ఇవి వారి ఎదిగే క్రమంలో ప్రముఖ పాత్ర వహిస్తాయి.
- ఐరన్, కాల్షియం.. ఇవి శారీరక ఎదుగుదలకు పనికొస్తాయి. కాబట్టి ఈ రెండు దొరికే ఆహారాలను తీసుకోవాలి.
- నట్స్, మాంసం, చీజ్, పాలల్లో జింక్ పాళ్లు ఎక్కువ. కాబట్టి ఈ వయసు పిల్లలకు వీటిని కచ్చితంగా డైట్‌లో చేర్చాలి.

వంట చిట్కాలు!



- కాఫీపొడి గడ్డ కట్టకుండా ఉండాలంటే దాన్ని గాలి చొరబడని డబ్బాలో పెట్టి డీప్ ఫ్రిజ్‌లో ఉంచండి.
- వంటగదిలో చీమలు ఇబ్బంది పెడుతుంటే... ఒక దోసకాయను ముక్కలుగా కోసి చీమలు తిరిగే చోట పెట్టండి.
- కూరగాయలు వాడిపోయాయా..? నిమ్మ రసం కలిపిన నీటిలో ఓ పదినిమిషాలు ఉంచండి. తాజాగా అవుతాయి.
- కూరల్లో మసాలా ఎక్కువైందా? రెండు మూడు టమాటాలను ఉడికించి అందులో కలపండి. మసాలా ఘాటు తగ్గుతుంది.

తాము చూసిన ప్రాంతాలు, అక్కడి రెస్టారెంట్లు.. నచ్చిన ఆహారపదార్థాలతో ఓ కిడ్స్ అండ్ ఫ్యామిలీ ఫ్రెండ్లీ రెస్టారెంట్ పెట్టాలనుకున్నారు ఈ నలుగురు స్నేహితులు. అధ్యయనం చేశారు.. ఆచరణలో పెట్టారు.. అందుబాటులోకి తెచ్చారు.. అదే హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లోని రెస్టారెంట్ 'ఫ్లయింగ్ బీన్స్ కేఫ్ అండ్ బిస్ట్రో'.


కిడ్స్.. ఫ్యామిలీ ఫ్రెండ్లీ





హైదరాబాద్‌కు చెందిన ఉమాదేవి, శాలిని, మంజీరా దేవి, నీతా ఫ్యామిలీ ఫ్రెండ్స్. మహిళా పారిశ్రామికవేత్తలుగా ఎదుగాలనుకుంటున్న వీరు ఫ్యామిలీతో తరుచుగా వేర్వేరు ప్రాంతాల్లో పర్యటిస్తుంటారు. ఆయా ప్రాంతాల్లో తమకు నచ్చిన ఫుడ్, పరిసరాలను దృష్టిలో పెట్టుకుని అలాంటి వాతావరణంతో కూడిన కుటుంబ సమేతంగా కూర్చుని ఎంజాయ్ చేయడానికి వీలుండేలా ఈ కేఫ్‌ను తీర్చిదిద్దారు. ఫుడ్ ఇండస్ట్రీలోకి రావాలనుకున్న వీరు ముందుగా నగరంలోని కేఫ్‌లను పరిశీలించారు. వాటిల్లో హుక్కా సర్వసాధారణమైంది. అందుకే అలాంటి వాతావరణానికి దూరంగా, ఎలాంటి ఆల్కహాల్ లేని క్లీన్ అండ్ నీట్ ప్రాంతంగా కిడ్, ఫ్యామిలీ ఫ్రెండ్లీగా ఫ్లయింగ్ బీన్స్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వహకుల్లో ఒకరైన ఉమాదేవి అన్నారు.

ఈ నలుగురు వేర్వేరు రంగాలకు చెందినవారైనప్పటికీ ఫుడ్ విషయంలో మాత్రం అందరికీ ఒకే అభిప్రాయం ఉంది. అందుకే వారంతా కలిసి ఫ్లయింగ్ బీన్స్ పేరుతో ఖండాంతర వంటకాలతో దీన్ని ప్రారంభించారు. హైదరాబాద్ ఫిలింనగర్‌లో ఉన్న ఈ కేఫ్‌లో ఇండియా వంటకాలు మినహా థాయ్, మెక్సికన్, ఇటాలియన్, ఏషియన్ వంటి పలు దేశాల వంటకాలు పూర్తి నాణ్యత, మంచి రుచితో కూడిన ఆహారపదార్థాలు లభిస్తాయి. పూర్తిస్థాయిలో అనుభవం ఉన్న చెఫ్‌లనే వంటవారిగా తీసుకున్నామని నిర్వహకులు చెప్పారు. వంటకాల్లో ఉపయోగించే మసాలాలు కూడా తామే స్వయంగా తయారుచేస్తామని ఉమాదేవి అన్నారు.







ఆకట్టుకునే అలంకరణ

ఫిలింనగర్ ప్రధాన మార్గంలో ఉండడంతో పాటు వాల్ ఆర్ట్స్, ఆకర్షించే పరిసరాల వల్ల ఈ కేఫ్ అందరినీ ఆకట్టుకుంటున్నది. ఇక్కడి గోడల మీదున్న 3డీ వింటేజ్ ఆర్ట్ చూడడానికి హాయిని గొల్పుతున్నది. కూర్చోడానికి రంగురంగుల కుర్చీలు, టేబుల్స్, సోఫాలు, గోడలపై వేసిన పెయింటింగ్స్, రంగు రంగుల విద్యుత్ లైట్స్.. ఇలా అనేకం ఇక్కడి పరిసరాలను మరింత అందంగా చూపిస్తున్నాయి.

ఈవెంట్స్, షూటింగ్స్

కేఫ్ బయటి ప్రాంతం విశాలంగా ఉండడం వల్ల ఈవెంట్స్, ప్రైవేట్ పార్టీలు నిర్వహించుకోవడానికి అనుకూలంగా ఉన్నది. అందుకే ఇక్కడ సినిమా, టెలివిజన్ షూటింగ్‌లు నిర్వహించుకోవడానికి పలు సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. ఇప్పటికే పలు టీవీ చానెల్స్ నటీనటుల ఇంటర్వ్యూలను ఇక్కడే నిర్వహించాయి.

సాయంకాలం స్నేహితులతో కలిసి కాలక్షేపం చేస్తూ కాఫీ తాగాలనుకునే స్నేహితులకు, కుటుంబసమేతంగా కలసి డిన్నర్ చేయాలనుకునే వారికి, చక్కని వాతావరణంలో వీకెండ్స్‌ను సెలెబ్రేట్ చేసుకోవాలనుకునేవారికి ఫ్లయింగ్ బీన్స్ అనువైన ప్రాంతం.

కిడ్స్ అండ్ ఫ్యామిలీ

ఫ్లయింగ్ బీన్స్ కేఫ్ పూర్తిగా కిడ్, ఫ్యామిలీ ఫ్రెండ్లీ వాతావరణంలో ఉంటుంది. ఇందులో మొత్తం ఐదు జోన్స్ ఉన్నాయి. ప్రతీ జోన్ దేనికదే ప్రత్యేకతతో కూడి ఉంటుంది. ఆకట్టుకునే డెకరేషన్‌తో పాటు లైట్‌మ్యూజిక్‌తో అలరిస్తున్నది. కేఫ్‌లో ఎదురుచూడాల్సి వస్తే బోర్ కొట్టకుండా ఉండడం కోసం ప్రత్యేక లైబ్రెరీ కూడా ఉంది. అలాగే పిల్లల ఎంటర్‌టైన్‌మెంట్‌కు వీలుగా పియానో, ఆడుకోవడానికి బోర్డ్ గేమ్స్ కూడా అందుబాటులో ఉన్నాయి. పిల్లలు వేసిన చిత్రాలను ఇక్కడ ప్రదర్శనకు ఉంచవచ్చు. వాటిని అమ్మకానికి కూడా పెట్టుకోవచ్చు. వచ్చిన మొత్తాన్ని పిల్లలకే ఇస్తారు. అలాగే పిల్లలు కూడా తమకు ఇష్టమైన కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి వీలుగా అన్ని రకాల వసతులు కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని నిర్వాహకులు అంటున్నారు. గతంలో మట్టి గణపతి తయారీ, యాక్సెసరీస్, బేకింగ్ వర్క్‌షాప్, బుక్‌రీడింగ్ వంటి ఈవెంట్స్‌ను నిర్వహించినట్లు నిర్వాహకులు చెప్పారు.

ఆహా ఏమి రుచి..

విదేశీ రుచులను ఆస్వాదించాలంటే ఫ్లయింగ్‌బీన్స్‌కు వెళ్లాల్సిందే. బ్రేక్‌ఫాస్ట్‌లో చీజ్ ఆమ్లెట్, మెక్సికన్ ఆమ్లెట్‌తో పాటు సలాడ్స్, శాండ్‌విచ్, బర్గర్, పిజ్జా, పాస్తా, గ్రిల్, ఏషియన్, క్రేప్స్, డెజర్ట్, వాఫ్ఫల్స్, చికెన్ వింగ్స్, చికెన్ 65, గ్రీక్ సలాడ్, ఇటాలియన్ గ్రిల్డ్ చికెన్ సలాడ్, చికెన్ టిక్కా సాలాడ్, అమెరికన్ చికెన్ బర్గర్, ఫ్రైడ్ చికెన్ బర్గర్, కీమా చికెన్, పెన్నా టమాటో క్రీమ్, గ్రిల్డ్ చికెన్, గ్రిల్డ్ స్పైసీ పనీర్ స్టిక్, థాయ్ గ్రీన్, రెడ్ కర్రీ వంటలు ఇక్కడ దొరుకుతాయి. చికెన్‌ఫర్మేషన్, సిల్వర్ సిన్ వాఫ్ఫుల్, బనానా బ్రెడ్, బిటర్ వైఫ్(డ్రింక్),తిరమిసులు ఫ్లయింగ్ బీన్స్‌కు ప్రత్యేకం.

మరిన్ని రుచులు..

ప్రతిరోజూ 100కు మించి కస్టమర్లు కేఫ్‌కు వస్తున్నారు. ఆర్డర్‌పై డెలివరీ చేయడంతోపాటు ఔట్‌డోర్ క్యాటరింగ్‌ను కూడా నిర్వహిస్తున్నారు. అలాగే కస్టమర్ల కోరికమేరకు త్వరలో చైనీష్, ఇండియన్ ఫుడ్‌ను కూడా ప్రవేశపెట్టే ఆలోచనలో ఉన్నట్లు నిర్వహకులు తెలిపారు.



పసుపు.. ప్రయోజనాలు!

భారతీయ వంటకాల్లో పసుపు అత్యంత ముఖ్యంగా వాడే పదార్థం. ఇందులో విటమిన్లు, లవణాలతో పాటు ఆరోగ్యానికి తోడ్పడే పైటిన్‌పాస్పరస్ కూడా అధికంగా ఉంటుంది. సుగంధ ద్రవ్యాల రాణిగా పిలిచే పసుపు ప్రయోజనాలు మరెన్నో..



- పసుపులో ఫైబర్, పొటాషియం, విటమిన్ బీ6, మెగ్నీషియం, విటమిన్ సి ఉన్నాయి. మనకు అవసరమయ్యే 26శాతం మాంగనీస్, 16శాతం ఇనుము ఈ పసుపు ద్వారానే అందుతుందట.
- పసుపు మనం తీసుకొనే ఆహారం జీర్ణం చేసి శరీర సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది. గ్యాస్, ఉబ్బరం తగ్గిస్తుంది.
- హెర్బ్ సొరియాసిస్, మొటిమలు, తామర వంటి ఇతర చర్మ సమస్యలను తగ్గించడంలో ఇది గొప్ప మందుగా ఉపయోగపడుతుంది.
- పసుపు మెటబాలిజం రేటును పెంచుతుంది. దీంతో శరీరంలో అధిక కొవ్వు చేరకుండా నిరోధిస్తుంది.
- యాంటీసెప్టిక్ గుణాలున్న పసుపు పలు వ్యాధుల్ని నయం చేస్తుంది. జలుబు, దగ్గు విపరీతంగా బాధిస్తున్నప్పుడు గ్లాసు గోరువెచ్చని పాలల్లో చిటికెడు పసుపు వేసుకొని తీసుకుంటే త్వరగా ఉపశమనం కలుగుతుంది.
- గ్యాస్ట్రబుల్, కడుపులో మంట లాంటి సమస్యలకు పసుపు చక్కని రోగనివారిణిగా పనిచేస్తుంది. సౌందర్యాన్ని మెరుగుపరుచడంలో కూడా పసుపు బాగా ఉపయోగపడుతుంది.
- ప్రతిరోజూ 100 నుంచి 200మి.గ్రా. పసుపు తినేవారికి క్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయని పరిశోధనలు చెబుతున్నాయి.

బిర్యానీకి ఫిదా!

ఐశ్వర్య రాయ్ బచ్చన్ ప్రత్యేకంగా వార్తల్లో ఉండకపోయినా అందరి ఆరాధ్య దేవత ఆమె. బాలీవుడ్‌లో ఈనాటికీ ఆమె టాప్ హీరోయినే! ఈ ప్రపంచ సుందరి మరి ఎలాంటి డైట్ పాటిస్తుందో అనుకుంటున్నారా?

ఒక కప్పు అన్నం దాంట్లోకి కాస్త పప్పు, పక్కన బెండకాయ ఫ్రై ఉంటే చాలునట ఐశ్వర్యరాయ్‌కి. రోజూ పప్పు వండి పెట్టినా కూడా ఓకేనట. కానీ భర్త అభిషేక్ మాత్రం పూర్తి విరుద్ధం అంటున్నదీ అమ్మడు. తనకి నార్త్ ఇండియన్, స్పైసీ ఫుడ్స్ అంటే ఇష్టపడుతాడట. అమ్మ చేసిన చికెన్ కర్రీ అంటే ఐశ్వర్య లొట్టలేసుకుంటూ తింటుంది. తను మంగళూరులో పుట్టి, పెరిగింది కదా! అందుకే అక్కడ దొరికే చేపలతో రుచిగా వండిపెడితే ముద్ద కూడా వదులకుండా తినేస్తుందట. హైదరాబాద్ వచ్చినప్పుడు ఇక్కడ బిర్యానీ టేస్ట్ చేసిందట ఐష్. ఆ రుచికి ఫిదా అయిపోయాను అంటున్నదీ భామ. తను డైట్‌లాంటివి అస్సలు పాటించనంటుంది. మూడు పూటలా మంచిగా భోజనం చేస్తుందట. మధ్యమధ్యలో ఏవైనా తాజా పండ్లు తింటుంది. ఐష్‌లో మంచి చెఫ్ కూడా ఉంది. మొదటిసారి అత్తగారింట్లోకి అడుగు పెట్టిన తర్వాత హల్వా చేసిందట ఐష్. ఆ రుచి ఇప్పటికీ మరచిపోలేను అంటాడట అభిషేక్. కూతురు ఆరాధ్యకి కూడా ఇంటి భోజనమే తినిపిస్తుందట. అందుకే తనే స్వయంగా కొన్ని వంటకాలు చేసి బిడ్డకు ప్రేమతో తినిపిస్తానంటున్నది ఐశ్వర్యరాయ్ బచ్చన్.



సుడోకు

డైలీ సుడోకు 127 సమాధానం

8	3	1	6	5	4	7	9	2
4	9	5	7	1	2	6	3	8
6	2	7	9	3	8	4	5	1
5	4	9	3	8	1	2	7	6
2	7	3	4	9	6	8	1	5
1	6	8	2	7	5	3	4	9
3	5	2	1	6	7	9	8	4
7	8	4	5	2	9	1	6	3
9	1	6	8	4	3	5	2	7

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -128

			1	9			7	8
	4				7	6		
9								
		2			4			7
	7	8				1	6	
3			6			2		
								9
		6	8				1	
8	1			2	5			

ట్వీట్



వాలెంటైన్స్ డేకు అందరూ క్యాండీలు, చాక్లెట్లు, పూలు ఇస్తుంటారు. కానీ ఈసారి మాత్రం ప్యాడ్స్ ఇవ్వడం మరచిపోవద్దు. ఆమెతో ఈ వాలెంటైన్స్ ఆనందంగా జరుపుకొన్నారని అనుకుంటున్నా.



అక్షయ్‌కుమార్
@akshaykumar

అక్షయ్‌కుమార్‌ని ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
24,866,495

కామన్‌మ్యాన్ వాయిస్

నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ఓ పాత తెలుగు సినిమాలో ఓ పాటలో చూస్తే ఎంత సంతోషంగా ఉంటుంది.
కాళేశ్వరం ప్రాజెక్ట్ తెలంగాణకు అంతకన్నా ఎక్కువ ప్రయోజనకరమైంది..
ఏదో ఓ సినిమాలో కాళేశ్వరం నిర్మాణాన్ని రికార్డ్ చేయవచ్చు కదా సాగర్ ప్రాజెక్ట్‌లా!
– Murali Buddha

దేవుళ్లుగా కొలిచే వాళ్లను ఓ వ్యక్తిగా చూసి స్ఫూర్తి పొందాలే తప్ప.. ఓ శక్తిలా చూడకు. అలా చూస్తే నీలోని అఖండ విద్యుచ్ఛక్తిని కోల్పోతావ్.
– Siddu Reddy

వైరల్ వీడియో



రంగస్థలం సినిమాలోని మొదట పాట విడుదలైంది. చంద్రబోస్ రాసిన 'ఎంత సక్కంగున్నవే..' అన్న ఈ పాట ఇప్పుడు యూట్యూబ్‌లో వ్యూస్‌ల పంట పండిస్తున్నది. మీరూ ఓసారి ఈ పాటను వినండి.


Yentha Sakkagunnaave Lyrical – Rangasthalam Songs | Ram Charan, Samantha, Devi Sri Prasad
Total views : 2,928,284+
Published on Feb 13, 2018

నమస్తే తెలంగాణ
రైతుబడి
[హైదరాబాద్]
గురువారం 15 ఫిబ్రవరి 2018

ఫుడ్ ప్రాసెసింగ్‌కు ప్రోత్సాహం

రైతుల ఆదాయాలు పెంచే, పంట అనంతర నష్టాలను తగ్గించే మరో కొత్తమార్గాన్ని రాష్ట్రం అన్వేషించింది. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి కనీసం ఒకటి చొప్పున ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్‌ను నెలకొల్పడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే వీటి అమలుతోపాటు ఆహారకల్తీలను నివారించడానికి, రైతులకు కనీస మద్దతు ధరలు కచ్చితంగా అందేలా చూడటానికి నలుగురు మంత్రులతో కూడిన క్యాబినెట్ సబ్ కమిటీని ముఖ్యమంత్రి ప్రకటించారు.

ఉద్యాన రంగంలో దేశంలో ఏ రాష్ట్రానికి లేని అనేక అవకాశాలు తెలంగాణవి. దాదాపు 50 శాతం ఎర్రనేలలు, ఎక్కువ తేమ లేని పొడి వాతావరణం, రవాణా వ్యవస్థ అందుబాటులో ఉన్నది. అందుకే రైతులు విరివిగా ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. ఉద్యాన రంగంతో పాటు వ్యవసాయ పంటల ఉత్పత్తులకు విలువల జోడింపుతో గిట్టుబాటు ధరలు సాధ్యమౌతాయి. వడ్ల నుంచి బియ్యం తీసేటప్పుడు వచ్చే పొట్టు నుంచి చార్ కోల్, తవుడు నుంచి శ్రేష్ఠమైన నూనె తీయవచ్చు. ప్రాసెసింగ్ యూనిట్లలో వీటిని నెలకొల్పుతాం. కందులు రాష్ట్రంలో అధికంగా ఉత్పత్తి అవుతున్నాయి. రైతులకు 'మిని దాల్ మిల్స్' ఇస్తాం. వారే పప్పుగా మార్చి నేరుగా విక్రయించుకోవచ్చు. నిజామాబాద్‌లో రైతులు సోయాబీన్ భారీగా ఉత్పత్తి చేస్తున్నారు. ప్రపంచంలో అత్యంత బలవర్ధకమైన ఆహారపదార్థాలు సోయా నుంచి తయారు చేస్తున్నారు. సోయా మీల్, సోయా మిల్క్, సోయా ప్రోటీన్లను రైతులే ప్రాసెసింగ్ ప్లాంట్ల ఏర్పాటుతో సొంతంగా ఉత్పత్తి చేసి, మార్కెటింగ్ చేసుకోవచ్చు. రాష్ట్రంలో ప్రత్యేకించి వరంగల్, గద్వాల జిల్లాల్లో రైతులు 'అధిక ఒలియోరెసిన్' కల్గిన మిరప రకాలను సాగుచేస్తున్నారు. విదేశాల్లో 'ఫుడ్ కలర్ అడిటివ్'గా దీనికి భారీ గిరాకీ ఉన్నది. మిరప నుంచి నేరుగా ఒలియోరెసిన్‌ను తీయవచ్చు. ఈ రకపు ప్రాసెసింగ్


సి.పార్థసారథి, ఐఏఎస్
వ్యవసాయ, సహకారశాఖ
ప్రధాన కార్యదర్శి

యూనిట్లను ఆయా ప్రాంతాల అనుకూలతను బట్టి ఇస్తాం. వీటితో రైతులకు పంట ఉత్పత్తుల గిట్టుబాటు సమస్య తీరుతుంది.

అయితే ఉద్యాన పంటల సాగును మరింత ప్రోత్సహించేందుకు పంట కాలనీలు అమలు చేయబోతున్నాం. బిందు, తుంపర సేద్యాల అమలులో ఇప్పటికే పలు కూరగాయల పంటల ఉత్పాదకత పెరిగింది. అయితే టమాటా, ఉల్లి విషయంలో దేశీయంగా ఉత్పత్తి వినియోగంలో భారీ హెచ్చుతగ్గులు ఉన్నాయి. ముఖ్యంగా వానాకాలం, యాసంగి కాలాల్లో దిగుబడులు ఎక్కువగా ఉంటున్నాయి. విస్తీర్ణం పెరుగుతుంది. మార్కెట్‌కు వచ్చే సరుకు ఎక్కువే. దాంతో ధరలు పడిపోతున్నాయి. వేసవిలో అధిక ఉష్ణోగ్రతను అంతగా తట్టుకునే రకాలు లేకపోవడంతో దిగుబడులు తగ్గి, ధరలు పెరుగుతున్నాయి. దీనికితోడు పంట చేలో కోత తర్వాత మార్కెట్లు, వినియోగదారులకు చేరేలోపు పంటను బట్టి 30 శాతం వరకు నష్టం జరుగుతుంది. దీంతో ఉత్పత్తులకు సరైన ధర రావడం లేదు. అందుకే రాష్ట్ర ప్రభు త్వం, ముఖ్యమంత్రి గారు ప్రతి నియోజకవర్గంలో ఆహార శుద్ధి యూనిట్‌ను నెలకొల్పాలని విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఉద్యాన రైతులకు గిట్టుబాటు ధరలు అందనున్నాయి. ఆహారశుద్ధితో విలువల జోడింపు సాధ్యమే. రాష్ట్రంలో పండే మామిడి, పసుపు, బత్తాయ, నిమ్మ పండ్లలో మేలైన నాణ్యత ఉన్నది. పరిశ్రమల ఏర్పాటుతో రైతులు భాగస్వాములుగా రైతుల ఉత్పత్తి సంస్థలుగా ఏర్పడి అవసరమైన సబ్సిడీని పొందవచ్చు. వారే పరిశ్రమలు నెలకొల్పుకోవచ్చు.

కేంద్ర బడ్జెట్‌లో సైతం ఎఫ్‌పీఓల సంవత్సర లావాదేవీలు 100 కోట్ల టర్నోవర్ వరకు పన్ను ఉండదని కేంద్రమంత్రి ప్రకటించారు. అలాగే ఆహారశుద్ధి రంగానికి రూ.1400 కోట్లు కేటాయించారు. ఇందులో రాష్ట్ర వాటా కూడా వస్తుంది. రాష్ట్రం ప్రాసెసింగ్‌కు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయలు కల్పించనుంది. నిపుణుల నేతృత్వంలో గ్రామీణ యువతకు ప్రాసెసింగ్ రంగంలో శిక్షణ ఇప్పిస్తుంది. దీంతో రైతులకు గిట్టుబాటు ధర, రాష్ట్రంలో ఉద్యానరంగానికి ప్రోత్సాహం, గ్రామీణ యువతకు ఉపాధి, రాష్ట్రానికి ఆదాయం సమకూరుతుంది.

వాతావరణ మార్పుల ప్రభావం అంతగా ఉద్యానపంటలపై ఉండదు. సంవత్సరమంతా పని దినాలు ఉంటాయి. అంతర పంటలతో తోటల్లో అదనపు ఆదాయం సాధ్యమవుతుంది. ఉద్యాన పంటలు అధిక విలువ కలిగినవి. మామిడి లాంటి పంటలు రాష్ట్రంలో ముందస్తుగా కాపునకు వస్తాయి. ప్రాసెసింగ్ ఉత్పత్తులు విక్రయించుకునే స్వేచ్ఛ విశ్వవిద్యాలయాలు, శాఖలకు ఉన్నది. రాష్ట్ర అవసరాలకే మన ఉత్పత్తులకు భారీగా డిమాండ్ ఉంటుంది. సేంద్రియ సాగుతో పండిస్తే మరి న్ని అవకాశాలు ఉంటాయి. క్లస్టర్ అప్రోచ్‌తో ఉద్యాన పంటలతో విస్తీర్ణం, దిగుబడులపై కచ్చిత అంచనాలు ఉంటాయి. ఎంత ఉత్పత్తి అవసరమో తెలుస్తుంది. ధరలను ముందుగానే అంచనా వేసే అవకాశమూ ఉంటుంది.



లాభసాటి పూలసాగు

పరిస్థితులకు అనుగుణంగా సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న రైతు జవ్వాజి దుబ్బయ్య

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తనకున్న వ్యవసాయ భూమిని ఏదోఒక రకంగా సాగు చేయాలనే తపనతో తనకున్న అనుభవాల ద్వారా నీటి ఎద్దడికి అనుగుణంగా పంటలు సాగుచేసేందుకు ఓ నిర్ణయానికి వచ్చాడో మల్యాల మండల కేంద్రానికి చెందిన జవ్వాజి దుబ్బయ్య అనే రైతు. అందరిలా కాకుండా విభిన్నంగా ఆలోచించాడు. సీజన్‌కు అనుకూలంగా పూలసాగు చేస్తూ విక్రయించి ఆర్థికంగా ప్రయోజనం పొందుతున్నాడు. అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

మల్యాల మండల కేంద్రానికి చెందిన జవ్వాజి దుబ్బయ్య తనకున్న రెండెకరాల భూమిలో పది గుంటల్లో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని బంతి, చామంతి, అసిరబ్బ, పట్నపు కుచ్చు, గుండుబంతి, గునుగు, తదితర పూల మొక్కలను సాగు చేస్తున్నాడు. నిత్యం దాదాపు 30 కిలోల వరకు పూలను అమ్ముతున్నాడు. పండుగల సందర్భంగా కిలోకు రూ.110ల నుంచి రూ.120లకు అమ్ముతూ మంచి లాభాలు పొందుతున్నాడు.

బతుకమ్మ పండుగ సమయంలో పలువురు వ్యాపారులు తమతో పూల గిరాకీ నిమిత్తం సంప్రదించారు. వారికి హోల్‌సేల్‌గా అమ్మాడు. అంతేగాకుండా పండుగ సందర్భాల్లో తానే కుటుంబ సభ్యులతో విక్రయాలు జరిపి సుమారు రూ.40వేల వరకు సంపాదించాడు. గతంలో వ్యవసాయ భూమిలో పొలం సాగు చేశాడు. అయితే ఆశించిన పంట పండలేదన్నాడు. అనంతరం కూరగాయల సాగు చేయగా కోతుల నుంచి రక్షించుకోలేక నష్టం వాటిల్లిందన్నాడు. గతేడాది ప్రయోగాత్మకంగా బంతి విత్తనాలు తీసుకువచ్చి సాగు చేశాను. మంచి ఫలితం వచ్చింది. నాలుగు రోజుల్లో రూ. 5వేల సంపాదించానన్నాడు. గతేడాది అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని ఈఏడాది ప్రత్యేకంగా పది గుంటల భూమిలో వరుసల పద్ధతిలో మూడు వరుసల్లో బంతి, ఒక వరుస పట్నపు కుచ్చు, మూడు వరుసలు ఎర్రబంతి, ముద్దబంతి, చామంతి, రెండు వరుసల అసిరబ్బలకు సంబంధించిన మొక్కలను నాటాడు. ప్రస్తుతం పంట పూర్తికాగా మరో పది గుంటల భూమిలో చామంతి తోటను సాగు చేశాడు. అవి పంట కోతకు వచ్చే దశలో ఉన్నాయన్నాడు. పూలను విక్రయించడం ద్వారా ఆర్థికంగా తన కుటుంబానికి ప్రయోజనం చేకూరుతున్నదని రైతు తెలిపాడు.

వర్షాభావ పరిస్థితులతో ఉన్న నీటిని వినియోగించుకునేందుకు గానూ పూల సాగు చేపట్టానని తెలిపాడు. పూలను రెండు రోజులకు ఒకసారి తెంపుతూ చామంతి పూలను ఇంటివద్దే అల్లుతూ మూరకు రూ.10ల చొప్పున విక్రయిస్తున్నానన్నాడు. రోజుకు సుమారు రూ.500లు సంపాదిస్తున్నట్టు వివరించాడు. నెలకు దాదా పు రూ. 15వేల వరకు సంపాదిస్తూ ఆర్థికంగా లబ్ధి పొందుతున్నాడు. మల్యాల మండల కేంద్రంలో పువ్వులు కావాలంటే జవ్వాజి దుబ్బయ్య వద్ద దొరుకుతాయని భావన ప్రజల్లో నెలకొన్నది.

- రిక్కల తిరుపత్తి రెడ్డి, మల్యాల
9866995654



ఫలితం ఉన్నది

గతేడాది ప్రయోగాత్మకంగా ఒక గుంటలో బంతి పూల మొక్కలు నాటాను. కానీ ఈ ఏడాది పది గుంటల్లో నాటాను. ఇది ఆదాయాన్ని సమకూర్చి పెడుతున్నది. ఇప్పుడిప్పుడే పూలతోటల్లో వచ్చే చీడ పీడలపై కొద్దికొద్దిగా అవగాహన వస్తున్నది. విత్తనాలకు సంబంధించి వరంగల్‌లో చదువుతున్న నా మనుమడు మేలైన విత్తనాలను కొనుగోలు చేసి పంపిస్తాడు. ఆ విత్తనాలను నాటుతూ పూల సాగు చేస్తున్నాను. వచ్చే ఏడాది సాగు విస్తీర్ణం పెంచాలనే ఆలోచనలో ఉన్నాను.

- జవ్వాజి దుబ్బయ్య, రైతు, మల్యాల

సేంద్రియ ఎరువులతో బొప్పాయి సాగు



ఔషధ గుణాలు ఉన్న బొప్పాయి సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు. బొప్పాయిలో వ్యాధి నిరోధకశక్తిని పెంచే గుణాలు ఉంటాయని వైద్య నిపుణులు సూచిస్తుంటారు. దీంతో ఈమధ్య కాలంలో బొప్పాయి వినియోగం చాలా పెరిగిపోయింది. దీనివల్ల ధరలు పెరిగాయి. అందుకే చాలామంది రైతులు బొప్పాయి సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు.

వ్యవసాయంలో అనేక మార్పులు వచ్చాయి. ఉత్పత్తి పరంగా లక్ష్యాలు సాధించాం. అయితే రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగం పెరిగింది. ఫలితంగా భూములు నిర్జీవమవుతున్నాయి. తమ సహజ స్వభావం కోల్పోతున్నాయి. దీంతో పర్యావరణానికి నష్టం వాటిల్లుతున్నది. వీటన్నింటికి తోడు వ్యవసాయం గిట్టుబాటు కాక నానాటికి సంక్షోభంలోకి కూరుకుపోతుండటం కండ్ల ముందు కన్పిస్తున్నది. దీనికి భిన్నంగా సేంద్రియ ఎరువులతో రాష్ట్రంలో బొప్పాయి సాగు సుమారు 15 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. బొప్పాయి ఎకరాకు 50 టన్నుల చొప్పున సగటు దిగుబడి వస్తుంది. రాష్ట్రంలో అత్యధికంగా మెదక్ జిల్లాలో సాగవుతున్నది. జగిత్యాల జిల్లాలోని మేడిపల్లి, మల్యాల, జగిత్యాల, కథలాపూర్, కోరుట్ల, కొడిమ్యాల, గొల్లపల్లి మండలాల్లో 200 ఎకరాల్లో బొప్పాయిని రైతులు సాగు చేస్తున్నారు. బొప్పాయిలో అధిక దిగుబడులు సాధించాలంటే సేంద్రియ ఎరువులతో సాగు చేయాలని జగిత్యాల జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్‌సింగ్ సూచిస్తున్నారు. మరిన్ని వివరాల కోసం ఉద్యాన అధికారి ప్రతాప్‌సింగ్‌ను (8374449367)ను సంప్రదించవచ్చు.


సేంద్రియ ఎరువులతో సాగు చేస్తున్న పంటను చూపిస్తున్న ప్రతాప్‌సింగ్

మొక్కలు నాటే విధానం:

బొప్పాయి సాగుకు నీరు నిలువని సారవంతమైన ఎర్రగరప నేలలు, మధ్యరకం నల్ల నేలలు అనుకూలం. ఇది ఉష్ణ మండలపు పంట. వేసవిలో 32 -38 డిగ్రీల సెల్సియస్ ఉండే ప్రదేశాల్లో బాగా పెరుగుతుంది. రాత్రి ఉష్ణోగ్రత 12-14 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ ఉంటే తట్టుకోలేదు. బొప్పాయిలో తైవాన్, వాషింగ్టన్‌సోలో, కో-1, కో-2, కో-3 రకాలు మేలైనవి. విత్తనాలు విత్తే ముందు బీజామృతంతో విత్తనశుద్ధి చేసిన తర్వాత ట్రైకోడెర్మావిరిడితో విత్తనశుద్ధి చేయాలి. బొప్పాయిని ఫిబ్రవరి-మార్చి, జూన్-జూలై మాసాల్లో లేదా అక్టోబరు-నవంబరు మాసాల్లో నాటుకోవాలి. 40 -60 రోజుల వయసున్న 15 సెం.మీ పొడవున్న మొక్కలను గుంతల్లో సాయంత్రం నాటుకోవాలి. సాళ్ళ మధ్య 8 అడుగుల దూరం, మొక్కల మధ్య 6 అడుగుల దూరంలో మొక్కలు నాటాలి. దుక్కి చేసిన పొలంలో 2 అడుగుల వెడల్పుతో గుంతలు తవ్వాలి. మొక్కలు నాటడానికి ముందు ప్రతి గుంతకు 5 కిలోల ట్రైకోడెర్మావిరిడి కలిపి మాగబెట్టిన 20 కిలోల పశువుల ఎరువు, 1 కిలో వేప పిండి, 20 గ్రా, అజోస్పైరిల్లం, 20 గ్రాముల ఫాస్ఫోబాక్టీరియా వేసి బాగా కలిపి గుంతను నింపుకోవాలి.

పోషకాల యాజమాన్యం:

ప్రతి మొక్కకు 2 కిలోల నాడెప్ కంపోస్టు, 1 కిలో వేప పిండి, అరకిలో ఘనజీవామృతం వేస్తూ మొక్కలు నాటాలి. ఆ తర్వాత ప్రతి 20 రోజుల కొకసారి ద్రవ జీవామృతం వేయాలి. ప్రతి 10 రోజులకొకసారి మూడు శాతం పంచగవ్వ ద్రావణం పిచికారీ చేయాలి. 200 లీటర్ల జీవామృతంలో 2 లీటర్ల పంచగవ్వ కలిపి డ్రిప్ ద్వారా లేదా సాగు నీటి కాలువల ద్వారా అందించాలి. మొక్క మొదళ్ళ దగ్గర నీరు తగులకుండా నీరు నిల్వ ఉండకుండా పిల్ల పాదులు తయారు చేసి నీటిని పారించాలి. డ్రిప్ పద్ధతిలో నీరు పెడితే అధిక దిగుబడులు పొందవచ్చు. డ్రిప్ ద్వారా చిన్న మొక్కలకైతే 2 రోజులకొకసారి 8 లీటర్ల నీటిని, పెద్ద మొక్కలకు ఎండాకాలంలోవిలో ప్రతి రోజు 20-25 లీటర్ల నీటిని అందించడానికి డ్రిప్పర్లను అమర్చుకోవచ్చు. వర్షాకాలంలో అవసరాన్ని బట్టి నీరందించాలి.

చీడపీడల నివారణ

పండు ఈగ: తోటలను శుభ్రంగా ఉంచాలి. చెట్ల కింద పడిపోయిన, చెట్ల పైన మిగిలిపోయిన పండ్లను నాశనం చేయాలి. మిథైల్ యూజినాల్ ఎరను ఉపయోగించి ఆకర్షించబడిన మగ పురుగులను నాశనం చేయాలి. మొక్కల మొదళ్ళలో వేపపిండిని 5 కిలోల చొప్పున వేయాలి. మొగ్గ సమయంలో 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు ఐదు శాతం వేపగింజల కషాయం లేదా నీమాస్త్రం పిచికారీ చేయాలి.

రసం పీల్చు, కొరికే పురుగులు:

అన్నిరకాల రసం పీల్చు పురుగులు, కొరికి తినే పురుగులను నివారించాలంటే ఐదు శాతం దశపర్ణి కషాయాన్ని 15 రోజులకొకసారి పిచికారీ చేయాలి. మొక్కలు నాటిన 3 నెలల తర్వాత నుంచి ఒక వారం దశపర్ణి కషాయం ఐదు శాతం మరో వారం వేపనూనెను 100 లీటర్ల నీటికి 250 మిల్లీలీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయాలి. జిల్లేడు, వేప, వావిలాకు మూడింటిని ఐదు కిలోల చొప్పున దంచి 10 లీటర్ల గో మూత్రంలో మురగబెట్టి 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

తెగుళ్ళ నివారణ:

ఒక కిలో ట్రైకోడెర్మావిరిడితో 90 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేప పిండి, 1కిలో బెల్లం అన్నింటినీ కలిపి 10 రోజులు మాగబెట్టి పాదుల్లో వేయాలి. పేడ పేస్టు బాగా పని చేస్తుంది. దీని తయారీకి ఐదు కిలోల ఆవుపేటను ఐదు లీటర్ల ఆవు మూత్రం, 100 గ్రాముల సున్నంతో కలిపి పేస్టు తయారు చేసి, బొప్పాయి చెట్టు కాండానికి రెండు నెలలకోసారి పూయాలి. మొక్కనాటే ముందు పాదులో పశువుల ఎరువుకు ట్రైకోడెర్మావిరిడి, జీవన ఎరువులు కలిపి సత్తువ కల్గించి వేయాలి. తోట నాటిన తర్వాత తొలి రోజుల్లో 15 రోజులకు ఒకసారి తులసి-కలబంద ద్రావణం పిచికారీ చేస్తే శిలీంధ్ర సంబంధిత సమస్యలను పూర్తి స్థాయిలో నియంత్రించవచ్చు. వారు పెంచుకునే దశలో మైకోరైజాపొడిని గింజవేసేముందు చిటికెడు వేస్తే అది మొక్క వేర్లకు రక్షణ కవచంగా మారి శిలీంధ్ర సంబంధిత సమస్యలను అరికడుతుంది. ఈ జాగ్రత్తలు ఏవీ తీసుకోకుండా నాటుకున్న రైతులు మొక్కకు 15 రోజుల కొకసారి ట్రైకోడెర్మావిరిడి, సూడోమోనాస్ ద్రావణం డ్రిప్ ద్వారా అందించి సమస్యను నివారించుకోవచ్చు.

వేరుకుళ్ళు, బూడిద తెగులు నివారణ:

వేరుకుళ్ళు తెగులు నివారణకు 200 లీటర్ల జీవామృతంలో 2 కిలోల ట్రైకోడెర్మావిరిడి కలిపి మూడు రోజులు మురగబెట్టి డ్రిప్ ద్వారా రెండుసార్లు పిచికారీ చేయాలి. బూడిద తెగులు సోకినప్పుడు ప్రతి 15 రోజులకొకసారి 6 లీటర్ల పులిసిన మజ్జిగ, 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ప్రతి 25 రోజులకొకసారి శొంఠిపాల కషాయం పిచికారీ చేయాలి. దీని తయారీకి ఒక కిలో పసుపు దుంపల పొడిని 8 లీటర్ల ఆవు మూత్రానికి కలిపి పలుచని గుడ్డతో వడపోయాలి. దీనిని 100 లీటర్ల నీటిలో కలిపి, 100 గ్రాముల సబ్బు పొడి కలిపి ఒక ఎకరం పంటపై పిచికారీ చేయాలి.

వైరస్ తెగులు నివారణ:

బొప్పాయిలో వైరస్ తెగులు సోకినప్పుడు మొక్కలను పొలం నుంచి ఎప్పటికప్పుడు పీకి నాశనం చేయాలి. 6 లీటర్ల పచ్చిపాలు 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పొగాకు కషాయం లేక వేప కషాయం పిచికారీ చేయాలి. బొప్పాయితో మునగ మిశ్రమ సాగు చేపట్టాలి. జీవామృతం మొక్కల పాదుల కందిస్తూ పంటపై శొంఠి పాల కషాయం, పంచగవ్వ, తులసి-కలబంధ ద్రావణం పిచికారీ చేయాలి. పాదుల్లో వేరుశనగ, పెసర, మినుము సజీవ అచ్ఛాదనగా వేయాలి. బొప్పాయి తోట చుట్టూ రుద్రాక్ష తులసి మొక్కలను రక్షణ పంటగా నాటాలి. 200 లీటర్ల నీటికి 20 గ్రాముల పిజిపిఆర్ బ్యాక్టీరియాను కలిపి నెలకొకసారి పిచికారీ చేయాలి. వైరస్ సోకితే 15 రోజులకోసారి పిచికారీ చేయాలి. ఆవు పాలు పిచికారీ చేస్తే మంచి ఫలితాలు వస్తాయని ఉద్యానవన శాఖ సూచిస్తుంది.

-బానుక శ్రీనివాస్, జగిత్యాల టౌన్,
9490530001

వేరుశనగ, మక్కలో ఎరువుల యాజమాన్యం

ప్రస్తుతం వేరుశనగ పంట కాయ అభివృద్ధి దశలో కోత దశలో ఉన్నది. ఈ మధ్య కాలంలో వ్యవసాయ నిపుణులు క్షేత్ర పర్యటనలో వేరుశనగ పంటను కాండం కుళ్లు వేరుకుళ్లు ఆశించటం గమనించారు. కాబట్టి రైతాంగం అప్రమత్తమై తెగుళ్లను సకాలంలో నివారించుకుంటే నష్టం నుంచి బయటపడేందుకు అవకాశం ఉంటుందని ఖమ్మం డాట్ సెంటర్ శాస్త్రవేత డాక్టర్ ఆర్ శ్రీనివాసరావు సూచించారు. వేరుశనగ, మక్కసాగులో ఎరువుల యామాన్యానికి సంబంధించి మరిన్ని వివరాలకోసం డాక్టర్ ఆర్ శ్రీనివాసరావును 99896 23813 సంప్రదించవచ్చు.

కాండం కుళ్లు తెగులు: ఈ తెగులను బూజు తెగులు లేదా బుడిమ తెగులు అని అంటారు. ఈ తెగులును కలుగజేసే శిలీంధ్రం భూమి ద్వారా, విత్తనం ద్వారా వ్యాపిస్తుంది. ఈ తెగులు పంట వేసిన తర్వాత సుమారు 70వ రోజు నుంచి పంట చివరి వరకు వస్తుంది. తెగులు ఆశించటం వల్ల, ప్రారంభదశలో మొక్క మొదలులో ఉన్న శాఖలు పసుపు వర్ణానికి మారి ఎండిపోతాయి. తర్వాత భూమిపై ఉన్న కాండం మీద తెల్లటి బూజు, తెరలుగా ఏర్ప డుతుంది. ఈ తెల్లటి బూజులో ఆవగింజ పరిమాణంలో ఉన్న శిలీంధ్ర, సిద్ధ బీజాలు ఏర్పడుతాయి. ఈ తెగులు ఆశించిన మొక్కను పీకినప్పుడు నేలపై ఉన్న భాగాలు మాత్రమే ఊడి వస్తాయి. వేర్లు కాయలు నేలలోనే ఉండిపోతాయి.

నివారణ:

- వేసవిలో లోతుదుక్కులు చేసుకోవాలి.
- ఆకుమచ్చ తెగుళ్లను అదుపులో ఉంచితే కాండం కుళ్లు ఉధృతి తగ్గుతుంది.
- జొన్న, సజ్జ వంటి పంటలతో పంట మార్పిడి చేయాలి
- సేంద్రియ ఎరువులను పొలంలో వేసి కలియ దున్ని 90 కిలోల పశువుల ఎరువుతో 10 కిలోల వేప పిండి, 2 కిలోల ట్రైకోడెర్మావిరిడిని 15 రోజుల పాటు కల్చర్‌ను పెంచి విత్తేముందు ఒక ఎకరా భూమిలో చల్లుకోవాలి.
- పూత సమయంలో 200 కిలలో జిప్సంను ఒక ఎకరాకు వేసుకోవటం వల్ల ఈ తెగులు ఉధృతిని అరికట్టవచ్చు.
- తెగులు సోకిన మొక్కల చుట్టూ 2 మి.లీ. హెక్సాకొనజోల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.



ఎరువుల యాజమాన్య పద్ధతులు (ఎరువులు కిలలో)


పంటరకాలు	నత్రజని	భాస్వరం	పొటాష్
సంకర రకాలు	200-240	80	80
తీపి మక్కజొన్న	180	60	50
పేలాల మక్కజొన్న	100	60	60
బేబీ కార్న్	150-180	60	60

వేరుకుళ్లు: ఈ తెగులు సుమారు 30 రోజుల తర్వాత వర్షాభావ, నీటి ఎద్దడి పరిస్థితుల వల్ల ఎక్కువగా ఆశిస్తుంది. మొదట కాండం మీద గోధుమ వర్ణం మచ్చలు ఏర్పడుతాయి. కొన్నిరోజుల తర్వాత నలుపు వర్ణానికి మారి కాండంపై భాగానికి వేరుకు కూడా వ్యాపిస్తాయి. ఈ తెగులు వల్ల తల్లి వేరు కుళ్లిపోయి నలుపు రంగుకు మారి నుజ్జునుజ్జుగా తయారవుతుంది.

నివారణ: ఈ తెగులు నివారణకు తెగులు లేని పొలం నుంచి విత్తనాలను సేకరించి తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలి. కాండం కుళ్లు నివారణకు తెలిపిన ట్రైకోడెర్మావిరిడి ఫార్మలేషన్ 15 రోజల తర్వాత విత్తేముందు పొలంలో వేసుకోవాలి. తెగులు ఆశించిన మొక్కలను పీకి కాల్చి వేయాలి. తెగులు సోకిన మొక్కల చుట్టూ గత నేలను ఒక లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజమ్ లేదా లీటరు నీటి కి 3 గ్రా. మాంకోజెబ్ మందులతో తడిచేటట్లు పిచికారీ చేయాలి.

కలుపు యాజమాన్య పద్ధతులు

- పంట విత్తిన తరువాత రెండు రోజుల్లోపు అట్రాజిన్ అనే కలుపు మందును పిచికారీ చేయాలి. తేలిక నేలల్లో ఎకరాకు 800 గ్రా, బరువు నేలల్లో 1200 గ్రా 200 లీటర్ల నీటిలో కలిపి తేమ శాతం ఉన్న సమయంలో పిచికారీ చేయాలి.
- 30-35 రోజుల మధ్య అంతరకృషి చేస్తే కలుపు మొక్కలను నివారించవచ్చు.
- వరి మాగాణుల్లో భూమిని దున్నటం ఉండదు. కాబట్టి కలుపు ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నది. నివారణ కోసం ఎకరాకు 1కిలో అట్రాజిన్, 50 శాతం పొడి మందును 200 లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేయాలి. అదే విధంగా వరి దుబ్బలు చిగురు వేయకుండా పారాక్వాట్ 1.0 లీటర్ 200 లీటర్ల నీటిలో కలిపి విత్తేముందు లేదా విత్తిన తరువాత పిచికారీ చేసుకోవచ్చు.



మక్క సాగులో ఎరువులు, కలుపు యాజమాన్యం

రాష్ట్రవ్యాప్తంగా రైతులుతో వానకాలంతో పాటు యాసంగిలో కూడా మక్కజొన్న సాగు చేస్తారు. ఇందులో భాగంగానే ఈ సంవత్సరం యాసంగిలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు లక్షా హెక్టార్లకు పైగా మక్కజొన్న సాగు చేశారు. అయితే ఈ పంటసాగులో అధిక దిగుబడులు సాధించాలంటే రైతులు సరైన సమయంలో కలుపు, ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

- నీటిపారుదల కింద మక్కజొన్న పంటకు నత్రజని ఎరువును విత్తేటప్పుడు 1/4 వంతు, 25 నుంచి 30 రోజుల మధ్య 1/4 వంతు, 45-50 రోజుల మధ్య 1/4వంతు, మిగిలిన 1/4 వంతు 60-65 రోజుల మధ్య వేయాలి.
- భాస్వరం ఎరువును ఒకేసారి దుక్కిలో వేయాలి. పొటాష్ ఎరువును విత్తే సమయంలో సగభాగం, మిగతా సగభాగం పూత దశలో వేయాలి.
- పైపాటుగా ఎరువులు వేసేటప్పుడు భూమిలో తగినంత తేమ శాతం ఉండేటట్లు చూసుకున్న తర్వాతే వేయాలి.
- ఎరువులు వేసిన వెంటనే బోదనాగలితో సాళ్ల మధ్య బోదే తొలి సాళ్ల మధ్య మట్టిని మొక్కల మొదళ్లకు ఎగతోయాలి. తద్వారా పైరుకు ఎరువు వినియోగ శాతం పెరిగి అధిక దిగుబడి సాధించేందుకు వీలుంటుంది.
- మొక్కలలో జింక్ లోపం కనిపిస్తే 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను లీటర్ నీటికి కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

మద్దెల లక్ష్మణ్, ఖమ్మం వ్యవసాయం,
901017 23131


పంట నాణ్యతే ప్రామాణికం

ఖమ్మం వ్యవసాయం: సాగులో అధిక దిగుబడి సాధించడం ఎంత ముఖ్యమో, పండించిన ఉత్పత్తులను నాణ్యతతో ఉంచుకోవడమూ అంతే ముఖ్యం. ప్రతి పంట ఉత్పత్తులకు కొన్ని నిర్దిష్ట ప్రమాణికాలను నిర్ధారించి, కనీస మద్దతు ధర నిర్ణయించబడుతుంది. ఈ నాణ్యతా ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని పలు పంటల ఉత్పత్తులను కనీస మద్దతు ధరకు కొంటారు. వివిధ మార్కెట్లలో పలు పంటల్లో ఉత్పత్తులకు కనీస మద్దతు ధరను పొందేందుకు ఆయా పంటలకు నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు సరిగా ఉండాలి. ఉత్పత్తితో పాటు ఉత్పాదకత పెంచి వరిలో ధాన్యాన్ని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉత్పత్తులను సాధిస్తే ధాన్యానికి మంచి మద్దతు ధర పొందవచ్చు. వరిలో ధాన్యానికి, బియ్యానికి, దేశ, అంతర్జాతీయ వాడుకకు అనుగుణంగా నాణ్యతా ప్రమాణాలను నిర్ణయించి అందుకు అనుగుణంగా మద్దతు ధరకు కొనుగోలు చేస్తారు. వరిలో మంచి నాణ్యతా ప్రమాణాలు రావాలంటే ధాన్యాన్ని బాగా ఆరబెట్టి తేమ 14 శాతం మించకుండా ఉండాలి. ధాన్యమంతా ఒకటే కొలత, ఆకారం, రంగు కలిగి ఉండాలి. ధాన్యం తప్ప తరకలు లేకుండా శుభ్రంగా ఎటువంటి హానికరమైన పదార్థాలు, ఇతర విష పదార్థాలు, బూజు, కొక్కు, రంగు మారిన గింజలు లేకుండా శుభ్రంగా ఉంచాలి.

వరి ధాన్యానికి గరిష్ఠస్థాయి ప్రమాణాలు

వరిలో రసాయన పదార్థాలు-1.0 శాతం, సేంద్రియ పదార్థాలు-1.0 శాతం, దెబ్బతిన్న, రంగుమారిన, మొలకెత్తిన, పుచ్చిన గింజలు-4 శాతం, పూర్తిగా నిండని సన్నగింజలు-3.0 శాతం, తేమ-14 శాతం గరిష్ఠంగా నిర్ణయించారు. ఈ స్థాయిలో గాని, ఇంతకన్నా తక్కువస్థాయిలో పైన చెప్పిన ప్రమాణాల శాతం ఉన్నట్లయితే వరిధాన్యానికి నిర్దేశించిన మద్దతు ధర లభిస్తుంది. అలాగే పొడవైన సన్నబియ్యానికి (6.మి.మీ పొడవు, 2-3 మి.మీ వెడల్పు కొలతలుంటే) ఎగుమతులకు అనువైన మంచిధర రావచ్చు.

రైతులు మంచి విత్తనాన్ని ధృవీకరించిన సంస్థల నుంచి సేకరించటం, పంట 80 శాతం పక్వానికి వచ్చాక కోయటం, తగిన సమయంలో చీడ పీడ



లను నివారించటం, సక్రమంగా నీటి యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణకు నిర్దేశించినస్థాయిలో ఎరువులను సమతుల్యంగా సూక్ష్మధాతు లోపాన్ని సవరించి ధాన్యాన్ని 14 శాతం తేమ వచ్చే వరకు నీడలో ఆరబెట్టడం, పంట చివరిదశల్లో (గింజలు పాలుపోసుకుని గట్టిపడే దశలో) సిఫారసు చేసిన తెగులు/పురుగు మందులను మాత్రమే అవసరం మేరకు వాటం లాంటి మేలైన యాజమాన్య పద్ధతులను పాటించాలి. దీంతో వరి ధాన్యాన్ని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉత్పత్తి చేయవచ్చు. ఇలా నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉత్పత్తులను సాధించాలి. తద్వారా మంచి ధరలను పొందగలరని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
గురువారం 15 ఫిబ్రవరి 2018



బాపినీడు, విద్యుల్లేఖ, రాశీఖన్నా, వరుణ్‌తేజ్, వెంకీ, దిల్‌రాజు, బీవీఎస్ఎన్ ప్రసాద్

చిరంజీవి షాకయ్యారు!

'ప్రేమకథల్లో హీరో, హీరోయిన్ మధ్య కెమిస్ట్రీ బాగా కుదిరితే ఆ సినిమా హిట్టేనని ఆనాటి 'తొలిప్రేమ' నిరూపించినట్లుగానే ఈ 'తొలిప్రేమ' నిరూపించింది' అన్నారు దిల్‌రాజు. వరుణ్‌తేజ్, రాశీఖన్నా జంటగా నటించిన తాజా చిత్రం 'తొలిప్రేమ'. వెంకీ అట్లూరి దర్శకుడు. బీవీఎస్ ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలైంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో చిత్ర బృందం థాంక్స్ మీట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా దిల్‌రాజు మాట్లాడుతూ 'వరుణ్‌తేజ్, రాశీఖన్నా మధ్య కెమిస్ట్రీ బాగా కుదిరింది. దానికి తగ్గట్లే తమన్ అద్భుతమైన సంగీతాన్ని అందించాడు. నాతో సినిమా చేయాలనుకున్న వెంకీ ఒక రోజు సడెన్‌గా వచ్చి వేరే సంస్థలో చేయాలనుకుంటున్నాని చెప్పాడు. అతన్ని వేయిట్ చేయించడం ఇష్టంలేక వెంటనే ఓకే చెప్పేశాను. అలా బాపినీడు దగ్గరికి వెళ్లిన ఈ సినిమా మళ్లీ నా దగ్గరికే వచ్చింది. వెంకీ రాసిన మాటలకు మంచి స్పందన లభిస్తున్నది. కొత్త కుర్రాడు అద్భుతంగా రాశాడని చెబుతున్నారు. అప్పట్లో 'తొలిప్రేమ'తో కరుణాకరన్ కొత్త ఒరవడిని సృష్టిస్తే ఈ సినిమాతో వెంకీ అదే మ్యాజిక్‌ను రిపీట్ చేశాడు. నిన్న ఫిదా, ఇప్పుడు 'తొలిప్రేమ'తో సక్సెస్‌ని అందుకున్న వరుణ్ హ్యాట్రిక్ హిట్‌ని సాధించాలి' అన్నారు. వరుణ్‌తేజ్ మాట్లాడుతూ 'దిల్‌రాజు లేకపోతే ఈ సినిమా లేదు. మా ఇద్దరిని నమ్మి ఈ సినిమాకు సపోర్ట్‌గా నిలిచినందుకు ఆయనకు రుణపడి వుంటాను. చిరంజీవిగారు ఈ సినిమా చూసి 'కొత్త దర్శకుడు చేసినట్టుగా లేదే' అని షాక్ అయ్యారు' అని తెలిపారు. దర్శకుడు వెంకీ మాట్లాడుతూ 'విద్యుల్లేఖా రామన్ పాత్రకు ఈ స్థాయి స్పందన లభిస్తుందని ఊహించలేదు. ఈ సినిమాకు కథానాయికగా రాశీఖన్నాను అనుకున్నప్పుడు ప్రేక్షకులు ఎలా స్పందిస్తారోనని భయపడ్డాను. వరుణ్‌తేజ్ వల్లే ఈ సినిమా ప్రాణం పోసుకుంది. కెమెరామెన్ జార్జ్, తమన్ ఈ చిత్రానికి మూల స్థంభాల్లా నిలిచారు' అని తెలిపారు. ఈ సక్సెస్ క్రెడిట్ అంతా వరుణ్‌దే' అని నిర్మాత అన్నారు. ఈ కార్యక్రమంలో రాశీఖన్నా, తమన్, కెమెరామెన్ జార్జ్, విద్యుల్లేఖా రామన్, బాపినీడు, హైపర్ ఆది, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

శీతాకాలం ప్రేమకహాని

'వర్షాకాలంలో వారిద్దరు కలుసుకున్నారు. శీతాకాలంలో ప్రేమించుకున్నారు. వేసవి కాలంలో విడిపోయారు. కాలమే ఆ జంటను కలిపింది. వారి ప్రేమకథకు విలన్‌గా మారింది. ఆ ప్రేమజంట కథేమిటో తెలియాలంటే వేసవి వరకు ఆగాల్సిందే' అంటున్నారు నితిన్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఛల్ మోహన్‌రంగ'. శ్రేష్ట్ మూవీస్, పవన్‌కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ పతాకాలపై సుధాకర్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కృష్ణ చైతన్య దర్శకుడు. మేఘా ఆకాష్ కథానాయిక. ఈ చిత్ర టీజర్‌ను హీరో పవన్‌కల్యాణ్ తన ట్విట్టర్ ఖాతా ద్వారా బుధవారం విడుదలచేశారు. నిర్మాత చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'కుటుంబ విలువలతో కూడిన వినోదభరిత చిత్రమిది. ఋతువులకు ఓ జంట ప్రేమకథకు ఉన్న సంబంధమేమిటన్నది ఆకట్టుకుంటుంది. చిత్రీకరణ తుదిదశకు చేరుకున్నది. బ్యాలెన్స్‌గా వున్న గీతాన్ని బుధవారం నుంచి హైదరాబాద్‌లో హీరో నితిన్‌పై చిత్రీకరిస్తున్నాం. ఈ పాటకు శేఖర్ మాస్టర్ నృత్యాలను సమకూర్చుతున్నారు. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఏప్రిల్ 5న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని తెలిపారు. త్రివిక్రమ్ అందించిన కథ, నితిన్ నటన, పాత్ర చిత్రణ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని దర్శకుడు చెప్పారు. టీజర్‌కు మంచి స్పందన లభిస్తున్నదని నితిన్ పేర్కొన్నారు. నరేష్, లిజి, రోహిణి, రావురమేష్, సంజయ్ స్వరూప్, ప్రభాస్ శ్రీను ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎస్.ఎస్. తమన్, కెమెరా: నటరాజ సుబ్రమణియన్, సమర్పణ: నిఖితారెడ్డి.



నితిన్

ప్రకృతే సాక్ష్యం



పూజా హెగ్డే, బెల్లంకొండ శ్రీనివాస్

బెల్లంకొండ శ్రీనివాస్, పూజా హెగ్డే జంటగా నటిస్తున్న చిత్రం 'సాక్ష్యం'. అభిషేక్ పిక్చర్స్ పతాకంపై అభిషేక్ నామా నిర్మిస్తున్నారు. శ్రీవాస్ దర్శకత్వం వహిస్తున్నారు. సినిమా చిత్రీకరణ ముగింపు దశకు చేరుకున్నది. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా బుధవారం హీరోహీరోయిన్ల లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. నిర్మాత మాట్లాడుతూ 'పంచభూతాల అండతో తన గమ్యాన్ని చేరుకున్న ఓ యువకుడి కథ ఇది. అతడి లక్ష్యసాధనకు ప్రకృతి ఎలా తోడ్పడిందనేది ఆసక్తికరంగా ఉంటుంది. యాక్షన్ ఎంటర్‌టైన్‌మెంట్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో పీటర్ హెయిన్స్ సమకూర్చిన పోరాట ఘట్టాలు రొమాంచితంగా సాగుతాయి. శ్రీనివాస్, పూజా హెగ్డేల కెమిస్ట్రీ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. దర్శకుడు శ్రీవాస్ వారి పాత్రలను నవ్యపంథాలో తీర్చిదిద్దారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో నాయకానాయికలతో పాటు ముఖ్య తారాగణంపై పతాక ఘట్టాల్ని చిత్రీకరిస్తున్నాం. వేసవిలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని తెలిపారు. జగపతిబాబు, శరత్‌కుమార్, మీనా, వెన్నెలకిషోర్, జయప్రకాష్, పవిత్రా లోకేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్, మాటలు: సాయిమాధవ్ బుర్రా, సినిమాటోగ్రఫీ: ఆర్థర్ ఏ విల్సన్.

సినిమాలకు గుడ్‌బై!



కమల్‌హాసన్

నటనకు గుడ్‌బై చెబుతున్నట్లు సంచలన ప్రకటన చేశారు కమల్‌హాసన్. ప్రస్తుతం విశ్వరూపం-2, ఇండియన్-2 సినిమాల్లో నటిస్తున్నారాయన. ఈ రెండు సినిమాల తర్వాత కొత్త చిత్రాలేవీ చేయనని ఓ ప్రైవేటు న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యలు దక్షిణాది చిత్ర వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. రాజకీయాల్లో అడుగుపెట్టనున్నట్లు, సొంతంగా ఓ పార్టీని స్థాపించబోతున్నట్లు ఇటీవలే కమల్‌హాసన్ వెల్లడించారు. భవిష్యత్తు ప్రణాళికలను దృష్టిలో పెట్టుకొనే కమల్‌హాసన్ సినిమాలకు స్వస్తి పలకబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కమల్‌హాసన్ మాట్లాడుతూ 'నిజాయితీగా జీవిస్తూ నా మనసుకు నచ్చింది ఏదో ఒకటి చేయాలనుకుంటున్నాను. ఓడిపోతానన్న భయం నాకు లేదు. ఏ రాజకీయపార్టీతో నాకు సంబంధం లేదు. బ్యాంకు బ్యాలెన్స్ పెంచుకోవడానికి రాజకీయాల్లోకి రావడం లేదు. సినిమాల ద్వారా చాలా డబ్బు సంపాదించుకున్నాను. చక్కటి పేరుప్రఖ్యాతులు, సంతోషకరమైన జీవితాన్ని గడిపాను. నటుడిగా మాత్రమే చనిపోవాలని అనుకోలేదు. ప్రజాసేవలో మరణిస్తా. నాకు నేనుగా తీసుకున్న నిర్ణయమిది. 37 ఏళ్లుగా సామాజిక సేవ చేస్తున్నాను. ఇన్నేళ్లలో పది లక్షల మంది కార్యకర్తల్ని సంపాదించుకున్నాను. వారంతా నా వెన్నంటి ఉన్నారు. మరింత మందికి సేవ చేయాలనే యువతరాన్ని ప్రోత్సహిస్తున్నాను' అని తెలిపారు.




ఆకాష్ పూరి

'మెహబూబా'

పూరి జగన్నాథ్ టూరింగ్ టాకీస్ పతాకంపై పూరి జగన్నాథ్ స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రం 'మెహబూబా'. ఆకాష్ పూరి, నేహాశెట్టి జంటగా నటిస్తున్నారు. వేసవిలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పూరి జగన్నాథ్ చిత్ర విశేషాల్ని తెలియజేస్తూ '1971 ఇండియా-పాకిస్తాన్ యుద్ధ నేపథ్యంలో సాగే కథఇది. స్వచ్ఛమైన ప్రేమకు ప్రతిరూపంగా ఉంటుంది. విజువల్‌గా చాలా అందంగా సాగుతూ సరికొత్త అనుభూతిని పంచుతుంది. నా గత చిత్రాలకు పూర్తి భిన్నమైన కథ, కథనాలతో వైవిధ్యంగా తెరకెక్కిస్తున్న చిత్రమిది. దర్శకుడిగా నా కెరీర్‌లో మంచి సినిమాగా నిలుస్తుందనే నమ్మకముంది. ఇటీవల విడుదలైన టీజర్‌కు చక్కటి స్పందన లభిస్తున్నది. తెలంగాణ, ఆంధ్రాతో పాటు విదేశాల్లో 800లకు పైగా థియేటర్లలో సినిమాను విడుదలచేయనున్నాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సందీప్ చౌతా, సినిమాటోగ్రఫీ: విష్ణుశర్మ, ఎడిటింగ్: జునైద్ సిద్ధిఖీ, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, నిర్మాత, దర్శకత్వం: పూరి జగన్నాథ్.









17న జలవిహార్‌లో సీఎం కేసీఆర్ బర్త్‌డే వేడుకలు

- భారీ కేక్ కటింగ్‌లు, రక్తదాన శిబిరం, వికలాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ
- ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తలసాని వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో /ఉస్మానియా యూనివర్సిటీ నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలను ఈ నెల 17న నెక్లెస్‌రోడ్‌లోని జలవిహార్‌లో ఘనంగా నిర్వహించనున్నట్టు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. భారీ కేక్ కటింగ్‌తోపాటు మెగా రక్తదానశిబిరం, వికలాంగులకు ట్రై సైకిళ్లు, అంధులకు చేతికర్రలు, వృద్ధ మహిళలకు చీరెల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్టు బుధవారం మంత్రి మీడియాకు వెల్లడించారు. రోజంతా సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లుచేస్తున్నట్టు తలసాని చెప్పారు. వేడుకలకు మంత్రులు, కార్పొరేషన్ చైర్మన్లు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, టీఆర్ఎస్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరవుతారని ఆయన తెలిపారు. నగరంలోని అన్నిడివిజన్లలో సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపాలని కార్పొరేటర్లు, నాయకులకు మంత్రి తలసాని పిలుపునిచ్చారు. గురువారం జలవిహార్‌ను సందర్శించి మంత్రి ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు.

17న ఓయూలో ఘనంగా వేడుకలు: తుంగ బాలు

సీఎం కేసీఆర్ 64వ జన్మదినం సందర్భంగా ఈ నెల 17న ఓయూలో ఘనంగా వేడుకలు నిర్వహించనున్నట్టు టీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు తెలిపారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మెగా రక్తదాన, కంటి వైద్య శిబిరాలను ఏర్పాటుచేయనున్నట్టు ఓయూ గెస్ట్‌హౌస్‌లో బుధవారం ఆయన మీడియాకు చెప్పారు. దీనికి నగర మేయర్ బొంతు రామ్మోహన్, ఎంపీ బాల్క సుమన్, ఎమ్మెల్యే గాదరి కిశోర్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

టీబీ వ్యాధి నిర్ధారణకు సంచార వాహనాలు

రాష్ట్రానికి 19 వాహనాలు మంజూరు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీబీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసేందుకు ప్రత్యేకంగా రూపొందించిన సంచార వాహనాలను కేంద్ర వైద్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ సిద్ధంచేసింది. దేశవ్యాప్తంగా ఇలాంటి 45 వాహనాలను త్వరలో వివిధ రాష్ట్రాలకు సరఫరా చేయనున్నది. ఇందులోభాగంగా తెలంగాణ రాష్ట్రానికి 19 వాహనాలను కేంద్రం మంజూరు చేసింది. సీబీఎన్ఏఏటీ మిషన్లు ఉన్న ఈ సంచార వాహనాల్లో సిబ్బంది గ్రామాలకు వెళ్లి టీబీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయనున్నారు. త్వరలోనే ఈ వాహనాలు మన రాష్ట్రానికి చేరనున్నాయి.

ఒక ఖైదీ.. 12 మంది సిబ్బంది!

నిజామాబాద్ బోస్టన్ స్కూలులో కొన్ని నెలలుగా విచిత్ర పరిస్థితి

యువ ఖైదీ జిల్లా జైలుకు తరలింపు.. అక్కడే ప్రత్యేక ఏర్పాట్లు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అక్కడ ఖైదీ ఒక్కడే.. అతడి కోసం పనిచేసే సిబ్బంది 12 మంది! కొన్ని నెలలుగా నిజామాబాద్ బోస్టన్ స్కూలులో కొనసాగిన పరిస్థితి ఇది. క్షణికావేశంలో తప్పులు చేసి శిక్షపడిన యువఖైదీలు (18 -21 వయస్సు) పరివర్తన చెంది సాధారణ జీవితం గడిపేందుకు వీలుగా బోస్టన్ స్కూళ్లను నెలకొల్పారు. అలాంటి యువఖైదీలకు వృత్తివిద్యాకోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు 1956లో నిజామాబాద్‌లో బోస్టన్ స్కూల్ ఏర్పాటుచేశారు. ఈ స్కూల్లో 90 మంది యువ ఖైదీలు ఉండేందుకు వసతి ఉంది. ఆ సంఖ్యకు అనుగుణంగా వృత్తివిద్యాకోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు 34 మంది ఉద్యోగులతోపాటు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఇదివరలో ఈ స్కూల్‌లో సగానికిపైగా ఖైదీలు ఉండేవారు. క్రమంగా సంఖ్య తగ్గుతూ వచ్చింది. కొన్ని నెలలుగానైతే ఒకే ఒక యువ ఖైదీ! సిబ్బంది మాత్రం 12 మంది విధులు నిర్వహిస్తూ వచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో ఈ తరహా స్కూళ్లు నిజామాబాద్‌తోపాటు విశాఖపట్నం, అనంతపురంలో ఉండేవి. ఏపీలోని రెండు స్కూళ్లను 20 ఏండ్ల కిందటే మూసేశారు. నిజామాబాద్ బోస్టన్ స్కూల్లో కొన్ని నెలలుగా ఒకే ఖైదీ ఉంటుండటంతో అతడిని ఇటీవలే జిల్లా జైలుకు తరలించి, ఇక్కడ ప్రత్యేకంగా బ్యారక్, శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీంతో బోస్టన్ స్కూల్ ఖాళీ అయ్యింది. ఈ భవనాన్ని జైళ్లశాఖ ఆధ్వర్యంలో ఇతరత్రా అవసరాలకు వాడనున్నట్టు అధికారులు తెలిపారు. బోస్టన్ స్కూల్లో.. చైన్ స్నాచింగ్ కేసులో శిక్ష పడిన వరంగల్‌కు చెందిన ఒకే యువకుడు ఉన్నాడని నిజామాబాద్ జిల్లా జైలు సూపరింటెండెంట్ కళాసాగర్ చెప్పారు.

చివరి భూములకూ సాగునీరు

ఎస్సారెస్పీ, నాగార్జునసాగర్, నిజాంసాగర్ కింద యాసంగిలో 13 లక్షల ఎకరాలకు నీరు పారాలి

- ఇతర మీడియం ప్రాజెక్టులు కలుపుకొని మొత్తం 19 లక్షల ఎకరాలకు సాగునీరివ్వాలి
- రిజర్వాయర్లలో భగీరథ కేటాయింపులు కాపాడాలి
- ఎల్ఎండీకి ఎగువన నాలుగు లక్షల ఎకరాలకు, దిగువన 1.15 లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యం
- నీటిపారుదలశాఖ సమీక్షలో మంత్రి హరీశ్‌రావు



బుధవారం జలసౌధలో సాగునీటి ప్రాజెక్టులపై సమీక్షిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో సీఎస్ ఎస్కే జోషి, ఇతర అధికారులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: యాసంగి పంట సీజన్‌లో చివరి భూములకు సైతం నీరందించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు తన శాఖాధికారులకు దిశానిర్దేశం చేశారు. అదే సమయంలో మిషన్ భగీరథ పథకానికి కేటాయించిన నీటిని జలాశయాల్లో కాపాడుకోవాలని స్పష్టంచేశారు. యాసంగిలో శ్రీరాంసాగర్, నాగార్జునసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టుల కింద నీటి నిర్వహణ, సాధించిన ఆయకట్టు, మిషన్ భగీరథ అవసరాలు తదితరాలపై సంబంధిత చీఫ్ ఇంజినీర్లు, సూపరింటెండెంట్ ఇంజినీర్లతో బుధవారం జలసౌధలో మంత్రి హరీశ్‌రావు సమీక్షించారు. ఎస్సారెస్పీ కింద యాసంగిలో ఎల్ఎండీకి ఎగువన నాలుగు లక్షల ఎకరాలకు, ఎల్ఎండీకి దిగువన 1.15 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. ఈ లక్ష్యాలను సాధిస్తూనే మిషన్ భగీరథ పథకానికి కేటాయించిన నీటిని జలాశయాల్లో కాపాడుకోవాలని ఇంజినీర్లకు సూచించారు. నిజాంసాగర్ కింద యాసంగిలో రెండు లక్షల ఎకరాల లక్ష్యాన్ని సాధించాలని అధికారులను ఆదేశించారు. గతంలో యాసంగిలో రెండు లక్షల ఎకరాల లక్ష్యాన్ని సాధించిన సందర్భాలు లేవని మంత్రి అన్నారు. వానకాలం పంట సీజన్‌లో 1.12 లక్షల ఎకరాలకు సాగునీరు అందించి పంటలను కాపాడినట్టు మంత్రి తెలిపారు. యాసంగిలో రాష్ట్రంలో శ్రీరాంసాగర్ కింద ఆరు లక్షల ఎకరాలు, నాగార్జునసాగర్ కింద ఐదు లక్షలు, నిజాంసాగర్ కింద రెండు లక్షలు, మీడియం ప్రాజెక్టులకింద ఆరు లక్షల ఎకరాలకు కలిపి మొత్తం 19 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని తెలిపారు.

ఎస్సారెస్పీ కింద ఇప్పటికే ఏడు తడులకు నీరు

ఎస్సారెస్పీ జలాశయం నుంచి ఇప్పటికే ఏడు తడులకు నీరిచ్చామని, మరో నాలుగు తడులకు నీరివ్వాల్సి ఉందని ఆ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ శంకర్ మంత్రి దృష్టికి తెచ్చారు. ఎల్ఎండీకి ఎగువన కాల్వలపై 3185 పంపులు నడుస్తున్నాయని చెప్పారు. శ్రీరాంసాగర్ ఆయకట్టు పరిధిలోని చెరువులను నింపుతున్నామని శంకర్ తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కాల్వలపై రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించాలని, అక్రమంగా తూములు, కాల్వలు తవ్వకుండా, గేట్లు ఎత్తివేయకుండా చూడాలని ఇంజినీర్లకు మంత్రి సూచించారు. అవసరమైతే పోలీస్, రెవెన్యూ అధికారులసాయం తీసుకోవాలని చెప్పారు.

రెండు జలాశయాల్లో 72 టీఎంసీల నీటి లభ్యత

నాగార్జునసాగర్ కింద యాసంగిలో ఐదు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి హరీశ్ అన్నారు. పాలేరుకు ఎగువన మూడు లక్షల ఎకరాలు, పాలేరు దిగువన రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని కోరారు. ప్రస్తుతం శ్రీశైలంలో 32 టీఎంసీలు, నాగార్జునసాగర్‌లో 30 టీఎంసీలు కలుపుకొని మొత్తం 72 టీఎంసీల నీటి లభ్యత ఉందని ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ సునీల్ తెలిపారు. ఇప్పటివరకు శ్రీశైలం, నాగార్జునసాగర్ కాంప్లెక్స్ నుంచి మొత్తం 126 టీఎంసీలు వినియోగించుకున్నామని, ఆంధ్రప్రదేశ్ 299 టీఎంసీలు వినియోగించుకున్నదని ఈఎన్సీ మురళీధర్ వివరించారు. మిషన్ భగీరథకి అవసరమయ్యే 12 టీఎంసీల నీటిని కాపాడుకోవాలని మంత్రి అధికారులకు సూచించారు. ఏప్రిల్ ఐదుకల్లా నాగార్జునసాగర్ ఎడవ కాల్వ తూము మూసి వేయాలని మంత్రి సూచించారు.

సీతారామ ప్రాజెక్టు పనుల సమీక్ష

- ప్యాకేజీలవారీగా పరిశీలన
- త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలి
- సమీక్షలో మంత్రులు హరీశ్‌రావు, తుమ్మల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కృష్ణాతో గోదావరిని అనుసంధానం చేయనున్న 16ఎల్, 18ఎల్ కాల్వ పనులను వెంటనే పూర్తి చేయాలని మంత్రులు హరీశ్‌రావు, తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశించారు. సీతారామ ప్రాజెక్టు భూసేకరణ, అటవీ, పర్యావరణ అనుమతులు, పంప్‌హౌజ్‌లు, కాల్వలతోపాటు ఇతర పనులను బుధవారం జలసౌధలో మంత్రులు సమీక్షించారు. ఈ ప్రాజెక్టు పరిధిలోని కాల్వల నిర్మాణం, సర్వే పనులను త్వరగా ముగించి టెండర్ల ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు. ఖమ్మం జిల్లాలోని సీతారామ లిఫ్ట్ పథకం మొదటి విడుతలోని మూడు పంపుహౌజ్‌ల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఈ ఏడాది చివరివరకు పంప్‌హౌజ్‌ల నిర్మాణం పూర్తికావాలని ఆదేశించారు. ప్యాకేజీలవారీగా 1,2,3 పనుల ప్రగతిని సుదీర్ఘంగా మంత్రులు సమీక్షించారు. వెంటనే ఒప్పందాలు చేసి అన్నిప్యాకేజీల్లో పనులను మొదలుపెట్టాలని అధికారులకు సూచించారు. ఈ మూడు పంప్‌హౌజ్‌ల పనులను ఎప్పటిలోగా పూర్తిచేయనున్నారో తేదీలవారీగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. సమీక్షలో ఖమ్మం సీఈ సుధాకర్‌తోపాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏఐబీపీ ప్రాజెక్టులపై నేడు ఢిల్లీలో సమావేశం

హాజరుకానున్న మంత్రి హరీశ్‌రావు

యూసీలు సిద్ధంచేయాలని అధికారులకు సూచన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సత్వర సాగునీటి ప్రయోజన పథకం (ఏఐబీపీ) కింద తెలంగాణలో చేపట్టిన ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. గురువారం ఢిల్లీలో కేంద్ర జలవనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధ్యక్షతన జరుగనున్న సమావేశంలో మంత్రి పాల్గొననున్న నేపథ్యంలో బుధవారం జలసౌధలో ఉన్నతాధికారులతో హరీశ్‌రావు ప్రాజెక్టుల సమీక్ష నిర్వహించారు. కేంద్రం మంజూరుచేసిన నిధుల వ్యయానికి సంబంధించి యుటిలైజేషన్ సర్టిఫికెట్లను (యూసీ) వెంటనే జారీచేయాలని సంబంధిత సీఈలను మంత్రి కోరారు. పలు ప్రాజెక్టులను పూర్తిచేయడానికి సంబంధించి డెడ్‌లైన్లు ఖరారు చేశారు. వచ్చేజూన్ వరకు భీమ, నీల్వాయి, కొమురంభీం ప్రాజెక్టులను, గొల్లవాగు ప్రాజెక్టును ఈ మార్చికి, పాలెంవాగును మే వరకు, దేవాదులను 2019 మార్చినాటికి, ఎస్సారెస్పీ వరదకాల్వను 2019 జూన్ నాటికి పూర్తి చేయాలని కోరారు. ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (పీఎంఎస్‌కేవై) కింద దేశవ్యాప్తంగా ప్రాధాన్యంతో పూర్తిచేయాల్సిన ప్రాజెక్టుల జాబితాలో తెలంగాణలోని 11 ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులకు 'క్యాడ్ వామ్' కింద రూ.1000 కోట్లు రాష్ట్రానికి రానున్నాయని తెలిపారు.

18 రాష్ట్రాల మంత్రులతో ఢిల్లీలో సమావేశం

ప్రాధాన్యపరంగా ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, నిధులు తదితర అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోవడానికి కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ 18 రాష్ట్రాల మంత్రులు, అధికారులను ఆహ్వానించింది. తెలంగాణ ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు అవసరమైన నిధులు గ్రాంటు, రుణం రూపేణా పీఎంకేఎస్‌వై ద్వారా లభించనున్నాయి. తెలంగాణ నుంచి ప్రధాన మంత్రి కృషి సించాయి యోజనలో చోటు లభించిన వాటిలో మత్తడివాగు, నీల్వాయి, గొల్లవాగు, ర్యాలివాగు, పాలెంవాగు, రాజీవ్ బీమా ప్రాజెక్టుల పనుల్లో మత్తడివాగు, ర్యాలివాగు పూర్తయ్యాయి. పూర్తయిన ప్రాజెక్టులకు సంబంధించి సర్టిఫికెట్లు మార్చి చివరిలోగా కేంద్రానికి సమర్పించాలని మంత్రి హరీశ్ సూచించారు. ప్రాజెక్టులు నిర్ణీత గడువులోగా పూర్తికావాలంటే ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే కేంద్ర నిధులు విడుదల చేయాలని హరీశ్‌రావు సమావేశంలో కోరనున్నారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, కార్యదర్శి వికాస్‌రాజ్, ఇంజినీరింగ్ అధికారులు మురళీధర్‌రావు, నాగేందర్‌రావు, అనిల్, భగవంతరావు, బంగారయ్య, 'కాడా' కమిషనర్ మల్సూర్ పాల్గొన్నారు.



తెలంగాణభవన్‌లో తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయీస్, వర్కర్స్ అసోసియేషన్ డైరీని ఆవిష్కరిస్తున్న ఎంపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మైనార్టీ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న ముస్లిం ఉద్యోగులు బంగారు తెలంగాణలోనూ భాగస్వాములు కావాలని లోక్‌సభలో టీఆర్ఎస్ పక్ష నేత ఏపీ జితేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం తెలంగాణభవన్‌లో తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయీస్, వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్రశాఖ డైరీని జితేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీకే గజియోద్దీన్, ప్రధాన కార్యదర్శి షేక్ ఫారూక్ హుస్సేన్, అసోసియేట్ అధ్యక్షుడు ఎండీ మోసా రషీద్, టీఆర్ఎస్ కార్యదర్శి ఇంతియాజ్, వివిధ జిల్లాల బాధ్యులు పాల్గొన్నారు.



సిరిసిల్ల శివారులో నిర్మించనున్న ఐడీటీఆర్ సంస్థ భవనం నమూనా

సిరిసిల్ల ఐడీటీఆర్ పనుల్లో వేగం

- రోడ్డు ప్రమాదాల నివారణకు అడుగులు
- బడ్జెట్‌లో కేటాయింపుల నేపథ్యంలో.. నిధులు రాబట్టేందుకు కేంద్రంపై ఒత్తిడి!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రోడ్డు ప్రమాదాల నివారణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిరిసిల్ల జిల్లాకేంద్రం శివారులో ఉన్న సారంపెల్లిలో చేపడుతున్న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్, ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ (ఐడీటీఆర్) సంస్థ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ప్రమాణాల ప్రకారం డ్రైవింగ్ లేకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించిన ప్రభుత్వాలు.. మెరుగైన శిక్షణతో వీటిని నివారించేందుకు ఏర్పాట్లుచేస్తున్నాయి. సిరిసిల్లలో ఐడీటీఆర్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం 20 ఎకరాల భూమిని ఉచితంగా అందించగా, కేంద్ర ప్రభుత్వం రూ.16 కోట్లు మంజూరు చేసింది. ఇందులో ఇప్పటివరకు రూ.1.49 కోట్లు విడుదలచేసింది. దశలవారీగా మిగతా నిధులు విడుదల చేయనుంది. దేశవ్యాప్తంగా ఐడీటీఆర్‌కు ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో రూ.100 కోట్లను కేటాయించారు. ఈ నిధుల నుంచి సిరిసిల్ల ఐడీటీఆర్‌కు నిధులు రాబట్టేందుకు కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెచ్చేందుకు సిద్ధమవుతుంది. సిరిసిల్లలో నిర్మిస్తున్న ఆధునిక డ్రైవింగ్ శిక్షణ, పరిశోధన సంస్థ పనులు వేగంగా సాగుతున్నాయి. 1.5 కిలోమీటర్ల మేర కాంపౌండ్ వాల్ పనులు పూర్తయ్యాయి. ట్రైనింగ్ బ్లాక్, డైనింగ్ బ్లాక్‌ల పనులు కొనసాగుతున్నాయి. శిక్షణ సంస్థ నిర్మాణాన్ని ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తిచేయాలన్న ఐటీ, పురపాలకశాఖల మంత్రి కేటీఆర్ ఆదేశాలకు అనుగుణంగానే అధికారులు పనుల్లో వేగంగా పెంచారు.

చంచల్‌గూడ జైలును సందర్శించిన కేరళ అధికారులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లోని చంచల్‌గూడ కేంద్ర కారాగారాన్ని బుధవారం కేరళ జైళ్లశాఖ జాయింట్ సూపరింటెండెంట్ రాజీవ్ ఆధ్వర్యంలోని 42 మంది అధికారుల బృందం సందర్శించింది. జైలులో అమలుచేస్తున్న ఖైదీల సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను జైలు సూపరింటెండెంట్ కే అర్జున్‌రావు వారికి వివరించారు. కార్యక్రమంలో జైళ్లశాఖ అధికారులు సాయిబాబా, వీ శ్రీనివాస్‌రావు, ఏ వెంకటేశంతదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఇంధన పొదుపు అవార్డులు

- యాదిరెడ్డికి రాష్ట్రస్థాయి పురస్కారం.. నేడు ప్రదానం
- రాష్ట్ర, రీజియన్లవారీగా ఉత్తమ కేఎంపీఎల్ పురస్కారాల ప్రకటన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీఎస్‌ఆర్టీసీ 2016-17 సంవత్సరానికి ఇంధన పొదుపు అవార్డులను బుధవారం ప్రకటించింది. రాష్ట్ర, రీజియన్ స్థాయిల్లో ఇంధనం పొదుపు చేసి సంస్థను లాభాలబాటలో నడిపించిన ఉత్తమ డ్రైవర్ల జాబితాను విడుదలచేసింది. సంగారెడ్డి రీజియన్‌లోని మియాపూర్-2 డిపోకు చెందిన ఎస్ యాదిరెడ్డి సంస్థకు 2047 లీటర్ల ఇంధనాన్ని పొదుపుచేసి 3.11 కేఎంపీఎల్ సాధించి రాష్ట్రస్థాయిలో ఉత్తమ డ్రైవర్‌గా ఎంపికయ్యారు. టీఎస్‌ఆర్టీసీ ఇంధన పొదుపుతోపాటు పలు అంశాలపై నిర్వహించిన రాష్ట్రస్థాయి వక్తృత్వ పోటీల్లో కంటోన్మెంట్ డిపోకు చెందిన జీ ప్రభాకర్, వ్యాసరచన పోటీల్లో భద్రాచలం డిపోకు చెందిన ఎండీ ఎంబేగ్ అవార్డులను సాధించినట్టు టీఎస్‌ఆర్టీసీ తెలిపింది. గురువారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణమండపంలో రవాణాశాఖ మంత్రి పీ మహేందర్‌రెడ్డి, టీఎస్‌ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ, టీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జీవీ రమణారావు అవార్డులు ప్రదానం చేయనున్నారు.

2016-17లో రాష్ట్రస్థాయిలో తొలి 11 స్థానాల్లో నిలిచిన ఉత్తమ డ్రైవర్లు వీరే

ఎస్ యాదిరెడ్డి (మియాపూర్-2), బీ శ్రీనివాస్ (నిజామాబాద్-2), ఆర్ నర్సింహ (నల్లగొండ), ఏ వెంకన్న (వరంగల్-1), ఎన్ జనార్దన్‌రెడ్డి (సిద్దిపేట), పీ సుబ్బారావు (ముషీరాబాద్-2), టీ బాబయ్య (నాగర్‌కర్నూల్), కేపీసీ రావు (మధిర), కేవీఎస్ రెడ్డి (కరీంనగర్-1), ఎస్ రవీందర్‌రావు (మంచిర్యాల), కే బుచ్చయ్య (హైదరాబాద్-1).

గంపగుత్త బడ్జెట్‌కు తెర

- ప్రతిపైసాకు పక్కాగా లెక్కగడుతున్న అధికారులు
- ప్రతి పనికీ వెచ్చించిన నిధులు, బకాయిల వివరాలు సేకరణ
- వాస్తవానికి అతిదగ్గరగా బడ్జెట్ రూపకల్పన
- డ్రాయింగ్ డిస్బర్స్‌మెంట్ అధికారులపై మరింత బాధ్యత

ప్రత్యేకప్రతినిధి, నమస్తే తెలంగాణ: 2018-19 వార్షికబడ్జెట్‌ను పక్కాలెక్కలతో రూపొందించడానికి భారీగా కసరత్తు జరుగుతున్నది. ప్రభుత్వ ఖజానాలోని ప్రతిపైసాకు అధికారులు నిర్దిష్టమైన లెక్కలుగడుతున్నారు. ప్రతి ఉద్యోగికి అందించిన మొత్తం, అభివృద్ధి పనులకు వెచ్చించిన నిధులు, ఇంకా చెల్లించాల్సిన బకాయిలను లెక్కిస్తున్నారు. సంక్షేమపథకాల కింద చెల్లించిన మొత్తాన్ని లబ్ధిదారులవారీగా వివరాలు సేకరిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న గంపగుత్తవిధానానికి స్వస్తిచెప్పి.. ప్రతిపైసాకు పక్కాగా అంచనాలు తయారుచేయాలనే సీఎం చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు అధికారులు వాస్తవానికి అతి దగ్గరగా ఉండేలా బడ్జెట్‌కు రూపకల్పన చేశారు. ఉద్యోగుల వేతనాలతోపాటు, సంక్షేమ కార్యక్రమాలకు వెచ్చించే నిధులు, ప్రభుత్వ ఖజానా నుంచి వివిధశాఖలకు విడుదలైన ప్రతీపైసాకు లెక్కలు చూపడానికి అధికారులు అవసరమైన సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఏఏ శాఖలో ఎంతమంది ఉద్యోగులున్నారు? వారికి చెల్లిస్తున్న వేతనాల మొత్తం ఎంత? ఖాతాలవారీగా వెంటనే సమర్పించాలని ఆర్థికశాఖ అన్నిశాఖల అధికారులకు ఆదేశాలు జారీచేసింది. డ్రాయింగ్ అండ్ డిస్బర్స్‌మెంట్ అధికారులపై ఈసారి ఎక్కువదృష్టి కేంద్రీకరించారు. ప్రతిశాఖలో లేదా విభాగంలో ప్రభుత్వం కేటాయించే నిధులను ఒక అధికారి ఖర్చుచేస్తారు. ఏఏ అవసరాలకు ఇంతవరకు ఎన్ని నిధులను ఖర్చుచేశారు. ఏఏ ఖాతాలలో ఎన్ని నిధులున్నాయి? అణాపైసాతో సహా లెక్కచూపాలని ఆర్థికశాఖ డ్రాయింగ్ డిస్బర్స్‌మెంట్ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. మార్చి నాటికి సమగ్రంగా వివరాలను అందించాలని సూచించారు.

అభివృద్ధి పనులు, సంక్షేమపథకాలకు లబ్ధిదారులవారీగా..

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు విడుదలయ్యే నిధులను కూడా లబ్ధిదారులవారీగా లెక్కలు తయారుచేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న వివిధ అభివృద్ధి నిర్మాణ కార్యక్రమాలకు ఇంతవరకు ఎంత చెల్లించాం.. ఇంకా ఎంత చెల్లించాలి.. బకాయిలు ఎంతున్నాయి అనే విషయాలపై సమగ్ర వివరాలు కావాలని అన్నిశాఖలకు ఆదేశాలు జారీఅయ్యాయి. గతంలో శాఖల వారీగా అంచనా ప్రకారం లెక్కలు పంపేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. పనుల వారీగా లెక్కలుండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాల కోసం రూ. 35వేల కోట్ల నుంచి రూ. 40వేల కోట్ల వరకు వెచ్చిస్తున్నది. ఎస్సీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి దేశంలోనే ఎక్కడాలేనివిధంగా నిధులను వెచ్చిస్తున్నదని రాష్ట్రాల బడ్జెట్‌ల తీరుతెన్నులపై అధ్యయనం జరిపిన ఢిల్లీలోని 'పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్' సంస్థ వెల్లడించిన విషయం తెలిసిందే. 2017-18 బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల సంక్షేమానికి ఖర్చుచేసే నిధులు బడ్జెట్‌లో 10 శాతం దాటవచ్చని సర్వేలో అంచనా వేశారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ మినహా ఏ రాష్ట్రాలు కూడా తెలంగాణ దరిదాపుల్లో కూడా లేవని తేల్చింది.

బీసీలకు 8 వేలకోట్లు!

- 2018-19 బడ్జెట్‌లో బీసీ సంక్షేమశాఖ ప్రతిపాదనలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వెనుకబడిన తరగతుల్లో ప్రధానంగా కులవృత్తులనే నమ్ముకొని జీవిస్తున్నవారు ఆత్మగౌరవంతో జీవించేందుకు వీలైనన్ని ఎక్కువ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం సంకల్పించింది. బీసీ కులాలవారి సమస్యలు, వాటి పరిష్కారాలపై సీఎం కేసీఆర్ విస్తృతంగా చర్చించి కులవృత్తులను ప్రోత్సహించాలని నిర్ణయించారు. అందుకే బీసీల సంక్షేమానికి బడ్జెట్‌లో పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారు. ఏటేటా ఈ నిధులు పెంచుతున్నారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో బీసీల అభివృద్ధి కొరకు రూ. 5,070.26 కోట్లు కేటాయించగా ఈ ఏడాది రూ.8,000.61 కోట్లు ప్రతిపాదించినట్లు సమాచారం. బీసీల కోసం కల్యాణ లక్ష్మి పథకం, రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్లు, ఫైనాన్స్ కార్పొరేషన్, స్కాలర్‌షిప్‌లు, స్టడీ సర్కిళ్ల నిర్వహణ, ఇతరత్రా పద్దుల కింద ఈ మేరకు బీసీ సంక్షేమశాఖ 2018-19 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాలు సిద్ధం చేసి ఆర్థికశాఖకు ప్రతిపాదించింది.

ఆ వివరాలిలా ఉన్నాయి

2018-19లో కేటాయింపులు	రూ.కోట్లల్లో
బీసీ రెసిడెన్షియల్ స్కూళ్లు, కళాశాలలు	607.20
బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్	300.00
ఎంబీసీ కార్పొరేషన్	1000.00
బీసీ కమిషన్	16.76
కార్యాలయాలు, భవనాలకు	421.20
రాష్ట్ర బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్	6.00
బీసీ హాస్టళ్లు	327.19
అడ్వొకేట్ల సబ్సిడీ	10.00
కమ్యూనిటీ సేవలు	25.50
కులాంతర వివాహ జంటలకు	2.25
సంచార జాతుల ఆర్థిక ప్రగతికి	200.00
నాయిబ్రాహ్మణ ఫెడరేషన్‌కు పెట్టుబడి	00.51
గీత కార్మికుల ఫెడరేషన్‌కు	100.00
భట్రాజు కోఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్‌కు	10.00
కృష్ణ బలిజ పూసల ఫెడరేషన్‌కు	25.00
ఇతర బీసీ కులాల ఫెడరేషన్లకు	500.00
బీసీల కల్యాణ లక్ష్మి	1000.00
సావిత్రిబాయి పూలే అభ్యుదయ యోజన	20.00
బీసీ విద్యార్థుల స్కాలర్‌షిప్	1650.00
తెలంగాణ బీసీ స్టడీ సర్కిళ్లు	28.00
ఓబీసీల అభివృద్ధి కోసం	3.00
మహాత్మాజ్యోతిబాపూలే ఓవర్సీస్ విద్యా పథకం	70.00
చేనేతకార్మికుల సంక్షేమానికి	1200.00
ఇతర కార్యక్రమాల అమలుకు	478.00
బడ్జెట్ మొత్తం	8,000.61



ఇరాన్ అధ్యక్షుడి పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న సీఎస్ ఎస్కే జోషి

నేడు హైదరాబాద్‌కు ఇరాన్ అధ్యక్షుడు

- ఏర్పాట్లను సమీక్షించిన సీఎస్ ఎస్కే జోషి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ హసన్ రౌహనీ రెండురోజుల పర్యటన నిమిత్తం గురువారం హైదరాబాద్ రానున్నారు. ఆయన పర్యటన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి బుధవారం సచివాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. బేగంపేట విమానాశ్రయంలో ఇరాన్ అధ్యక్షుడికి కేంద్రమంత్రి ఆర్పీసింగ్ స్వాగతం పలుకుతారని సీఎస్ వివరించారు. హైదరాబాద్‌లోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ మహ్మద్ హఘ్‌బిన్ ఘోమీ మాట్లాడుతూ తమ దేశాధ్యక్షుడి పర్యటనకు అతి తక్కువ సమయంలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు చేయడం హర్షణీయమన్నారు. సమావేశంలో జీఏడీ ముఖ్యకార్యదర్శి అధర్‌సిన్హా, నగర పోలీస్‌కమిషనర్ వీవీ శ్రీనివాసరావు, మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి దాన కిషోర్, హైదరాబాద్ కలెక్టర్ యోగితారాణా, ఇంటెలిజెన్స్ ఐజీ నవీన్‌చంద్, అడిషనల్ డీజీ అంజనీకుమార్, ప్రోటోకాల్ డైరెక్టర్ అర్విందర్‌సింగ్, జాయింట్ పోలీస్ కమిషనర్ రవీందర్, రీజనల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ ఈ విష్ణువర్ధన్‌రెడ్డి, ఫైర్ సర్వీసెస్ డీజీ రాజీవ్ రతన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులకు ఓడీ సౌకర్యం

ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీ మధుసూదన్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ వీ బాబూరావుకు ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు రాష్ట్ర ప్రభు త్వం ఆన్‌డ్యూటీ సౌకర్యం కల్పించింది. ఈ మేరకు బుధవారం సాధారణ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి ఆధర్‌సిన్హా జీవో జారీచేశారు. తమకు ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పించిన సీఎం కేసీఆర్‌కు మధుసూదన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.



ఫలక్‌నుమా ఎస్సై నరేందర్‌కు ఫిర్యాదుచేస్తున్న ముస్లిం యువకులు. (ఇన్‌సెట్) నటి ప్రియ

ప్రియావారియర్ పాటపై ఫిర్యాదు

- కేసు నమోదు చేసిన ఫలక్‌నుమా పోలీసులు

చాంద్రాయణగుట్ట: కొద్దిరోజులుగా దేశంలో కుర్రకారుతోపాటు, మహామహులైన నటులకు సైతం మతులు పోగొట్టిన మలయాళ నటి ప్రియా ప్రకాశ్ వారియర్ నటించిన ఒరు అదర్ లవ్ అనే సినిమా పాటపై కేసు నమోదైంది. 'ఒరు అదర్ లవ్' చిత్రంలోని ఓ పాటలోని కొంతభాగం గత నాలుగురోజులుగా సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఈ పాటలో ప్రియా హావభావాలు తమ మత మనోభావాలను దెబ్బతీస్తున్నాయని కొందరు ముస్లిం యువకులు అభ్యంతరం వ్యక్తంచేస్తూ బుధవారం ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. హైదరాబాద్‌కు చెందిన అద్నాన్ ఖమర్ అనేవ్యక్తి ఫేస్‌బుక్‌లో వీడియోద్వారా పాటలోని నటీనటుల హావభావాలు అభ్యంతరకరంగా ఉన్నాయని పోస్ట్ చేశారు. ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్‌లో దాఖలుచేసిన ఫిర్యాదుపై 57మంది ముస్లిం యువకులు తమ ఫోన్ నంబర్లతో సహా సంతకాలు చేశారు. మహమ్మద్ ప్రవక్తతో సంబంధం ఉన్న గొప్ప సాహిత్యంపై రొమాంటిక్ సన్నివేశాలు చిత్రీకరించడం ఎంతమాత్రం అంగీకారం కాదని ఫిర్యాదుదారు మహమ్మద్ అబ్దుల్ పేర్కొన్నారు. ఈ మేరకు ఫలక్‌నుమా ఎస్సై నరేందర్ కేసు నమోదు చేశారు.



కేంద్ర మాజీ మంత్రి

బోళ్ల బుల్లి రామయ్య కన్నుమూత

హైదరాబాద్/ అమరావతి, నమస్తే తెలంగాణ: కేంద్ర మాజీ మంత్రి, ఆంధ్రా షుగర్స్ ఎండీ బోళ్ల బుల్లి రామయ్య బుధవారం కన్నుమూశారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా తాటిపాకలో 1926 జూలై 9న జన్మించారు. బుల్లి రామయ్య 1984, 1991, 1996, 1999లో ఏలూరు నుంచి ఎంపీగా గెలుపొందారు. 1996-98లో కేంద్ర వాణిజ్యశాఖ సహాయమంత్రిగా పనిచేశారు. మృతికి ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రులు సంతాపం తెలిపారు.

వేసవిలో పశుగ్రాసం కొరత రావొద్దు

గ్రామాల్లో గొర్రెలకు నీటితొట్లు, షెడ్ల నిర్మాణం

త్వరలో గొర్రెల పెంపకందారులు, మత్స్యసహకార సంఘాలకు ఎన్నికలు

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వచ్చే వేసవిలో పశువులు, గొర్రెలకు గ్రాసం కొరత లేకుండా ముందస్తుచర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక, మత్స్యశాఖల మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో జిల్లాకలెక్టర్లు, పశుసంవర్ధక, మత్స్యశాఖ అధికారులతో మంత్రి తలసాని వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో పశుసంవర్ధక, మత్స్యశాఖలకు సరైన నిధులు లేక నిర్లక్ష్యానికి గురయ్యాయని, సీఎం కేసీఆర్ చొరవతో ఆ శాఖలు నేడు దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 42 లక్షల గొర్రెలను పంపిణీ చేశామని, గొర్రెల సంఖ్యకు అనుగుణంగా గ్రాసం అందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. 87 లక్షల టన్నుల పచ్చిమేత అవసరం కాగా, 82.51 లక్షల టన్నుల గ్రాసం అందుబాటులో ఉందని, మిగిలిన గ్రాసం కోసం పెంపకందారులకు సబ్సిడీపై గడ్డి విత్తనాలను పంపిణీచేయాలని ఆదేశించారు. పాడిపరిశ్రమాభివృద్ధికి సబ్సిడీ గేదెల పంపిణీకి చర్యలు తీసుకోవాలని చెప్పారు. వచ్చే వేసవి నాటికి గ్రామాలలో గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో 8,642 నీటితొట్లు, 39,372 గొర్రెల షెడ్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించినట్టు మంత్రి వివరించారు. గొర్రెల షెడ్ల నిర్మాణానికి 90శాతం సబ్సిడీపై లక్ష రూపాయల వరకు ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. గొర్రెల పంపిణీలో 96.13 శాతంతో కామారెడ్డి జిల్లా ప్రథమస్థానంలో ఉండగా, కుమ్రంభీం-ఆసిఫాబాద్ జిల్లా 94.04 శాతంతో రెండోస్థానంలో నిలిచిందన్నారు. గొర్రెల పెంపకందారులు, మత్స్యకార సొసైటీలకు త్వరలో ఎన్నికలు నిర్వహించనున్నట్టు మంత్రి తలసాని వెల్లడించారు. మత్స్యకారులకు చేపల విక్రయాల కోసం హోల్‌సేల్, రిటైల్ చేపల మార్కెట్లు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణానికి అవసరమైన నిధులు సిద్ధంగా ఉన్నాయని, స్థల సేకరణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. 2018-19లో చెరువుల్లో చేప పిల్లలు వేయడానికి మార్చి నుంచే టెండర్ ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పారు. హైదరాబాద్‌లో వచ్చేనెల ఆక్వాఎక్స్‌పో నిర్వహిస్తున్నామని, 25 దేశాల ప్రతినిధులు హాజరవుతారని వివరించారు. కార్యక్రమంలో సీఎం కార్యాలయ కార్యదర్శి స్మితాసబర్వాల్, పశుసంవర్ధకశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ, డైరెక్టర్ వెంకటేశ్వర్లు, గొర్రెలు-మేకల అభివృద్ధి సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మారెడ్డి, ఉద్యాన కమిషనర్ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.



బుధవారం సచివాలయం నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లు, పశుసంవర్ధక, మత్స్యశాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న పశుసంవర్ధక, మత్స్యశాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సమస్యలన్నీ యథాతథం

- అనేక క్యాటగిరీల్లో వివాదాస్పదంగా విభజన
- తెలంగాణ ఉద్యోగుల ఫిర్యాదులు బుట్టదాఖలు
- వివాదాల నడుమ 55,940 ఉద్యోగుల విభజన
- డీవోపీటీపై తెలంగాణ ఉద్యోగుల అసహనం
- నిరసన ప్రకటించేందుకు సంఘాల సమాయత్తం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్ర డీవోపీటీ ఉమ్మడి రాష్ట్ర ఉద్యోగుల విభజన 99% పూర్తయిందని చెప్తున్నా.. సమస్యలన్నీ యథాతథంగానే ఉన్నాయని తెలంగాణ ఉద్యోగసంఘాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. తాము లేవనెత్తిన సమస్యలను పట్టించుకోకుండా, తాము ఎజెండా చేసిన అంశాలకు సమాధానాలు చెప్పకుండా ఉద్యోగుల విభజన చేశారని మండిపడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ తీరును తప్పుపడుతూ నిరసన ప్రకటించేందుకు సిద్ధమవుతున్నాయి. ఉద్యోగుల విభజన 99% పూర్తయ్యిందని డీవోపీటీ చేతులు దులుపుకొంటున్నది. కానీ, ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, డీఎస్పీలు, స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీకలెక్టర్లు, ఏఎస్పీలు, డీఎస్పీలు వంటి అనేక క్యాటగిరీల్లో విభజన ప్రక్రియ వివాదాస్పదంగా ఉంది. ఈ అన్యాయాలపై వందలమంది తెలంగాణ ఉద్యోగులు కోర్టులను ఆశ్రయించారు. వివాదాలు కొనసాగుతుండగానే, ఉద్యోగులు ఫిర్యాదులు చేసిన అంశాలను పరిగణనలోకి తీసుకోకుండానే కేంద్ర డీవోపీటీ 55,940 మంది విభజన పూర్తిచేసింది. ఇందులో 31,644 మందిని ఏపీకి, 24,295 మందిని తెలంగాణకు కేటాయించారు. 2017 డిసెంబర్ నాటికి 153 శాఖల్లో విభజన ప్రక్రియ పూర్తయిందని ప్రకటించారు. 2014 ఆగస్టులో ఉద్యోగుల విభజన కమిటీ చైర్మన్ కమలనాథన్ రూపొందించిన మార్గదర్శకాలపై ఉద్యోగసంఘాల జేఏసీ తీవ్ర నిరసన వ్యక్తంచేసింది.18(ఎఫ్) నిబంధన తెలంగాణలోకి ఏపీ ఉద్యోగులు వచ్చేందుకు ద్వారాలు తెరిచినట్లుందని ధ్వజమెత్తింది.

క్యాడర్‌స్ట్రెంత్ నిర్ణయించకుండానే..

విభజన ప్రక్రియ చేస్తూనే శాఖలవారీగా తెలంగాణకు, ఏపీకి క్యాడర్‌స్ట్రెంత్ నిర్ధారించాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేశాయి. కానీ.. కేడర్‌స్ట్రెంత్‌ను నిర్ణయించకుండానే ఉద్యోగుల విభజనను 'మమ' అనిపించారు. రాష్ట్రస్థాయి క్యాడర్ పేరుతో ఏపీకి కేటాయించిన 900 మంది తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగులను స్వరాష్ట్రానికి కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు డీవోపీటీ నుంచి సానుకూలత లభించడం లేదు. స్థానికత నిబంధనలను డీవోపీటీ పట్టించుకోలేదు. ఈ మూడేండ్లలో తెలంగాణలో ఎక్కడ ఖాళీలు ఏర్పడితే అక్కడ ఏపీ ఉద్యోగులను భర్తీచేస్తున్నారు. సెక్రటేరియట్‌లో ఏఎస్‌వో, ఎస్‌వో క్యాడర్‌లో ఏపీకి చెందిన 60 మందిని తెలంగాణకు కేటాయించారు. ఉమ్మడి రాష్ట్రంలో 18% మహిళా ఉద్యోగులుండగా, అందులో ఎక్కువ శాతం మహిళలను తెలంగాణకు కేటాయించారు. స్పౌజ్, వికలాంగులు, ఎస్సీ, ఎస్టీ క్యాటగిరీ ఉద్యోగులు, దీర్ఘవ్యాధిగ్రస్తులకు విభజనలో ఇచ్చిన మినహాయింపులను ఏపీ ఉద్యోగులు తురుపుముక్కగా ఉపయోగించుకున్నారని టీఎన్జీవో ప్రధానకార్యదర్శి మామిండ్ల రాజేందర్ ఆరోపించారు.

స్థానికతను బేఖాతర్ చేసిన డీవోపీటీ

స్థానికతను నిర్వచించాలని తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ పట్టుపట్టిన విషయాలను డీవోపీటీ బేఖాతరు చేసింది. ముల్కీ నిబంధనల ప్రాతిపదికగా, తల్లిదండ్రుల చిరునామాను ప్రామాణికంగా తీసుకోవాలని, ఉద్యోగి సర్వీసులోకి వచ్చే రోజున స్పెషల్ బ్రాంచి రికార్డు చేసిన స్థానికతను పరిగణనలోకి తీసుకోవాలని తెలంగాణ ఉద్యోగ జేఏసీ పలు సందర్భాల్లో విజ్ఞప్తి చేసింది. ఉద్యోగుల విభజనతోపాటు విభజన అన్యాయాలన్నింటినీ ఎంపీ కల్వకుంట్ల కవిత సారథ్యంలో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు నివేదించామని టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి తెలిపారు. ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులు తెలంగాణ నేటివ్ ఎంప్లాయీస్ వర్కింగ్ ఇన్ సీమాంధ్ర అనే సంఘాన్ని ఏర్పరచుకొని కేంద్ర డీవోపీటీకి, ఏపీ ప్రభుత్వానికి తమ సమస్యలను వందలసార్లు విన్నవించారు. ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ బిడ్డలందరినీ స్వరాష్ట్రానికి తీసుకురావడానికి తెలంగాణ ప్రభుత్వం సానుకూలత వ్యక్తంచేసింది. నీటిపారుదలశాఖ వంటి కొన్ని శాఖల్లో సూపర్‌న్యూమరరీ పోస్టులను కూడా సృష్టించింది. కానీ.. ఏపీ ప్రభుత్వం, కేంద్ర డీవోపీటీ నుంచి స్పందన కరువైంది. సాచివేత వైఖరిని అనుసరిస్తున్నారని టీజీవో వ్యవస్థాపక అధ్యక్షుడు, శాసనసభ్యులు వీ శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నిస్తున్నారు.

నకిలీ సర్టిఫికెట్లపై విచారణలేవి?

1975నాటికి వనస్థలిపురం లేనప్పటికీ, అక్కడి ప్రాథమిక పాఠశాలలో చదువుకున్నట్లుగా సృష్టించిన నకిలీ సర్టిఫికెట్లపై విచారణ జరుపాలని, చట్టపరంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యోగులు కోరారు. చాలా శాఖలలో ఇటువంటి ఉదంతాలు ఉన్నాయని తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఏ పద్మాచారి అన్నారు. మరోవైపున జోనల్, మల్టీ జోనల్ పోస్టులు అదేవిధంగా ఉన్నాయి.



కేంద్రం తాత్సారం చేస్తున్నది

సాంకేతికంగానే విభజన ఉద్యోగుల విభజన పూర్తయ్యింది. సమస్యలన్నీ అదేవిధంగా ఉన్నాయి. విభజన సమస్యల పరిష్కారంలో కేంద్రం తాత్సారం చేస్తున్నది. ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించకుండా, అన్నీ శాఖలలో స్థానికత సమస్యలను కప్పిపెట్టి ఉద్యోగుల విభజన పూర్తయ్యిందని ప్రకటిస్తున్నారు.

\- జీ దేవీప్రసాద్, తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్



అశాస్త్రీయంగా విభజించారు


క్యాడర్‌స్ట్రెంత్ విషయంలో అశాస్త్రీయంగా ఉద్యోగులను విభజించారు. విభజన పూర్తయ్యిందని ప్రకటిస్తున్న 153 శాఖలలో స్థానికత సమస్యలున్నాయి. ఏపీ స్థానికతగల ఉద్యోగులు ఏపీకి వెళ్తామని దరఖాస్తు చేసుకున్నారు. ఏపీ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ఇటువంటి సమస్యలన్నింటికీ ద్వారాలు మూసివేసింది.

\- కారం రవీందర్‌రెడ్డి, తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్

పెండింగ్ కేసుల్లో పరిహారాన్ని

ఏడాది చివరికల్లా అందజేస్తాం

- హైకోర్టుకు నివేదించిన రాష్ట్రప్రభుత్వం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భూసేకరణ పరిహారం పెండింగ్ కేసుల్లో చెల్లింపులను ఈ ఏడాది చివరకల్లా పూర్తిచేస్తామని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉమ్మడి హైకోర్టుకు నివేదించింది. సుమారు రూ.458 కోట్లను చెల్లించాల్సి ఉందని, రాబోయే బడ్జెట్ ఏడాది అయిన ఏప్రిల్ 1 నుంచి ఆరు వాయిదాల్లో డిసెంబర్ చివరినాటికి బాధితులకు అందజేస్తామని తెలిపింది. బకాయిల్లో అధికశాతం గతంలో చెల్లించకుండా పేరుకుపోయినవేనని నివేదించింది. పరిహారం పెంపు కోసం కోర్టులు ఇచ్చిన ఉత్తర్వులను ప్రభుత్వ యంత్రాంగం అమలుచేయకపోవడంతో దిగువ న్యాయస్థానాల్లో ఎగ్జిక్యూటివ్ పిటిషన్ల (ఈపీ) అమలుకు భారీ కేసులు దాఖలయ్యాయి. ఈ కేసులపై మహబూబ్‌నగర్ జిల్లా జడ్జి గత ఏడాది హైకోర్టుకు లేఖ రాశారు. ఆ లేఖలోని అంశాలను పరిశీలించిన ఉమ్మడి హైకోర్టు.. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో ఈపీలపై వివరాలను సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు ఆదేశించింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని 1669 కేసుల్లో రూ.458 కోట్లను చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపింది. ప్రభుత్వ వివరణతో సంతృప్తిచెందిన హైకోర్టు.. ఆరు వాయిదాల్లో చెల్లించాలని ఆదేశించింది.

ఏపీ ప్రభుత్వం నివేదికపై అనుమానాలు

ఏపీ రాష్ట్రంలో రూ.62 కోట్లు మాత్రమే పెండింగ్ కేసుల్లో చెల్లించాల్సి ఉందన్న ఏపీ సర్కార్ నివేదికపై ఉమ్మడి హైకోర్టు అనుమానం వ్యక్తంచేసింది. ఏపీలోని దిగువకోర్టుల నుంచి సమాచారం తెప్పించుకొని సరిపోల్చుకుంటామని పేర్కొంది. రెండు రాష్ట్రాల్లోని దిగువ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న ఈపీ కేసులు, చెల్లించాల్సిన బకాయిలపై వివరాలను మార్చి చివరినాటికి తెప్పించాలని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. విచారణ ఏప్రిల్‌కు వాయిదావేసింది.

క్యాబినెట్ హోదా జీవోపై వివరణ ఇవ్వండి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వ సలహాదారులు, కార్పొరేషన్ చైర్మన్లకు క్యాబినెట్ హోదా కల్పించడంపై మార్చి 14లోగా వివరణ ఇవ్వాలని ప్రభుత్వానికి ఉమ్మడి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. క్యాబినెట్ హోదా కల్పించడంపై రేవంత్‌రెడ్డి గతంలోనే పిటిషన్ దాఖలుచేశారు. ఇటీవల ఆప్ ఎమ్మెల్యేలపై కేంద్ర ఎన్నికల సంఘం సస్పెన్షన్‌కు సిఫారసుచేయడంతో తాను దాఖలు చేసిన పిటిషన్‌ను వెంటనే విచారించాలని రేవంత్‌రెడ్డి అనుబంధ పిటిషన్ దాఖలుచేశారు. బుధవారం విచారణ చేపట్టిన జస్టిస్ వీ రామసుబ్రమణియన్, జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్ నేతృత్వంలోని ధర్మాసనం వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

పురుషోత్తంరెడ్డి బినామీల ఆస్తులపై ఏసీబీ దృష్టి!

- అవినీతి కోణంలో కేసుదర్యాప్తు
- పురుషోత్తంరెడ్డి వేధింపులపై ఏసీబీకి మరో ఫిర్యాదు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో హెచ్ఎండీఏ ప్రణాళిక విభాగం డైరెక్టర్ (సస్పెన్షన్) పురుషోత్తంరెడ్డి బినామీలపై అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) దృష్టిసారించింది. బినామీల పేరుతో ఉన్న డాక్యుమెంట్లను పరిశీలిస్తున్నది. డాక్యుమెంట్ల ఆధారంగా బినామీల పేరుతో ఉన్న ఆస్తులు ఎవరి నుంచి వచ్చాయనే కోణంలో దర్యాప్తుచేస్తున్నట్టు తెలిసింది. పురుషోత్తంరెడ్డి వ్యాపారంలో మద్దతుగా కొందరు పెద్దలు ఉన్నారని సమాచారం. అతడిని అదుపులోకి తీసుకొన్నాక వివరాలు తెలుస్తాయని, అవినీతి కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్తున్నారు. మరోవైపు పురోషోత్తంరెడ్డి అవినీతిపై ఏసీబీకి మరో ఫిర్యాదు అందింది. అధికారులు వారి స్టేట్‌మెంట్ కూడా రికార్డు చేసినట్టు తెలిసింది. హెచ్ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్‌గా పనిచేసిన పురుషోత్తంరెడ్డి వద్ద ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్టు సమాచారం రావడంతో పక్కా ఆధారాలతో ఈ నెల 2న సోదాలు చేసిన విషయం తెలిసిందే. ఈ సోదాల్లో అతడి వద్ద రూ.25 కోట్ల విలువచేసే ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఏసీబీ సోదాల గురించి ముందే గుర్తించిన పురుషోత్తంరెడ్డి, కుటుంబసభ్యులతో కలిసి అజ్ఞాతంలోకి వెళ్లాడు. అతడి కోసం ఏసీబీ అధికారులు గాలిస్తున్న క్రమంలో నగరశివారుల్లో ఉన్న కొన్ని ఆస్తులు బయటకొచ్చాయి. ఆ ఆస్తులపై ఆరాతీయగా, పురుషోత్తంరెడ్డి బినామీ పేర్లతో రూ.కోట్లు కూడగట్టుకున్నాడని గుర్తించి, ఇద్దరి బినామీలను అరెస్టుచేశారు. బినామీల పేరుతో ఉన్న ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లను అధికారులు పరిశీలించగా ఆసక్తికరమైన వివరాలు బయటపడినట్టు తెలిసింది. పురుషోత్తంరెడ్డి చేసిన రియల్ ఎస్టేట్, నిర్మాణం వంటి వ్యాపారంలో కొందరు ప్రముఖులను భాగస్వాములుగా పెట్టుకున్నాడని, వారికి డబ్బులిచ్చి, తనకు సంబంధించిన వ్యక్తులను బినామీలుగా చేర్చినట్టు ఏసీబీ దర్యాప్తులో వెల్లడైనట్టు సమాచారం. పురుషోత్తంరెడ్డి బినామీల పేర్లతో ఉన్న డాక్యుమెంట్లను అధికారులు పరిశీలిస్తున్నారని తెలిసింది. ప్రస్తుతం బినామీల పేరుతో ఉన్న ఆస్తులు గతంలో ఎవరి పేరుతో ఉన్నాయి. వారు ఎవరు? వారితో పురుషోత్తంరెడ్డికి ఉన్న సంబంధాలు! వంటి అంశాలపై ఏసీబీ కూపీ లాగుతున్నట్టు సమాచారం. పురుషోత్తంరెడ్డి పెద్ద కూతురు వివాహానికి రూ.కోటిన్నర వరకు చేసిన ఖర్చును వియ్యంకుడు రాధాచరణ్ రెడ్డి ఖాతాలో వేశాడని, ప్రభుత్వ ఉద్యోగి అయిన పురుషోత్తంరెడ్డి అంత డబ్బు ఖర్చుచేసినట్టు బయటపడితే ప్రమాదమని గుర్తించాడని ఏసీబీ విచారణలో వెల్లడైనట్టు తెలిసింది.



డాక్ ఆన్‌లైన్‌కు

ఎస్సీసీ గుర్తింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆన్‌లైన్ విధానంతో వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటుచేసిన డాక్ ఆన్‌లైన్ సంస్థకు స్టాండర్డ్స్ సర్టిఫికేషన్ కౌన్సిల్ (ఎస్సీసీ) గుర్తింపు దక్కిందని ఆ సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రాహుల్‌పెయిత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని గతనెల హైదరాబాద్‌లో ఏర్పాటుచేసినట్టు పేర్కొన్నారు.

టీడీపీ ఎమ్మెల్యే చింతమనేనికి జైలు.. బెయిల్

మాజీ మంత్రి వసంతకుమార్‌పై దాడి కేసులో భీమడోలు కోర్టు తీర్పు



హైదరాబాద్/ అమరావతి, నమస్తే తెలంగాణ: ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా దెందులూరు టీడీపీ శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ చింతమనేని ప్రభాకర్‌కు భీమడోలు మేజిస్ట్రేట్ కోర్టు జైలు శిక్ష విధించింది. మూడు వేర్వేరు కేసుల్లో ఆయనకు మూడేండ్ల జైలు శిక్ష, రూ.2500 జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించింది. 2011 జూన్‌లో దెందులూరు హైస్కూల్‌లో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యేగా ఉన్న చింతమనేని ప్రభాకర్, రాష్ట్ర మంత్రిగా ఉన్న వట్టి వసంతకుమార్ మధ్య వివాదం తలెత్తింది. ఈ ఘటనలో చింతమనేని తనపై దాడిచేశారని అప్పట్లో దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో వసంతకుమార్ ఫిర్యాదుచేయగా.. వివిధ సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. ఏడేండ్లపాటు విచారణ సాగించిన న్యాయస్థానం మాజీ మంత్రిపై చింతమనేని దాడికి పాల్పడ్డారని నిర్ధారించింది. కోర్టు సెక్షన్ 506(2) కింద రెండేండ్లు జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా, సెక్షన్ 353కు ఆరునెలలు జైలు, రూ.వెయ్యి జరిమానా, సెక్షన్ 7(1) కింద ఆరునెలల జైలు, రూ.500 జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ దీప దైవకృప తీర్పు చెప్పారు. అన్ని శిక్షలు ఏకకాలంలో అమలుచేయాలని తీర్పులో పేర్కొనడంతో.. చింతమనేనికి గరిష్ఠంగా రెండేండ్ల జైలు శిక్ష వర్తిస్తుంది. ఈ కేసులో చింతమనేనికి బెయిల్ మంజూరైంది.

ఏపీఎన్జీవో అధ్యక్షుడు

అశోక్‌బాబుకు హైకోర్టు వారెంట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లోని గన్‌ఫౌండ్రీ వద్ద ఏపీఎన్జీవో భవన్‌లో భాగ్యనగర్ తెలంగాణ ఎన్జీవో అసోసియేషన్‌కు అవకాశం వ్యవహారంలో కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన కింద తమ ఎదుట హాజరుకావాలని ఏపీఎన్జీవో అధ్యక్షుడు అశోక్‌బాబుకు ఉమ్మడి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. కోర్టు ఉత్తర్వులను అమలు చేయకపోవడాన్ని కోర్టు ధిక్కారంగా ఎందుకు పరిగణించకూడదో స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. నోటీసులు జారీచేస్తూ విచారణను నాలుగువారాలకు వాయిదా వేసింది. ఏపీఎన్జీవో భవనం వ్యవహారంలో ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తడంతో హైకోర్టును ఆశ్రయించారు. భవనంలోని కొంతభాగం భాగ్యనగర్ తెలంగాణ ఎన్జీవో అసోసియేషన్‌కు కేటాయించాలని ఆదేశిస్తూ ఏపీఎన్జీవోకు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. దీన్ని పాటించడం లేదని భాగ్యనగర్ టీఎన్జీవో అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్ హైకోర్టులో కోర్టు ధిక్కారణ వ్యాజ్యం దాఖలుచేయగా, న్యాయస్థానం అశోక్‌బాబుకు నోటీసులు జారీచేసింది.

వ్యక్తిత్వ వికాసంపై

జైళ్ల శాఖ సదస్సు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నాయకత్వ లక్షణాలు ఉన్నప్పుడే విశ్వాసం, ఆత్మస్థైర్యం పెరుగుతుందని అదనపు డీజీపీ గోపీకృష్ణ అన్నారు. బుధవారం హైదరాబాద్ జైళ్లశాఖ ప్రధాన కార్యాలయంలో బ్యూరో ఆఫ్ పోలీసు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, న్యూఢిల్లీ (బీపీఆర్‌డీ) 'వ్యక్తిత్వ వికాసం' (పర్సనాలిటీ డెవలప్‌మెంట్) సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ నెల 16వ తేదీ వరకు జరిగే సదస్సుకు ఎనిమిది రాష్ట్రాల నుంచి 28 మంది జైళ్లశాఖ అధికారులు హాజరవుతారని జైళ్లశాఖ డీజీ వీకే సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జైళ్లశాఖ ఐజీ ఆకుల నరసింహ, చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సెన్సెక్స్	నిఫ్టీ
34,156	10,501
↘ 144	↘ 39

ముడి చమురు (బ్రెంట్) ↗ 62.98 డాలర్లు

బంగారం ధరలు

న్యూఢిల్లీ (రూ.లలో)	
24 క్యారెట్లు	31,300
22 క్యారెట్లు	31,150
వెండి (కిలో)	39,250

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	58.34	67.65
బహ్రెయిన్ దినార్	157.99	181.06
కువైట్ దినార్	176.65	219.91
సౌదీ రియాల్	15.51	18.39
యూఏఈ దిర్హామ్	15.88	18.56

చికెన్ ధరలు

	(రూ.లలో)
ఫారం ధర	70.00
రిటైల్ లైవ్	92.00
డ్రెస్డ్	133.00
స్కిన్‌లెస్	152.00

నెక్ (వంద గుడ్లకు)

	(రూ.లలో)
హైదరాబాద్	386-00
రంగారెడ్డి	386-00
మెదక్	386-00
కరీంనగర్	388-00
వరంగల్	388-00
రిటైల్ ప్రైస్	4-45

మేమూ పన్ను వేస్తాం

- హార్లీ డేవిడ్‌సన్ మోటార్‌సైకిళ్లపై దిగుమతి సుంకాన్ని విమర్శించిన ట్రంప్



వాషింగ్టన్, ఫిబ్రవరి 14: అమెరికాకు చెందిన హార్లీడేవిడ్‌సన్ మోటార్‌సైకిళ్లపై భారత్ అధికంగా దిగుమతి సుంకాన్ని విధిస్తున్నదంటూ ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రీమియం మోటార్‌సైకిళ్లపై దిగుమతి సుంకాన్ని 50 శాతానికి తగ్గించినప్పటికీ ఇది చాలా ఎక్కువని బుధవారం ఇక్కడ ఉక్కు పరిశ్రమపై కాంగ్రెస్ సభ్యులతో జరిగిన ఓ చర్చలో ట్రంప్ విమర్శించారు. అమెరికాలో మోటార్‌సైకిళ్లపై దిగుమతి సుంకం లేనేలేదన్న ఆయన తాము కూడా తమ దేశంలోకి వస్తున్న భారతీయ మోటార్‌సైకిళ్లపై దిగుమతి సుంకాన్ని విధిస్తామని హెచ్చరించడం గమనార్హం. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో ఇటీవల జరిపిన సంభాషణల్లో అధిక దిగుమతి సుంకంపై పరోక్షంగా ప్రస్తావించినట్లు ట్రంప్ చెప్పారు. కాగా, హార్లీ డేవిడ్‌సన్, ట్రయంఫ్ తదితర ఖరీదైన మోటార్‌సైకిళ్ల దిగుమతిపై విధిస్తున్న కస్టమ్స్ సుంకంలో కేంద్రం చేసిన మార్పులతో 800సీసీ, అంతకంటే తక్కువ ఇంజిన్ సామర్థ్యం కలిగిన మోటార్‌సైకిళ్లపై దిగుమతి సుంకం 10 శాతం, ఎక్కువ వాటిపై 25 శాతం చొప్పున తగ్గింది.

ఆ వివరాలన్నీ ఇవ్వండి..

పీఎన్‌బీ కుంభకోణం నేపథ్యంలో బ్యాంకులకు ఆర్థిక శాఖ ఆదేశం

స్థితి నివేదిక సమర్పించాలని స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో బట్టబయలైన భారీ కుంభకోణం నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ అప్రమత్తమైంది. ఈ వ్యవహారం అన్ని బ్యాంకులను ప్రభావితం చేయవచ్చన్న అనుమానాల మధ్య ఈ కేసుతో ప్రమేయమున్నా, ఇలాంటి ఘటనలు ఇటీవల ఏమైనా జరిగినా.. వెంటనే వాటి వివరాలను ఈ వారంలోగా నివేదించాలని అన్ని బ్యాంకులను కోరింది. ముంబైలోని తమకు చెందిన ఓ శాఖలో సుమారు రూ.11,335 కోట్ల మోసపూరిత ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని బుధవారం పీఎన్‌బీ ప్రకటించింది. కొంతమంది ఖాతాదారుల ప్రయోజనాలే లక్ష్యంగా జరిగిన ఈ లావాదేవీల్లో ఇతర బ్యాంకుల ద్వారా సొమ్మును విదేశాల్లోకి తరలించి ఉండవచ్చన్న అనుమానాన్ని బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు విడుదల చేసిన ప్రకటనలో పీఎన్‌బీ వెలిబుచ్చింది. మరోవైపు ఈ లావాదేవీల ఆధారంగా వివిధ ప్రభుత్వ, ప్రైవేట్‌రంగ బ్యాంకుల నుంచి డైమండ్ వ్యాపారి నిరవ్ మోదీ, ఆయన అనుచరులు విదేశాల్లో లబ్ధి పొంది ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతుండటం గమనార్హం. ఇప్పటికే నిరవ్ మోదీ ద్వారా పీఎన్‌బీ మోసపోయిన విషయం తెలిసిందే. కాగా, 2011 నుంచి డిప్యూటీ జనరల్ మేనేజర్ స్థాయి ఉద్యోగుల మద్దతుతో ఈ కుంభకోణం నడిచిందని సమాచారం. ఈ కేసుతో సంబంధమున్న 10 మంది ఉద్యోగులను ఇప్పటికే పీఎన్‌బీ తొలగించగా, ఆభరణాల డిజైనర్ అయిన నిరవ్ మోదీ, ఆయన సంస్థపై సీబీఐకి ఫిర్యాదు కూడా చేసింది. ఇతర భారతీయ బ్యాంకుల నుంచి విదేశీ రుణాలను పొందేందుకు ముంబైలోని తమ శాఖ నుంచి మోసపూరితంగా లేఖలు పొందారన్న ఆరోపణలను మోదీ ఎదుర్కొంటున్నారు. కేవలం పది రోజుల్లో నిరవ్ మోదీ అనే ఒకే వ్యక్తి ద్వారా పీఎన్‌బీలో రెండు మోసాలు వెలుగుచూడటం ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఈ నేపథ్యంలోనే ఈ మోసంపై త్వరలో అన్ని బ్యాంకులు స్థితి నివేదిక (స్టేటస్ రిపోర్టు)ను సమర్పించాలని ఆర్థిక సేవల శాఖ ఆదేశించింది. ఇప్పటికే పెరుగుతున్న మొండి బకాయిలతో విమర్శల పాలవుతున్న ప్రభుత్వ బ్యాంకులు.. ఈ తరహా మోసాలతో మరింత ఇరుకునపడుతున్నాయి.



కుంభకోణం వెలుగుచూసింది ఈ శాఖలోనే

ప్రముఖ జ్యుయెల్లర్లపై నిఘా

పీఎన్‌బీ రూ.11,335 కోట్ల కుంభకోణంలో నిరవ్ మోదీ పాత్ర ప్రధానంగా కనిపిస్తుండటంతో ప్రముఖ జ్యుయెల్లర్లపైనా దర్యాప్తు సంస్థలు నిఘా పెట్టాయి. గీతాంజలి, గిన్ని, నక్షత్ర వంటి దిగ్గజాల ప్రమేయం ఏమైనా ఉందా? అన్న కోణంలో విచారణలు జరుగుతున్నాయి. వివిధ బ్యాంకులతో వీటికి ఉన్న సంబంధాలపై ఆరా తీస్తున్నట్లు పీటీఐకి ఓ ప్రభుత్వరంగ బ్యాంక్ సీనియర్ అధికారి తెలిపారు. మరోవైపు అవినీతిపరులను విడిచిపెట్టవద్దని, నిజాయితీపరులనూ ఇబ్బందిపెట్టవద్దని బ్యాంకులకు ఆర్థిక మంత్రిత్వ శాఖ నుంచి స్పష్టమైన సూచనలు వస్తున్నాయి. 2015లో ఢిల్లీకి చెందిన ఇద్దరు వ్యాపారులు బ్యాంక్ ఆఫ్ బరోడా, మరో ప్రభుత్వ రంగ బ్యాంకును రూ.6,000 కోట్లు మోసం చేసిన విషయం తెలిసిందే.

స్టాక్ మార్కెట్లకు బ్యాంకింగ్ దెబ్బ

సెన్సెక్స్ 144, నిఫ్టీ 39 పాయింట్లు క్షీణత

మొండి బకాయిలపై ఆర్బీఐ నిబంధనలు, పీఎన్‌బీ కుంభకోణం ప్రభావం

8 శాతానికిపైగా నష్టపోయిన వివిధ బ్యాంకుల షేర్లు

ముంబై, ఫిబ్రవరి 14:

దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ నష్టాల బాట పట్టాయి. మొండి బకాయిల (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ)పై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కొత్త నిబంధనలు, దేశీయ రెండో అతిపెద్ద ప్రభుత్వరంగ బ్యాంకైన పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణం ప్రభావం చూపాయి. ఈ నేపథ్యంలోనే బుధవారం ట్రేడింగ్‌లో బ్యాంకింగ్ రంగ షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. గరిష్ఠంగా 8 శాతం మేర నష్టపోయాయి. దీంతో సెన్సెక్స్ 144.52 పాయింట్లు పడిపోయి 34,155.95 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 38.85 పాయింట్లు కోల్పోయి 10,500.90 వద్ద నిలిచింది. నిజానికి ఆరంభంలో సూచీలు లాభాల్లోనే మొదలైనప్పటికీ.. సమయం గడుస్తున్నకొద్దీ నష్టాల్లోకి జారుకున్నాయి. చివరకు డిసెంబర్‌లో పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) పుంజుకున్నా, జనవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం స్వల్పంగా తగ్గినా మదుపరులు పట్టించుకోలేదు. ఆర్బీఐ ఎన్‌పీఏ నిబంధనలు, పీఎన్‌బీ కుంభకోణం భయాలకే అధికంగా ప్రభావితులయ్యారు. బ్యాంకింగ్ రంగాన్ని, ముఖ్యంగా ప్రభుత్వరంగ బ్యాంకులను ముప్పుతిప్పలు పెడుతున్న మొండి బకాయిల సమస్య పరిష్కారానికి ఆర్బీఐ సరికొత్త విధానంతో ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. 180 రోజుల గడువుతో ఓ రిజల్యూషన్ ప్లాన్‌ను పరిచయం చేసింది. ఈ ఆర్థిక సంవత్సరం (2017-18) మూడో త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్)లో మెజారిటీ ప్రభుత్వరంగ బ్యాంకులు భారీ నష్టాలను మూటగట్టుకున్న నేపథ్యంలో ఆర్బీఐ ఈ కఠిన నిబంధనలను తీసుకువచ్చింది. రిజల్యూషన్ ప్లాన్‌తో రుణాలు వసూలుకాని పక్షంలో సదరు ఖాతాను దివాలా ప్రక్రియ కోసం పంపాలని సూచించింది. ఈ క్రమంలో బ్యాంకులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కూడా హెచ్చరించింది. దీనికి తోడు పీఎన్‌బీలో దాదాపు రూ.11,335 కోట్ల కుంభకోణం వెలుగుచూడటం మదుపరులను ఒక్కసారిగా కలవరపెట్టింది. దీని ప్రభావం ఇతర బ్యాంకులపైనా ఉండొచ్చన్న అనుమానాల మధ్య బ్యాంకింగ్ షేర్లు భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. ఈ మోసపూరిత లావాదేవీ ద్వారా ఆయా బ్యాంకుల్లోని ఖాతాల్లోకి సొమ్ము బదలాయించబడినట్లు తెలుస్తుండటంతో దాదాపు అన్ని బ్యాంకుల షేర్లు ఒడిదుడుకులకు లోనయ్యాయి. దీంతో బ్యాంకింగ్ సూచీ 1.62 శాతం పతనం చెందగా, పీఎస్‌యూ, హెల్త్‌కేర్, పవర్, చమురు, గ్యాస్, ఆటో రంగాల షేర్లూ నష్టపోయాయి. అంతర్జాతీయంగా ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా మార్కెట్లు లాభాల్లో కదలాడాయి.

ఎల్టీసీజీ ప్రభావం ఉండదు: పీఎఫ్‌ఆర్‌డీఏ

ప్రతిపాదిత దీర్ఘకాలిక మూలధన లాభాల (ఎల్టీసీజీ) పన్ను.. జాతీయ పెన్షన్ స్కీం (ఎన్‌పీఎస్)పై పెద్దగా ప్రభావం చూపకపోవచ్చని పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్‌ఆర్‌డీఏ) చైర్మన్ హేమంత్ కాంట్రాక్టర్ అభిప్రాయపడ్డారు. ఎన్‌పీఎస్‌లోని పెట్టుబడులు ఎన్‌పీఎస్ ట్రస్టుల ద్వారానే జరుగుతున్నాయని, ఈ ట్రస్టుకు పన్ను మినహాయింపు వెసులుబాటు ఉన్నదన్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2018-19)గాను ఈ నెల 1న పార్లమెంట్‌లో ప్రకటించిన బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ఎల్టీసీజీని ప్రతిపాదించిన విషయం తెలిసిందే.

నష్టపోయిన బ్యాంక్ షేర్లు

సంస్థ	నష్టం (శాతాల్లో)
బ్యాంక్ ఆఫ్ ఇండియా	7.87
అలహాబాద్ బ్యాంక్	7.79
ఓరియంటల్ బ్యాంక్	7.43
కెనరా	5.82
సిండికేట్	4.49
యెస్ బ్యాంక్	4.40
ఐడీబీఐ	4.22
ఎస్బీఐ	4.06
యాక్సిస్	3.35
ఐసీఐసీఐ	2.29
బ్యాంక్ ఆఫ్ బరోడా	1.75



10 శాతం పతనమైన పీఎన్‌బీ షేర్లు

పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో వెలుగుచూసిన భారీ కుంభకోణం ఆ సంస్థ షేర్లను కుదిపేసింది. 10 శాతానికిపైగా పీఎన్‌బీ షేర్ల విలువ పతనమైంది. ముంబైలోని ఓ శాఖలో సుమారు రూ.11,335 కోట్ల మోసపూరిత ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు బయటపడిన నేపథ్యంలో బుధవారం ఒక్కరోజే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో బ్యాంక్ షేర్ విలువ 9.81 శాతం క్షీణించి రూ.145.80 వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లోనూ 10.29 శాతం దిగజారి రూ.145.20 వద్ద నిలిచింది. ట్రేడింగ్ మధ్యలోనైతే మరింతగా నష్టపోయాయి. తాజా పరిణామంతో పీఎన్‌బీ మార్కెట్ విలువ ఈ ఒక్క రోజే రూ.3,844 కోట్లు పడిపోయి రూ.35,365 కోట్లకు తగ్గింది.

పీఎన్‌బీలో భారీ స్కామ్

మొదటిపేజీ తరువాయి...

ఆయా ఖాతాదారులు ఇతర బ్యాంకుల ద్వారా విదేశాలకు తరలించినట్లు తెలుస్తున్నదని, దీంతో ఈ కుంభకోణం ఇతర బ్యాంకులకు కూడా విస్తరించే అవకాశం ఉన్నదని ఆ బ్యాంకు బుధవారం ఒక ప్రకటనలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కి వివరించింది. అయితే ఆ ఇతర బ్యాంకులు ఏవో పీఎన్‌బీ వెల్లడించలేదు. 'ముంబైలోని బ్రాడీ హౌస్ పీఎన్‌బీ శాఖలో పనిచేస్తున్న గోకుల్‌నాథ్ షెట్టి, మనోజ్ హనుమెంత్ ఖరత్ అనే ఉద్యోగులు మోసపూరిత అండర్‌టేకింగ్ లెటర్లు జారీ చేశారు. డైమండ్ ఆర్ యూఎస్, సోలార్ ఎక్స్‌పోర్ట్స్, స్టెల్లార్ డైమండ్ అనే సంస్థల్లో భాగస్వాములుగా ఉన్న ప్రముఖ వజ్రాల వ్యాపారి నిరవ్ మోదీ, నిశాల్ మోదీ, అమీ నిరవ్ మోదీ, మెహుల్ చినూభాయ్ చోక్సీ అనే వ్యక్తులతో కుమ్మక్కై వారు ఈ అక్రమాలకు పాల్పడ్డారు' అని పీఎన్‌బీ ఆ ప్రకటనలో స్పష్టం చేసింది. స్వభావ రీత్యా ఇవి తాత్కాలిక లావాదేవీలని, ఈ లావాదేవీలకు సంబంధించిన వాస్తవ వివరాలను లోతుగా పరిశీలించి వీటి వలన తమకు ఎంత నష్టం జరిగిందో నిగ్గు తేలుస్తామని పీఎన్‌బీ పేర్కొన్నది. ఈ అక్రమ లావాదేలకు పాల్పడిన నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ఈ కేసును ఇప్పటికే దర్యాప్తు సంస్థలకు నివేదించామని, పారదర్శకతకు పెద్దపీట వేసి బ్యాంకింగ్ కార్యకలాపాల్లో మచ్చ లేకుండా చూసేందుకు కట్టుబడి ఉన్నామని ఆ బ్యాంకు స్పష్టం చేసింది.



వజ్రాలతో పొదిగిన ఏనుగు బొమ్మ గురించి బ్రిటన్ యువరాజు చార్లెస్‌కు వివరిస్తున్న నిరవ్ మోదీ (ఫైల్‌ఫొటో)

నిరవ్ మోదీపై మరో రెండు ఫిర్యాదులు

పంజాబ్ నేషనల్ బ్యాంకులో ఇటువంటి అక్రమాలు జరగడం గత పది రోజుల్లో ఇది రెండోసారి. గతేడాది పీఎన్‌బీని రూ.280.70 కోట్ల మేరకు మోసగించారన్న అభియోగాలతో నిరవ్ మోదీతో పాటు ఆయన భార్య అమీ, సోదరుడు నిశాల్, వారి వ్యాపార భాగస్వామి మెహుల్ చోక్సీపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ఈ నెల 5వ తేదీన కేసు నమోదు చేసిన విషయం విదితమే. వీరంతా తమ బ్యాంకు అధికారులతో కలసి కుట్రకు పాల్పడి 'ఉద్దేశ్య పూర్వకంగా నష్టం' కలిగిస్తున్నారని పీఎన్‌బీ ఫిర్యాదు చేయడంతో ఆ కేసును దాఖలు చేసిన సీబీఐకి ఇప్పుడు తాజా కుంభకోణంలో నిరవ్ మోదీతో పాటు ఆయన జ్యూయెల్లరీ కంపెనీలపై మరో రెండు ఫిర్యాదులు అందాయి. ముంబై నగరంలోని తమ శాఖలో దాదాపు రూ.11,400 కోట్ల మోసపూరిత లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని, ఈ లావాదేవీల్లో నిరవ్ మోదీతో పాటు ఆయన జ్యూయెల్లరీ సంస్థ ప్రమేయం ఉందని పీఎన్‌బీ ఆ ఫిర్యాదుల్లో పేర్కొన్నట్లు అధికారులు వెల్లడించారు.

ఆందోళన అనవసరం: ఆర్థిక శాఖ

ఇదిలావుంటే, ఈ కుంభకోణం గురించి ఎవరూ పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిస్థితులేమీ చేయి దాటలేదని కేంద్ర ఆర్థిక శాఖ పేర్కొన్నది. ఈ కుంభకోణానికి సంబంధించి చర్యలు చేపడుతున్నామని, దీని వెనుక ఉన్న దోషులను కోర్టు ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించేందుకు ప్రయత్నిస్తామని కేంద్ర ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి రాజీవ్ కుమార్‌తో పాటు సంయుక్త కార్యదర్శి లోక్ రంజన్ స్పష్టం చేశారు.

జీఎమ్మార్ ఇన్‌ఫ్రా నష్టం 566 కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: ఈ ఆర్థిక సంవత్సరం (2017-18) మూడో త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్)లో జీఎమ్మార్ ఇన్‌ఫ్రా ఏకీకృత నికర నష్టం రూ.565.94 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం (2016-17) ఇదే వ్యవధిలో సంస్థ లాభం రూ.643.44 కోట్లుగా ఉన్నట్లు బుధవారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు జీఎమ్మార్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తెలియజేసింది. గతంతో పోల్చితే ఆదాయం తగ్గిపోగా, ఈసారి రూ.2,295.83 కోట్లుగా, పోయినసారి రూ.2,587.26 కోట్లుగా ఉన్నట్లు సంస్థ పేర్కొంది. కాగా, సంస్థాగత వ్యయం రూ.2,623.74 కోట్ల నుంచి రూ.2,487.90 కోట్లకు తగ్గించుకున్నట్లు వివరించింది. దేశ, విదేశాల్లో విమానాశ్రయాలు, విద్యుత్, రవాణా, పట్టణీకరణ తదితర మౌలిక రంగ ప్రాజెక్టులను జీఎమ్మార్ సంస్థ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

రెడ్‌మీ నోట్-5, నోట్-5ప్రో వచ్చేశాయ్

- తొలిసారి స్మార్ట్ ఎల్‌ఈడీ టీవీని ఆవిష్కరించిన షియోమీ
- 55 అంగుళాల అల్ట్రా స్లిమ్ యూహెచ్‌డీ మోడల్ ధర రూ.39,999

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: చౌక ధరలో ఎక్కువ ఫీచర్లతో మొబైల్ ఫోన్లను అందజేస్తూ వినియోగదారుల మన్ననలు పొందుతున్న చైనా సంస్థ షియోమీ దేశీయ మార్కెట్లో మరో రెండు స్మార్ట్‌ఫోన్లను ఆవిష్కరించింది. రూ.9,999 ప్రారంభ ధరతో రెడ్‌మీ నోట్-5ను, రూ.13,999 ప్రారంభ ధరతో రెడ్‌మీ నోట్-5ప్రో మోడళ్లను అందుబాటులోకి తీసుకొచ్చిన ఆ సంస్థ.. పనిలో పనిగా రూ.39,999 ధరతో 55 అంగుళాల స్మార్ట్ ఎల్‌ఈడీ టీవీని కూడా ఆవిష్కరించింది. 18:9 యాస్పెక్ట్ రేషియోతో షియోమీ రూపొందించిన తొలి బడ్జెట్ స్మార్ట్‌ఫోన్లు రెడ్‌మీ నోట్-5, నోట్-5ప్రోలే కావడం గమనార్హం. వీటిలో రెడ్‌మీ నోట్-5 ఫీచర్లను చూస్తుంటే.. షియోమీ గత ఏడాది చైనాలో ఆవిష్కరించిన రెడ్‌మీ నోట్-5 ప్లస్ స్మార్ట్‌ఫోన్‌కే పేరు మార్చి మన దేశంలో ప్రవేశపెట్టినట్లు స్పష్టమవుతున్నది. అయితే రెడ్‌మీ నోట్-5ప్రో మాత్రం రెడ్‌మీ నోట్-5 కంటే మరింత అప్‌గ్రేడెడ్ వెర్షన్. వెనుక డ్యూయల్ కెమేరా, వేగవంతమైన క్వాల్కమ్ స్నాప్‌డ్రాగన్ 636 ప్రాసెసర్‌తో రూపొందించిన రెడ్‌మీ నోట్-5ప్రోలో ఇక మిగిలిన ఫీచర్లన్నీ రెడ్‌మీ నోట్-5 లోనివే. రెడ్‌మీ నోట్-5 నాలుగు రంగుల్లో (బ్లాక్, గోల్డ్, రోజ్ గోల్డ్, బ్లూ), రెండు వేరియంట్లలో (3జీబీ ర్యామ్/32జీబీ రామ్, 4జీబీ ర్యామ్/64జీబీ రామ్) లభ్యమవుతుంది. వీటిలో బేసిక్ వేరియంట్ ధరను రూ.9,999 గానూ, ప్రీమియం వేరియంట్ ధరను రూ.11,999 గానూ నిర్ణయించారు. అలాగే రెడ్‌మీ నోట్-5ప్రో కూడా రెండు వేరియంట్లలో (4జీబీ ర్యామ్/64జీబీ రామ్, 6జీబీ రామ్/64జీబీ రామ్) లభ్యమవుతుంది. వీటిలో బేసిక్ వేరియంట్ ధరను రూ.13,999 గానూ, ప్రీమియం వేరియంట్ ధరను రూ.16,999 గానూ నిర్ణయించారు. ఈ రెండు ఫోన్లు ఎంఐయూఐ-9 ఆధారిత ఆండ్రాయిడ్ నౌగట్ ఆపరేటింగ్ సిస్టమ్‌తో పనిచేస్తాయి.



చైనా స్మార్ట్‌ఫోన్ సంస్థల హవా

- దేశీయ మార్కెట్లో 53 శాతం వాటా కైవసం ■ అగ్రస్థానంలో షియోమీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: దేశీయ మార్కెట్‌లో చైనా స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థలు దూసుకెళ్తున్నాయి. స్థానిక స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎంతగా ఊతమిస్తున్నప్పటికీ చైనా సంస్థల జోరు మాత్రం తగ్గడం లేదు. 2016 చివరి నాటికి దేశీయ మార్కెట్లో 34 శాతంగా ఉన్న చైనా స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థల వాటా 2017లో గణనీయంగా పెరిగి 53 శాతానికి చేరుకుందన్న ఐడీసీ (ఇంటర్నేషనల్ డాటా కార్పొరేషన్) గణాంకాలు ఈ విషయాన్ని మరోమారు స్పష్టం చేస్తున్నాయి. భారత్‌లోని దిగువశ్రేణి నగరాలు, పట్టణాల్లో ఉన్న డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని చైనా బ్రాండ్లు తమ వ్యాపారాన్ని వేగవంతంగా పెంచుకుంటున్నాయని ఐడీసీ ఇండియాకి చెందిన సీనియర్ మార్కెట్ విశ్లేషకుడు జైపాల్ సింగ్ తెలిపారు. వీటిలో అన్నింటి కంటే ముందున్న షియోమీ గతేడాది డిసెంబర్ చివరి నాటికే భారత స్మార్ట్‌ఫోన్ల మార్కెట్‌లో దక్షిణ కొరియా సంస్థ సాంసంగ్ ఆధిపత్యానికి తెర దించి అగ్రస్థానానికి దూసుకెళ్లింది.

'డాక్ ఆన్‌లైన్'కు స్టాండర్డ్ సర్టిఫికేషన్ గుర్తింపు

హైదరాబాద్, ఫిబ్రవరి 14: దేశంలో బహు భాషల్లో సేవలందిస్తూ వేగవంతంగా వృద్ధి చెందుతున్న ఆన్‌లైన్ డాక్టర్ కన్సల్టేషన్ ప్లాట్‌ఫామ్ 'డాక్ ఆన్‌లైన్'కు స్టాండర్డ్స్ సర్టిఫికేషన్ కౌన్సిల్ నుంచి గుర్తింపు లభించింది. ఐఎస్‌ఓ 9001:2015 కింద ఈ ఏడాది జనవరి నుంచి తమకు ఈ గుర్తింపు లభించిందని, దీంతో దేశంలో ఈ ప్రమాణాలను అందుకున్న తొలి హెల్త్ స్టార్టప్‌గా తమ సంస్థ ఆవిర్భవించిందని 'డాక్ ఆన్‌లైన్' బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాల సంస్థ (ఐఎస్‌ఓ) 9001:2015 క్వాలిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, పెర్ఫార్మెన్స్‌పై దృష్టి కేంద్రీకరించి నాణ్యమైన సేవలను అందించే సంస్థలకు ఈ గుర్తింపును ఇస్తున్న విషయం తెలిసిందే.

అపోలో హాస్పిటల్స్ లాభం 67 కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ స్టాండలోన్ నికర లాభం గతేడాది అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో 7.4 శాతం పడిపోయి రూ.67.44 కోట్లుగా నమోదైంది. అంతకుముందు ఏడాది ఇదే వ్యవధిలో రూ.72.83 కోట్ల లాభాన్ని అపోలో అందుకున్నది. ఆదాయం ఈసారి రూ.1,896.14 కోట్లుగా, పోయినసారి రూ.1,680.61 కోట్లుగా ఉన్నట్లు బుధవారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు వెల్లడించింది. ఖర్చులు మాత్రం గతంతో పోల్చితే రూ.1,599.62 కోట్ల నుంచి రూ.1,806.16 కోట్లకు పెరిగినట్లు స్పష్టం చేసింది.

ఉన్నత విద్యామండలి 'క్వాలిటీ క్యాలండర్'

కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్న అధికారులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఉన్నత, సాంకేతిక విద్యాభివృద్ధిపై అధికారులు నిర్దిష్ట ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. నాణ్యమైన ఉన్నతవిద్యా కార్యాచరణ కోసం ఉన్నత, సాంకేతిక విద్యామండలి ముమ్మర కసరత్తు చేస్తున్నది. ఏయే నెలలో ఏయే చర్యలు చేపట్టాలనేది నిర్ణయించుకుని అమలు చేసేందుకు వీలుగా 'క్వాలిటీ క్యాలండర్'ను రూపొందించుకోవాలని అధికారులు భావిస్తున్నారు. యూనివర్సిటీల వారీగా క్యాలండర్‌ను అమలు చేయనున్నారు. దీని ప్రకారం యూనివర్సిటీల వైస్‌చాన్స్‌లర్లతో సమావేశాలు నిర్వహించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల అధ్యాపకులకు బోధనలో మెళకువలను నేర్పించే విధానానికి పరిశ్రమల సహకారం కూడా తీసుకోవాలని అధికారులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఏప్రిల్ 1 నుంచి ప్రారంభించి వచ్చే ఏడాది మార్చి 31తో ముగించి ఉన్నత విద్యలో నాణ్యత కోసం సమగ్ర నివేదికలను తయారు చేయాలని ఉన్నత, సాంకేతిక విద్యామండలి భావి స్తున్నది. దీనిపై ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి ఆధ్వర్యంలో వారంలోగా ఒక కమిటీ ఏర్పాటు కానున్నది. రాష్ట్రంలో ఇప్పటికే డిమాండ్ లేని కోర్సులు, కాలేజీలు ఒక్కొక్కటిగా మూత పడుతున్నాయి. ఈ నేపథ్యంలో నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రైవేటు డిగ్రీ, జూనియర్, ఇంజినీరింగ్, ఫార్మసీ వంటి కోర్సుల్లో కొత్త కాలేజీల ఏర్పాటుకు అధికారులు అనుమతి నిరాకరిస్తున్నారు. ఏయే కోర్సులకు డిమాండ్ ఉన్నదో సర్వే చేశాక తుది నిర్ణయం తీసుకుంటున్నారు.

బోధనా వైద్యుల ఎంపికకు కొత్తవిధానం

మారిన ఐఎంసీ నిబంధనలతో ప్రభుత్వ దవాఖానల్లో తీరనున్న బోధనాసిబ్బంది కొరత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బోధనా వైద్యుల నియామకాలకు ఇండియన్ మెడికల్ కౌన్సిల్(ఐఎంసీ) రూపొందించిన కొత్త విధానాలు ఉపయుక్తంగా మారనున్నాయి. తద్వారా రాష్ట్రంలోని వైద్యకళాశాలల్లో బోధనాసిబ్బంది కొరతను సులభంగా తీర్చే అవకాశం ఉంది. సీనియారిటీ ఉన్న వైద్యులను బోధకులుగా గుర్తించేందుకు సులభ అంశాలను చేర్చుతూ ఇటీవల నిబంధనలను (ఐఎంసీ) సవరించింది. ఎంసీఐ నిర్ణయంతో కొత్తగా ఏర్పాటయ్యే వైద్యకళాశాలల్లో బోధకుల కొరత తీర్చేందుకు మార్గం సుగమవుతుంది. తెలంగాణలో త్వరలో నాలుగు కొత్త వైద్యకళాశాలలను ప్రారంభించాల్సి ఉన్నది. ఎంసీఐ కొత్త నిబంధనల ప్రకారం జిల్లాస్థాయి దవాఖానల్లో పనిచేసే వైద్యులను బోధకులుగా గుర్తించి నియమించవచ్చు. దీనికి ఎంసీఐ కనీస అర్హతలు నిర్ణయించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోని దవాఖానల్లో, 300 పడకల నాన్ టీచింగ్ జిల్లా దవాఖానల్లో పనిచేస్తున్న వైద్యులు పోస్టు గ్రాడ్యుయేషన్‌లో చేరాక రీసెర్చ్ ప్రచురణను తొలి సంపాదకుడుగా, కరస్పాండెంట్‌గానైనా వెలువరించి ఉండాలి. దీంతోపాటు ప్రత్యేక అంశంలో జిల్లాస్థాయి దవాఖానలో కనీసం 18 ఏండ్లు పనిచేసి ఉంటే అటువంటి వైద్యుడిని ప్రొఫెసర్‌గా గుర్తిస్తారు. 300 పడకల జిల్లా దవాఖానలో పదేండ్ల అనుభవం కలిగి, పీజీ స్థాయిలో రెండు పరిశోధనా పత్రాలను తొలిసంపాదకుడుగా, కరస్పాండెంట్‌గా వెలువరించినవారిని అసోసియేట్ ప్రొఫెసర్‌గా గుర్తిస్తారు. ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ పీజీ డిగ్రీ పూర్తిచేసి 300 బెడ్ల సామర్థ్యం ఉన్న జిల్లా దవాఖానలో సీనియర్ రెసిడెంట్‌గా పనిచేసిన వారికి అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్‌గా అవకాశం కల్పించాలని కూడా నిబంధనలను రూపొందించారు. మార్చిన నిబంధనలతో ఎక్కువ మంది వైద్యులకు ప్రయోజనం కలుగనుంది. దీంతో బోధనాసిబ్బంది కొరత త్వరగా తీరుతుంది.

పోలీసుశాఖలో నిర్మాణాలకు కసరత్తు

- కొత్తగా నాలుగు డివిజన్ల ఏర్పాటు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పోలీసుశాఖలో కొత్త భవనాలు నిర్మించేందుకు ఆ శాఖ హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటివరకు కార్పొరేషన్‌కు రాష్ట్రంలో ఏడు డివిజన్లు పనిచేస్తుండగా, ఇటీవల కొత్తగా మరో నాలుగు డివిజన్లు ఏర్పాటుచేశారు. రాష్ట్రంలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌కు సిటీ-1, సిటీ-2, సైబరాబాద్, సంగారెడ్డి, హైదరాబాద్ రేంజ్, వరంగల్, కరీంనగర్ వంటి ఏడు డివిజన్లు ఇప్పటికే ఉన్నాయి. కొత్త భవనాలు నిర్మించనున్న నేపథ్యంలో నల్లగొండ, ఖమ్మం, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలను నాలుగు డివిజన్లుగా ఏర్పాటుచేశామని, దీంతో పనుల్లో నాణ్యత, వేగం పెరుగుతుందని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ తెలిపారు. నలుగురు డిప్యూటీ ఇంజినీర్లకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా పదోన్నతి కల్పించి, కొత్త డివిజన్ల బాధ్యతలు అప్పగించారు. రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటుతో జిల్లా పోలీసు అధికారుల భవనాలు, కమిషనరేట్ భవనాలతోపాటు 300 అర్బన్ పోలీసుస్టేషన్ల భవనాలను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధంచేశామని చెప్పారు. ఈసారి బడ్జెట్‌లో నిధులు కేటాయించిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

- వేలాలలో భక్తుల రద్దీ



మంచిర్యాల జిల్లా వేలాలలో రెండో రోజు బుధవారం భక్తుల రద్దీ కొనసాగింది. మంగళవారం గుట్టపై గట్టు మల్లన్నను దర్శించుకున్న భక్తులు, బుధవారం గుట్ట కిందకు పయనమయ్యారు. గ్రామంలోని మల్లికార్జునస్వామిని దర్శించుకునేందుకు బారులు తీరారు. తొలిరోజు 2 లక్షల మంది, బుధవారం సుమారు 80వేల మంది దర్శించుకున్నారు. - జైపూర్

బండలాగుడు పోటీలు ప్రారంభం

మేళ్ల చెర్వు: సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు శివాలయంలో మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా తెలుగు రాష్ట్రాలస్థాయి ఎద్దుల పందేల(బండలాగుడు)తోపాటు కబడ్డీ పోటీలను విద్యుత్, ఎస్సీ అభివృద్ధి శాఖల మంత్రి జగదీశ్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కబడ్డీ క్రీడాకారులను పరిచేయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జి కాసోజు శంకరమ్మ, కోదాడ మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఎడ్ల పందేలను ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

నేత్రపర్వంగా రథోత్సవం



ఐదో శక్తిపీఠమైన అలంపూర్ జోగులాంబ క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కీలకఘట్టమైన రథోత్సవాన్ని బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ప్రధాన ఆలయం నుంచి హంస వాహనంపై జోగులాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామివార్ల ఉత్సవ మూర్తులను ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై, 'పోలు' (ఈ ప్రాంతంలో పండిన ధాన్యాన్ని) చల్లి, మొక్కు చెల్లించారు. - అలంపూర్, నమస్తే తెలంగాణ



కరీంనగర్ కలెక్టరేట్‌లో మిషన్ భగీరథ పనులపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి ఈటల రాజేందర్

మార్చిలో అన్ని గ్రామాలకు భగీరథ నీళ్లు..

- 'డబుల్' నిర్మాణాల్లో వేగం పెంచాలి
- మంత్రి ఈటల రాజేందర్

కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ఈ ఏడాది మార్చి మొదటివారంలో కరీంనగర్ జిల్లాలోని అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ బల్క్ వాటర్ అందిస్తామని రాష్ట్ర ఆర్థిక, పౌర సరఫరాలశాఖ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. బుధవారం కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో మిషన్ భగీరథ, డబుల్‌బెడ్‌రూం ఇండ్ల నిర్మాణప్రగతి, భూరికార్డుల ప్రక్షాళనపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా మిషన్ భగీరథ పథకంపై ప్రతి 15 రోజులకొకసారి సమీక్షిస్తున్నారన్నారు. భగీరథ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలనీ, ఎక్కువ మంది కూలీలను పెట్టి మిషన్లు ఏర్పాట్లు చేయాలని సూచించారు. నిధులకు కొరత లేదనీ, బిల్లులు రాగానే వెంటనే పేమెంట్ చేస్తున్నామన్నారు. జిల్లాకు మంజూరైన డబుల్ ఇండ్ల నిర్మాణాలన్నింటినీ దసరా లోపు పూర్తిచేయాలని ఆదేశించారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లకు అవసరమైన సిమెంట్, ఐరన్ తక్కువ ధరకు ఇప్పిస్తామన్నారు. మార్చి 11న రైతులకు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కరీంనగర్ జడ్పీ అధ్యక్షురాలు తుల ఉమ, కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, రాష్ట్ర సాంస్కృతిక సారథి రసమయి బాలకిషన్, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, చొప్పదండి, హుస్నాబాద్ ఎమ్మెల్యేలు బొడిగె శోభ, వొడితెల సతీశ్‌కుమార్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ అక్బర్ హుస్సేన్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రావీణ్య, అధికారులున్నారు.

శరవేగంగా కాళేశ్వరం

- రెట్టింపు వేగంతో ప్రాజెక్టు నిర్మాణం
- గ్రావిటీ కెనాల్, మట్టి పనుల్లోనూ అదే ఉత్సాహం
- రోజుకు 25వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు
- జాతరను తలపిస్తున్న బారాజ్‌లు, పంప్‌హౌస్‌లు

జయశంకర్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: తెలంగాణకు వరప్రధాయిని కానున్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో వేగం పెరిగింది. సీఎం కేసీఆర్ సందర్శన అనంతరం జెట్‌స్పీడ్‌తో సాగుతున్నాయి. అంతకు ముందు మూడు బరాజ్‌లు, మూడు పంప్‌హౌస్‌ల వద్ద రోజు సుమారు 12వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు జరిగితే, ఇప్పుడు అది 23వేల క్యూబిక్ మీటర్లకు చేరింది. సీఎం లక్ష్యాలను నిర్దేశించడం, మంత్రి హరీశ్‌రావు పనులను పరుగెత్తించడం వల్ల ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో వేగం వందశాతం పెరిగింది. మరి కొద్దిరోజుల్లో రోజుకు 25వేల క్యూబిక్ మీటర్లకు పెంచే దిశలో ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు ప్లాన్ చేసి, బాధ్యతలను ఇంజినీర్లకు అప్పగించారు. కన్నెపల్లి-అన్నారం గ్రావిటీ కెనాల్ కోసం నిత్యం 1.74లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి పనులు కొనసాగుతున్నాయి. అంతేకాకుండా నిర్మాణ పనుల్లో మరింత స్పీడ్ పెంచేందుకు సాగునీటి శాఖ ఇంజినీర్లు పక్కా ప్రణాళికతో సాగుతుండగా, ఇంత వేగంగా నిర్మాణ పనులు జరుగుతున్న సాగునీటి ప్రాజెక్టుల్లో ఈ ప్రాజెక్టుది ప్రపంచంలో నెంబర్ వన్ స్థానంలో నిలుస్తున్నది. క్షేత్రస్థాయిలో బరాజ్‌లు, పంప్‌హౌస్‌లు, గ్రావిటీ కెనాల్ పనులను చూసేందుకు ప్రాజెక్టు బాటపడుతున్నారు. కొందరు ఎమ్మెల్యేలు సైతం రైతులతో కలిసి కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శిస్తున్నారు. కొద్దిరోజుల నుంచి రైతుల కాళేశ్వరం పర్యటన జాతరను తలపిస్తుంది. ప్రతీ రోజు రైతులు ఈ ప్రాజెక్టు బరాజ్‌లు, పంప్‌హౌస్‌లు, గ్రావిటీ కెనాల్‌కు వస్తున్నారు. వచ్చే వానాకాలం నుంచి 'కాళేశ్వరం' ద్వారా రైతులకు సాగునీరు అందిస్తామని సీఎం కేసీఆర్ ఇటీవల స్పష్టం చేశారు. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు, కన్నెపల్లి, సిరిపురం, గోలివాడ పంప్‌హౌస్‌ల నిర్మాణ పనులను జూన్ లోపు పూర్తి చేయాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని అధిగమించే పనిలో ఇంజినీర్లు తలమునకలయ్యారు.



కాళేశ్వరం ప్రాజెక్టు పనులు వేగంగా సాగుతున్నాయి. మూడు బరాజ్‌లు, మూడు పంప్‌హౌస్‌ల వద్ద ప్రతీ రోజు సుమారు 23వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు జరుగుతున్నాయి. నిర్మాణ స్థలాలు జాతరను తలపిస్తుండగా, ప్రముఖుల సందర్శనలతో ప్రాజెక్టు ప్రదేశాలు కళకళలాడుతున్నాయి.

కన్నెపల్లిలో కొనసాగుతున్న పంప్‌హౌస్ పనులు

రైతన్నల సంబురం

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులను స్వయంగా వీక్షించేందుకు వివిధ జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో రైతులు తరలివచ్చి, వచ్చే వానాకాలం తమ నియోజకవర్గానికి సాగు నీరు అందుతుందనే ధీమా వ్యక్తం చేశారు. కొద్దిరోజుల క్రితం ట్రైనీ ఐఏఎస్‌లు ఎనిమిది మంది, రాష్ట్రంలోని ఐఎఫ్ఎస్ అధికారులు సందర్శించి పనుల వివరాలు తెలుసుకొని వెళ్లారు. ఇలా ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు నిత్యం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు, పంప్‌హౌస్‌లను చూసి ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశంసిస్తున్నారు.


రాష్ట్రంలో నేరాలు తగ్గాయి

- 'ఫీల్ ద జైలు' ప్రపంచానికే ఆదర్శం
- రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ వీకే సింగ్



సంగారెడ్డిలోని పాత జైలు మ్యూజియంలో జైళ్ల శాఖ వారోత్సవాలను ప్రారంభిస్తున్న డీజీ వినయ్‌కుమార్ సింగ్

సంగారెడ్డి రూరల్ : రాష్ట్రంలో నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టిందని జైళ్ల శాఖ డీజీ వినయ్‌కుమార్ సింగ్ అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పాత జైలు మ్యూజియంలో ఈ నెల 14 నుంచి 19 వరకు నిర్వహించనున్న ఆ శాఖ వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంగారెడ్డిలో పాత జైలు మ్యూజియంలో ఏర్పాటు చేసిన 'ఫీల్ ద జైలు' కార్యక్రమం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఎంతో మంది ప్రముఖులు ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా ఈ కాన్సెప్ట్ గురించి తెలుసుకుని ఒక రోజు జైలు జీవితాన్ని అనుభవించి అనుభూతులను పంచుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జైలు శాఖ హైద్రాబాద్ రేంజ్ డీఐజీ సైదయ్య, జిల్లా జైలు సూపరింటెండెంట్ సంతోష్ కుమార్ రాయ్, జిల్లా సబ్ జైళ్ల అధికారి వెంకటేశ్వర్లు, డీఎస్పీ శ్రీనివాస్‌కుమార్ పాల్గొన్నారు.



ఇంటి యజమానులను సన్మానిస్తున్న నిరంజన్‌రెడ్డి

పాతబస్తీలను అభివృద్ధిపరుస్తాం

వనపర్తి, నమస్తే తెలంగాణ : పాతబస్తీలను అభివృద్ధి పరుచడంతోపాటు ప్రజల ఆరోగ్య, జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తానని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని పాతకోటలో ఉన్న కందకం పనులను ఆయన పరిశీలించారు. అంతకు ముందు కందకంలో అక్రమంగా కట్టుకున్న ఇండ్లకు సంబంధించిన యజమానులతో నిరంజన్‌రెడ్డి మాట్లాడారు. ఈ నెలాఖరున మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా పనులను ప్రారంభించనున్నట్టు చెప్పారు. తమ ఇండ్లను తొలగించుకునేందుకు ముందుకు వచ్చిన వారిని సన్మానించారు.



మహబూబాబాద్ జిల్లా తొర్రూరు, పెద్దవంగర మండలాల్లో ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు బుధవారం పర్యటించారు. తొమ్మిది గ్రామాల్లో 345డబుల్ బెడ్‌రూం ఇండ్లు, రెండు సబ్ స్టేషన్లు, బీటీ, సీసీ రోడ్లు, తదితర మొత్తం రూ.25.80కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించారు. - తొర్రూరు, నమస్తే తెలంగాణ

టీఆర్‌ఎస్‌లోకి భారీగా చేరికలు



హైదరాబాద్‌లో సుమీర్ హైమద్‌కు కండువా కప్పుతున్న ఎంపీ కవిత



మహబూబ్‌నగర్ జిల్లా పెద్దాయకుంట తండాలో మంత్రి లక్ష్మారెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరిన గిరిజనులు



నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పల్‌పహాడ్‌లో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

నెట్‌వర్క్: ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులవుతున్న వివిధపార్టీల నేతలు టీఆర్‌ఎస్‌లో భారీగా చేరుతున్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గొల్లపల్లి పంచాయతీలోని పెద్దాయకుంట తండాలో మంత్రి లక్ష్మారెడ్డి సమక్షంలో 60 మంది గిరిజనులు టీఆర్‌ఎస్‌లో చేరారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో హన్వాడ మండలం వేపూర్ గ్రామానికి చెందిన 30 మంది కాంగ్రెస్, బీజేపీ నాయకులు, అడ్డాకుల, గుడిబండకు చెందిన 180 మంది వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు టీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలోని మొరిపిరాల, చిన్న గూడెం గ్రామానికిచెందిన 300 మంది కాంగ్రెస్, టీడీపీ నాయకులు టీఆర్‌ఎస్ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్‌రెడ్డి సమక్షంలోటీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం ఉప్పల్‌పహాడ్ గ్రామానికి చెందిన టీడీపీ, కాంగ్రెస్ నాయకులు దాదాపు 150 మంది వంగూరు మండల కేంద్రంలో ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో చేరారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు సుమీర్ హైమద్ హైదరాబాద్‌లో ఎంపీ కల్వకుంట్ల కవిత, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయనను ఎంపీ కవిత కండువా కప్పి టీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్ నాయకులను తరిమికొట్టండి

- త్వరలో ఉదండాపూర్ రిజర్వాయర్ పనులు
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి



బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి లక్ష్మారెడ్డి

జడ్చర్ల టౌన్: తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని అడుగడుగునా అడ్డుకోవాలని చూస్తున్న కాంగ్రెస్ నాయకులను రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని వైద్యఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గొల్లపల్లి పంచాయతీలోని పెద్దాయకుంట తండారోడ్డును రూ.30 లక్షలతో బీటీగా మార్చే పనులకు బుధవారం మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. త్వరలోనే ఉదండాపూర్ రిజర్వాయర్ పనులను ప్రారంభిస్తున్నామన్నారు. పాలమూరు ఎత్తిపోతలతో జడ్చర్ల నియోజకవర్గంలో లక్షా 50 వేల ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. అనంతరం కుర్వగడ్డపల్లి సమీపంలోని మీనాంబరం వాగు వద్ద ఉన్న పరుశవేదీశ్వరాలయాన్ని, జడ్చర్లలోని శివగిరి క్షేత్రాన్ని మంత్రి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. బాదేపల్లి నగర పంచాయతీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎల్ఈడీ సెంట్రల్ లైటింగ్ సిస్టంను ప్రారంభించారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బాద్మి శివకుమార్, టీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పథకాల అమల్లో ఉద్యోగులకు దేశవ్యాప్త గుర్తింపు

- రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవిప్రసాద్



కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లో మాట్లాడుతున్న చైర్మన్ దేవిప్రసాద్

తిమ్మాపూర్, నమస్తే తెలంగాణ: సంక్షేమ పథకాల అమల్లో తెలంగాణ ఉద్యోగులకు దేశవ్యాప్త గుర్తింపు లభిస్తున్నదని రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవిప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని ఎస్సారెస్పీ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడున్నరేండ్లలో సమగ్రసర్వే నుంచి భూరికార్డుల ప్రక్షాళన వరకు దేశంలో ఏ ఉద్యోగులు చేయలేని అన్ని కార్యక్రమాలు విజయవంతం చేశామని తెలిపారు. కేవలం 24 గంటల్లో సమగ్ర సర్వే చేసిన ఘనత తెలంగాణ ఉద్యోగులదేనని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆశ వర్కర్లు, అంగన్‌వాడీలు, హోంగార్డులకు వేతనాలు పెంచారన్నారు. దేశవ్యాప్తంగా రాష్ట్రానికి వివిధ రంగాల్లో ఇప్పటి వరకు 18 అవార్డులు రావడం వెనుక ఉద్యోగుల కృషి ఉందన్నారు. రైతులను కేంద్రీకృతంగా చేస్తూ ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న పెన్షన్ విధానాన్ని ఎన్డీయే, యూపీఏ ప్రభుత్వాలు కొల్లగొట్టాయనీ ఆరోపించారు. ఈ రెండు ప్రభుత్వాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా మార్చిలో టీఎన్జీవోస్ తరుపున బహిరంగ సభ నిర్వహించబోతున్నట్టు తెలిపారు. సమావేశంలో టీఎన్జీవోస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎంఏ హమీద్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి మడిపల్లి కాళీచరణ్, రాష్ట్ర కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, ఎల్ఎండీ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు మామిడి రమేశ్, గొడిశాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

17న ప్రగతిభవన్‌కు చిన్నారి విగ్నేశ్

- బాలుడి కోరికను తీర్చనున్న సీఎం కేసీఆర్



కాజీపేట: 'మస్క్యులర్ డిస్ట్రోఫీ' అనే జన్యుపర వ్యాధితో బాధపడుతున్న వరంగల్ అర్బన్ జిల్లా కాజీపేట పట్టణానికి చెందిన కొక్కొండ విగ్నేశ్(11) ఈ నెల 17న ప్రగతి భవన్‌కు వెళ్లనున్నాడు. టీవీల్లో తరచూ కనిపిస్తున్న ముఖ్యమంత్రిని చూసి, 'సీఎం కేసీఆర్ తాత'ను చూడాలని విగ్నేశ్ మారాం చేస్తుండేవాడు. ఈ విషయాన్ని బంధువుల ద్వారా తెలుసుకున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి చిలువేరు శంకర్, సీపీఐ నాయకుడు నారాయణ, స్పీకర్ మధుసూదనాచారితో పాటు ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ సీఎం క్యాంపు కార్యాలయానికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన సీఎం కేసీఆర్, విగ్నేశ్‌ను హైదరాబాద్ ప్రగతి భవన్‌కు తీసుకురావాలని సూచించారు. ఏడాదికి మించి తమ బాబు బతుకలేడని వైద్యులు సూచించారనీ, తమ బాబు చివరి కోరికను తీర్చేందుకు ఒప్పుకున్న ముఖ్యమంత్రికి విగ్నేశ్ తల్లిదండ్రులు కొక్కొండ సతీశ్-సరిత కృతజ్ఞతలు తెలిపారు.

ఇక నీట్‌తోనే 'ఆయుష్' అడ్మిషన్లు

వరంగల్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఆయుష్ కోర్సుల్లో అడ్మిషన్లు పొందాలనుకునే విద్యార్థులు ఆన్‌లైన్‌లో నీట్ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని కాళోజీ హెల్త్ అండ్ మెడికల్ సైన్సెస్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి చెప్పారు. 'ఆయుష్' కోర్సులైన ఆయుర్వేదం, యునానీ, హోమియోపతి, నేచురోపతి కోర్సుల్లో అడ్మిషన్లు ఈసారి గతంలో లోగా ఉండవనీ, కేంద్ర ఆయుష్ మంత్రిత్వశాఖ కొత్త మార్గదర్శకాలకు అనుగుణంగా ఆయా కోర్సుల్లో అడ్మిషన్లు పొందాలనుకునే వారు కచ్చితంగా నీట్ రాయాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు.

సెల్‌ఫోన్ కొనివ్వలేదని ఆత్మహత్య

మల్దకల్: జోగుళాంబ గద్వాల జిల్లాలో మల్దకల్ మండలంలోని మల్లెందొడ్డి గ్రామంలో తండ్రి స్మార్ట్‌ఫోన్ కొనివ్వలేదని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థుల వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన తెలుగు మంగమ్మ, సవారన్న కొడుకు శివకుమార్(18) ఏడో తరగతి దాకా చదివి, తండ్రికి పొలం పనుల్లో సాయపడుతున్నాడు. తనకు స్మార్ట్‌ఫోన్ కొనివ్వమని తండ్రిని కోరగా, ప్రస్తుతం తన వద్ద డబ్బులు లేవనీ, మిరప పంట అమ్మిన డబ్బులు వచ్చిన తర్వాత కొనిస్తామని చెప్పాడు. దీంతో మనస్తాపానికి గురైన శివకుమార్, పొలం దగ్గరికి వెళ్లి క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన చుట్టుపక్కల వారు గద్వాల దవాఖానకు తరలించగా అప్పటికే మృతిచెందినట్టు డాక్టర్లు తెలిపారు.

ఏసీబీ వలలో అధికారులు

- రూ.లక్ష తీసుకుంటూ పట్టివేత



యాదయ్య, శ్యాంసుందర్

కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: కూరగాయల కాంట్రాక్టర్ నుంచి రూ. లక్ష లంచం తీసుకుంటూ ఎస్సీ అభివృద్ధిశాఖ వార్డెన్ శ్యాంసుందర్ ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఎస్సీ అభివృద్ధిశాఖ డిప్యూటీ డైరెక్టర్ పెరుక యాదయ్య ఒత్తిడి మేరకే డబ్బు తీసుకున్నామని సదరు వార్డెన్ వాగ్మూలం ఇవ్వడంతో ఆయనను కూడా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ వరంగల్ రేంజ్ డీడీ సుదర్శన్‌గౌడ్ వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పలు ఎస్సీ వసతి గృహాలకు కూరగాయలు సరఫరా చేసే కాంట్రాక్టర్ బాకం కనకయ్యకు 2018-19 సంవత్సరానికి గానూ టెండర్లు ఇప్పిస్తానని డీడీ యాదయ్య రూ.2 లక్షలు డిమాండ్ చేశాడు. రూ.1.30 లక్షలు ఇచ్చేందుకు కాంట్రాక్టర్ కనకయ్య అంగీకరించాడు. ఆ డబ్బులు వసూలు చేయాలని స్థానిక రాంనగర్‌లోని హాస్టల్‌వార్డెన్ శ్యాంసుందర్‌కు చెప్పగా, కనకయ్యపై వార్డెన్ ఒత్తిడి పెంచాడు. దీంతో కనకయ్య ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శ్యాంసుందర్ తన ఇంటిలో కనకయ్య నుంచి లంచం తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు. డీడీ ఒత్తిడి మేరకే తీసుకున్నానని వార్డెన్ చెప్పగా, అప్పటికే కార్యాలయంలోనే ఉన్న డీడీ యాదయ్యను మరో బృందం ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

చిరుత దాడిలో ఒకరికి గాయాలు

తాండూరు, నమస్తే తెలంగాణ: వికారాబాద్ జిల్లా తాండూరు మండలం మల్కాపూర్ గ్రామం వద్ద ఉన్న ఐసీఎల్ సిమెంట్ కర్మాగార కార్మికుడు శివకుమార్ బుధవారం సాయంత్రం స్వగ్రామం కరన్‌కోట్‌కు వెళ్తుండగా, చిరుత దాడి చేసింది. దాడిలో యువకుడి ముఖం, గొంతుపై గాయాలు కాగా, జిల్లా దవాఖానలో చికిత్స పొందుతున్నాడు.



విజేతగా నిలిచిన తెలంగాణ రాష్ట్ర బాలుర జట్టు

తెలంగాణ డబుల్ ధమాకా

- బాల, బాలికల విభాగంలో టైటిల్స్ కైవసం
- జాతీయ ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ టోర్నీ

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్: జాతీయ ఎస్‌జీఎఫ్ అండర్-17 హ్యాండ్‌బాల్ టోర్నీలో తెలంగాణ బాలబాలికల జట్లు చాంపియన్‌గా నిలిచాయి. విజేతలకు స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయి టోర్నీలో తెలంగాణ జట్లు చాంపియన్‌గా నిలవడం ఆనందంగా ఉందన్నారు. బుధవారం ఢిల్లీ బాలుర జట్టుతో జరిగిన ఫైనల్లో తెలంగాణ రాష్ట్ర ట్టు 17-13 పాయింట్ల తేడాతో విజయం సాధించగా, బాలికల విభాగంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తెలంగాణ బాలికల జట్టు ఢిల్లీపై 10-04 స్కోర్ తేడాతో విజయం సాధించింది. బాలికల విభాగంలో హర్యానా, బాలుర విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టు మూడో స్థానంలో నిలిచింది.



విజేతగా నిలిచిన తెలంగాణ రాష్ట్ర బాలికల జట్టు

ఫైనల్లో ఆరుగురు భారత బాక్సర్లు

జకార్తా: భారత బాక్సర్లు అదురగొడుతున్నారు. ఆసియా గేమ్స్ టెస్ట్ ఈవెంట్‌లో ఆరుగురు ఫైనల్లోకి దూసుకెళ్లి తమ సత్తా చాటారు. ఇందులో ప్రపంచ యూత్ చాంపియన్ శశి చోప్రా(57కి)తో సహా పవిత్ర(60కి), మనీశ్ కౌశిక్(60కి), శ్యామ్‌కుమార్(49కి), షేక్ సల్మాన్ అన్వర్(52కి), అశిష్(64కి) ఉన్నారు. మరోవైపు ముహమ్మద్ ఎతాశ్‌ఖాన్(56కి), రితు గ్రెవాల్(51కి), పవన్ కుమార్(69కి), అశిష్ కుమార్(75కి) ప్రత్యర్థుల చేతుల్లో ఓటములతో కాంస్య పతకాలకు పరిమితమయ్యారు. 57కిలోల సెమీస్ బౌట్‌లో శశి 4-1తో రెజా పస్యూట్(ఫిలిప్పీన్స్)పై అలవోక విజయం సాధించి సవాటో(థాయ్‌లాండ్)తో ఆఖరి పోరుకు సిద్ధమైంది. మరో సెమీస్‌లో పవిత్ర 5-0తో వాంగ్ హ్యుజాంగ్(దక్షిణకొరియా)ను చిత్తుగా ఓడించింది. పురుషుల విభాగంలో తెలుగు బాక్సర్ శ్యామ్ కుమార్‌కు సెమీస్‌లో ముహమ్మద్ ఫాద్(మలేసియా) నుంచి వాకోవర్ లభించింది.

రబాడపై జరిమానా



దుబాయ్: నోటి దురుసుతనం వల్ల దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబాడ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. మంగళవారం భారత్‌తో జరిగిన ఐదో వన్డేలో ఓపెనర్ ధవన్ పట్ల రబాడ దురుసుగా ప్రవర్తించాడు. ఇన్నింగ్స్ ఎనిమిదో ఓవర్లో తన బౌలింగ్‌లో ఔటైన తర్వాత నోటికి పనిచెబుతూ అమర్యాదకరంగా సంజ్ఞలు చేశాడు. దీంతో మ్యాచ్ ఫీజులో 15 శాతం జరిమానాతో పాటు ఒక డీమెరిట్ పాయింట్ విధిస్తూ ఐసీసీ బుధవారం నిర్ణయం తీసుకుంది. ఆటగాళ్ల ప్రవర్తన నియమావళి ప్రకారం రబాడ లెవల్-1 తప్పిదానికి పాల్పడ్డాడని ఐసీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఫీల్డ్ అంపైర్లు ఇయాన్ గౌల్డ్, షాన్ జార్జ్, థర్డ్ అంపైర్ అలీమ్ దార్, ఫోర్త్ అంపైర్ జెలె నివేదికను అనుసరించి మ్యాచ్ రిఫరీ అండీ పైక్రాఫ్ట్ ఈ నిర్ణయం తీసుకున్నాడు. ప్రస్తుతం రబాడ ఖాతాలో ఐదు డీమెరిట్ పాయింట్లు ఉన్నాయి. ఒక వేళ ఏడాది కాలంలో ఎనిమిది డీమెరిట్ పాయింట్లకు ఇవి చేరుకుంటే..అతనిపై రెండు మ్యాచ్‌ల నిషేధం పడే అవకాశముంటుంది.


ఫెల్ప్స్‌కు పుత్రోత్సాహం




లాస్ ఎంజిల్స్: అమెరికా స్విమ్మింగ్ సూపర్‌స్టార్ మైఖేల్ ఫెల్ప్స్ మళ్లీ తండ్రయ్యాడు. ఫెల్ప్స్ భార్య నికోల్ పండంటి బాబుకు జన్మనిచ్చింది. ఈ సంతోషకరమైన సందర్భాన్ని సోషల్‌మీడియా ద్వారా అతను అభిమానులతో పంచుకున్నాడు. 'జీవితంలో మధురమైన క్షణాలను ఆస్వాదిస్తున్నాను. నేను, నికోల్..బెకెట్ రిచర్డ్ ఫెల్ప్స్‌ను ఈ ప్రపంచానికి పరిచయం చేస్తున్నాం. తల్లి, బాబు ఇద్దరు ఆరోగ్యంగా ఉన్నారు. మాటలకందని సంతోషంతో ఉబ్బితబ్బిబవుతున్నాను' అని ఫెల్ప్స్ రాసుకొచ్చాడు. 2016 రియో ఒలింపిక్స్‌లో తన అద్వితీయ స్విమ్మింగ్ కెరీర్‌కు 32 ఏండ్ల ఫెల్ప్స్ వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే.

కోహ్లీ[ఇజం]

దూకుడే విరాట్ 'మంత్రం'
కెప్టెన్‌గా తనదైన ముద్ర..



భారత కెప్టెన్ల అత్యధిక విజయాల శాతం



ధోనీ
మ్యాచ్‌లు: 199
విజయాలు: 110
ఓటములు: 74
గెలుపు శాతం: 59.57%

అజరుద్దీన్
మ్యాచ్‌లు: 174
విజయాలు: 90
ఓటములు: 72
గెలుపు శాతం: 51.72%

గంగూలీ
మ్యాచ్‌లు: 146
విజయాలు: 76
ఓటములు: 65
గెలుపు శాతం: 53.90%

ద్రవిడ్
మ్యాచ్‌లు: 79
విజయాలు: 42
ఓటములు: 33
గెలుపు శాతం: 56%

కోహ్లీ
మ్యాచ్‌లు: 48
విజయాలు: 37
ఓటములు: 10
గెలుపు శాతం: 78.72%

అత్యధిక విజయాల శాతం గల విదేశీ కెప్టెన్లు

కెప్టెన్	మ్యాచ్‌లు	విజయాలు	ఓటములు	గెలుపు శాతం
పాంటింగ్ (ఆస్ట్రేలియా)	230	165	51	76.14
క్రోన్యే (ద.ఆఫ్రికా)	138	99	35	73.70
లాయిడ్ (వెస్టిండీస్)	84	64	18	77.71
క్లార్క్ (ఆస్ట్రేలియా)	74	50	21	70.42

ఎంతకీ బెదురడు.. ఎక్కడా తగ్గడు.. తనను తానే చూసుకుని మురవడు.. పరాజయాలకు కుంగిపోడు. ప్రశంసలకు పొంగిపోడు.. ఎంతకైనా సై అంటాడు.. ఎక్కడైనా నెగ్గుతాడు.. ఒక్కసారి కిందపడినా.. గోడకు కొట్టిన బంతిలా తిరిగి దూసుకొచ్చే నైజం.. ఆస్ట్రేలియా ఆటగాళ్లే అసూయ పడేలా పొగరు చూపించిన పోటుగాడు.. దూకుడుకు సిసలైన నిర్వచనం..జగమొండికి నిలువెత్తు నిదర్శనం.. సహచరులంతా తనలాగే తయారయ్యే దాకా వదల్లేదు..

ఆహార్యంలోనే కాదు..ఆటలోనూ రాటుదేలిన ఘనుడు.. పరుగుల వేటలో ప్రళయరుద్రుడు..రికార్డులకు రారాజు.. దిగ్గజాలతో పోలికే లేదు.. ఎవరితో పోటీ కాదు.. తనకు తానే సాటి.. మేటి ఆటతీరుకు సెంచరీలు సలామ్ కొడుతున్నాయ్..దాయాది దేశాలు దాసోహమవుతున్నాయ్..విదేశాల్లోనూ వేట మొదలుపెట్టాడు..ఇది ఆరంభమే..

(నమస్తే తెలంగాణ స్పోర్ట్స్‌డెస్క్)

దక్షిణాఫ్రికా గడ్డపై వన్డే సిరీస్ గెలిచి మూడు దశాబ్దాల కలను సాకారం చేసిన విరాట్ కోహ్లీ, జట్టును విజయవంతంగా నడిపిస్తూ..భారత కెప్టెన్ల జాబితాలో అగ్రస్థానంలో నిలిచాడు. మిగతా నాయకులతో పోలిస్తే కోహ్లీది ప్రత్యేక స్థానమని వేరే చెప్పనవసరం లేదు. ఇప్పటికే ఆటగాడిగా, నాయకుడిగా తానేంటో నిరూపించాడు. విదేశాల్లో సిరీస్ గెలుపు కష్టసాధ్యమనుకున్న వేళ చరిత్ర సృష్టించాడు. దక్షిణాఫ్రికా పర్యటనకు బయలుదేరే ముందు ఎందరో దిగ్గజాలు పెదవి విరిచారు. టెస్ట్ మ్యాచ్‌ల్లో ఓటమిపాలైతే పగులబడి నవ్వారు. కానీ నవ్విన నాపచేనే పండుతున్న చందంగా విరాట్ కోహ్లీ శతకాలతో మోతెక్కించాడు. జట్టులోని మిగతా ఆటగాళ్లలోనూ స్ఫూర్తి నింపాడు. వాండరర్స్‌లో జరిగిన మూడో టెస్ట్ నుంచి జైత్రయాత్ర మొదలుపెట్టాడు. వన్డే సిరీస్ గెలువగానే, 4-1 చాలదు, 5-1తో గెలిస్తేనే అసలైన మజా అంటూ మరో విజయానికై ఆరాటపడుతున్నాడు. విదేశాల్లో కోహ్లీ దండయాత్రను చూసి రానున్న రోజుల్లో ఆతిథ్యమివ్వనున్న ఇంగ్లండ్, ఆస్ట్రేలియా ఇప్పటికే అప్రమత్తమయ్యాయి.

కెప్టెన్‌గా కేక..

ఇప్పటిదాకా ఇటువంటి కెప్టెన్‌ను చూడలేదని విశ్లేషకులు సైతం విరాట్‌కోహ్లీని ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. 2014-15 ఆస్ట్రేలియాలో ఇతని కెప్టెన్సీ ప్రయాణం మొదలైంది. రెండు టెస్ట్ మ్యాచ్‌ల్లో ఒక పరాజయం, ఒక డ్రాతో మొదలుపెట్టాడు. ఆ తర్వాత బంగ్లాదేశ్‌తో జరిగిన ఏకైక టెస్ట్ మ్యాచ్ కూడా డ్రా అవడంతో..శ్రీలంకపై తన జైత్రయాత్రను మొదలుపెట్టాడు. 2016-17లో అన్నీ స్వదేశీ మ్యాచ్‌లే ఉండటంతో సులువుగా విజయాలు దక్కాయి. ఇక ఈ ఏడాది నుంచి అసలైన పరీక్ష ఎదుర్కొంటున్నాడు. ఇప్పటి వరకు 35 టెస్ట్ మ్యాచ్‌లకు నాయకత్వం వహించగా..21 విజయాలు, 5 ఓటములు, 9 డ్రా అయ్యాయి. వన్డేల విషయానికొస్తే 48 మ్యాచ్‌ల్లో 37 విజయాలు, 10 పరాజయలతో మంచి రికార్డును నమోదు చేశాడు. ఇతని విజయాల శాతం 78.72గా ఉంది. గత కెప్టెన్ల విజయాల సగటు 60కి మించలేదు. ధోనీ ఒక్కడే 59.57 శాతంతో ఇతని తర్వాతి స్థానంలో ఉన్నాడు. ద్రవిడ్ 56, కపిల్‌దేవ్ 54, గంగూలీ 53 శాతం విజయాలు నమోదు చేసి ఉత్తమ కెప్టెన్లుగా నిరూపించుకున్నారు. కానీ విరాట్ వీరందరినీ తోసిరాజని ఇప్పుడు అత్యుత్తమ నాయకుడిగా ఎదుగుతున్నాడు.

జట్టుకు దిక్సూచి

ప్రస్తుతం టీమ్‌ఇండియాలో మహేంద్రసింగ్ ధోనీ మినహా మిగతా వారంతా తనకంటే తనకన్నా చిన్నవారే. అందరిలోనూ ఉత్సాహం నింపడంలో విరాట్ శైలి భిన్నంగా ఉంటుంది. 'మైదానంలో మీ ఆట మీరు ఆడండి. స్వేచ్ఛగా బ్యాటింగ్ చేయండి. ఈరోజు మీదే అనుకోండి'..ఇవీ కోహ్లీ తమ సహచరులకు చెప్పే మాటలు. అద్భుతాలు చేయాలని చెప్పడు. ఆంక్షలు పెట్టడు. తన ఆటతీరుతోనే మిగతా ఆటగాళ్లలో స్ఫూర్తి నింపుతాడు. వైఫల్యాల్లో ఉన్నప్పుడు ఆటగాడికి అండగా నిలబడతాడు. తాజాగా జరిగిన టెస్ట్ సిరీస్‌లో రోహిత్ ఉదంతమే ఇందుకు ఉదాహరణ. వన్డే సిరీస్‌లోనూ రోహిత్‌పై నమ్మకంతోనే అవకాశం ఇస్తూ వచ్చాడు. కీలక సమయంలో కోహ్లీ నమ్మకమే నెగ్గింది. ఐదో వన్డేలో రోహిత్ శతకం చేసి భారత్‌కు గౌరవప్రదమైన స్కోరు అందించడంలో కీలకపాత్ర పోషించాడు. రహానేకు తక్కువ అవకాశాలే ఇచ్చినా, అతనిలోని ప్రతిభను ఎప్పుడు ఎలా ఉపయోగించుకోవాలో కోహ్లీకి బాగా తెలుసు. ఇక యువ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యకూ కావల్సినన్ని అవకాశాలు ఇస్తూ అతనిలోని ప్రతిభను వెలికితీస్తున్నాడు. 'కోహ్లీ..హార్దిక్ పాండ్యలో తనను తాను చూసుకుంటున్నాడు. దూకుడు, సానుకూల దృక్పథం పాండ్యలో మెండుగా ఉన్నాయి. అతను కెప్టెన్ విరాట్‌కు నచ్చాడు. జట్టులో సుదీర్ఘ కాలం కొనసాగే అవకాశం ఉంటుంది. అయితే ఆ అవకాశాల్ని పాండ్య సద్వినియోగం చేసుకోవాలి' అని దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ షాన్ పొలాక్ తాజాగా వ్యాఖ్యానించాడు. పొలాక్ చెప్పిన మాటలు అక్షరసత్యాలే. ఇంగ్లండ్‌లో జరుగనున్న ప్రపంచకప్ దృష్ట్యా కోహ్లీ..యువ ఆల్‌రౌండర్ పాండ్యకు ఎక్కువ అవకాశాలిస్తున్నాడు. అది టీమ్‌ఇండియాకు ప్రపంచకప్‌లో లాభం చేకూర్చేదే.

శాస్త్రి ఉంటేనే..

కోహ్లీ ఆటలో ఎంత పట్టుదలగా ఉంటాడో.. ఆఫ్ ద ఫీల్డ్ కూడా అలాగే పంతం నెగ్గించుకున్నాడు. కోచ్‌గా అనిల్‌కుంబ్లే ఉన్న సమయంలో తనకు ఆంక్షలు విధించడాన్ని తట్టుకోలేకపోయిన కోహ్లీ..రవిశాస్త్రిని రప్పించుకునేందుకు తనదైన శైలిలో పాచికలు కదిపాడు. ఎందుకంటే జట్టుకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడంలో శాస్త్రి కోహ్లీకి పూర్తి మద్దతు ఇస్తాడు. వీరిద్దరి భాగస్వామ్యంలో మంచి ఫలితాలు రావడానికి కారణం కూడా అదే.కోహ్లీని విమర్శించిన వారిపై కోచ్ ప్రతి విమర్శలు చేస్తాడు..ప్రతికూల పరిస్థితులు తలెత్తినపుడు శాస్త్రికి కోహ్లీ మద్దతుగా నిలబడతాడు. ఇలా ఒకరికొకరు గురుశిష్య సంబంధాన్ని కాపాడుకుంటూ వస్తున్నారు.



అత్యధిక ద్వైపాక్షిక వన్డే సిరీస్ విజయాలు

వెస్టిండీస్	14
భారత్	9
ఆస్ట్రేలియా	8
పాకిస్థాన్	7
దక్షిణాఫ్రికా	7

ప్రపంచకప్ సవాల్

దక్షిణాఫ్రికా పర్యటన తర్వాత విరాట్ కోహ్లీకి అసలైన సవాల్ ప్రపంచకప్ అనే చెప్పాలి. దీనికి ముందు ఇంగ్లండ్, ఆస్ట్రేలియా పర్యటనల్లో జట్టును అత్యుత్తమంగా తీర్చిదిద్దడమే కోచ్, కెప్టెన్ ముందున్న సవాల్. అందుకోసం ప్రతిభావంతులైన యువ ఆటగాళ్లను సానపట్టే పనిలో పడ్డాడు కోహ్లీ. 'ఆరో వన్డేలో రిజర్వ్ బెంచ్ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలని ఆలోచిస్తున్నాం. కానీ 5-1తో సిరీస్‌ను ముగించడమే మా లక్ష్యం. అందుకోసం మేము చేయాల్సిందంతా చేస్తాం. గెలుపుతోనే సంబురపడిపోవడం లేదు. జట్టులో ఏయే లోపాలున్నాయో, వాటిని ఎలా సవరించుకోవాలి అనేదానిపై కూడా దృష్టి పెట్టాం' అని కోహ్లీ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. అంటే సమీప భవిష్యత్ కోసం జట్టును పూర్తి స్థాయిలో సిద్ధం చేసేందుకు కసరత్తు మొదలుపెట్టాడని తెలుస్తున్నది. కోహ్లీ నాయకత్వ తీరు..జట్టులో స్ఫూర్తి ఇలాగే కొనసాగితే విరాట్ కోహ్లీ ప్రపంచకప్‌ను కైవసం చేసుకోవడం కష్టమేమీ కాదు.



సిరాజ్(5/37)

సిరాజ్ పాంచ్ పటాకా

- విజయ్ హజారే క్వార్టర్స్‌కు హైదరాబాద్


హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లింది. తమ వరుస విజయాల జోరును కొనసాగిస్తూ హైదరాబాద్(20) గ్రూపు-డిలో టాప్‌లో నిలిచింది. బుధవారం స్థానిక జింఖానా మైదానంలో జరిగిన తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ 84 పరుగుల తేడాతో ఛత్తీస్‌గఢ్‌పై ఘన విజయం సాధించింది. హైదరాబాద్ నిర్దేశించిన 281 పరుగుల లక్ష్యఛేదనలో ఛత్తీస్‌గఢ్..స్పీడ్‌స్టర్ మహ్మద్ సిరాజ్(5/37) ధాటికి 44.3 ఓవర్లలో 196 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ ఖరె(71) మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. సిరాజ్‌కు తోడు మెహదీ హసన్(2/28) విజృంభణతో ఛత్తీస్‌గఢ్ 66 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. పదునైన స్వింగ్‌తో సిరాజ్ చెలరేగడంతో ఛత్తీగఢ్ ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. ఖరె ఒంటరి పోరాటం చేసినా సహచరుల నుంచి సహకారం కరువైంది. అంతకుముందు సందీప్(79), కెప్టెన్ రాయుడు(46), రవితేజ(45) బ్యాటింగ్‌తో హైదరాబాద్ నిర్ణీత 50 ఓవర్లలో 280/8 స్కోరు చేసింది. 60 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయినా హైదరాబాద్..సందీప్, రాయుడు బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో గట్టెక్కింది. వీరిద్దరు కలిసి నాలుగో వికెట్‌కు 92 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. పంకజ్‌రావు(3/52), షానవాజ్ హుస్సేన్(2/53) రాణించారు. మిగతా మ్యాచ్‌ల్లో రంజీ చాంపియన్ విదర్భపై 8 వికెట్ల విజయంతో సౌరాష్ట్ర క్వార్టర్స్‌కు అర్హత సాధించింది. ఈనెల 21 నుంచి క్వార్టర్స్ పోరు మొదలవుతుంది.

వాలీబాల్ చాంప్ లయోలా అకాడమీ జట్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: ఫాదర్ బాలయ్య మెమోరియల్ అఖిల భారత ఇంటర్ కళాశాల వాలీబాల్, బాస్కెట్ బాల్ టోర్నీలో లయోలా అకాడమీ జట్టు వాలీబాల్ చాంపియన్‌గా నిలిచింది. జీసీపీఈ జట్టుతో నాలుగుసెట్లపాటు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో 25-8,25-11,17-25,25-17 స్కోరుతో లయోలా జట్టు విజయం సాధించి చాంపియన్‌గా నిలిచింది. కాగా, బాస్కెట్‌బాల్ ఫైనల్లో మాత్రం లయోలా జట్టు 82-86 స్కోరుతో ఎంఎల్ఆర్ఐటీ జట్టు చేతిలో పరాజయం పాలై రన్నరప్‌గా నిలిచింది. ముగింపు కార్యక్రమానికి ఎంఎల్సీ రామచందర్‌రావు, పీఎం సాయిప్రసాద్ హాజరై విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ ఫాదర్ ఎస్ రాజు, కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ థినస్సీ తదితరులు పాల్గొన్నారు.



'ఆ శృంగార వీడియోలో నేను కాదు'



మలేసియా: బ్యాడ్మింటన్ ప్రపంచాన్ని రారాజులా ఏలిన మలేసియా షట్లర్ లీ చాంగ్ వీ సెక్స్ వివాదంలో చిక్కుకున్నాడు. ఈ షట్లర్ శృంగార వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. దీంతో ఇతని అభిమానులు, సన్నిహితులు ఫోన్ కాల్స్ చేయసాగారు. అయితే ఆ వీడియోలో ఉన్నది తాను కాదని, తన పోలికలతో ఉన్న మరో వ్యక్తి అని చాంగ్ వీ ప్రకటించాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు కూడా చేశాడు.

మూడోరౌండ్‌లో హలెప్



దోహా: ప్రపంచ నంబర్2 రొమేనియా స్టార్ టెన్నిస్ ప్లేయర్ సిమోనా హలెప్ కతార్ ఓపెన్ మూడోరౌండ్ చేరింది. ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో పరాజయం తర్వాత బరిలోకి దిగిన తొలిమ్యాచ్‌లోనే విజయంతో సత్తా చాటింది. తొలిరౌండ్‌లో బై లభించడంతో రెండోరౌండ్‌లో రష్యా టెన్నిస్ భాట మకరోవాతో తలపడింది. 71 నిమిషాల్లోనే ముగిసిన ఈ పోరులో 6-3,6-0 స్కోరుతో వరుససెట్లలో విజయం సాధించిన హలెప్ శుభారంభం చేసింది.

చెన్నై, ముంబైతో ఐపీఎల్ పోరు మొదలు

న్యూఢిల్లీ: ఐపీఎల్-11వ సీజన్ షెడ్యూల్ ఖరారైంది. ఏప్రిల్ 7న డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య తొలి పోరుతో ఐపీఎల్‌కు తెరలేవనుంది. క్వాలిఫయర్-1, ఫైనల్ మ్యాచ్‌లకు ముంబై వాంఖడే స్టేడియం ఆతిథ్యమివ్వనుండగా, ఎలిమినేటర్, క్వాలిఫయర్-2 మ్యాచ్‌ల వేదికలు ఖరారు కావాల్సి ఉంది. మరోవైపు ఐపీఎల్ బ్రాడ్‌కాస్టర్ స్టార్ స్పోర్ట్స్ మ్యాచ్‌ల సమయాలను మార్చాలంటూ చేసిన విజ్ఞప్తిని ఐపీఎల్ మేనేజ్‌మెంట్ అంతగా పట్టించుకున్నట్లు లేదు. గత సీజన్లలాగే సాయంత్రం 4 గంటలకు ఒక మ్యాచ్, రాత్రి ఎనిమిది గంటలకు మరో మ్యాచ్ జరుగనుంది. కొన్ని ఫ్రాంచైజీలు ప్రసారదారునికి అనుకూలంగా మ్యాచ్‌ల సమయాలు మార్చాలంటూ డిమాండ్ చేసినా బీసీసీఐ తమ నిర్ణయానికే కట్టుబడి ఉండటంతో షెడ్యూల్‌లోనూ మార్పులు జరుగలేదు. ఏప్రిల్ 9న ఉప్పల్ స్టేడియంలో రాజస్థాన్ రాయల్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ తొలి మ్యాచ్ ఆడుతుంది.

అమర జవాన్లకు మతం రంగు పులుమొద్దు

- సైన్యంలో ఏం జరుగుతుందో చూసి తెలుసుకోవాలి
- ఆర్మీ ఉత్తర కమాండ్ చీఫ్ దేవరాజ్ అన్బు
- ఓవైసీ వ్యాఖ్యలపై స్పందన



ఉధంపూర్, ఫిబ్రవరి 14: ఉగ్రదాడుల్లో అమరులైన సైనికులకు మతం రంగు పులుమొద్దని భారత సైన్యం ఉత్తర కమాండ్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ దేవరాజ్ అన్బు అన్నారు. ఇటీవలి సుంజ్వాన్ ఉగ్రదాడిలో చనిపోయిన ఏడుగురిలో ఐదుగురు ముస్లింలేనన్న మజ్లిస్ అధినేత అసదుద్దీన్ వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. అమర సైనికులను ఆర్మీ ఎప్పుడూ మతపరంగా విభజించి చూడదని తెలిపారు. బుధవారం ఉధంపూర్‌లో సైనికులకు సాహసపురస్కారాలను అందజేసిన అన్బు, అనంతరం మీడియాతో మాట్లాడారు.

తాము అమరులకు మతాన్ని ఆపాదించబోమని, అసలు సైన్యం అంటే ఏంటో తెలియనివారే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారని చెప్పారు. 'మతాలకతీతంగానే సైనికుల్ని చూస్తాం. ఆర్మీ ప్రతీ చర్యలోనూ అదే ప్రస్ఫుటమవుతుంది. శ్రీనగర్‌లోని బాదామీబాగ్‌కు వెళ్లినా, ఉధంపూర్ వెళ్లినా లేదా మా నివాసాలకు వచ్చిచూసినా అవన్నీ 'సర్వధర్మ' స్థలాలుగా మీకు కనిపిస్తాయి' అని అన్బు తెలిపారు. మంగళవారం హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. 'మేం (ముస్లింలు) మా ప్రాణాలను ఇస్తున్నాం. అయితే ఉగ్రవాదులు మతం ఆధారంగా ఎవరిపైనా వివక్ష చూపించరు. కాబట్టి మమ్మల్ని కూడా చంపుతున్నారు. వారు అందరినీ భారతీయులుగానే చూస్తున్నారు. కానీ మా చిత్తశుద్ధిని ఇప్పటికీ ప్రశ్నిస్తున్నవారు ఈ దేశంలో చాలామందే ఉన్నారు. అలాంటివారు సుంజ్వాన్ దాడిలో ప్రాణాలు కోల్పోయిన ఏడుగురిలో ఐదుగురు ముస్లింలేనని గుర్తుంచుకోవాలి' అని వ్యాఖ్యానించారు. దీనిపై ఉత్తర కమాండ్ చీఫ్ అన్బు స్పందిస్తూ.. 'అలాంటి వ్యాఖ్యలు చేసేవారు సైన్యంలో ఏం జరుగుతున్నదో వచ్చి చూడాలి. మతాలను పక్కనబెట్టి మేమెలా కలిసిమెలిసి జీవిస్తున్నామో తెలుసుకోవాలి' అని సూచించారు. సైన్యాన్ని మతపరంగా చూసేవారు.. సుంజ్వాన్ దాడిలో అమరులైన సైనికుల అంత్యక్రియలకు జమ్ముకశ్మీర్ ప్రజలు పెద్దఎత్తున ఎలా తరలివచ్చారో తెలుసుకోవాలని హితవు పలికారు. షోపియాన్ కాల్పుల ఘటనలో మేజర్ ఆదిత్యకుమార్‌పై ఎఫ్ఐఆర్ దాఖలైన ఘటనను విలేకరుల ప్రస్తావించగా, మేజర్‌పై దాఖలైన ఎఫ్ఐఆర్.. ఆర్మీ నైతిక స్థయిర్యాన్ని ఆవగింజంత కూడా తగ్గించలేకపోయిందని చెప్పారు.

'నైరాశ్యంతోనే ఇలా దాడులు చేస్తున్నారు'

సుంజ్వాన్ ఆర్మీక్యాంప్‌పై దాడికి పాకిస్థాన్ పూర్తిగా నైరాశ్యంలో మునిగిపోవడమే కారణమని జనరల్ అన్బు వ్యాఖ్యానించారు. సరిహద్దుల్లో విఫలమవుతున్నందువల్లే సున్నిత లక్ష్యాలపై శత్రువు దాడిచేస్తున్నాడని చెప్పారు. భారత సైన్యం మాత్రం క్రియాశీలకంగా వ్యవహరిస్తుందని ఆయన తెలిపారు. చొరబాట్లను పూర్తిగా అరికట్టడంలో విజయం సాధించామని, ముమ్మందు కూడా దానిని అలాగే కొనసాగిస్తామని ఆయన వెల్లడించారు. హిజ్బుల్ ముజాహిదీన్, లష్కరే తాయిబా, జైషే మొహమ్మద్ ఉగ్రవాద సంస్థల మధ్య పరస్పర అనుబంధం ఉందన్నారు. పీర్‌పంజాల్ వ్యూహాత్మకంగా కీలకమైన స్థానమని, దానికి దక్షిణాన బలగాలు మళ్లితే, వాళ్లు ఉత్తరం వైపు కాల్పులకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. సరిహద్దుల్లో భద్రతాపరమైన వైఫల్యాలేవీ లేవని, రక్షణాత్మక చర్యల కోసం భారత సైన్యం సుమారు రూ.364కోట్ల వరకు ఖర్చుచేసిందని ఆయన వివరించారు.

రవాణారంగానికి వేతనం విరాళమిచ్చిన ట్రంప్

న్యూయార్క్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన వేతనాన్ని రవాణాశాఖకు విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. 2017 నాల్గవ త్రైమాసికానికి సంబంధించిన మూడునెలల వేతనం రూ. 64.23 లక్షలు (లక్ష డాలర్లు) విరాళంగా ఇచ్చారని వైట్‌హౌస్ బుధవారం తెలిపింది. మౌలికవసతుల ప్రాజెక్టులపై ఆ నిధుల్ని ఖర్చుచేస్తామని రవాణా శాఖ తెలిపింది. అధ్యక్షుడి హోదాలో ట్రంప్‌కు ఏటా రూ.2.5 కోట్లు వేతనంగా అందుతున్నాయి.

దాహం.. దాహం..!

- ప్రపంచవ్యాప్తంగా మహానగరాల్లో పడిపోతున్న మంచినీటి నిల్వలు
- మొదటిస్థానంలో సావోపోలో.. రెండో స్థానంలో బెంగళూరు
- ఐక్యరాజ్యసమితి అధ్యయనంలో వెల్లడి



మహారాష్ట్రలోని బీడ్‌లో నీరు తోడేందుకు ఓ బావిలోకి దిగుతున్న బాలిక (ఫైల్)

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా నగరాల్లో మంచినీటి నిల్వలు పడిపోతున్నాయి. డిమాండ్‌కు సరఫరాకు మధ్య వ్యత్యాసం పెరిగిపోతున్నది. 2030 నాటికి డిమాండ్‌కు, సరఫరాకు మధ్య 40 శాతం వ్యత్యాసం ఉంటుందని ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా నగరాల్లో నీటినిల్వలపై అధ్యయనం చేసి ఓ నివేదికను విడుదల చేసింది. అత్యంత వేగంగా తాగునీటి నిల్వలు పడిపోతున్న మొదటి 11 నగరాల జాబితాను విడుదల చేసింది. ఇది భవిష్యత్తు నగరజీవన దుర్భర స్థితికి హెచ్చరిక వంటిదని ఇప్పటికైనా మేలుకోకుంటే నగరాల్లో దాహం కేకలు తప్పవని హెచ్చరించింది. మన దేశం నుంచి బెంగళూరు నగరం ఈ జాబితాలో నిలువడం ఆందోళన కలిగించే అంశం. బ్రెజిల్ ఆర్థిక రాజధాని నగరం సావోపోలో మొదటిస్థానంలో ఉండగా బెంగళూరు రెండో స్థానంలో నిలిచింది. వాతావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్, జనాభా విచ్చలవిడిగా పెరిగిపోవడం, నీటి నిర్వహణ లోపాలే ఇందుకు ప్రధాన కారణమని పేర్కొన్నది. ఐరాస నివేదిక ప్రకారం వివిధ నగరాల్లో పరిస్థితి ఎలా ఉందంటే..

సావోపోలో: బ్రెజిల్ ఆర్థిక రాజధాని నగరమైన సావోపోలో మూడేండ్లుగా నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నది. గత ఏడాది రిజర్వాయర్లలో నీటి నిల్వలు 15 శాతం దిగువకు పడిపోయాయి. ఒకానొక దశలో నగరవాసులకు కొన్ని వారాలపాటు మాత్రమే నీరందించగలిగే దుర్భర పరిస్థితి ఎదురైంది. ఈ ఏడాది సైతం ఇలాంటి పరిస్థితులే నెలకొంటున్నాయి. నిర్వహణ లోపమే ప్రధాన కారణమని చెప్తున్నారు.

కేప్‌టౌన్ మొదటి పాఠం

ఆధునిక యుగంలో కనీసం తాగునీరు లేక ప్రజలు దాహార్తితో అలమటించిన మొదటి నగరం దక్షిణాఫ్రికా రాజధాని కేప్‌టౌన్. 2015లో కేప్‌టౌన్‌లోని రిజర్వాయర్లలో నీటి నిల్వలు నాలుగు శాతం దిగువకు పడిపోయాయి. దీంతో ప్రజలకు తాగునీరు అందించడమే కష్టంగా మారింది. ఒకానొక దశలో కేవలం 20 రోజులు మాత్రమే నీరు అందించగలిగే పరిస్థితి నెలకొన్నది. రోజుకు 90 లీటర్ల నీటిని మాత్రమే అందించారు. ప్రభుత్వ నల్లాల ద్వారా కొన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో మాత్రమే నీరందించారు. అక్కడ సాయుధ పోలీసులు కాపలాగా ఉండగా, నిఘా నీడలో నీటిని పంపిణీ చేశారు. ప్రజలు గంటల కొద్దీ లైన్లలో నిలబడి నీటిని పట్టుకున్నారు.

బెంగళూరు: నగర జనాభా విపరీతంగా పెరుగుతున్నా దానికి అనుగుణంగా మౌలిక సదుపాయాలు లేవు. ముఖ్యంగా నీటి సరఫరా, మురుగునీటి పారుదల వ్యవస్థ సరిగా లేకపోవడంతో నీరు భారీగా వృథా అవుతున్నది. లేదా వినియోగించడానికి పనికిరానంతగా కలుషితం అవుతున్నాయి. బెంగళూరు పరిధిలోని ఏ ఒక్క చెరువులోని నీరు కూడా కనీసం స్నానం చేయడానికి, బట్టలు ఉతుక్కోవడానికి పనికిరావని తేలింది.

బీజింగ్: నీరు అడుగంటుతున్న నగరాల జాబితాలో చైనా రాజధాని బీజింగ్ మూడోస్థానంలో ఉన్నది. ఐరాస లెక్కల ప్రకారం ఒక వ్యక్తికి ఏడాదికి పది లక్షల లీటర్ల మంచినీరు అవసరం. కానీ బీజింగ్‌లో 2014 సంవత్సరంలో ఒక్కో వ్యక్తికి సగటున 1.45 లక్షల లీటర్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

కైరో: ఈజిప్ట్ రాజధాని కైరోకు ఈ జాబితాలో నాలుగో స్థానం దక్కింది. ఈజిప్ట్ మొత్తం నీటికోసం శతాబ్దాలుగా నైలు నది మీదనే అతిగా ఆధారపడుతున్నది. అయితే విచ్చలవిడిగా జనాభా పెరిగిపోవడంతో దేశంలోని 97శాతం జలనరులు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. 2025 నాటికి దేశవాసులు తాగునీటికి అల్లాడే పరిస్థితులు ఎదురవుతాయని హెచ్చరించింది. ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా జకార్తా, మాస్కో, ఇస్తాంబుల్, మెక్సికో సిటీ, లండన్, టోక్యో, మియామీ నిలిచాయి.

భారత్‌లో మరిన్ని ఉగ్రదాడులు!

- హెచ్చరించిన యూఎస్ నిఘా విభాగం అధిపతి

వాషింగ్టన్, ఫిబ్రవరి 14: భారత్‌లో పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రదాడులు భవిష్యత్‌లో ఇంకా కొనసాగుతాయని అమెరికా నిఘా విభాగం అధిపతి భారత్‌ను హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు క్రమంగా పెరిగేందుకు కారణమవుతాయని చెప్పారు. సుంజ్వాన్ మిలిటరీ క్యాంపుపై జైషే మహమ్మద్ ఉగ్రదాడులు జరిపిన నేపథ్యంలో అమెరికా నిఘా విభాగం అధిపతి డ్యాన్ కోట్స్ సెనేట్ సెలక్ట్ కమిటీకి సమర్పించిన ప్రమాణపత్రంలో ఈ విషయాలను పొందుపరిచారు. అమెరికా ప్రయోజనాలకు వ్యతిరేకంగా భారత్, ఆఫ్ఘనిస్థాన్‌లలో పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడులు చేసే అవకాశాలున్నాయని కోట్స్ వివరించారు. సరిహద్దు వెంబడి దాడులు మరింత పెరుగడంగానీ, సుంజ్వాన్‌లాంటి మరో పెద్ద ఘటన గానీ జరిగితే భారత్-పాకిస్థాన్‌ల మధ్య సంబంధాలు మరింత అధ్వానంగా తయారవుతాయని హెచ్చరించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి చేసిన తీర్మానాలను పాకిస్థాన్ పట్టించుకోవడం లేదని అమెరికా ఘాటుగా విమర్శించింది.

పోర్న్‌స్టార్‌కు ఇచ్చిన సొమ్ము తిరిగివ్వలేదు

ట్రంప్‌పై న్యాయవాది మైఖేల్ కోహెన్ ఆరోపణ



స్టెఫనీ క్లిఫోర్డ్

వాషింగ్టన్: డొనాల్డ్ ట్రంప్‌తో సంబంధాలు ఉన్నాయని చెప్పిన శృంగారతార (పోర్న్‌స్టార్)కు.. తన సొంతడబ్బు దాదాపు రూ.83 లక్షలకు (1.3 లక్షల డాలర్లు) పైగా చెల్లించానని అమెరికా అధ్యక్షుడి వ్యక్తిగత న్యాయవాది మైఖేల్ కోహెన్ మంగళవారం మీడియాకు చెప్పారు. సదరు నటి స్టెఫనీ క్లిఫోర్డ్‌కు ఇచ్చిన మొత్తాన్ని ట్రంప్ తనకు తిరిగి ఇవ్వలేదని పేర్కొన్నారు. డబ్బు చెల్లింపు చట్ట ప్రకారమే జరిగిందని, ఆ సమయంలో ట్రంప్‌కు కూడా ఈ విషయం తెలిసే ఉంటుందన్నారు. కానీ ఎందుకు ఆ డబ్బు చెల్లించారో వివరాలు చెప్పేందుకు మాత్రం కోహెన్ నిరాకరించారు. క్లిఫోర్డ్‌తో లావాదేవీలతో ట్రంప్ సంస్థకు ఎటువంటి సంబంధంలేదని, దీనికి సంబంధించి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా కానీ ఇప్పటివరకు ఆ డబ్బు తనకు చెల్లించలేదని కోహెన్ పేర్కొన్నారు. ఈ చెల్లింపు చట్ట ప్రకారం జరిగిందని, ఇది ప్రచార విరాళం లేదా ప్రచార ఖర్చు కాదని ఆయన స్పష్టంచేశారు. తాను ట్రంప్‌ను కలిశానని ఓ ఇంటర్వ్యూలో క్లిఫోర్డ్ చెప్పిన మాటలు సంచలనం రేపిన విషయం తెలిసిందే.

ఐఐఐటీహెచ్‌లో యూజీ కోర్సులు

- ప్రతిష్ఠాత్మక సంస్థలో ఐఐఐటీహెచ్ ఒకటి
- 2018-19 విద్యాసంవత్సరానికి ప్రవేశాలు
- బీటెక్, డ్యూయల్ డిగ్రీ కోర్సులు
- నాలుగు విధాలుగా ప్రవేశాలు

హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ)లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

ఐఐఐటీ హైదరాబాద్‌ను 1998లో ప్రారంభించారు. ఈ సంస్థ లాభాపేక్షలేని పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (ఎన్-పీపీ) కింద ప్రారంభమైన స్వతంత్ర సంస్థ. కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ తదితర విభాగాల్లో పరిశోధనల కోసం ప్రత్యేకంగా దీన్ని ఏర్పాటుచేశారు.

- కోర్సులు: అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ) ప్రోగ్రామ్స్. 2018 -19 విద్యాసంవత్సరానికి ఈ ప్రవేశాలు.

నాలుగు విధాలుగా ఐఐఐటీలో ప్రవేశాలు కల్పిస్తారు.



వివరాలు..

1. జేఈఈ (మెయిన్) స్కోర్ ఆధారంగా
2. అండర్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (యూజీఈఈ)
3. ఒలింపియాడ్
4. స్పెషల్ చానెల్ ఆఫ్ అడ్మిషన్ (ఎస్‌పీఈసీ)

- **జేఈఈ (మెయిన్):** జేఈఈ మెయిన్ స్కోర్ ఆధారంగా బీటెక్ (సీఎస్ఈ) - 90 సీట్లు, బీటెక్ (ఈసీఈ) -60 సీట్లు భర్తీ చేస్తారు.
- **అర్హతలు:** జేఈఈ మెయిన్ స్కోర్, ఇంటర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత.

నోట్: ఐఐఐటీహెచ్ పోర్టల్ ద్వారా ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలి.

- **అండర్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (యూజీఈఈ):** ఈ ఎంట్రెన్స్ ద్వారా రిసెర్చ్ ఆధారిత డ్యూయల్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.
- **కోర్సులు:** బీటెక్ కంప్యూటర్‌సైన్స్ అండ్ ఇంజినీరింగ్ అండ్ మాస్టర్ ఇన్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్‌డీ)
- బీటెక్ (ఈసీడీ), బీటెక్ (సీఎల్‌డీ), బీటెక్ (సీఎన్‌డీ)
- **అర్హత:** ఇంటర్/తత్సమాన పరీక్షలో కనీసం 60 శాతం మార్కులతో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులతో ఉత్తీర్ణత.
- సీట్ల సంఖ్య - సీఎస్‌డీ - 35, ఈసీడీ - 25, సీఎన్‌డీ - 15, సీఎల్‌డీ - 15
- **ఎంపిక:** ఏప్రిల్ 18న నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 2,000/-
- **చివరితేదీ:** మార్చి 15
- యూజీఈఈలో ఉత్తీర్ణులకు ఇంటర్వ్యూలు నిర్వహించి తుది జాబితాను రూపొందించి ప్రవేశాలు కల్పిస్తారు. అంతర్జాతీయ స్థాయి ఒలింపియాడ్స్‌లో పాల్గొన్న విద్యార్థులు నేరుగా డ్యూయల్ డిగ్రీ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చు. వీరికి రాతపరీక్ష ఉండదు. ఇంటర్వ్యూ ద్వారా ఎంపికచేస్తారు.

స్పెషల్ చానెల్ ఆఫ్ అడ్మిషన్ (ఎస్‌పీఈసీ):

- ఈ విద్యాసంవత్సరం నుంచి కొత్తగా ఈ స్కీం ప్రవేశపెట్టారు. దీని ద్వారా బీటెక్‌లో ప్రవేశాలు కల్పిస్తారు.
- **కోర్సులు:** బీటెక్ (సీఎస్ఈ) -10 సీట్లు, బీటెక్ (ఈసీఈ) - 10 సీట్లు
- **అర్హతలు:** ఇంటర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలో ఉత్తీర్ణతతోపాటు కింది ఏదైనా ఒక అర్హత కలిగి ఉండాలి.

1. సీబీఎస్ఈ ఉడాన్ స్కీంకు ఎంపికైన విద్యార్థులు
2. ఆరేండ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులు చదువుతూ రెండో ఏడాది పూర్తిచేసుకున్న విద్యార్థులు (అంటే బాసర ఐఐఐటీలో బీటెక్ చదువుతున్నవారు)

- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 15
- **ఎంట్రెన్స్ టెస్ట్:** ఏప్రిల్ 18
- వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

డైరెక్ట్ ఆడ్మిషన్స్ ఫర్ స్టూడెంట్స్ అబ్రాడ్ (డీఏఎస్ఏ):

- ప్రవాస భారతీయ విద్యార్థులు, విదేశాల్లో నివసిస్తున్న భారత సంతతి విద్యార్థులకు నేరుగా ప్రవేశాలు కల్పిస్తారు.
- **ఎంపిక:** శాట్‌లో నిర్దేశిత స్కోర్ సాధించి ఉండాలి.
- **అర్హతలు:** ఇంటర్/తత్సమాన పరీక్షలో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. ఇంటర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులుగా కలిగి ఉండాలి.
- **కోర్సులు:** సీఎస్ఈ & సీఎస్‌డీ - 20, ఈసీఈ & ఈసీడీ - 10, ఇతర ప్రోగ్రామ్స్ - 5 సీట్లు ఉన్నాయి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో మార్చి 2 నుంచి ప్రారంభం
- **చివరితేదీ:** ఏప్రిల్ 25
- **వెబ్‌సైట్:** https://www.iiit.ac.in/admissions

ఇండియన్ ఆయిల్‌లో 350 అప్రెంటిస్‌లు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) వెస్టర్న్ రీజియన్ పరిధిలోని మార్కెటింగ్ డివిజన్‌లో ఖాళీగా ఉన్న అప్రెంటిస్ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ అనేది భారతదేశంలోని ఫార్చ్యూన్ గ్లోబల్ 500 కంపెనీల్లో అతిపెద్ద వాణిజ్య సంస్థ.

- పోస్టు: ట్రేడ్ అప్రెంటిస్
- మొత్తం ఖాళీలు - 350.
- **రాష్ర్టాల వారీగా ఖాళీలు:** మహారాష్ట్ర-162, గుజరాత్-105, గోవా-8, మధ్యప్రదేశ్-58, ఛత్తీస్‌గఢ్-14, దాద్రా, నగర్‌హవేలీ-3 ఖాళీలు ఉన్నాయి.
- **వయస్సు:** 2018, జనవరి 31 నాటికి 18 నుంచి 24 ఏండ్ల మధ్య ఉండాలి.
- **అర్హతలు:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదోతరగతితోపాటు రెండేండ్ల ఐటీఐ ట్రేడ్‌లో ఉత్తీర్ణత.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 20
- **వెబ్‌సైట్:** www.iocl.com

బ్యాంక్ నోట్ ముద్రణ్‌లో

బెంగళూరులోని భారతీయ రిజర్వ్ బ్యాంక్ నోట్ ముద్రణ్ ప్రైవేట్ లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

బీఆర్‌బీఎన్ఎమ్‌పీఎల్ అనేది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంపూర్ణ యాజమాన్య అనుబంధ సంస్థ. దీన్ని 1995 ఫిబ్రవరి 3న ఆర్‌బీఐ ఏర్పాటుచేసింది.

- మొత్తం పోస్టుల సంఖ్య-7
- అసిస్టెంట్ మేనేజర్ (ఇంక్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్)-4 పోస్టులు
- **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ (కెమికల్ ఇంజినీరింగ్/పాలిమర్ సైన్స్ అండ్ టెక్నాలజీ/కెమిస్ట్రీ) లేదా డిప్లొమా ఇన్ కెమికల్ ఇంజినీరింగ్‌లో ఉత్తీర్ణత.
- అసిస్టెంట్ మేనేజర్ (రాజభాష)-3 పోస్టులు
- **అర్హత:** మాస్టర్ డిగ్రీ (హిందీ/హిందీ ట్రాన్స్‌లేషన్)లో ఉత్తీర్ణత. డిగ్రీ స్థాయిలో ఇంగ్లిష్ సబ్జెక్టును చదివి ఉండాలి.



- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 19
- **వెబ్‌సైట్:** www.brbnmpl.co.in

టీసీసీఎల్‌లో 39 ఖాళీలు

కేరళలోని ట్రావెన్‌కోర్ -కొచ్చిన్ కెమికల్స్ లిమిటెడ్ హెల్పర్ తదితర పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- మొత్తం ఖాళీల సంఖ్య: 39
- ఆపరేటర్-11, ఫిట్టర్ మెకానిక్-8, హెల్పర్ (ఫిట్టర్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్)-20
- **అర్హత:** పదోతరగతితోపాటు సంబంధిత విభాగంలో డిప్లొమా/ఐటీఐలో ఉత్తీర్ణత.
- **ఎంపిక:** రాతపరీక్ష, ప్రాక్టికల్ టెస్ట్/ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు** : ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తు ఫీజు:** రూ.500/-, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 200/-
- **చివరితేదీ:** ఫిబ్రవరి 23
- **వెబ్‌సైట్:** www.tcckerala.com

విద్య, ఉద్యోగ సమాచారం

బార్క్‌లో స్టాఫ్‌నర్సులు

ముంబైలోని బాబా అటామిక్ రిసెర్చ్ సెంటర్(బార్క్) మెడికల్ డివిజన్‌లో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్స్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

భారత ప్రభుత్వం 1954 జనవరి 3న అణుపరిశోధన కోసం అటామిక్ ఎనర్జీ ఎస్టాబ్లిష్‌మెంట్, ట్రాంబే అనే సంస్థను స్థాపించింది. 1966లో భారతదేశ అణుశక్తి పితామహుడుగా పేరుగాంచిన డాక్టర్ హోమీ జహంగీర్ బాబా జ్ఞాపకార్థంగా ట్రాంబేను 'బాబా అటామిక్ రిసెర్చ్ సెంటర్'గా పేరు మార్చారు



- **పోస్టు పేరు:** స్టాఫ్ నర్స్-12 ఖాళీలు
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఇంటర్‌తోపాటు నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీలో డిప్లొమా లేదా బీఎస్సీ నర్సింగ్‌లో ఉత్తీర్ణత.
- **పే స్కేల్:** రూ. 24,234/- (కన్సాలిడేటెడ్ పే రూపంలో)
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **ఇంటర్వ్యూతేదీ:** ఫిబ్రవరి 19
- **వెబ్‌సైట్:** www.barc.gov.in

చిత్తరంజన్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో

కోల్‌కతాలోని చిత్తరంజన్ నేషనల్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

- మొత్తం పోస్టుల సంఖ్య: 22
  సీనియర్ రెసిడెంట్-6
  జూనియర్ రెసిడెంట్-16
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎంబీబీఎస్, ఎంఎస్/ఎండీ, పీజీ డిప్లొమా ఉండాలి. సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 30 ఏండ్లకు (సీనియర్ రెసిడెంట్ కు 33 ఏండ్లు) మించరాదు.
- **ఎంపిక:** రాతపరీక్ష/ ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** http://cnci.org.in

ఎన్ఐఎన్‌లో ఎస్ఆర్ఎఫ్

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఎన్ఐఎన్ అనేది ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ (ఐసీఎంఆర్) పరిధిలో పనిచేస్తున్న సంస్థ.

- **పోస్టు పేరు:** సీనియర్ రిసెర్చ్ ఫెలో-6 పోస్టులు
- **అర్హత:** కంప్యూటర్ సైన్స్/అప్లికేషన్, బయోస్టాటిస్టిక్స్‌లో పీజీ, ఎమ్మెస్సీ (బయోకెమిస్ట్రీ, లైఫ్ సైన్సెస్, న్యూట్రిషన్, సైన్స్, బయోటెక్నాలజీ), ఎంటెక్ (బయోటెక్నాలజీ, బయోమెడికల్), ఎంబీబీఎస్/ఎండీలో ఉత్తీర్ణత.
- **పే స్కేల్** : రూ. 28,000/- అదనంగా హెచ్ఆర్ఏ చెల్లిస్తారు.
- **ఎంపిక:** రాత పరీక్ష/ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో నిర్ణీత నమూనాలో



దరఖాస్తులను నింపి ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూ రోజున పర్సనల్ అధికారి వద్ద హాజరుకావాలి.

చిరునామా:

NATIONAL INSTITUTE OF NUTRITION (NIN), Conference Hall, Tarnaka, JAMAI-OSMANIA, HYDERABAD - 500 007

- **వెబ్‌సైట్:** http://ninindia.org